# క్రాంతి

## లోపలి పేజీల్లో...


టంప్ పర్యటన.................................... 6
దేశంలో ఉవ్వెత్తున...............................14
పత్థల్‌గడీ పోరాటాలు..................... 19
ఉత్తరాలు.......................................... 24
గెరిల్లా ప్రాంతాల్లో........................... .27
ఆర్థికవాదుల................................... .30
అమరులకు జోహార్లు.................... 33
ఏఓబీ ప్రజా పోరాటాలు................ 37



సి.పి.ఐ. (మావోయిస్టు) ఎ.పి., తెలంగాణ, ఎ.ఒ.బి. కమిటీల అధికార పత్రిక

సంపుటి: 45 సంచిక: 2 ఏప్రిల్ - జూన్ 2020 వెల: పది రూపాయలు


# యావత్ ప్రపంచంలోని ఆర్థిక, రాజకీయ సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తూ లోతుల్లోకి విజృంభిస్తోన్న కొరోనా వైరస్ మహావిపత్తు

## కొరోనా మహమ్మారి ముసుగులో భారతదేశంలో వేగంగా విస్తరిస్తున్న ఫాసిజాన్ని ఓడిద్దాం

ప్రపంచ నెంబర్ వన్ అమెరికా కొరోనా వైరస్ దాడికి అతలాకుతలమై పోతుంది. ఇప్పటికే లక్షకు పైగా మరణాలతో ప్రథమ స్థానంలో కొనసాగుతుంది. యూరప్ మొత్తం వైరస్ కారణంగా తీవ్రంగా ప్రభావితం అయ్యింది. మొత్తం ప్రపంచంలో 73 లక్షలకు పైగా కొరోనా పాజిటివ్ కేసులు ఉన్నాయి. నాలుగు లక్షలకు పైగా మరణాలున్నాయి. ఇవి ఇంకా పెరుగుతునే ఉన్నాయి. రష్యాలో ఒక్క మాస్కోలోనే ఒకలక్ష పాజిటివ్ కేసులున్నాయి. భారతదేశంలో రోజుకు 11వేలకు పైగా పాజిటివ్ కేసులు పెరుగుతున్నాయి. ఇంతటి భయబీతావహ పరిస్థితి మునుపెన్నడూ లేదు. ప్రపంచ యుద్ధాలప్పుడు కూడా ఇంతటి సంక్షోభం ప్రజలు ఎరుగరు.



ప్రపంచంలో తలెత్తే ప్రతి మహమ్మారిని కచ్చితంగా రాజకీయార్థిక, సామాజిక కోణాల్లోంచి పరిశీలించాల్సిందే. ప్రజా ఆరోగ్యాన్ని, సంక్షేమాన్ని సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ ప్రపంచీకరణ విధానం ధ్వంసం చేస్తున్న సమయంలో కోవిడ్ 19 (కొరోనా) వైరస్ ప్రబలింది. మూడు దశాబ్దాలకు పైగా అమలు చేస్తున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలు, ఏళ్ల తరబడి ప్రజల సంక్షేమానికి ఎంతో కీలకమైన మౌలిక సేవలను ధ్వంసం చేస్తున్న సమయంలో కొరోనా వైరస్ మహమ్మారి ప్రబలింది. ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ (ఎల్‌పిజి) విధానాలు అమలవుతున్న దేశాల్లో ప్రజారోగ్య సదుపాయాలన్నీ బలహీనపడి తుడిచి పెట్టుకుపోయాయి. ఆరోగ్య రంగాన్ని ప్రైవేటీకరించడం వల్ల

ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రజల మౌలికావసరాలైన ఆహారం, ఇల్లు, విద్య, వైద్యం, రవాణా వంటి వాటిని అందించాల్సిన బాధ్యతలను ప్రభుత్వాలు విస్మరించాయి.

జీవ పరిణామ క్రమంలో వివిధ జీవుల మధ్య సమన్వయం, వైవిధ్యం ఉండడమే మనుగడ సూత్రం. ఈ సమన్వయం లోపించినప్పుడే మానవ జాతిని ఈ మహమ్మారులు పీడిస్తుంటాయి. కొరోనా వైరస్ కూడా ఓ సాధారణ వైరసే, కాకపోతే దాని జీవనచక్రం వేరు. ప్రపంచంలోని కాలమాన భౌగోళిక వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా తన డిఎన్ఏను మార్చుకుంటూ మానవాళికి సవాలు విసురుతోంది. అందుకే కరోనా రహస్యం ఇప్పటికి మనిషికి అంతుచిక్కలేదనే చెప్పాలి. పరిశోధనా సంస్థలు, శాస్త్రవేత్తలు కొరోనా వైరస్ పరమార్థాన్ని పసిగట్టలేకపోతున్నారు. అగ్రదేశాల్లో కొరోనా వ్యాప్తికి మరణాలకు ప్రధాన కారణాలు ఒకటి ప్రకృతిని, పర్యావరణాన్ని ధ్వంసం చేసే ఉత్పత్తి విధానం, రెండు ప్రజారోగ్య వ్యవస్థను నిర్వీర్యం చేయడం.

జంతువులను ఒక కృత్రిమ పద్ధతిలో తయారు చేయడం మాత్రమే కాదు, అవి బతకడానికి కృత్రిమ వాతావరణాన్ని కూడ సృష్టిస్తున్నారు. జంతువులను పారిశ్రామికంగా, మార్కెట్ లాభాల వేటలో ఉత్పత్తి చేసినప్పుడు వైరస్‌లు వ్యాపించడానికీ, వేగంగా పెరగడానికీ, పరివర్తన చెందడానికీ అవకాశాలున్నాయి. ఈ పరిశ్రమలలో పనిచేసే మనుషుల ద్వారా వైరస్ మొత్తం సమాజానికీ వ్యాపిస్తుంది. చివరికి ఈ ప్రపంచీకరణ యుగంలో అది ప్రపంచమంతా వ్యాపిస్తుంది. ఈ ప్రక్రియలో ఏమవుతుందంటే ఈ జీవులకు సహజంగా ఉండే రోగ నిరోధక శక్తి, రక్షణ శక్తి అంతరించిపోతాయి. అంటే డార్విన్ చెప్పిన 'సహజ ఎంపిక' నియమం ఇక్కడ వర్తించకుండా పోతుంది. 'సహజ ఎంపిక స్థానాన్ని 'పెట్టుబడిదారీ ఎంపిక' అక్రమిస్తుంది. జంతుశాస్త్రవేత్త రాబ్ వాలేస్ 'బిగ్ ఫార్మ్స్ మేక్ బిగ్ ఫ్లూ' (పెద్ద వ్యవసాయ క్షేత్రాలు భారీగా ఫ్లూను తయారు చేస్తాయి) అనే పుస్తకం రాశారు. ఈ కంపెనీలు మాంసం ఉత్పత్తి చేయడం మాత్రమే కాదు, తీవ్రమైన వ్యాధులకు కారణమయ్యే వైరస్‌లను కూడ సాగు చేస్తాయని రాబ్ వాలేస్ మరో చోట రాశారు.

స్క్రిప్స్ రిసర్చ్ ఇన్‌స్టిట్యూట్‌తో సహా ఎన్నో ప్రతిష్ఠాత్మక పరిశోధనా సంస్థలు కోవిడ్-19 జన్యు నిర్మాణం మీద అధ్యయనాలు చేసి, దాన్ని ఒక రసాయనశాలలో తయారు చేయడం అసాధ్యమని రుజువు చేశాయి. ఈ వైరస్ పరివర్తన (మ్యుటేషన్) ద్వారా సహజంగా దానంతట అదే రూపొందింది. దాని వెనుక ఏదో ఒక దేశం ఉందని అనుకోనక్కర లేదు. ప్రపంచం దృష్టిని చైనా వైపుకు మరల్చి తన అసమర్థతను కప్పిపుచ్చుకోవాలన్న ట్రంపు కుట్ర ఫలించడం లేదు. కొరోనా కుటుంబంలో ఇది తాజా వైరస్ మాత్రమే. ప్రస్తుత వైరస్‌ను కోవిడ్-19, సార్స్-2 అంటున్నారు. ఇదే కుటుంబానికి చెందిన ఎస్ఏఆర్ఎస్ (సార్స్) అనే వైరస్ 2003-04ల్లో ప్రపంచంలో ఎన్నో దేశాలను అల్లకల్లోలం చేసింది.

2011కూ 2018కీ మధ్య 172 దేశాల్లో మొత్తం 1,483 విస్తృతమైన అంటువ్యాధులు ప్రబలాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించింది. ఇందుకు కారణమైన వైరస్‌లను, ప్రధానంగా ఇన్ ఫ్లుయెంజా, సార్స్, ఎంఇఆర్ఎస్, ఇబోలా, జికా, ప్లేగ్, ఎల్లో ఫివర్ వగైరాలను, అధ్యయనం చేసిన గ్లోబల్ ప్రిపేర్డ్‌నెస్ మానిటరింగ్ బోర్డ్ (జిపిఎంబి), ఇవాళ్టి కొరోనా లాంటి మహా విపత్తు త్వరలో బైటపడనున్నదని కచ్చితమైన హెచ్చరికను 2019 సెప్టెంబర్‌లోనే ఇచ్చింది. 'ప్రమాదంలో ప్రపంచం' (ఎ వరల్డ్ ఎట్ రిస్క్) అనే శీర్షికతో వెలువడిన ఆ నివేదికను పరిగణనలోకి తీసుకునేవాళ్లు ఒక్కరూ లేకపోయారు.

పెట్టుబడిదారీ విధానం భారంగా మారిన శ్రమశక్తిని కుదించుకో దల్చింది. వీలైనంతగా పనివారిని వదిలించుకో దల్చుకుంది. ఉత్పత్తి యాంత్రీకరణను, డిజిటల్ లావాదేవీలను అత్యంత వేగంగా అమలుచేయ దల్చుకుంది. పని గంటలు పెంచదల్చుకుంది. తక్కువ వేతనంతో ఎక్కువ పనిని, మేలైన పనిని పొందదల్చుకుంది. సంఘటిత కార్మిక చట్రాన్ని తుత్తునియలుచేసి కార్మికుడు అనే పదాన్ని చెరిపేయ దల్చుకుంది. వారిని కేవలం విడివిడి పనివాళ్లుగా మాత్రమే మిగిల్చి వారితో ఊడిగం చేయించుకోదల్చుకుంది. హక్కులకు, యూనియన్లకు చరమగీతం పాడదల్చుకుంది.

చిన్న కమతాల శ్రామిక రైతాంగం, ఆదివాసులు, అడవిపై వాళ్లకున్న హక్కులు కాలరాసి సమస్త అటవీ సంపదను, ఖనిజ సంపదను పెట్టుబడి పాదాక్రాంతం చేయదల్చుకుంది. తనకు ఏమాత్రమూ గిట్టని పబ్లిక్ వ్యవస్థలన్నిటినీ భూస్థాపితం చేయదల్చుకుంది. పబ్లిక్ విద్య, పాఠశాలలు, కాలేజీలు, విశ్వవిద్యాలయాలు, వైద్య, ఆరోగ్య వ్యవస్థలు, బ్యాంకింగ్, బీమా, రవాణా, ప్రభుత్వ సేవలు, టోకువ్యాపారం, చిల్లర వ్యాపారం, ఇవన్నీ ప్రపంచంలో ఎక్కడున్నా, అవి పూర్తిగా తనహస్తగతం చేసుకుంటుంది.

నిజానికి జీవ వైవిధ్యాన్ని నాశనం చేసిన, పర్యావరణాన్ని విషతుల్యం చేసిన కార్పొరేట్ శక్తులే ఈ నూతన అంటువ్యాధులు ప్రబలటానికి కారకులవుతున్నారు. మొత్తంగా అమెరికాలో నెలకొన్న పరిస్థితి కార్మికులకు, పేద ప్రజలకు తీవ్ర కష్టాలు తెచ్చిపెట్టేలా ఉంది. ట్రంప్ టక్కరి వేషాలు, అబద్ధాలు, దబాయింపులు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడలేవు.

ట్రంప్ పొదుపు చర్యల్లో భాగంగా ఆరోగ్య, వైద్యరంగానికి జరిగిన నిధుల కోతల ఫలితం ఇది. అంటువ్యాధుల నివారణకు బడ్జెట్‌లో కోత విధించాడు. వ్యాధి నియంత్రణ, నివారణ కేంద్రాలకు కేటాయించే బడ్జెట్‌ను ట్రంప్ ప్రభుత్వం తగ్గిస్తూ వస్తోంది. 2018లో పది శాతం బడ్జెట్ కేటాయింపులు తగ్గితే 2019లో 19 శాతం కేటాయింపులు తగ్గించింది. మరీ దురదృష్టం ఏమిటంటే నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న కొరోనా వైరస్ వంటి అంటువ్యాధులను నివారించడానికి అయ్యే ఖర్చులో కనీసం 20 శాతం ఖర్చు తగ్గించాలని ట్రంప్ ప్రతిపాదించాడు. ఒబామా హెల్త్ కేర్‌ను రద్దు

చేశాడు. సామూహిక సేవలు, ప్రజారోగ్యశాఖలో పనిచేసే ఉద్యోగులను తొలగించడం జరిగింది. ట్రంప్ వాణిజ్య ప్రయోజనాలు మాత్రమే చూశాడు.

ఈ భూమిని తొమ్మిది సార్లు ధ్వంసం చేయడానికి తగిన ఆయుధ సామగ్రి ఉంది గాని, అదే సమయంలో జీవితాన్ని నిలపడానికి అవసరమైన వెంటిలేటర్లు మాత్రం కావలసినన్ని లేవు. ఈ వెంటిలేటర్ల తీవ్రమైన కొరతే ఇవాళ కొరోనా వల్ల జరిగే మరణాలకు ప్రధాన కారణం కానుంది. క్యూబా కొరోనాను అదుపులో పెట్టడం మాత్రమే కాదు, కొరోనా వ్యతిరేక పోరాటంలో ప్రపంచంలోనే అగ్రశ్రేణిలో ఉండి 62 దేశాలకు తన వైద్యులను, ఔషధాలను పంపిస్తున్నది. ఇతర దేశాలకు సైన్యాన్ని, ఆయుధాలను పంపించే పని అమెరికా చేస్తుండగా, వైద్యులను, ఔషధాలను పంపించే పని క్యూబా చేస్తున్నది.

ప్రపంచమంతటా మాంద్యం ముసురుకుంటున్నప్పుడు, తమ లాభాల వాటాను కాపాడుకోవడానికి కంపెనీలు తమ కార్మికులను, ఉద్యోగులను ఉద్యోగాల నుంచి తొలగించడానికి కంకణం కట్టుకున్నాయి. కాని అవి ఆ పని చేయడానికి తీవ్రమైన వ్యతిరేకత ఎదురవుతూ ఉండింది. ఇప్పుడు కొరోనా వారికి మహా అవకాశం ఇచ్చింది. ఈ కాలంలో మొత్తం ఎంత మందిని ఉద్యోగాల నుంచి తొలగించారో వాస్తవ గణాంకాలు తర్వాత బైటపడతాయి. ఒక్క అమెరికాలోనే ఒక కోటీ ఎనభై లక్షల మంది గత రెండు నెలల్లో కొత్తగా నిరుద్యోగ భృతికి దరఖాస్తు పెట్టుకున్నారు. 1929-30 నాటి మహా సంక్షోభం తర్వాత ఇంతమంది నిరుద్యోగులు కావడం ఇప్పుడే.

గత సంవత్సరం, 2019 ఒక గొప్ప నిరసన ప్రదర్శనల, ఉద్యమాల సంవత్సరం. చాల మంది రాజకీయ విశ్లేషకులు ఆ సంవత్సరాన్ని 1848తో, 1968తో పోల్చారు. ఆ సంవత్సరం భూగోళం మీద ఏ ఒక్క మూల కూడ భారీ ప్రజా ప్రదర్శనలు చూడకుండా లేదు. భారతదేశంలో కూడ ఈ కాలంలోనే సిఎఎకు వ్యతిరేకంగా బ్రహ్మాండమైన ప్రదర్శనలు జరిగాయి. కొరోనా సాకుతో పాలకవర్గాలు ఈ ఉద్యమాలన్నిటినీ తక్షణమే మూసివేయడంతో విజయం సాధించాయి.

మార్చ్ 21న కొలంబియాలోని బొగొటా జైలులో కొరోనాతో వ్యవహరించడానికి తగిన మెరుగైన పరిస్థితులు కల్పించమని అడిగిన ఖైదీల మీద పోలీసులు దాడిచేసి, కాల్పులు జరిపి 23 మంది ఖైదీలను చంపేశారు. కెన్యాలో వీధుల్లో పోలీసు కాల్పుల్లో చనిపోయిన వారి సంఖ్య కొరోనాతో చనిపోయినవారి సంఖ్య కన్న ఎక్కువ. మనం అమెరికాలోని అంకెలనే పరిశీలిస్తే, మరణాలలో 70 శాతం నల్లజాతి వారివి, ఆఫ్రికన్ అమెరికన్లవి. మామూలు సందర్భాల్లోనైతే ఇవి ప్రధాన వార్తలు అయి ఉండేవి. కాని కొరోనా కాలంలో ఈ వార్తలకు దిక్కే లేదు.

ఇవాళ ప్రపంచంలోని 2,153 మంది సహస్ర కోటీశ్వరుల దగ్గర ఉన్న సంపద, 406 కోట్ల మంది దగ్గర ఉన్న సంపదతో సమానం. భారతదేశంలోను అసమానతలు మరింతగా పెరిగాయి. మొదట భారత ఆర్థిక వ్యవస్థ పట్టాలు తప్పిన పెద్ద నోట్ల రద్దును గుర్తు చేసుకుందాం. నల్లధనాన్ని అరికట్టడానికనే పేరుతో పెద్దనోట్ల రద్దు జరిగింది. కాని పెద్ద నోట్ల రద్దుతో నల్ల ధనమంతా తెల్ల ధనమైపోయింది. ఉన్న నోట్ల కన్న ఎక్కువ నోట్లు తిరిగివచ్చాయి. కాని నియంత చూపిన ఈ ఉన్మాదం వల్ల కోట్లాది భారతీయుల బతుకుతెరువు ధ్వంసమైపోయింది.

అదే విధంగా మోదీ ఎటువంటి సన్నద్ధతలు లేకుండానే దేశవ్యాపితంగా ఒకేసారి మార్చ్ 24న అనాలోచితంగా ప్రకటించిన లాక్‌డౌన్ తర్వాత ఏర్పడిన పరిస్థితులు కొరోనా మరింత వ్యాపించడానికి దారి తీశాయి. నిజం చెప్పాలంటే భారతదేశం వంటి పేద దేశంలో, శ్రామిక జనాభాలో 94 శాతం అసంఘటిత రంగంలోనే పనిచేస్తున్న చోట, సగం కన్న ఎక్కువ జనాభా దుర్భర దారిద్ర్యంలో మగ్గిపోతున్న చోట, సంపూర్ణ లాక్‌డౌన్ సరైన నిర్ణయం కాజాలదు. లక్షలాది మంది వలస కార్మికులు 'వెనుకకు లాంగ్ మార్చ్' చేయవలసిన పరిస్థితికి నెట్టబడ్డారు. ఎండలో, వానలో, దిక్కుతోచని ఈ వలస కార్మికులు కొరోనాకు అత్యంత సులభంగా దొరికే ఎరలుగా మారారు. కొన్ని షెల్టర్ హోమ్స్‌లో జనాన్ని ఎట్లా కుక్కేశారంటే, అవి వారి కార్మిక శిబిరాల్లో మరెన్నో క్వారంటైన్ కేంద్రాలు జైళ్ల కన్న హీనంగా ఏ నేరం చేయని లక్షలాది మందిని నిర్బంధించాయి. వీరందరూ కొరోనాకు అందుబాటులో ఉన్న బాధితులే. గ్రామసీమల్లో ప్రతి రోజూ 31 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇపుడు కొరోనా మరణాలు, ఆకలిచావులు, ఆత్మహత్యలు ఈ పరిస్థితులెంత దయనీయమంటే చెప్పలేనంత.

## భౌతిక దూరాన్ని సామాజిక దూరంగా మార్చివేసిన పాలకవర్గాల భావజాలం

భారతదేశంలో గాని, ప్రపంచంలో ఎక్కడైనా గాని మురికివాడల్లో సామాజిక దూరం (సోషల్ డిస్టెన్సింగ్) అనేది ఆచరణసాధ్యం కాని ఒక విషాదం. హంగరీతో సహా ఎన్నో దేశాలు నేరుగానే అత్యవసర పరిస్థితిని ప్రకటించాయి. మన దేశంలో కూడ మోదీ స్పష్టంగానే 'సామాజిక అత్యవసర పరిస్థితి' గురించి మాట్లాడాడు. నిజానికి ఇది భారత్ వంటి మూడో ప్రపంచ దేశాలలో దారుణంగా ఉంది. భారతదేశం లాంటి వర్గ కుల సమాజంలో సామాజిక దూరం అంటే వాస్తవంగా వర్గ దూరమే. దీని అసలు ఉద్దేశం ఉన్నత, మధ్యతరగతి వర్గాలకూ, పేద వర్గాలకూ దూరాన్ని పెంచి, కొరోనాను పేద వర్గాలవైపు పంపించడమే. కొరోనా కన్న ఆకలికీ, వివక్షకు, పోలీసు లాఠీకీ ప్రజలు ఎక్కువ భయపడుతున్నారు. ఇప్పుడు ప్రజల బతుకు దినదిన గండంగా మారింది.

కొరోనా సందర్భంలో ఖైదీలను విడుదల చేయమని సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా 11 వేలమంది ఖైదీలను విడుదల చేయాలని నిర్ణయించిన ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వమే లాక్‌డౌన్‌ను ఉల్లంఘించారనే పేరుతో అంతకన్న ఎక్కువమందితో జైళ్లను నింపుతున్నది. మొత్తం ప్రపంచమంతా కొరోనా వైరస్ జన్యు నిర్మాణం ఏమిటని అధ్యయనం చేస్తున్న సమయంలో మనం కొరోనా మతమేమిటో కనిపెట్టడంలో తలమునకలై ఉన్నాం. మతతత్వ, నిరంకుశ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దివాళాకోరుతనానికి అంతకన్న మంచి ఉదాహరణలు ఉండవు.

ఢిల్లీలో కాన్సర్ వ్యాధి గ్రస్తులందరూ ఎఐఐఎంఎస్ దగ్గరా, ఇతర ఆస్పత్రుల దగ్గరా మృత్యువు కోసం ఎదురుచూస్తూ పడి ఉన్నారు. ఇవాళ మనం ప్రతి 10,000 మందికి ఒక ఎంబిబిఎస్ డాక్టర్ ఉండే స్థితికి చేరుకున్నాం. అలాగే ప్రతి వెయ్యి మందికి ఆస్పత్రిలో సగం మంచం ఏర్పాటు చేశాం. బీహార్‌లోని 18 జిల్లాల్లో ఒక్కటంటే ఒక్క వెంటిలేటర్ కూడ లేదు. ఈరోజు దేశంలో ఎక్కడ కూడ ఇతర రోగాలకు చికిత్స అందడంలేదు. కొరోనా విషయంలో కేవలం ప్రచారార్భాటం తప్ప తగినన్ని టెస్టింగ్ కిట్స్ లేవు. ఇప్పటికి దేశంలో బయటపడినవి రెండు లక్షలు. ఇంకా బయటపడనివి చాలానే ఉండవచ్చు. మరణాల రేటు క్రమంగా పెరుగుతూనే ఉంది.

మన పోరాటం ఒక్క వైరస్‌తోనే కాదు. మానవ జాతిని ఇలాంటి కొత్త జబ్బుల్లో ముంచేసే వ్యవస్థతోనూ, ఉత్పత్తి విధానాలతోనూ మన పోరాటం. వాస్తవాలను, అవాస్తవాల నుండి విడగొట్టి కొరోనా 19 గురించి స్పష్టమైన హేతు బద్ధమైన అవగాహనను పెంచుకోవలసిన అవసరం ఉంది. సమస్త జనావళి ఇప్పటికే భయాందోళనలతో ఉన్నారు. ఒకవైపు, కొరోనా వైరస్ 19 భయం, మరోవైపు కోవిడ్ 19 వస్తే ఎలా అనే ఆందోళన. దీనికి తోడు, లాక్‌డౌన్ కారణంగా నలిగిపోతున్న జీవితాలు, ఆర్థికంగా చితికిపోతున్న బతుకులు, పెరగబోతున్న నిరుద్యోగం, బయటికివెళ్లితే పోలీసుల లాఠీల భయం చూస్తే సమస్య ఎంత గంభీరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మన పోరాటం, కొరోనాతో మాత్రమే కాదనీ, కొరోనాకు కారణమైన సామ్రాజ్యవాదం, వారి దళారీలతోనని ప్రజలు తెలుసుకుంటున్నారు.

ఒక పన్నెండేళ్ల బాలిక ప్రాణాలు కోల్పోయిన విషయం వైరల్ అయింది. ఆ బాలిక పేరు జమిలి మడ్కమ్. జమిలి మడ్కం సొంత ఊరు ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్. ఏదైనా పనిలో కుదిరితేగాని తన కుటుంబం గడవదు. తెలంగాణకు పనికోసం వలస వెళ్లిన కూలీలతో పాటు తానూ వెళ్లి కన్నాయిగూడంలో పనికి కుదిరింది. అక్కడ మిర్చితోటలో పని. మిర్చితోటలో పని అయిపోయిన తర్వాత మరోచోట పని వెతుక్కుందామని ప్రయత్నం. ఆ లోపల లాక్‌డౌన్ ప్రకటించేశారు. కాలం గడుస్తూ ఉంది. పనిలేదు. మిగుల్చుకున్న డబ్బు అయిపోయింది. చేసేదేమీలేక, అక్కడ ఉండడమూ కుదరక ఏప్రిల్ 15న తన ఊరు బయల్దేరింది. బస్సులు లేవు. రైళ్లు లేవు. 250 కిలోమీటర్ల దూరం. మరో మార్గంలేక కాలినడకన తోటి కూలీలతో కలిసి తన ఊరు చేరుకుందామన్న తాపత్రయంతో నడక ప్రారంభించింది. తినడానికి తిండి దొరకలేదు. తాగడానికి నీళ్లు దొరకలేదు. బొబ్బలెక్కిన కాళ్లు. మధ్యలోనే మృత్యువాత పడింది. ఏప్రిల్ 18న డీహైడ్రేషన్‌తో చనిపోయింది. వెలుతురు చూడని ఇలాంటి కథలెన్నో.

దేశంలోని ప్రధాన నగరాలు, పట్టణాలతో సహా అన్ని ప్రాంతాల నుండి పుట్ట పగిలి చీమల బారులు కదిలినట్టు లక్షలాది వలస కార్మికులు రోడ్లను ముంచెత్తారు. నెత్తిన మూటలు, చంకన పిల్లలతో రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లు చేరుకొని స్వస్థలాలకు వెళ్లే మార్గం లేదనుకొని కాలినడకన సుదీర్ఘ యాత్రకు బయలుదేరినట్టు మొదలయ్యారు. పని చేసిన చోట ఉండలేక, చేసిన పనికి పూర్తిగా పైకము పొందక అసలు ఏ వైపు వెళితే తాము పుట్టి పెరిగిన నేలను చేరుకుంటామో కూడా తెలియకుండానే జాతీయ రహదారుల వెంట నిండి పోవడంతో వాహనాలతో నిండే ఆ దారులన్నీ సుదీర్ఘ జన ప్రవాహాన్ని తలపిస్తున్నాయి. నెత్తి మీద సూర్యుని భగభగలు, ఖాళీ కడుపులు ఇంటికి చేరుకోవాలనే తపన, పశువులను తరిమినట్టు తరుముతున్న పోలీసులు దారంతా వారిని ఉక్కిరి బిక్కిరి చేశాయి. తాగడానికి నీరు లేక, ఉండటానికి నీడ లేక, కడుపు నింపుకునే దిక్కులేక దారులెంటా కన్నీరు కారుస్తూనే వారి జీవితంలోకి వస్తున్న భయంకర అనుభవాలను దాటుకుంటూ బహుదూరపు బాటసారులుగా సాగుతున్నారు.

ఎండల్లో రోడ్లన్నీ వలస కార్మికుల వ్యదార్థ కథలే వినిపించాయి. ఎక్కడబడితే అక్కడ వాళ్లను పోలీసులు ఆపేవారు. లాఠీలు ఝళిపించేవారు. ఆకలి బాధ ఒకవైపు, నిప్పులు కురిపిస్తున్న సూర్యుడొకవైపు. పురుషుడు సూట్కేస్ మోస్తూ ఉంటే చంకలో పిల్లల్ని మోస్తూ మహిళ. పైనుండి పోలీసుల అదిలింపు. దేశవ్యాప్తంగా రోడ్ల మీద రోజూ ఇవే దృశ్యాలు పునరావృతమయ్యేవి.

లాక్‌డౌన్ సమయంలో కూడా లోపాలతో కూడిన వ్యవస్థను వ్యతిరేకిస్తున్నవారు, పేద ప్రజానీకం, దళితులు, వలస కార్మికులు, ముస్లింలు, ఇతర బలహీన సమూహాలు వివక్షకు గురవుతూనే ఉన్నారు. వారిపై నిర్బంధం కొనసాగుతుంది. అక్రమ అరెస్టులు, బూటకపు ఎదురుకాల్పులు ఆగడం లేదు.

మొత్తం దేశ ఆర్థిక వ్యవస్థలో అసంఘటిత రంగ భాగస్వామ్యం 90 శాతానికి పైగానే ఉంది. ఈ రంగం కిందికే వచ్చే వలస కార్మికులు దేశంలో 15 కోట్లకు పైగానే ఉంటారనేది ఒక అంచనా. ఎక్కడ పని లభిస్తే అక్కడ తాత్కాలిక నివాసాన్ని ఏర్పాటు చేసుకోవడం, దుర్భర జీవితం గడపడం సర్వసాధారణమైంది. తమ భాష గాని రాష్ట్రంలో, సంఘటిత బలం లేని చోట విశ్వాసాన్ని, ధైర్యాన్ని కోల్పోయి అన్ని రకాల దోపిడికి, వివక్షలకు గురవుతున్నారు. ఇలాంటి దయనీయమైన బతుకులు వెళ్లదీస్తున్న ఈ బక్క జీవుల పైన లాక్‌డౌన్ ఒక్కసారిగా విరుచుకు పడి చెట్టుకొకరు పుట్టకొకరు అయ్యేలా చేసింది. ఇలాంటివారు కోట్లల్లో ఉన్నారని, వారికి స్థిరనివాసం, ఆదాయం ఉండదని, వారి బతుకులు ఈ లాక్‌డౌన్

నిర్ణయంతో పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్టు అవుతాయని పాలకులకు తెలియదా? పోనీ పనిచేసే చోటనే భద్రంగా ఉండేలా కనీస ఏర్పాట్లన్నా చేశారా అంటే ఆర్భాటపు ప్రకటనలే తప్ప చేసింది శూన్యం. మండే ఎండలో గుంపులుగా నడిచి నడిచి అరికాళ్లు చిట్లిపోయి నడవలేక సొమ్మసిల్లి, అనారోగ్యం పాలై ఆకస్మికంగా మృత్యువు పాలైన వారి లెక్కలు కూడా లేవు. తరుముకొస్తోందన్న కొరోనా కంటే కడుపుల్ని దహించి వేసే ఆకలే వారి ప్రాణాలను ఎక్కువగా బలిగొన్నది.

స్థూల జాతీయోత్పత్తికి అతి పెద్ద దోహదకారి అయిన అసంఘటిత రంగ కార్మిక శక్తిలో భాగమై భారీ సంఖ్యలో ఉన్న వలస కార్మికులకు ఏ చట్టబద్ధమైన రక్షణలు లేవు. ఏ సామాజిక భద్రతా పతకాల ప్రయోజనాలు వర్తించవు. కనీస భద్రత కరువైన దినదిన గండపు బదుగు జీవితాలు వారివి. ఈ వలస కార్మికుల్లో నూటికి 90 శాతం పైగా ఉత్పత్తి కులాల నుండి భూమిలేని నిరుపేద వర్గాల నుండి వచ్చిన వారే. కేంద్రం ప్రకటించిన 5 కిలోల బియ్యం, 500 రూపాలయలు వీళ్లకు అందడం అసాధ్యం. జేబులో చిల్లిగవ్వ లేకుండా, చేసేందుకు పనులు లేక ప్రభుత్వాల విదిలింపు ఏ మూలకు సరిపోక భవిష్యత్తును తలుచుకుంటేనే బదుగు జీవుల బతుకుల్లో పిడుగులు పడుతున్నాయి.

అరకొరగా అమలు చేస్తున్న ప్రజా పంపిణీ వ్యవస్థ పరిధిలోకి వలస కార్మికులు రావడం లేదు. కనీస వేతనాలచట్టం వీరికి అమలు కావడం లేదు. వీరి కోసం ప్రత్యేకంగా బీమా పథకాలు అంటూ కూడా ఏమీ లేవు. పనిచేసే చోట ప్రమాదవశాత్తు ప్రాణాలు పోయినా, అనారోగ్యం పాలై పని చేయలేని స్థితికి వచ్చినా ప్రమాద బీమా లేకపోవడంతో కనీస నష్టపరిహారం కూడా పొందే పరిస్థితి లేకుండా పోయింది. చట్టబద్ధ రక్షణలు ఉన్నచోటనే శ్రమదోపిడి జరుగుతూ ఉంటే ఏ రక్షణలు లేని వలస కార్మికులు ఇంకెంత శ్రమదోపిడికి గురవుతున్నారో ఊహించుకోవచ్చు. అసంఘటిత కార్మికుల భద్రత చట్టం 2008 అని ఒకటుంది గాని అయితే ఈ చట్టం కింద వచ్చే వలస కార్మికులు ఐదు శాతం కూడా లేరు.

## దూరదృష్టి లోపించిన ప్రభుత్వ చర్యలు

కొరోనా మొదటి పాజిటివ్ కేసు చైనాలోని వూహాన్‌లో 2019 డిసెంబర్‌లో గుర్తించిన అనంతరం ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుఎచ్ఒ) ఈ ప్రాణాంతక వైరస్ పట్ల ప్రపంచ దేశాలన్ని అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. మార్చి మొదటి వారంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పర్యటన విజయవంతం కోసం, మెప్పు కోసం మోదీ ప్రభుత్వం విశేషకృషి చేసింది. అనంతరం జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో కొరోనా తీవ్రత పట్ల ప్రతిపక్షాల సూచనలను అవహేళన చేసింది. మనదేశంలోకి వైరస్ ప్రవేశించిన 70 రోజుల అనంతరం ఈ లాక్‌డౌన్ విధించడం ప్రభుత్వ దూరదృష్టిలేమికి, ఎటువంటి సన్నాహాలు లేకుండానే దేశమంతా ఒకేసారి ప్రకటించడం బాధ్యతారాహిత్యానికి నిలువెత్తు నిదర్శనం.

వేతనాల్లో కోతలు మార్చ్, ఏప్రిల్ నెలలో జరిగాయి. ఇకముందు ఎన్ని నెలల వరకు కొనసాగిస్తారో స్పష్టత లేదు. ఇదే దారిలో ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలు నిర్ణయాలు చేశాయి. ఇక కేంద్ర ప్రభుత్వం కూడా 2020 జనవరి నుండి 2021 జూన్ వరకు సంవత్సరంన్నర పాటు కరువు భత్యాన్ని నిలిపివేస్తున్నట్లు ఏప్రిల్ 23న ఉత్తర్వులను జారీ చేసింది. వీటి బకాయిలను కూడా చెల్లించడం జరగదని కూడా తెలిపారు. ఇంతటి తీవ్రమైన నిర్ణయాన్ని తీసుకునే ముందు ఉద్యోగ ప్రతినిధులతో సంప్రదించకుండా తీసేకుకోవడం నియంతృత్వ పోకడలకు నిదర్శనం. ఆర్థిక అత్యయిక పరిస్థితి లేకుండానే ఏ రాజ్యాంగ శాసనాధికారం ద్వారా వేతనాల కోతను చేపడతారు? ఇది రాజ్యాంగ విరుద్ధమైన చర్య, జీవించే హక్కుకు భంగకరం.

దినసరి, వలస కూలీలు, అసంఘటిత రంగంలోని కార్మికులు, కర్షకులకు పూటగడవడం కష్టంగా, దినదినగండంగా, బతుకే భారంగా మారింది. బయటకొస్తే లాక్‌డౌన్, ఇంట్లోనే ఉంటే తీరని కనీస అవసరాలు ఎలా ఎదుర్కోవాలో తెలియని సంకట స్థితిలో అక్కడక్కడ అందించే ఆహార పొట్లాల కోసం ఎదురుచూడడం ఎంత బాధాకరమో అనుభవిస్తేగాని తెలిసిరాదు.

దేశంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో పనిచేస్తున్న కోట్లాది మంది ఉపాధి కోల్పోవడం వలన 41.8 కోట్ల కార్మిక శక్తి ఉపాధి కోల్పోయినట్లయిందని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ ప్రకటించింది. దీనితో పాటు ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న 2.5 కోట్ల మందికి, ప్రభుత్వ అనుబంధ రంగాల్లో పనిచేస్తున్న మరో 2.5 కోట్ల మందికి జీతాల్లో కోతల వలన కొనుగోలు శక్తి లేకపోవడంతో వినియోగం తగ్గి వస్తు డిమాండ్ పడిపోయింది. వృద్ధి మందగించింది. ఈ నేపథ్యంలో మునుపెన్నడు లేనంతగా 45 సంవత్సరాల నాటి స్థాయికి నిరుద్యోగ రేటు 26.2 శాతం నమోదు కావడం విచారకరం.

ప్రభుత్వ ప్రకటనలు రైతులకు అరచేతిలో స్వర్గం చూపించాయి. కానీ వాస్తవంలో రైతుల వెతలకు అంతులేకుండా ఉంది. రైతులు వరి, మొక్క జొన్నలు కూరగాయలు, పండ్లు పండించటంలో ఎంత కష్టపడ్డారో వాటిని అమ్ముకోవటానికి అంతకంటే రెట్టింపు కష్టాలు ఎదుర్కుంటున్నారు. తరుగు పేరుతో క్వింటాలుకు 10 కిలోలు అదనంగా తీసుకుంటున్నారు.

లాక్‌డౌన్ కాలంలో వ్యవసాయ పనులకు సడలింపు ఇస్తున్నామని ఒకవైపు ప్రభుత్వం ప్రకటించినప్పటికీ చాలా గ్రామాలలో కొరోనా వ్యాప్తి సాకుతో పోలీసులు రైతులు, రైతు కూలీలను వ్యవసాయ పనులు చేసుకోనివ్వలేదు. ఇక కోసిన పంటను మార్కెట్‌కి తీసుకెళ్లడానికి ఆటోలు నడవకపోవటంచేత అవసరమైనప్పుడు రవాణా సౌకర్యం లేకుండా పోయింది. అమ్ముకోవటానికి సరైన మార్గంలేక, అమ్మినా గిట్టుబాటు ధర లేక కూరగాయలు సాగు చేసిన రైతులు విపరీతంగా నష్టపోయారు. కూరగాయలు నిల్వ ఉండే ఉత్పత్తి కాకపోవటం కూడా తీవ్రమైన నష్టాలకు దారి తీస్తుంది.

*(మిగతాది 47వ పేజీలో...)*

# ట్రంప్ పర్యటన సందర్భంగా దేశాన్ని దోచిపెట్టి తన సేవకబుద్ధిని చాటుకున్న ప్రధాని మోదీ

'ఆపాదమస్తకం ఆయుధాలు ధరించిన' ప్రపంచ 'మొనగాడు' ట్రంప్ 2020 ఫిబ్రవరి 24-25 తేదీలలో మనదేశ పర్యటనకు కూతురు ఇవాంక, అల్లుడు కుష్నర్ (వీరు అధ్యక్ష భవనం సీనియర్ సలహాదారులు) సహ సహచరి మెలానియా తోడుగా, భారీ ప్రతినిధివర్గంతో (8మంది ఉన్నతాధికారులు, ప్రవాస తస్మదీయ భారతీయులున్నారు). 'రాజు వెడలె రవి తేజములలరగా' అన్నట్టు వచ్చాడు. ఆయన 45వ అమెరికా అధ్యక్షుడిగా 2016లో అధికారం అందుకున్నాక చివరి సంవత్సరం అంటే తిరిగి ఆ దేశంలో 2020 నవంబర్‌లో జరుగనున్న రాష్ట్రపతి ఎన్నికలకు ముందు అనేక ప్రయోజనాలను ఆశించి మన దేశం దర్శించిన ఏడవ శ్వేతసౌధాధిపతి మిస్టర్ ట్రంప్. 1947-99 మధ్య 52 ఏళ్లలో ముగ్గురు రాష్ట్రపతులు ఐసన్‌హోవర్, నిక్సన్, జిమ్మీ కార్టర్ మన దేశానికి రాగా 2000-2020 మధ్య 20 ఏళ్లలో బుష్, క్లింటన్, ఒబామా (రెండు విడుతలు), ట్రంప్‌లు రావడం మన దేశం ఎంతవేగంగా అమెరికాకు దాసోహమవుతుందో తెలియజేస్తుంది.

ట్రంప్ వ్యాపార రాజకీయ సైనిక ప్రయోజనాలను ఆశించి మన దేశం వచ్చాడన్నది ఇరు దేశాల ప్రభుత్వాలు ప్రకటించిన బహిరంగ ఎజెండా ద్వారా విదితమవుతోంది. ఇద్దరి నాయకుల రహస్య మంతనాలు సరేసరి! ఇప్పటివరకూ ఏ అమెరికా అధ్యక్షుడికన్నా అధికంగా అభాసుపాలవుతున్న, ఒక బఫూన్‌గా పేరు తెచ్చుకున్న ప్రపంచ ప్రజల నంబర్‌వన్ శత్రువైన అమెరికా సామ్రాజ్యవాద అధిపతి భారత పర్యటన గురించి జరిగిన ప్రచార ఆర్భాటం, విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు గతంలో ఒబామా భారత పర్యటనను మించాయి. గూగుల్‌లో అడ్రస్ లేని 'నాగరిక్ అభినందన్ సమితి' అహ్మదాబాదులో 'నమస్తే ట్రంప్' కార్యక్రమాన్ని స్పాన్సర్ చేసింది. ట్రంప్ రాక సందర్భంగా 22 కి.మీ.ల 'రోడ్డు షో' 'ఇండియా రోడ్ షో' పేరుతో నిర్వహించారు. మోదీ-ట్రంప్ అపూర్వ స్నేహ బంధానికి అది సంకేతమన్నారు. 'భవ్యమైన భవితకు బలీయ స్నేహబంధం' అంటూ అహ్మదాబాద్‌లో 22 కిలోమీటర్ల రహదారి పొడవునా పేదరికాన్ని మరుగుపరిచి దేశంలోని 28 రాష్ట్రాలను ప్రతిబింబించేలా అన్ని వేదికలను తీర్చిదిద్ది హంతక ట్రంప్‌కు అపూర్వ స్వాగతం పలికారు.

ట్రంప్ స్వాగత సత్కారాలలో భాగంగా ఏర్పాటు చేసిన మానవ హారాలు, నృత్యాలు జరిగిన తీరు కాలం చెల్లిన భూస్వామ్య సంప్రదాయాలను తలపించి 21వ శతాబ్దంలో దేశ ప్రజలు తలదించుకునేలా సాగాయి. అహ్మదాబాదులోని పూరి గుడిసెలు, పేదరికం, 'స్వచ్ఛ భారత్' పటాటోపం అతిథులకు కానరాకుండా ఏకంగా రోడ్డు పొడవుతా గోడ్డ కట్టి సరళీకృత ఆర్థిక విధానాలు ముందుకు తెచ్చిన నగరాల సౌందర్యీకరణను తలపిస్తూ విదేశీ పెట్టుబడులతో తయారవుతున్న వర్తమాన స్మార్ట్ సిటీని అలంకరించారు. వృత్తిరీత్యా బడా వ్యాపారి ట్రంప్ అమెరికా నుండి ఇండియాచేరే లోపు 8,000 కిమీల దారి పొడవునా తడవ తడవకు తన లాభాల గణితాలకు తగ్గట్టు పట్టరాని సంతోషాన్ని వ్యక్తం చేస్తూ భారత్‌లో కోటి మంది తనకు స్వాగతం చెప్పనున్నారన్న సంబురంతో ఉబ్బితబ్బిబవుతూ అనేక ట్వీట్లు చేశాడు. నిజానికి అహ్మదాబాదు మున్సిపల్ కమీషనర్ మాత్రం ఆ సంఖ్యలోని కుడిపక్క రెండు సున్నాలు తొలగించి లక్షకు కుదించి వాస్తవాన్ని అందించాడు. అహ్మదాబాద్‌లోని ప్రపంచ విఖ్యాత మోతేరా స్టేడియంను ట్రంప్ ప్రారంభించి, సులేమానీని చంపి ఇరాన్‌ను పొగడిన చందంగానే మోదీనీ దేశాన్నీ తెగ ప్రశంసిస్తూ తన 27 నిముషాల ప్రసంగాన్ని ముగించాడు.

ఆయన దిల్లీ పర్యటన సందర్భంగా హొటల్ ఐటీసీ మౌర్యలో ప్రెసిడెన్షియల్ సూట్ 'చాణక్య'ను రంగ రంగ వైభవంగా అలంకరించి ప్రైవేట్ డ్రాయింగ్ రూమ్, ప్రైవేట్ టెర్రస్, జిమ్, ప్రైవేట్ ఎంట్రన్స్‌తో కూడిన డైనింగ్ ఏరియా, హై స్పీడ్ ఎలివేటర్, సిల్క్ పానెళ్లు గల వాల్స్, డార్క్ వుడ్ ఫ్లోరింగ్, అద్భుతమైన కళాఖండాలతో అలంకరించారు. రెండు బెడ్‌రూమ్‌లతో కూడిన ఈ సూట్‌లో ఇంతకుముందు అమెరికా మాజీ అధ్యక్షులు జిమ్మీ కార్టర్, బిల్‌క్లింటన్, జార్జి డబ్ల్యూ బుష్, బరాక్ ఒబామాలతో పాటు పలు దేశాల అధినేతలు బస చేసిన చోటనే ట్రంప్‌కు రాజభోగాలతో ఆతిథ్యం లభించింది.

5,000 మంది భద్రతా సిబ్బంది రక్షణలో ఐదంతస్తుల హొటల్ అంతా మూడంచెల భద్రతా ఏర్పాట్లు జరిగాయి. స్వాట్ కమాండోలు, స్నైపర్లు, హొటల్ సమీపంలో ఎత్తైన భవనాల్లో షార్ప్ షూటర్లను మోహరించారు. 438 గదులు గల ఆ హొటల్‌లో ఏ మూలకు వెళ్లినా హొటల్ మొత్తం 'నమస్తే ట్రంప్' నామస్మరణ విన్పించేలా చేశారు. మోదీ తన రెండు విడుతల ఎన్నికలలో విజయం సాధించిన అనంతరం అమెరికా పర్యటనకు వెళ్లినపుడు బీజేపీ అక్కడి ప్రవాస భారతీయులతో మొదట 2014 సెప్టెంబర్‌లో ఏర్పాటు చేయించిన న్యూయార్క్‌లోని మాడిసన్ స్క్వేర్ గార్డెన్ సభ, ఆ తరువాత 2019లో టెక్సాస్‌లో 'టెక్సాస్ ఇండియా ఫోరమ్' హ్యూస్టన్‌లో నిర్వహించిన 'హౌడీ మోదీ' సభలను తలదన్నే రీతిలో ఇక్కడి ఏర్పాట్లు నిర్వహించి మోదీ ఆ రెండు రోజులు ట్రంప్ సేవలో నిండా మునిగిపోయాడు. వారిరువురి మధ్య సాగిన కెమిస్ట్రీని ఒండొరుల పొగడ్తలను సామ్రాజ్యవాదులు భారత వ్యాపారానికి ఇచ్చే ప్రాధాన్యతగా, దాని పట్ల వారి లాభాపేక్షకు సంకేతంగానే ప్రజలు గమనించారు. భారత్, అమెరికాలు ప్రపంచంలో రెండు అతి పురాతన, పెద్ద ప్రజాస్వామిక దేశాలు అంటూ, అగ్రగామి ఆర్థిక వ్యవస్థలంటూ పొంగిపోయారు. ఆర్థిక సత్తాలో ప్రథమ స్థానంలో ఉన్న అమెరికా, ఐదవ స్థానంలో ఉన్న భారత్ మధ్య సన్నిహిత సంబంధాలు ఏర్పడడం ఏ కోణం నుంచి చూసినా ఇరుదేశాలకే కాక, ప్రపంచానికీ అత్యంత ప్రయోజనకరమే అంటూ స్వదేశీ జపాన్ని వదిలేసిన హిందుత్వ శక్తులు ఉప్పొంగిపోయాయి.

ఉగ్రవాదం ప్రధానంగా ఇస్లాం ఉగ్రవాదం, ఆర్థిక అసమానతలు, రక్షణ సహకారం, ఇంటెలిజెన్స్ సమాచార పంపిణీ, పర్యావరణం, సైబర్ నేరాలు, ఇంధన భద్రత, కమ్యూనికేషన్ విప్లవం, వర్తక సంబంధాలు, పెట్టుబడులు, మార్కెట్ విస్తరణ, ఉపాధి కల్పన వంటి అనేక విషయాలు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహ సమస్త సామ్రాజ్యవాద శక్తులకు వారి దళారీలకు కంఠోపాఠ ఎజండాగా మారాయి. వీటిలో పునాది వర్గాల ప్రజల జీవన్మరణ సమస్యలు మచ్చుకైనా కానరావు. ఉపాధి లాంటి అంశాలున్నప్పటికీ ఆచరణలో ఉన్నవి ఊడగొట్టడానికే తప్ప కొత్తవి సృష్టించడానికి కావనేది నూతన సరళీకృత ఆర్థిక విధానాల గురించి తెలిసిన వారికి తేటతెల్లమే! మన భారతదేశంలోనే 2012-2017 మధ్య గడిచిన ఐదేళ్లలో ఒక్క మానుఫాక్చరింగ్ రంగంలోనే 35 లక్షల ఉద్యోగాలు పోయాయి. ఆ సమయంలో మొత్తం దేశవ్యాపితంగా దాదాపు 90లక్షల ఉద్యోగాలు ఊడాయి. ప్రస్తుతం గత 45 సంవత్సరాల రికార్డును బద్దలు చేస్తున్న స్థాయిలో నిరుద్యోగం తాండవిస్తోంది. యావత్ప్రపంచ నిరుద్యోగ స్థితి ఇంతకన్నా భిన్నంగా ఏమీ లేదు. గత ఆరేళ్లలో ప్రపంచంలోని దాదాపు అన్ని పెద్ద, ధనిక దేశాలలోనూ పర్యటించిన భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆ ఎజండానే భుజానేసుక తిరిగాడన్నది జగమెరిగిన సత్యం. వాస్తవంగా ఈనాడు సమస్త అర్థవలస దేశాల నేతలకు అదే ఎజండా! మరోమాటలో చెప్పాలంటే నూతన సరళీకృత ఆర్థిక విధానాల రూపకల్పన ఆ ఎజండా! అందుకే అమెరికాలో మోదీ పర్యటించినా, భారత్‌లో ట్రంప్ పర్యటించినా ఏ దేశ నాయకులు ఏ దేశంలో పర్యటించినా ఆ ఎజండాలో మార్పేమి ఉండదనేది ఆలోచనాపరులు ఎరిగిందే!

ప్రపంచంలో భారీ పెట్టుబడులు సమకూర్చే దాదాపు అన్ని దేశాలలోనూ గత ఆరేళ్లలో మోదీ పర్యటించి భారత్‌కు అంతర్జాతీయంగా అనితరసాధ్యమైన గుర్తింపు తీసుకువచ్చాడని మోదిత్వ శక్తులు చంకలు గుద్దుకుంటున్నాయి. కానీ, అభివృద్ధికి కొలమానంగా వారు చూపే స్థూల జాతీయోత్పత్తి, ప్రజాస్వామ్య సూచీ సహ అన్ని రంగాలలో మోదీ హయాంలోనే గ్రాఫ్ దిగజారుతూ యేటేటా కుదేలుతుండడం గమనార్హం. 2006లో ప్రారంభమైన 167 దేశాల ప్రజాస్వామ్య సూచీలో 10 మెట్లు పడిపోయి మొదటి 10 దేశాల లిస్టునుండి బయటకు గెంటబడి 51వ స్థానానికి దిగింది. దానిని మరుగునపెట్టి చైనా 153వ స్థానంలో ఉందని సంఘ్ శక్తులు మురిసిపోతున్నాయి.

అధ్యక్షుడు ట్రంప్‌కూ, ప్రధాని మోదీకీ మధ్య ఏర్పడిన కెమిస్ట్రీ విలువ ఇరు దేశాల పేద ప్రజలను అడిగితే తెలుస్తుంది. దేశ ప్రజలు ఎన్నటికీ క్షమించని 2002 గుజరాత్ నరసంహార 'నాయకుడు' హిందూ 'హృదయ సామ్రాట్' మోదీ రక్తసిక్త చరిత్రను ఈసడిస్తూ అమెరికా పర్యటనకే అతడు అనర్హుడంటూ గతంలో ఆ దేశం ఆ ముఖ్యమంత్రి వీసానే రద్దు చేసింది. 2002 ఫిబ్రవరి-మార్చ్‌లో గుజరాత్‌లో 2,000 మంది ముస్లింల నరసంహారాన్ని క్రియాశీలంగా ప్రోత్సహించడం సిగ్గుచేటు అని ఆయనగారి రాజకీయ గురువు, భారత ప్రధాని వాజ్‌పేయి బహిరంగంగానే తప్పుపట్టక తప్పలేదు. అవన్నీ పెట్టుబడుల పోటీలో యాంకీలు పాతరేశారు. రెడ్ ఇండియన్‌లుగా ప్రపంచానికి పరిచయమైన 'అరువక్' ఆదివాసుల శవాల గుట్టలపై అమెరికాను నిర్మించుకున్న యాంకీలు వ్యాపార ప్రయోజనాల కోసం ఎంతకైనా తెగిస్తారు. పైగా వాళ్లే ప్రపంచ శాంతి దూతలయ్యారు. ప్రజాస్వామ్య వకాల్తాదారులయ్యారు. అలాంటివారిలో ఒకడైన ప్రపంచ నోబుల్ శాంతి పురస్కార గ్రహీత బారాక్ ఓబామా సహజంగానే గతాన్ని కాలదన్ని శ్వేత భవనంలో మోదీకి విందు ఏర్పాటు చేసినపుడు వ్యాపార దురంధరుడు ట్రంప్‌కు మోదీ గత చరిత్ర, అమెరికా గత నిర్ణయం ఏ లెక్కలోవి! ట్రంప్, మోదీల మధ్య అరమరికలు లేని సాన్నిహిత్యం నెలకొనడానికి వారిద్దరి మధ్య ఉన్న సరళీకృత ఆర్థిక విధానాల భావ సారూప్యతే అసలు కారణం.

'ఛాయ్‌వాలా' తనకేమీ ఆస్తులు లేవంటూనే తన వ్యాపారకళతో బహుళజాతుల కార్పొరేషన్‌లు మన దేశ సమస్త వనరులను కొల్లగొట్టుక పోవడానికి దారులు విశాలం చేస్తూ ప్రధాన సేవకుడిగా వాటికి అనేక రకాల ఊడిగం చేస్తూన్నాడు. సరళీకృత ఆర్థిక విధానాల దుష్పరిణామాల నుండి ప్రజలను పక్కతోవ పట్టించడానికి ఆ విధానాలు సూచించిన రంగు భేదం, అంధ జాతీయవాదం, మతోన్మాదాలను ప్రపంచ నాయకులంతా సమర్థిస్తున్నారు. సామ్రాజ్యవాదులు సృష్టించిన ఇస్లామిక్ ఉగ్రవాదం ప్రపంచ వ్యాపితంగా అదుపు తప్పిన మంత్రగాడి భూతంలా మారింది. మనదేశ సంఘ్ బ్రిగెడ్ 'కేసరియా శక్తులకు' ముస్లింలంటేనే పూనకం వస్తుంది. ఫలితంగా, దానిని తుదముట్టించడంలో ఉభయులకూ ఒకే రకమైన ఆసక్తీ ఆలోచనలున్నాయి. యాంకీలకు ఇజ్రాయిల్ ముద్దుబిడ్డ అయితే, సంఘ్ పరివార్‌కు ప్రియమైన ఆదర్శం. ఇవి ఇలా ఉంటే ఆర్థికంగా, రాజకీయంగా ప్రపంచ మార్కెట్‌లో చైనా దూకుడును తగ్గించడం యూఎస్‌కు ఇపుడు అవసరం. అందుకు దక్షిణాసియాలో దాని చెప్పుచేతులలో నడుచుకునే భారత పాలకవర్గాలను వాడుకోవడం దానికి అన్ని విధాలా లాభదాయకం.

భారత పర్యటనలో సామ్రాజ్యవాద అధిపతి ట్రంప్ చివరివరకూ 'వర్తకుడు లాభం లేనిదే వరదన పడడు' అన్న చందంగా వ్యాపార వాణిజ్య ఒప్పందాల యావలోనే మునిగిపోయాడు. ట్రంప్ పర్యటన సందర్భంగా వివిధ రంగాలలో ఇరు దేశాల మధ్య అనేక ఒప్పందాలు జరిగాయి. రెండు దేశాల మధ్య యేటా 12 వేల కోట్ల డాలర్ల వ్యాపారం సాగుతుందంటూ దానిని 50వేల కోట్ల డాలర్లకు పెంచాలని నేతలు భావించారు. మన దేశం చైనా తదుపరి అమెరికాతోనే భారీ వ్యాపారాన్ని కొనసాగిస్తోంది. చైనాకు మనం 17.3 బిలియన్ డాలర్ల సరుకులు ఎగుమతి చేస్తుండగా చైనా నుండి 50 బిలియన్ డాలర్ల సరుకులు దిగుమతి చేసుకుంటున్నాం.

అంటే చైనాతో వ్యాపార లోటును ఎదుర్కొంటున్నాం. కానీ మరోవైపు అమెరికాతో 2018లో రూ.10.12 లక్షల కోట్ల వ్యాపారం జరిగి 2019లో రూ.1.65 లక్షల కోట్ల వ్యాపార మిగులు ఏర్పడింది. చైనాతో అమెరికా వాణిజ్యలోటులో పదోవంతు కూడా లేని ఇండియా పైనా కారాలూ మిరియాలూ నూరుతున్న ట్రంప్ ఆగ్రహం – మన ఛాయ్‌వాలాకు వివిధ సందర్భాలో సాక్షాత్కరిస్తోంది! ప్రపంచంలో ఎక్కడా లేని సుంకాలు విధిస్తూ తమ దేశ వాణిజ్యాన్ని భారత్ తీవ్రంగా దెబ్బ తీస్తుందని 'తొలుత అమెరికా' అంటూ నినదించే ట్రంప్ తెగ మండిపడుతుంటాడు. మన దేశంతో వాణిజ్యలోటును తగ్గించడానికి ట్రంప్ అనేక ఎత్తులు వేస్తున్నాడు. అందులో భాగమే పౌల్ట్రీ, పాల ఉత్పత్తుల దిగుమతి పథకం.

అమెరికాకు ఎనిమిదో అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఇండియా ఎదిగి అమెరికాతో వాణిజ్యంలో దక్షిణ కొరియా, ఫ్రాన్స్‌ల సరసన ఇండియా చేరిందన్న మాటేగాని ట్రంప్ ప్రధానంగా భారత్‌తో వాణిజ్యలోటును తగ్గించడంపై దృష్టి సారించడంతో–సుంకాలు, విదేశీ పెట్టుబడులపై నియంత్రణలు, వ్యవసాయ, పౌల్ట్రీ పాల ఉత్పాదనలపై ఆంక్షలు ముందుకు వచ్చాయి. భారత్ మెడలు వంచి వ్యవసాయ పౌల్ట్రీ పాల రంగాల తలుపులు తెరిపించాలన్న తెరచాటు అజెండాతో అతడి వ్యాపార యుద్ధంలో భాగంగా భారీ వాణిజ్య సుంకాలు మనకూ వడ్డించాడు. ఇండియా మరే మాత్రం అభివృద్ధి చెందుతున్న దేశం కానే కాదంటూ వాణిజ్య రాయితీలకు చెల్లుకొట్టిన ట్రంప్ ప్రభుత్వం– 'మా ఇంటికొస్తే ఏం తెస్తావు; మీ ఇంటికొస్తే ఏం పెడతావు?' చందంగా వ్యవహరిస్తోంది. భారత్ మొదట తన ఎగుమతులపై ఎటువంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేని ప్రాధాన్య హోదా (జీఎస్‌పీ) కలిగి ఉండింది. అమెరికా ఉత్పత్తులకు భారత మార్కెట్లలో 'సమానమైన, సమర్ధనీయమైన' వాతావరణం కల్పించడంలో భారత్ విఫలమైందని 'తొలుత అమెరికా' ('అమెరికా ఫస్ట్') విధానంతో పని చేస్తున్న ట్రంప్ భావించి దానిని రద్దు చేసి మన దేశ దిగుమతులపై కూడా వ్యాపార సుంకాలు విధించిన విషయం, దానిని పునఃపరిశీలించాలని మోదీ ట్రంప్‌కు మొర పెట్టుకోవడం ప్రజలు ఇంకా మరిచిపోలేదు.

శ్వేత విప్లవాన్ని సాధించిన దేశంగా భారతదేశం ప్రపంచంలోనే పాల ఉత్పత్తులలో అగ్రశ్రేణిలో ఉండడంతో మన దేశానికి అన్ని రకాల పాల ఉత్పత్తుల దిగుమతులను చాలా కాలం క్రితమే నిలిపివేశారు/నిషేధించారు. ఎందుకంటే మన దేశంలో దాదాపు 8కోట్ల కుటుంబాలు ఏదో రూపంలో పాల ఉత్పత్తులతో ముడిపడి ఉన్నవి. ట్రంప్ పర్యటనలో కోళ్ల పరిశ్రమతో పాటు పాడి రంగంలోకి అమెరికా ఉత్పత్తులను పాక్షికంగానైనా అనుమతించాలన్న వత్తిడికి భారత్ లొంగితే ఆ కుటుంబాలన్నీ తీవ్రమైన ఆర్థిక దుష్పరిణామాలకు గురికాక తప్పదు. అమెరికా తన వ్యవసాయోత్పత్తులను ఎగుమతి చేయడానికి కొలంబియా, పనామా, దక్షిణ కొరియాలతో నూతన ఒప్పందాలు చేసుకుంది. ఆ వరుసనే మన దేశంతోనూ ఒప్పందాలు జరిగితే పాలు, సేపులు, అర్కట్, బాదాం, సోయాబీన్, గోధుమలు, మక్కలు, కోడి కాళ్లు అతి తక్కువ దిగుమతి సుంకాలపై మనం తెచ్చుకోక తప్పదు. అది దిగజారుతున్న భారత వ్యవసాయ రంగాన్ని మరింత తీవ్రంగా దుష్ప్రభావితం చేస్తుంది. అందుకే వాటికి వ్యతిరేకంగా మన దేశంలో రైతులు పోరాటానికి సిద్ధమయ్యారు. పాడీ, కోళ్ల పరిశ్రమకు సంబంధించిన విషయాలలో అమెరికాతో ఎలాంటి ఒప్పందాలు చేసుకోకూడదని 'జాతీయ రైతు మహాసభ', 'అఖిల భారత పోరాట సమన్వయ సమితి' నాయకత్వంలో 100కు పైగా రైతు సంఘాలు ట్రంప్ రాక సందర్భంగా తమ తీవ్ర నిరసనను తెలిపాయి. దానితో, 2025 నాటికి దేశం 5 ట్రిలియన్ డాలర్ల (5 లక్షల కోట్ల డాలర్లు) జీడీపీతో ప్రపంచంలోనే మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపొందాలన్న ఏకైక పంతంతో అన్ని రంగాలలోకి మోదీ సర్కార్ విస్తృతంగా విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తున్నప్పటికీ ఈ విషయంలో మాత్రం వెనుకంజ తప్పలేదు. మోదీ–షాల ఎత్తుగడలతో ఢిల్లీ విధానసభ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ ఘోర ఓటమి పాలు కావడం సహ దేశంలో వీస్తున్న అనేక రకాల కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక పవనాల మధ్య ఈ రంగంలో ఒప్పందానికి మోదీ సాహసించలేదు. వాస్తవం ఇది కాగా వ్యాపార సంధుల విషయంలో మాత్రం మోదీ ఘటికుడు అంటూ ఆయన ఖాతాలో ట్రంప్ మరో కితాబును చేర్చారు.

ట్రంప్ పర్యటనలో భాగంగా అమెరికా ప్రతినిధి బృందం కొవ్వాడ అణు విద్యుత్తు కేంద్రం సహ దేశంలో ఆరు అణు రియాక్టర్ల నిర్మాణ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఎన్‌పీసీఎల్‌తో ఇంతకుముందే కుదిరిన ఒప్పందాలపై సంతకాలు చేసింది. అమెరికాకు చెందిన వెస్టింగ్ హౌజ్... ఇక్కడ రియాక్టర్లను నిర్మించనుంది. ఈ బృందంలో ఉన్న అమెరికా అణు ఇంధన మంత్రిత్వ శాఖ అసిస్టెంట్ సెక్రటరీ రీటా సబరన్‌వాల్ భారత సంతతికి చెందినదేనని గొప్పగా చెప్పుకుంటున్నారు. కానీ ఆవిడ ఎవరి ప్రయోజనాలను నెరవేర్చడానికి ట్రంప్ ప్రభుత్వంలో భాగమైందో విడిగా రాయాల్సిన అవసరమే లేదు. ట్రంప్ పర్యటనలో భారత నావికా దళానికి 260 కోట్ల డాలర్లతో 24 సీహాక్ హెలికాప్టర్ల కొనుగోలు ఒప్పందం జరిగింది. మీ దేశానికి మేమిపుడు అత్యంత భారీవినాశకర ఆయుధాలను సమకూరుస్తున్నామన్న ట్రంప్‌తో భారత్ 300 కోట్ల డాలర్ల ఆయుధాల కొనుగోలు ఒప్పందం చేసుకుంది. ట్రంప్ ప్రతినిధిమండలి వ్యాపార వాణిజ్య రంగాలలో చేసుకున్న ఒప్పందాలు అమెరికా ఘరానా సైనిక పారిశ్రామిక రంగానికి అనేక ప్రయోజనాలను తీర్చనున్నాయి.

డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన 'అమెరికా విజన్'లో ఫ్రీ అండ్ ఓపెన్ ఇండో-పసిఫిక్ రీజియన్ ముఖ్యమైనది. చైనాను నియంత్రించడానికి అమెరికా అనేకానేక దేశాలను తన పక్షం చేసుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తుంది. అందులో భారతదేశానికి ఎనలేని ప్రాముఖ్యతను ఇస్తోందది. భారతదేశంతో 'లాజిస్టిక్ ఎక్స్ఛేంజ్ మెమోరాండం ఆఫ్ అగ్రిమెంట్', 'కమ్యూనికేషన్ కంపీటబిలిటీ అండ్ సెక్యూరిటీ అగ్రిమెంట్'లపై ఒప్పంద సంతకాలు జరిగాయి. 'ఆసియా రీఎస్యూరెన్స్ ఇనిషియేటివ్ ఆక్ట్-2018' కి డిసెంబర్ 31న చట్టబద్ధత లభించింది. దీంతో ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో మిత్రదేశాలను ఆర్థిక, రక్షణపరంగా బలోపేతం చేయాలన్నది అమెరికా లక్ష్యం. ఆయా దేశాల్లో ప్రజాస్వామ్య విలువలు, సైబర్ భద్రత, అంతర్జాతీయ జలాల్లో స్వేచ్ఛగా ప్రయాణించేలా, రక్షణ రంగాలను బలోపేతం చేయడం వంటి అంశాలను అందులో పొందుపరిచారు. అమెరికా కాంగ్రెస్‌లో భారీ మద్దతు లభించడమే ఆ బిల్లు ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది. ప్రధాన రక్షణ భాగస్వామిగా ఇండియాకు ఇచ్చిన హోదాను ట్రంప్ అధ్యక్షుడయ్యాక మరింత విస్తృతం చేసి, సమాచార అనుకూలత భద్రత ఒప్పందం (కామ్‌కోసా) పట్టాలకెక్కించారు. రక్షణ ఉత్పత్తుల విక్రయాలకు అక్కరకొచ్చేలా ఇండియాను అక్కున చేర్చుకొంటున్న అగ్రరాజ్యం - ఇతర దేశాల నుంచి భారత్ ఆయుధాల కొనుగోళ్లపైనా కన్నెర్రజేస్తోంది. 2003 వరకు అమెరికా మన దేశంతో డిఫెన్స్ ట్రేడ్‌లో 14వ స్థానంలో ఉండగా 2009-14 మధ్య అది రెండవ స్థానానికి ఎదిగినప్పటికీ దాని దోపిడీ దాహం తీరేది కాదు.

ప్రపంచంలో ఇపుడు సామ్రాజ్యవాదుల మధ్య ముఖ్యంగా అమెరికాకు గట్టి పోటీదారుగా సోషల్ సామ్రాజ్యవాద చైనా రంగంలో నిలిచింది. చైనా రష్యా ఇరాన్‌లు ఒక కూటమిగా వ్యవహరిస్తున్న విషయం చూస్తున్నాం. ఆసియా పసిఫిక్, మధ్య ఆసియా, హిందూ మహా సముద్రం, మధ్య ప్రాచ్యం, ఆఫ్రికా మున్నగు దేశాలతో చైనాతో పోటీగా అమెరికా దన్నుతో 'అభివృద్ధి' ఎజండాతో తన సంబంధాలను పెంచుకుంటున్న భారత పాలక వర్గాల తోడ్పాటు ఈ సమయంలో అమెరికాకు చాలా కీలకమైనది.

సార్క్ దేశాలపై చైనా పట్టు పెరుగుతున్న నేపథ్యంలో భారత్ దానికి విరుగుడుగా ఉప ప్రాంతీయ కూటములను ఏర్పాటు చేసింది. బంగ్లాదేశ్, భూటాన్, ఇండియా, నేపాల్ (బీబీఐఎన్) కూటమి ఈ విధంగా ఏర్పాటైందే. ఇండియా, మయన్మార్, థాయిలాండ్ త్రైపాక్షిక రహదారి కూటమి తూర్పుదేశాలతో సంబంధాల పటిష్టతకు ఏర్పడ్డది. సార్క్, బిమ్‌స్టెక్‌తో పాటు మరో రెండు ప్రాంతీయ కూటములు కూడా ఏర్పాటయ్యాయి. హిందూ మహాసముద్ర తీర కూటమి (ఐఓఆర్‌ఏ) ఆస్ట్రేలియా చొరవతో 1995లో ఏర్పాటయింది. అందులో ఆస్ట్రేలియా, భారత్, ఇరాన్, దక్షిణాఫ్రికాతో పాటు 20 దేశాలకు సభ్యత్వం వున్నది. ప్రధాని నరేంద్రమోదీ రెండవ పర్యాయం ప్రమాణ స్వీకారం సందర్భంగా 'బంగాళాఖాత తీర కూటమి' (బిమ్స్‌టెక్) దేశాల నాయకులను ఆహ్వానించాలని నిర్ణయించడం తూర్పు దేశాలతో అనుసంధానాన్ని పెంచుకోవాలన్న విధానానికి అనుగుణంగా వున్నది. ఈ బిమ్స్‌టెక్ దేశాలలోని బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్, భూటాన్ దేశాలు సార్క్‌లో కూడా సభ్యదేశాలే. బిమ్‌స్టెక్ దేశాలలో మొత్తంగా 1.5 బిలియన్ జనాభా వున్నది. ప్రపంచ జనాభాలో ఇది 22శాతం. ఈ ప్రాంత స్థూల దేశీయోత్పత్తి 2.8 ట్రిలియన్ డాలర్లు. బిమ్‌స్టెక్ దేశాల మధ్య నౌకాయానానికి కూడా ప్రాధాన్యం వున్నది. ఇవన్నీ అమెరికా ప్రయోజనాలను ఈడేర్చుకునే విధంగా భారత్‌ను మలచుకోవాలన్నదే అమెరికా వ్యూహం.

అమెరికా, రష్యాలు ఇకపై అడ్డూ ఆపూ లేని ఆయుధ పోటీకి దిగబోతున్నట్టు ఈ రెండు దేశాలూ ఇటీవల తీసుకున్న నిర్ణయంతో తేలిపోయింది. మధ్యతరహా అణ్వస్త్ర నిర్మూలన ఒప్పందం (ఐఎన్ఎఫ్) నుంచి వైదొలుగుతున్నట్టు అమెరికా ప్రకటించగానే, రష్యా కూడా అదే దారిలో నడుస్తూ, మరింత ఆధునిక క్షిపణుల రూపకల్పనకు సిద్ధపడుతున్నట్టు ప్రకటించింది. అధ్యక్షుడు ట్రంప్ అమెరికా రక్షణ బడ్జెట్ 740 బిలియన్ డాలర్లు (ఇంచుమించు రూ. 56 లక్షల కోట్లు) ప్రతిపాదించడం గమనార్హం. ఇందులో పరమాణు ఆధునీకరణకు 28.9 బిలియన్ డాలర్లు అంటే ఆ దేశం ఏ వైపు వెళుతుందో గమనించవచ్చు. ట్రంప్ వర్తమాన పర్యటనలో మన దేశంలో జరిగిన అణు రియాక్టర్ల నిర్మాణ ఒప్పందాన్ని ఈ నేపథ్యంలోనే చూడాలి. 2019లో చైనా రక్షణ బడ్జెట్ రూ. 12.6 లక్షల కోట్లు, భారత రక్షణ బడ్జెట్ 3.37 లక్షల కోట్లు. ఈ అంకెలు చైనాతో పోటీలో భారత సామర్థ్యానికి అమెరికా దన్ను ఆవశ్యకతను తెలుపుతున్నాయి. నిజానికి ఇంత మొత్తాలలో వారు నిధులు కేటాయిస్తున్నారంటే మరోవైపు ప్రజా సంక్షేమ నిధులకు కోత విధిస్తున్నారని విడిగా చెప్పాల్సిన పనే ఉండదు. ఫలితంగా, అమెరికాలో పేదరికం పెచ్చుమీరుతోంది.

అమెరికాలో రూ.18.50 లక్షల వార్షికాదాయం ఉన్న వర్గాలను పేదలుగా గుర్తిస్తున్నారు. వీరి సంఖ్య నాలుగు కోట్లుంటుందని అక్కడి గణాంకాలే తెలుపుతున్నాయి. అంటే 30కోట్ల అమెరికా జనాభాలో వీరి శాతం 12% ఉండగా వీరిలో శ్వేతజాతీయులు కానివారే 20%గా ఉన్నారు. గత 20 సంవత్సరాలలో వీరి సంఖ్య 55% పెరిగింది. అమెరికాలో రోజుకూ 22 మంది వెటరన్‌లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అలాంటి దేశంలోని పేదల కోసం అమెరికా ఒకవైపు సంక్షేమ నిధులలో కోతలు విధిస్తున్నప్పటికీ అనివార్యంగా మరోవైపు పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. లేనిచో వారి ఆగ్రహం అనే గ్యాస్ సిలిండర్ పేలిపోతుంది. తక్కువ ధరకు ఆహార స్టాంపులు అందజేయడం, ఉచిత విద్య, ఆరోగ్య పథకాల వంటివి అందులో ఉన్నాయి. అయితే వీటిని పేద అమెరికన్ల కంటే వలసదారులు ఎక్కువగా వినియోగించుకుంటున్నారని,

ఫలితంగా స్వదేశీ పన్ను చెల్లింపుదారులపై అధిక భారం పడుతోందని చాలా కాలంగా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. వలసదారులపై మరో కఠిన నిబంధనాస్త్రాన్ని ప్రయోగించేందుకు ట్రంప్ సర్కారు సమాయత్తమైంది. అమెరికాలో శాశ్వత నివాస హోదా కోరే విదేశీయులెవరూ అక్కడి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆధారపడకుండా అది నిషేధం విధించనుంది. ఈ విషయంలో మోదీ ప్రభుత్వం నోరు విప్పలేదు.

తమ దేశంలోని పన్ను చెల్లింపు దారులపై వలసదారులు అదనపు భారంగా మారకుండా నిరోధించేందుకుగాను ఈ నూతన నిబంధనను అమల్లోకి తీసుకురానుంది. హెచ్-1బీ వీసాలపై అమెరికాలో ఉంటూ గ్రీన్‌కార్డు కోసం దీర్ఘకాలంగా నిరీక్షిస్తున్న వేలమంది భారతీయులపై ఇది ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తన విజయావకాశాలను మెరుగుపరుచుకోవడానికి ట్రంప్ కొన్ని కొత్త అస్త్రాలు వెలికితీశాడు. ఎన్నికల ముందు విద్వేషపూరితమైన వాతావరణాన్ని సృష్టించి, డెమోక్రాట్ల ఓటు బ్యాంకును ఛిన్నాభిన్నం చేయడం లక్ష్యంతో అమెరికా పౌరులు కాని వారు, వలసదారులకు అమెరికాలో పుట్టిన పిల్లలకు పుట్టుకతో సంక్రమించే పౌరసత్వ హక్కును రద్దుచేస్తానని ప్రకటించాడు. ప్రస్తుత రాజ్యాంగం ప్రకారం తల్లిదండ్రుల వలసస్థితి, పౌరసత్వంతో నిమిత్తం లేకుండా అమెరికాలో పుట్టే పిల్లలు అమెరికా పౌరులు అవుతున్నారు. ఈ విషయంలో 'తొలుత అమెరికా' అనే విధానం ముందు మోదీ గొంతు మూగపోయింది. గతంలో 85 వేల హెచ్1బీ వీసాల్లో భారతీయ ఐటీ నిపుణులు 70 శాతం పొందేవారని, ప్రస్తుతం అమెరికా వలస విధానంలో ఆంక్షల వల్ల 2015లో 6 శాతం వీసా దరఖాస్తులు తిరస్కరణ కాగా 2019 నాటికి అది 24 శాతానికి చేరింది. అయినా మోదీ నోటా పల్లెత్తు మాట పెకలదు. 3 బిలియన్ అమెరికా డాలర్ల విలువైన రక్షణ ఒప్పందాలను అమెరికాతో భారత్ చేసుకుంటుండగా, భారత్ ఉక్కు ఎగుమతులపై అమెరికా ఆంక్షలు ఎందుకని నిలదీసే సామర్థ్యం మన పాలకులకు ఎక్కడుంటుంది?

ఈ మూడు సంవత్సరాల్లో అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న అనేక నిర్ణయాలు విశ్వ వ్యాపితంగా బూర్జువా వర్గాలలోనే ఎంతగానో వివాదాస్పదమయ్యాయి. ముస్లింల జనాభా అధికంగా ఉన్న ఏడు దేశాల పౌరులపై అమెరికాలో ప్రవేశంపై ఆంక్షలు విధించడం, చైనాతో వాణిజ్య యుద్ధం, ఆమెరికన్లకు ఉద్యోగ ప్రయోజనాలు కలిగేలా నిబంధనలు కఠినతరం చేయడం, మెక్సికో సరిహద్దులో ఉద్రిక్త వాతావరణం సృష్టించడం, ఏడువేలమంది వలసదారులను అడ్డుకోవడానికి వేలాదిమంది సైనికులను అమెరికా సరిహద్దుల్లో మోహరించి తానొక యుద్ధం చేస్తున్న భావనను ప్రజలకు కలిగించే ప్రయత్నమూ చేశాడాయన. అదనపు బలగాల మోహరింపుతో మెక్సికన్లను భయాందోళనకు గురిచేయడం, ఇరాన్ సైన్యాధికారిని హత్య చేయడం వరకు అనేక నిర్ణయాలను తీసుకున్నాడు. ప్రపంచ ప్రజల దృష్టిలో అత్యంత ధూర్త రాజకీయవేత్తగా అవతారమెత్తిన ట్రంప్ దాష్టీక విధానాలలో మోదీ ప్రభుత్వం ఏ ఒక్కదానిని నిర్ద్వంద్వంగా ఖండించలేదు. అంతేకాదు, తమ ప్రయోజనాలకు భంగం వాటిల్లినప్పుడు అమెరికా దృష్టిలో చైనా అయినా ఒకటే భారత్ అయినా ఒకటే! అన్న అతగాడి 'తొలుత అమెరికా' విధానంలోని వివక్షను హిందుత్వ 'గాయత్రి మంత్రం' ఎదిరించలేదు.

అమెరికా కొన్ని దేశాలపై దాడులు చేస్తూ మిగతా దేశాలను బెదిరిస్తది. ఉదాహరణకు ఇరాన్‌తో కయ్యానికి సిద్ధమై భారత్‌పై వాణిజ్య ఆంక్షలను విధించింది. అమెరికా షరతులు భారత్‌కు అంగీకారయోగ్యంగా లేవు. అయినప్పటికీ ఒక బలమైన సామ్రాజ్యవాద దేశం దళారీ స్వభావం కలిగిన అర్ధవలస దేశాన్ని తమ ప్రయోజనాలకు అనుగుణంగా సునాయసంగానే ఒప్పించ గలుగుతుంది. బడుగు దేశాలు తాము నష్టపోతామని తెలిసి కూడా అమెరికా వాణిజ్య ప్రయోజనాలు నెరవేర్చవలసి వస్తున్నది. ఈ చిదంబర రహస్యం అర్థం కావాలంటే నూతన సరళీకృత ఆర్థిక విధానాలను తెలుసుకోవాలి. నిజానికి ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యు.టీ.వో)ను ఏర్పర్చడం వెనుక ప్రపంచవ్యాప్తంగా వలసవాదం మరోరూపంలో అమలవుతున్నది. అందువల్ల అమెరికా పెత్తందారీ పోకడలకు ప్రపంచదేశాలు అడ్డుకట్టవేయాలె. పాత్రికేయుడు ఖషోజ్జీని చంపిన సౌదీతో సంబంధాలు తెంపుకోవడానికి సిద్ధంగా లేననీ ట్రంప్ గతంలోనే అన్నాడు. తమనుంచి భారీగా ఆయుధాలు కొనే సౌదీని దూరం చేసుకొని ఆయుధ కంపెనీలకు అన్యాయం చేయలేనన్నాడు. అది వారి వ్యాపార నీతి. దానికి రాజకీయ ముసుగు తగిలించడంలో వారు మహా దిట్టలు. అమెరికా అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యూ బుష్ ' ధరిత్రిపై అత్యంత శక్తిసంపన్నులమైన మాపై (అమెరికా) స్వాతంత్ర్యాన్ని విస్తరింపచేసే బాధ్యత ఉంది' అంటూ 1776 జూలై 4 నాటి థామస్ జెఫర్సన్ స్వాతంత్ర ప్రకటన విధానాన్ని 'గతంలో తమను బంధించిన రాజకీయ సంకెళ్లను తెంచుకుని ప్రకృతి నియమాలు, దేవుని నియమాలు ఇచ్చిన హక్కుల ఆధారంగా ప్రత్యేక, సమాన దేశంగా ఎదిగి భూమిమీద శక్తులకు ఒకటిగా నిలబడే తరుణం మానవ ఘటనల క్రమంలో వస్తుంది' అన్నదాన్ని నిలువునా కాలనాలికలో పాతరేసి భవిష్యత్ అధ్యక్షులకు సైనిక దురాక్రమణల దారి చూపాడు.

అమెరికా - భారత్‌ల మధ్య సంబంధాలలో ఉభయ తెలుగు ప్రాంతాలు చాలా ముఖ్యమైనవి. హైదరాబాద్‌లో కాన్సులేట్ కార్యాలయం ఏర్పాటులో అమెరికన్ సభ్యులు, భారత సభ్యులు ఎంతో కీలకమైన పాత్ర పోషించారు. హైదరాబాద్ ప్రపంచంలోనే ఎంతో ముమ్మరంగా వీసాలను జారీ చేసే ప్రాంతమని చెప్పవచ్చు. విద్యార్థి వీసాలు, వ్యాపార వీసాలు జారీ చేసే విషయంలోనైతే హైదరాబాద్ ప్రపంచంలో మొదటి పదిస్థానాల్లో ఉంటుంది. ఆ కార్యాలయం ప్రారంభించిన పదేళ్ళలో ఒక్క హైదరాబాదులోనే

బోయింగ్, లాఖీడ్-మార్టిన్, అమెజాన్, గూగుల్, ఉబర్, ఆపిల్ వంటి ప్రముఖ సంస్థలు తమ కార్యకలాపాలను ప్రారంభించాయి. అంతకుముందే డెల్ సంస్థ పదేళ్ళుగాను, మైక్రో సాఫ్ట్ సంస్థ ఇరవై ఏళ్ళుగాను అక్కడ పని చేస్తున్నాయి; మైక్రోసాఫ్ట్ సంస్థ సీఈవో కూడా హైదరాబాద్‌కు చెందినవాడే! 130కి పైగా అమెరికన్ కంపెనీలు ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ రంగంలో నెలకొన్నాయి. గత ఐదేళ్ళలోనూ ఈ రాష్ట్రాలకు లక్షకోట్ల రూపాయల విదేశీ పెట్టుబడులు వచ్చాయి. 2018లో హైదరాబాద్‌లో జరిగిన 'గ్లోబల్ అంత్రప్రెన్యూరియల్ సదస్సు'కు ట్రంప్ కూతురు ఇవాంకా హాజరైన సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి కూడా ప్రపంచ పెట్టుబడుల యావలో మహా ఆర్భాటం చేశాడు. ఇది అర్థం కాకుండా ఇవాంకను కల్వకుంట్ల గారు సత్కరించడం వెనుక దాగిన రహస్యం అంతు పట్టదు.

అమెరికాలో వాషింగ్టన్ డీసీ సహా 30 నగరాలలో సీఏఏకు వ్యతిరేకంగా ప్రదర్శనలు చేశారు. 'కోల్యూషన్ టూ స్టాప్ జినోసైడ్' నాయకత్వంలో భారత రాయబారికి వినతిపత్రం సమర్పించారు. 'ఇండియన్ అమెరికన్ ముస్లిం కౌన్సిల్', 'ఈక్వాలిటీ లాబ్స్', 'హిందూస్ ఫర్ ఈక్వల్ రైట్స్' లాంటి అనేక సంస్థలు ఆ ప్రదర్శనలలో పాల్గొన్నాయి. 751 మంది గల యూరోపియన్ పార్లమెంటులో 154 మంది సమర్థనతో ఓటింగ్ జరిపి మెజార్టీ అభిప్రాయంతో సీఏఏకు వ్యతిరేకంగా తీర్మాణం చేయడం జగద్విదితమే! పౌరసత్వ సవరణ చట్టంతో భారత్‌లో మత స్వేచ్ఛకు తీవ్ర భంగం వాటిల్లిందని అంతర్జాతీయ మత స్వేచ్ఛపై యూ.ఎస్. కమీషన్ వెల్లడించిన నివేదికనైనా ట్రంప్ తన 27 నిముషాల ఉపన్యాసంలో 15 సార్లు మోదీ పేరెత్తుకుని రెండున్నర నిముషాలు అతగాడిని ప్రశంసించడానికే కెటాయించాడు తప్ప దానిని ప్రస్తావించలేదు. ట్రంప్ పర్యటన సందర్భంగా దిల్లీ షాహీన్‌బాగ్‌లో ప్రజల పై జరిగిన హిందుత్వ శక్తుల హత్యాకాండ గమనార్హం. వీటిపై ఆ మొనగాడు నోరైనా మెదుపలేదు. కశ్మీర్‌పై మధ్యవర్తిత్వం నెరపడానికి సిద్ధం అని ప్రగల్భాలు పలికిన ట్రంప్‌కు మోదీ జరిపిన స్వాగత సన్మాన సంబురాలలో వేదికపై అది గుర్తుకే రాలేదు.

2020 అమెరికాలో అధ్యక్ష ఎన్నికల సంవత్సరం. రిపబ్లికన్ పార్టీ తరపున అభ్యర్థిగా మరో విడుత ట్రంప్ నిలబడడానికే పూర్తి అవకాశాలు ఉండగా, డెమాక్రటిక్ పార్టీ తరపున అభ్యర్థి ఎన్నిక ప్రక్రియ నడుస్తోంది. అమెరికాలోని 50 రాష్ట్రాలలో కలిపి దాదాపు 50 లక్షల భారతీయులుంటారు. వాటిలోని 16 రాష్ట్రాల్లో వారి జనాభా అధికం. గత ఎన్నికలలో ఇంచుమించు 10 రాష్ట్రాలలో ట్రంప్‌ను మించి హిల్లరీకే వారి ఓట్లు పడడం తెలిసిందే! ప్రవాస భారతీయులలో అధిక శాతం డెమాక్రటిక్ పార్టీ సమర్థకులేనన్నది గమనార్హం. గత అధ్యక్ష ఎన్నికలలో అవినీతిలో నిండా మునిగి అంచులపై గెలిచిన ట్రంప్ ఈసారి ముందునుండే జాగ్రత్తపడడం వర్తమాన పర్యటనలో విడదీయరాని భాగం. ఆయన తొలి అడుగు అహ్మదాబాదులో వేయడం వెనుక అమెరికాలోని భారతీయులలో గుజరాతీలు గణనీయమైన సంఖ్యలో ఉండడమే అందుకు గల ఒక ముఖ్య కారణం.

సామ్రాజ్యవాద యుగంలో ఒక నూతన ఫేజుగా ముందుకు వచ్చిన నియో లిబరల్ ఆర్థిక విధానాలు కూడా వారిని సంక్షోభాల నుండి గట్టెక్కించలేక పోతున్నాయి. దానితో ప్రపంచంలో నూతన సరళీకృత ఆర్థిక విధానాల దుష్పరిణామాలు యేటేటా తీవ్రతరమవుతున్న నేపథ్యంలో సామ్రాజ్యవాద నాయకుల విదేశీ పర్యటనలు ముఖ్యంగా అపార ప్రాకృతిక వనరులను కలిగిన అర్ధ వలస దేశాల పర్యటనలు పోటీలుపడి సాగుతున్నాయి. గతంలోని సంక్షేమ రాజ్య భావనకు తిలోదకాలు ఇచ్చి కినీషియన్ ఆర్థిక విధానాలకు చెల్లుచీటి ప్రకటించి పబ్లిక్ సెక్టార్‌లోని అన్ని రంగాలను ప్రైవేటీకరించాలని శాసించే, వ్యక్తుల వ్యక్తిగత ఆస్తుల హక్కులకు చట్ట పాలనా, మార్కెట్టులు, స్వేఛ్ఛా వ్యాపారానికి అన్ని విధాల హామీనిచ్చే వ్యవస్థాపిత ఏర్పాట్లను సైద్ధాంతికంగా బలంగా సమర్థించే నియో లిబరల్ ఆర్థిక విధానాలను 1970లలో అమెరికా రోనాల్డ్ రీగన్, బ్రిటన్ మార్గరెట్ థాచర్‌లాంటి మహాశయులు ముందుకు తెచ్చారు. వ్యక్తి స్వేచ్ఛకు పట్టంకట్టే పేరుతో వినియోగదారుల రక్షణ, శ్రామిక చట్టాల సంస్కరణ, అనుకూల పన్నుల విధానం, వ్యాపార స్పర్థను ప్రోత్సహించే గుత్తా సంస్థలను కట్టడిచేయడానికి 1970లలో నియో లిబరల్ విధానాలకు ఒక రీగన్, మరో థాచర్‌లు అవసరమయ్యారు. 'వ్యక్తుల (ఆ రూపంలో కార్పొరేట్ శక్తుల) ప్రయోజనాలను' దెబ్బతీసే అరాచకాలను కట్టడిచేయడానికి నయా కన్జర్వేటివ్‌లు సైనికీకరణపై ఎక్కువగా దృష్టి పెడుతున్నారు. మరోవైపు 'రాజ్యం పౌర శక్తుల సమ్మేళనమే'ననే గ్రాంస్కీ రాజ్య భావన వెలుగులో 'పౌర సమాజం' ప్రతిపక్ష కేంద్రకంగా ఉంటుందంటూ నియో లిబరల్ విధాన రూపకర్తలు ఆ భావనను పాదుకొల్పారు. నియో లిబరల్ విధానాల మూలాలను తెలుసుకున్నపుడే మోదీ, ట్రంప్‌ల కెమిస్ట్రీ తెలిసివస్తుంది. మోదీ ప్రభుత్వంలో జయశంకర్‌లకు, వీ కే సింగ్‌లకు ప్రాతినిధ్యం ఇవ్వడం వెనుక కూడా 'అనుభవశీలురు, అభిజాతవర్గాల వారితో ప్రభుత్వ నిర్మాణం ఉండాలని వత్తిడి చేసే నియో లిబరల్ విధానాలున్నాయి. సరుకు, పెట్టుబడి చలనాలపై రాజ్య సార్వభౌమత్వం విధిగా ప్రపంచ విపణికి సరెండర్ కావాలి. దానికి అనుగుణంగా రాజ్యాలు ఉమ్మడిగా పెట్టుబడుల చలనానికి సరిహద్దుల అడ్డంకులను తొలగించాలి. వర్తమాన ట్రంప్-మోదీల స్నేహం, ఒప్పందాలు అడుగడుగునా నియో లిబరల్ విధానాలను గట్టిపరుస్తున్నాయి. గతంలోనే 2014లో మోదీ అమెరికా పర్యటించినపుడు అక్కడి ఈతిక్స్ కమిటీ అధ్యక్షుడు పీట్ సెషన్స్ నియో లిబరల్ విధానాల రూపకర్తలలో ఒకరైన రోనాల్డ్ రీగన్‌ను మోదీ గుర్తు చేశాడని ఊరకనే అనలేదు.

# ఆంధ్రప్రదేశ్ ప్రజల సంపదను కొల్లగొట్టడంలో బందిపోట్లలా కుమ్ములాడుకుంటున్న చంద్రబాబు, జగన్ ముఠాలు

2014లో, విభక్త ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పటి నుంచి, రాష్ట్రాన్ని పాలించిన చంద్రబాబు, ప్రస్తుతం పాలస్తున్న జగన్‌లు నిరంకుశ, అరాచక, మోసపూరిత లక్షణాలను ఒక కళగానే అభ్యసించి, తమ వర్గ ప్రయోజనాలను ఈడేర్చడంలోనే కాకుండా, దోపిడీ సొమ్ములో అధిక మొత్తాన్ని చేజిక్కించుకొనేందుకు కుమ్ములాటలో కూడా వీరు ఆరితేరారు.

2014లో ఏర్పడిన విభక్త ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన మొదటి అసెంబ్లీ ఎన్నికలలో, అనేక మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టి ఎన్నకలలో గెలిచిన చంద్రబాబు, అధికారపీఠం ఎక్కిన తర్వాత ఎన్నికల వాగ్దానాలను అటకెక్కించాడు. రైతుల, డ్వాక్రా మహిళల అప్పుల మాఫీని కేవలం కంటి తుడుపు చర్యగా మార్చాడు. ఎన్నికల హామీలలో ఏ ఒక్క దాన్ని కూడా సమగ్రంగా అమలు జరపకపోగా, రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో తాను, తన పరివారం వేలాది కోట్ల రూపాయల ప్రజాధనాన్ని స్వాహా చేసారు. ప్రధానంగా చంద్రబాబు ఆశ్రితులైన రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, అమరావతి భూముల విషయంలో తమ బొక్కసాలు నింపుకొంటే, బడా కాంట్రాక్టర్లు పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో, డబ్బు సంచుల మూటలను పెద్ద ఎత్తున వెనకేసుకున్నారు. ఇంతకీ అసలు విషయమేమిటంటే చంద్రబాబు తన రెండు కళ్ళుగా చెప్పుకొన్న ఆ రెండు నిర్మాణాలను తన హయంలో పూర్తి చేయలేకపోయాడు. కానీ తాను, తన పరివారం మాత్రం ఈ రెండు నిర్మాణాల ద్వారా బాగానే లబ్ది పొందారు. ఇక చంద్రబాబు ముఠాకు చెందిన ఇసుక మాఫియా, మైనింగ్ మాఫియా, లిక్కర్ మాఫియా, విద్యా, వైద్య రంగానికి చెందిన కార్పొరేట్ జలగలు ప్రజల నెత్తురును పీల్చి పడేశాయి. రాష్ట్ర సంపదని అడ్డగోలుగా మేసిపడేసాయి.

2014లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజునే నల్లమల అటవీ ప్రాంతంలో పోలీసులు కోవర్టు కుట్ర జరిపి, ముగ్గురు సి.పి.ఐ (మావోయిస్టు) క్యాడర్లను హత్య చేసారు. ఈ సంఘటన మొదలు, చంద్రబాబు పదవీభ్రష్టుడయ్యే వరకు ప్రజలపై రాజ్యహింస పలురూపాల్లో జరుగుతూ వచ్చింది. పోలీసులు ఎర్రచందనాన్ని అక్రమంగా ఎగుమతి చేసే కాంట్రాక్టర్లను వదిలి, 20 మందికి పైగా సాధారణ కూలీలను బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చిచంపారు.

2019 ఏప్రిల్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల నాటికి, చంద్రబాబు అనుసరించిన ప్రజా వ్యతిరేక, విధ్వంసకర, రోడ్డురోలర్ పాలనలో దోపిడీ పీడనలకూ, అవమానాలకూ, బాధలకూ, విసుగుకు గురైన ప్రజలు బాబును ఓడించి, 'బర్రెను తినేవాడు పోయి, గొర్రెను తినేవాడు వచ్చినా ఫరవాలేదన్న' చందంగా, పాలకవర్గ భావజాల ప్రభావంతో మరో బడా పెట్టుబడిదారీ, బడా భూస్వామ్య వర్గాలకు చెందిన వై.ఎస్.ఆర్.సి.పి పార్టీనీ, దాని నాయకుడైన జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించారు.

ప్రజలలో రాజకీయ వెనుకబాటుతనం కొనసాగినంతకాలం అంటే 'బర్రెను తినేవాడు పోయి, గొర్రెను తినేవాడు' వచ్చినా ఫరవాలేదని సంతృప్తి పడినంతకాలం ఈ స్థితి ఇలానే కొనసాగుతుంది. ఈ స్థితిని మార్చాలంటే శ్రామిక ప్రజలను శ్రమ పరాయీకరణ నుంచి విముక్తి పొందేలా, వర్గపోరాటంలో సమీకృతుల్ని చేయడం ఒక్కటే మార్గం.

జగన్ మే 30, 2019న ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచి, ముఖ్యంగా కేంద్రంలోని బ్రాహ్మణవాద హిందూ ఫాసిస్టు మోడీ నేతృత్వంలోని బి.జె.పి ప్రభుత్వంతో అంటకాగుతూ, అది పార్లమెంటులో మందబలంతో చేసిన అత్యంత అప్రజాస్వామిక,

---

మన దేశ ప్రధానులంతా నడిచిన బాటలోనే నేడు మోదీ మరింత దూకుడుగా పరుగిడుతున్నాడు. మోదీ రాజకీయ గురువు మాజీ భారత ప్రధాని వాజ్‌పేయి 1998లో భారత అమెరికా సంబంధాలపై మాట్లాడుతూ '21వ శతాబ్దంలో ప్రపంచ సుందర భవిష్యత్తు అన్వేషణలో భారత్, అమెరికాలు సహజ నేస్తాలు' అన్నాడు. భారత్‌లో 'నూతన ఆర్థిక విధానాల' వైతాళికుడు భారత ప్రధాని మన్మోహన్ సింగ్ 2005లో 'మేం ఉమ్మడిగా దుష్ట ఉగ్రవాదాన్ని ఎదిరిస్తాం. ప్రపంచ కీలక సవాళ్లను ఎదుర్కోవడానికి మేం ఉమ్మడిగా ఒకే తెరపై ఉండాలి, ఒకే భాష మాట్లాడాలి, ఒకే విధంగా వ్యవహరించాలి' అని సూటిగా చెప్పాడు. ఆ తరువాత గద్దెనెక్కిన కాషాయ ఉగ్రవాది మోదీ 2014లో మాట్లాడుతూ 'భారత అమెరికాల నూతన శక భాగస్వామ్యానికి వాజ్‌పేయి నాంది పలికాడు. దానిని పటిష్టం చేసి ముందుకు తీసుకుపోవడం మా ఉమ్మడి సంబంధాలకు అవశ్యం. ప్రపంచంలో పురాతన ప్రజాస్వామ్య దేశం అమెరికా, విశాల ప్రజాస్వామ్యం భారతం సహజ నేస్తాలు. మేం ఒండొరులం ప్రపంచ శాంతి, అభివృద్ధికి పాటుపడుతాం' అంటూ తనదైన శైలిలో అన్నాడు. ఇతగాడికి రేపటిరోజు ప్రపంచ శాంతి నోబుల్ పురస్కారం దొరికినా ఆశ్చర్యమేమి ఉండదు. వీళ్లంతా ఒకే గూటి పక్షులు. వీరి నైజాన్ని పూర్తిగా తెలుసుకోకుండా వీరిని దునుమాడలేం. వీరి నయవంచక విధానాలను ఎదిరించడానికి సామ్రాజ్యవాదం, దానితో పెనవేసుకపోయిన భారత దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాలతో తుదివరకూ పోరాడాలి. ఐసెన్‌హోవర్, రీగన్‌ల నుండి ట్రంప్ వరకూ జవహర్‌లాల్ నెహ్రూ నుండి మోదీ వరకూ నేతలెవరైనా పార్టీలేవైనా విధానాలు ఒక్కటే! సామ్రాజ్యవాద విధానాలే! వాటిని ఓడించడమే నేటి ప్రజల ప్రధాన కర్తవ్యం. ★

దేశ వ్యతిరేక, ప్రజా వ్యతిరేక, ఫాసిస్టు చట్టాల (ఆర్టికల్ 370 (ఎ)ల రద్దు, త్రిపుల్ తలాక్, సి.ఎ.ఎ, ఎన్.పి.ఆర్, ఎన్.ఆర్.సిలు) పై ఎటువంటి భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేయకుండానే పార్లమెంటులో తన పార్టీ ఎమ్.పిల చేత ఆమోదముద్ర వేయించాడు. మరోవైపు రామజన్మభూమి వివాదంలో సుప్రీంకోర్టు ఇచ్చిన అత్యంత అప్రజాస్వామిక తీర్పును కూడా ఆమోదించాడు. ఈ విషయాలలో జగన్ ఆమోదం, మౌలికంగా అతని వర్గ దృక్పథాన్ని, రాజకీయ వైఖరిని, అవకాశవాదాన్ని తెలిజేస్తున్నాయి. ఇక నిర్దిష్టంగా రాష్ట్రంలో జగన్ చేపట్టిన పాలనాపరమైన చర్యలను పరిశీలిద్దాం.

## 1. అధికార యంత్రాంగాన్ని, ముఖ్యంగా పోలీసు యంత్రాంగాన్ని పటిష్టపరచడం

జగన్ పోలీసు వ్యవస్థను తన లాఠీగా మల్చుకొనేందుకు వారికి అనుకూలంగా అనేక సంస్కరణలు చేపట్టాడు. తన తండ్రి రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనకు విధేయంగా ఉంటూ, సేవలు చేసిన పోలీసు, సివిల్ సర్వీస్ అధికారులను తిరిగి కీలకమైన స్థానాల్లో నియమించాడు. ఈ అధికారులు వై.ఎస్.ఆర్ పాలనలో కీలకమైన అధికారాలు చెలాయిస్తూ, దోపిడీవర్గాల ప్రయోజనాలను, ముఖ్యంగా వై.ఎస్.ఆర్ ఆశ్రితుల ప్రయోజనాలను నెరవేర్చేందుకు అప్రజాస్వామికంగా, క్రూరంగా వ్యవహరించిన వారే, అక్రమ, అవినీతి సంపాదనతో కోట్లాది రూపాయలు వెనకేసుకున్నవారే.

## 2. గత ప్రభుత్వ నిర్ణయాలను సమీక్షించడం... రాజధాని వివాదం

జగన్ అధికారంలోకి రాగానే, చంద్రబాబు హయాంలో తీసుకొన్న కొన్ని ముఖ్యమైన నిర్ణయాలవల్ల ప్రజాధనం కైంకర్యం అయిందనీ, వృధా అయిందని ప్రకటనలు చేస్తూ, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపైనా, పోలవరం కాంట్రాక్టుపైనా, కియాకార్ల కంపెనీకిచ్చిన ప్రోత్సహకాలపైనా, రాజధాని నిర్ణయంపైనా సమీక్షకు పూనుకున్నాడు. పాలనా వికేంద్రీకరణ పేరుతో మూడు రాజధానుల నిర్ణయాన్ని జగన్ ప్రభుత్వం, అసెంబ్లీలో ఆమోదింపచేసింది. దీని ప్రకారం అమరావతి లెజిస్లేటీవ్ రాజధానిగా, విశాఖ ఎగ్జిక్యూటీవ్ రాజధానిగా, కర్నూలు జ్యుడిషియరీ రాజధానిగా ఉంటాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రజల సంపదను కొల్లగొట్టడంలో బందిపోట్లలా కుమ్ములాడుకుంటున్న చంద్రబాబు, జగన్ ముఠాలు ప్రజలను చీల్చి తమ దోపిడీ రాజకీయాలకు అనుకూలంగా వాడుకుంటున్నాయి.

వాస్తవంగా రాజధాని మార్పులో అసలు మతలబు ఏమిటంటే, అమరావతి నిర్మాణంలో చంద్రబాబు, అతడి రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, అక్రమంగా సంపాదించుకున్న స్థలాల విలువలను దెబ్బతీసి, విశాఖలో తాను, తన రియల్‌ఎస్టేట్ పరివారం సంపదను పోగేసుకోవటమే. ఇప్పటికే, జగన్‌కు సన్నిహితులైన రియల్‌ఎస్టేట్ రాబందులు విశాఖపై వాలి ఉన్నాయి. కనుక ఈ వికేంద్రీకరణ ప్రజల దృష్టికోణంతో చూసినప్పుడు ప్రజలకు ఒరిగేది ఏమిలేదు.

## 3. 'నవరత్నాల' అమలు

ఎన్నికల సందర్భంగా జగన్ తన పాదయాత్రలో నవరత్నాల (రైతు బరోసా, ఫీ రియింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, జలయజ్ఞం, మద్యనిషేధం, అమ్మఒడి, వై.ఎస్.ఆర్ ఆసరా, పేదలందరికీ ఇళ్లు, పెన్షన్ల పెంపు)ను హామీ పడ్డాడు. వీటిని తమ పార్టీ ఎన్నికల ప్రణాళికలో కూడా పొందుపరిచారు. ఎన్నికల తదనంతరం జగన్ 'నవరత్నాలే' తనకు 'గీత, ఖురాన్, బైబిల్' అంటూ వీటిని అమలు చేసేందుకు పూనుకున్నాడు. అయితే ఈ ఎన్నికల రాజకీయ పథకాలేవి ప్రజల జీవితాల్లో గుణాత్మకమైన మార్పు తెచ్చేవికావు. జగన్ పక్షాన చేరిన వారికి లాభాలు కూడబెట్టేవి. సమాజంలో ఒక సెక్షన్ ప్రజలను చీల్చి, రాజకీయంగా జగన్‌కు అనుకూలంగా మల్చుకునేవి.

## 4. బహుళజాతి సంస్థలకు, దేశీయ కార్పొరేట్ సంస్థలకు రెడ్ కార్పెట్

జగన్ ఈ మధ్య అనిల్ అంబానీతో లోపాయికారి ఒప్పందాలు చేసుకొని, రాష్ట్ర సంపదను పెంచడంలో భాగంగా రిలయన్స్ గ్రూప్ చైర్మన్ పరిమళ్ సత్వానీని ఎ.పి నుంచి రాజ్యభస సభ్యుడిగా ఎంపిక చేశాడు. జగన్ మాటల్లోని 'రాష్ట్ర సంపదను పెంచడం' అంటే బహుళజాతి సంస్థలకూ, దేశీయ కార్పొరేట్ సంస్థలకు రాష్ట్ర రాజకీయాల్లో చోటివ్వడం, వనరులను కొల్లగొట్టి, వారు విపరీతంగా సంపదను పెంచుకొనేలా చేయడమే.

## 5. సమస్యలు సృష్టించడం, ప్రజలను వాటి చుట్టూ గిరికీలు కొట్టించడం

దోపిడీ పాలకవర్గాలు ప్రజలను అసలు సమస్యల నుంచి పక్కదారి పట్టించేందుకు వారే సమస్యలు సృష్టించి, ప్రజలను ఆ సమస్యల చుట్టూ గిరికీలు కొట్టించేలా చేస్తారు. జగన్ ప్రభుత్వం ఈ విషయంలో ఆరితేరినట్లుగా కనిపిస్తున్నది. జగన్ ఉన్నట్టుండి ప్రాథమిక విద్య నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం మాత్రమే ఉంటుందని ప్రకటించాడు. ఈ సమస్యకు తోడు, రాజధాని సమస్యను కూడా కలిపి వాటిని ఎడతెగని సమస్యలుగా మార్చింది. ప్రజలను వాటి చుట్టూ గిరికీలు కొట్టేలా ప్రభుత్వం కుట్రలు చేస్తున్నది.

## చంద్రబాబుకు తీసిపోని ఫ్యూడల్ నియంత జగన్

ఏ ప్రభుత్వానికైనా, అది ప్రాతినిధ్యం వహించే సామాజిక వ్యవస్థ తాలుకు మౌలిక, ఆర్థిక లక్షణాల మూలంగా ఒక స్వభావం ఏర్పడుతుంది. మనదేశంలోగానీ, నిర్దిష్టంగా ఆంధ్రప్రదేశ్‌లో గానీ కొనసాగుతున్న అర్ధ వలస, అర్ధ భూస్వామ్య సామాజిక వ్యవస్థకు రాజకీయంగా ప్రాతినిధ్యం వహించే ప్రభుత్వాలన్నింటికి దోపిడీవర్గాల తరపున ప్రజలపై నియంతృత్వాన్ని అమలు చేసే స్వభావమే ఉంటుంది.

గడిచిన 10 నెలల కాలంలోనే జగన్ తీసుకొంటున్న ఏకపక్ష నిర్ణయాలతో పాటు, ప్రజలను అణచివేసి ఉంచడానికి తన పోలీసు బలగాలపై ఎంతగా ఆధారపడ్తున్నాడో పరిశీలిస్తే ఆయన ఎంతటి

# దేశంలో కెరటాల్లా ఉవ్వెత్తున ప్రజా ఉద్యమాలు పెంపొందుతుంటే, మావోయిస్టుల సత్వర నిర్మూలనకై వేగిరపడుతున్న కేంద్ర సైనిక వ్యూహం 'సమాధాన్'

మనం దేశంలో ఇటీవలి కాలంలో మావోయిస్టుల గురించి జరుగుతున్న ప్రచారం ముందెన్నడూ బహుశా జరిగి ఉండదు. 2004లో నూతనంగా ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)ని వెన్వెంటనే 2005లో దేశ అంతరంగిన భద్రతకు ఏకైక అతి పెద్ద ప్రమాదకర శక్తిగా కేంద్రం పరిగణించిన తర్వాతి నుండి ఏ యేటికాయేడు మావోయిస్టుల గురించి ప్రజలకు అధికాధికంగా తెలుస్తోంది. కేంద్రంలో బ్రాహ్మణీయ శక్తులు అధికారాన్ని చేపట్టిన తర్వాత ఈ ప్రచారం తారస్థాయికి చేరి ప్రస్తుతం 'అర్బన్ మావోయిస్టు'లనే పద బందం విశేష ప్రాచుర్యంలోకి వచ్చింది. గడచిన పదిహేనేళ్ల కాలంలో మావోయిస్టుల అణచివేతలో మొదట చేపట్టిన సల్వాజుడుం, సేంద్ర లాంటి శ్వేత భీభత్స కెంపెయిన్‌లు విఫలం కావడం, ఆ తర్వాత చేపట్టిన అప్రకటిత 'ఆపరేషన్ గ్రీన్ హంట్' దాదాపు తొమ్మిదేళ్లు సాగినపుటికి అది పాలకులు, పోలీసులు ఆశించిన ఫలితాలు ఇవ్వలేదనీ చివరకు సమీక్షలో తేల్చి 2017మే నుండి ఐదేళ్ల కాల వ్యవధితో 'ఆపరేషన్ సమాధాన్'ను ముందుకు తెచ్చారు. దానికి 2020 మే నాటికి మూడేళ్లు పూర్తయ్యాయి. మరోవైపు మోదీ-2 పాలనకు యేడాది పూర్తయ్యింది. సమాధాన్ పథకానికి రోజులు దగ్గరపడుతున్నా కొద్ది ఒకవైపు మావోయిస్టుల తుడిచివేతకై వ్యూహకర్తల వేగిరపాటు పెరుగుతుంటే మరోవైపు దేశవ్యాపితంగా ప్రజా ఉద్యమాలు కెరటాల్లా ముందుకువస్తూ తీవ్రమవుతూ పాలకుల, పోలీసుల మావోయిస్టుల అణచివేత చర్యలను గట్టిగా అడ్డుకుంటున్నాయి.

17వ లోకసభ ఎన్నికలలో మోదీ-షాల నాయకత్వంలో జాతీ, మత విద్వేషాలను అనూహ్య స్థాయిలో రెచ్చగొట్టి ఓట్లు దండుకున్న హిందుత్వ శక్తులు గతంకన్నా మించిన మెజార్టీతో రెండవ విడుత కేంద్రంలో ఎన్.పీ.ఏ. గద్దెనెక్కింది. వారు అధికారానికి వచ్చిన మరుక్షణం నుండే ఆ దిశలో తమ పాలనను కొనసాగిస్తున్నారు. ప్రమాణస్వీకార వేడుకలకు సార్క్ బదులు బిమ్స్‌టెక్ దేశాలను ఆహ్వానించడం మొదలు కొరోనా మహమ్మారి దేశ వ్యాపితంగా విజృంభిస్తున్న వేళ పాటిస్తున్న 'సామాజిక దూరం' (వారు అంటున్నది భౌతిక దూరం కాదు సుమా!) వరకు ముందుకు తెస్తున్న జాతీ, మత విద్వేష హిందుత్వ రాజకీయాలను అడుగడుగునా మన దేశ ప్రజలు, ప్రజాస్వామిక, లౌకికవాదులు, దేశభక్తులు ప్రతిఘటిస్తున్నారు.

మోదీ ప్రభుత్వం తొలి లోక్‌సభ సమావేశాల సందర్భంగా ముందెన్నడూ లేని విధంగా 33 బిల్లులకు చట్టరూపం ఇవ్వగలిగింది. వాటిని నిశితంగా పరిశీలిస్తే అవన్నీ నూతన సరళీకృత ఆర్థిక విధానాల వెలుగులో రూపొందిన ప్రజావ్యతిరేక చట్టాలేనన్నది తేటతెల్లమవుతుంది. మరీ ముఖ్యంగా వాటి ముస్లిం వ్యతిరేక, మావోయిస్టు విప్లవ వ్యతిరేక స్వభావం స్పష్టమవుతుంది. భారత రాజ్యాంగం హామీ ఇచ్చిన ఆర్టికల్స్ 370, 35ఏ రద్దు, ముమ్మారు తలాక్, ఉపా చట్ట సవరణ, అనేక కార్మిక చట్టాల సవరణలు, మత ప్రాతిపదికన 'జాతీయ పౌరసత్వ సవరణ-2019' రూపకల్పన మున్నగునవి ఉన్నవి. దేశ ఆర్థిక వ్యవస్థ విధానాల దుష్ప్రభావం నుండి ప్రజలను దారి మళ్లించడానికి గుడ్డి జాతీయోన్మాదాన్ని, మత విధ్వంసాన్ని రెచ్చగొట్టడానికి అన్ని విధాలా పూనుకుంటున్నారనడానికి కరసేవకులు పూనుకున్న బాబ్రీమసీదు విధ్వంసం సరైనదేనని అనకుండానే న్యాయాన్ని అమ్మిన

---

నియంతో ఇట్టే అర్థమైపోతుంది. తన ప్రతిపాదనగా అసెంబ్లీలో ఆమోదం పొందిన 'మూడు రాజధానుల' బిల్లును శాసనమండలి వాయిదా పడేలా చేసిందనే కక్షతో, అహంభావ పూరితంగా శాసనమండలినే రద్దు చేశాడు. బహుశా గత చరిత్రలో కూడా ఇంతటి నియంతగా వ్యవహరించిన ముఖ్యమంత్రి లేడనే చెప్పుకోవాలి. రాష్ట్ర ఎన్నికల కమీషనర్ రమేష్‌కుమార్ కోవిడ్-19 పరిస్థితులు కారణంగా స్థానిక ఎన్నికలని ఆరు వారాలు పాటు వాయిదా వేసాడన్న కారణంగా నియంత జగన్ ఆయనను తొలగించి వేశాడు. ఈ విషయంలో అన్ని సెక్షన్ల ప్రజలు వ్యతిరేకించడంతో పాటు హైకోర్టు, సుప్రీంకోర్టు కూడా జగన్ చర్యను తప్పుపట్టాయి.

పై పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజల ముందు ఒక్కటే కీలకమైన కర్తవ్యం ఉంది. అది కేంద్రంలోనూ, రాష్ట్రంలోను అధికారంలో కొనసాగుతున్న ప్రజావ్యతిరేక, అభివృద్ధి నిరోధక, ప్రతీఘాతుక ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలను నిర్మించడం. ఈ ఉద్యమాలను బ్రాహ్మణవాద హిందూ ఫాసిజం, విస్థాపన, భూమి, ప్రజాస్వామ్యం, సాగునీరు, తాగునీరు, విద్య, వైద్యం, అధిక ధరలు, ఉపాధి వంటి కీలక సమస్యలతో పాటు, ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ-2013 చట్టంలో పొందుపరిచిన హామీల ప్రాతిపదికన సమరశీలంగా నిర్వహించాలి. నేడు ఐక్య ఉద్యమాలే ప్రజల ప్రయోజనమని దృష్టిలో ఉంచుకోవాలి.

ప్రజల ప్రయోజనాలనాసించే మేధావులకైనా, ప్రజాస్వామికవాదులకైనా, సంస్థలకైనా, పార్టీలకైనా ఐక్య ఉద్యమాలే మౌలిక కర్తవ్యంగా ఉండాలి. ఈ ఐక్య ఉద్యమాల లక్ష్యం ప్రజలను రాజకీయంగా చైతన్య పరుస్తూ భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసేదిగా ఉండాలి. ★

'సుప్రీం తీర్పు' రాంమందిర్ నిర్మాణం, జేఎన్‌యూ విద్యార్థులపై, ఉపాధ్యాయులపై జరిపిన దాడులు ప్రబల ఉదాహరణలుగా మన ముందున్నాయి. వాటన్నింటికి వ్యతిరేకంగా దేశం దావానలమై మండింది. ఆ మంటలను రాజేసిన శక్తులు 'అర్బన్ మావోయిస్టులే' నంటూ హిందుత్వ శక్తులు వారి గొంతు నొక్కడానికి ఇటీవలే తెలంగాణలో అనేక ప్రజా సంఘాలను నిషేధిత జాబితాలోకి చేర్చడమే కాకుండా అక్కడ అరెస్టు చేసినవారిలో ఆచార్యులు కాశీం, దేవేంద్ర, మద్దిలేటిలతో పాటు మరికొంతమంది ఉండగా తాజాగా ప్రపంచ వ్యాపితంగా దాదాపు 5వేల మందితోపాటు 150కిపైగా ప్రజా పోరాట సంస్థలు వ్యతిరేకించినప్పటికీ కొరోనా మహమ్మారి మధ్యనే చేపట్టిన ఆనంద్ తేల్‌తుంబ్డే, గౌతం నవల్ఖాల అరెస్టులను హిందుత్వ ఆగడాలకు ప్రబల తార్కాణాలుగా చూపవచ్చు.

నిజానికి మనదేశంలో ప్రస్తుతం అధికారంలోనున్న హిందుత్వ శక్తులకు, వాటిని అడుగడుగునా ప్రతిఘటిస్తున్న ప్రజలకు అంటే వారికి నాయకత్వం వహిస్తున్న మావోయిస్టులకు, ప్రజాస్వామిక లౌకిక దేశభక్త శక్తులకు మధ్యనే దేశ వ్యాపితంగా అన్ని రంగాలలో పోరాటాలు బద్దలవుతున్నాయి. పరమ రియాక్షనరీ పాలక వర్గ హిందుత్వ శక్తులను మత మైనార్టీలు, దళితులు, ఆదివాసీలు సహ సమస్త పీడిత ప్రజలు వారికి నాయకత్వం వహిస్తున్న మావోయిస్టు విప్లవకారులు వారి 'నూతన సరళీకృత ఆర్థిక విధానాలను' వాటిని మరుగున పరచడానికి ప్రజలను మభ్యపెడుతూ చేపట్టిన హిందూ రాష్ట్ర నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో దాదాపు 60 మందిని అర్బన్ మావోయిస్టులుగా జాబితా తయారుచేసి వారిలో కొందరిని అరెస్టు చేసి మిగతావారి అరెస్టుకు పోలీసులు రంగం సిద్ధంచేస్తుంటే మరోవైపు ఆ రాష్ట్రాలలో అనేక పోరాట సంఘాలు సంఘటితమై విశ్రాంత ఆచార్యులు హరగోపాల్‌ను కన్వినర్‌గా ఎన్నుకొని 'నిర్బంధ వ్యతిరేక కమిటీ'ని నిలుపుకొని ప్రజాస్వామ్య హక్కుల కోసం ఉద్యమించ పూనుకోవడం నిర్బంధం ప్రతిఘటనకు దారితీస్తుందన్న వాస్తవాన్ని గుర్తుచేస్తోంది. వారు ఆచార్యులు చింతకింది కాశీంను బెయిల్‌పై విడిపించుకోవడం అభినందనీయం.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్‌గొగోయి హిందుత్వ శక్తులకు లొంగిపోయి ఐదుగురితో కూడిన ధర్మాసనం తరఫున ఏకాభిప్రాయం అంటూ వెలువరించిన రాంమందిర్ నిర్మాణ తీర్పును ఖండిస్తూ 2019 డిసెంబర్ 8నాడు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) 'భారత్‌బంద్‌కు' పిలుపునిచ్చింది. మత ప్రాతిపదికపై రూపొందించిన సీఏఏకు వ్యతిరేకంగా జనవరి 26 నాడు బూటకపు భారత గణతంత్ర దిన వేడుకల బహిష్కరణకు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) పిలుపునిచ్చింది. సీ.ఏ.ఏ. (సిటిజన్‌షిప్ అమెండ్‌మెంట్ ఆక్టు)కు వ్యతిరేకంగా ప్రజలు వీధులలోకి వచ్చి నెలల తరబడిగా సమరశీల పోరాటాలు కొనసాగిస్తుంటే, దండకారణ్యం సహ దేశవ్యాప్త మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలు, అడవులూ ప్రతిధ్వనించాయి. సరిగ్గా అదే సమయంలో ఆర్.ఎస్.ఎస్. అధినాయకుడు కరుడు గట్టిన హిందుత్వవాది మోహన్ భాగవత్ మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో జరిగిన వారి సమన్వయ సమావేశాల వేదిక నుండి 'దేశ వ్యాపిత ఆదివాసులు 2021 జనగణనాల లెక్కింపు సమయంలో తామంతా హిందువులమనే నమోదు చేయించుకోవాలని' పిలుపునిచ్చాడు. దానిని తక్షణం స్వామి అగ్నివేశ్ ఖండిస్తూ ముందుకు రాగా దేశ వ్యాపిత ఆదివాసీ ఉద్యమ సంస్థలు మార్చ్ 25 నాడు 'భారత్ బంద్‌కు' పిలుపునిచ్చాయి. ఆదివాసులు హిందువులు కారంటూ బంద్‌ను సమర్థిస్తూ దండకారణ్య ఆదివాసులూ ముందుకువచ్చారు. సీ.ఏ.ఏ. ఎన్.ఆర్.సీ. ఎన్.పీ.ఆర్.లను వెనక్కి తీసుకోవాలనీ, అవి ఆదివాసులను హిందువులుగానే పరిగణిస్తున్నాయని ఏప్రిల్ 1నాడు దండకారణ్య బంద్‌కు సిద్ధమయ్యారు. కొరోనా మధ్య వాటిని ఉపసంహరించుకున్నారు.

ఫిబ్రవరి-10 మహాన్ భూంకాల్ దివస్‌గా జరుపుకోవడం గత దశాబ్దంన్నర కాలంగా ఒక పోరాట పరంపరగా దండకారణ్యంలో కొనసాగుతోంది. ఈసారి మునుపెన్నటికన్నా సంఘటితంగా సమన్వయంతో సమరశీలంగా ఈరోజు జరిగింది. ఈసారి వేడుకలలో జల్ జంగిల్ జమీన్‌పై తమదే అధికారమంటూ వెల్లువలా పెల్లుబికిన ప్రజానీకం విస్తాపనకు వ్యతిరేకంగా ముక్తకంఠంతో నినదించడమే కాకుండా గనుల తవ్వకాలకు తరలివచ్చిన భారత భద్రతా బలగాలను తక్షణం అడవులనుండి ఉపసంహరించాలని వారు గట్టిగా డిమాండ్ చేశారు. అడవులలో తిష్ట వేసిన పోలీసు క్యాంపులకు వ్యతిరేకంగా వారి అత్యాచారాలకు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఏఓబీ ప్రాంతం నుండి దండకారణ్యం వరకు ఆదివాసులు ధ్వజమెత్తారు.

ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్, దుర్గ్, రాజనందిగాం జిల్లాలకు చెందిన వేలాది ఆదివాసులు సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును ఉపసంహరించుకోవాలని ఆదివాసులను అడవుల నుండి బేదఖల్ చేయకూడదంటూ 2019 నవంబర్‌లో వారం రోజులకుపైబడి వందలాది కిలోమీటర్లు పాదయాత్ర జరిపి రాయపూర్ చేరుకొని తమ సాగు భూముల పరిరక్షణకై ఆదివాసీ గవర్నర్ అనసూయ ఉయికేను కలిసి విజ్ఞాపన పత్రం ఇచ్చారు. ఆ తరువాత వారు ఈ సంవత్సరం హిందూ పండుగల సందర్భంగా ముఖ్యంగా దసరా వేడుకల సమయంలో ఆదివాసుల ఆరాధ్య దైవాలను రాక్షసులుగా చిత్రించి 'రావన్‌దహన్' (రావణున్ని కాల్చడం), దీపావళి సందర్భంగా మహిషాసురున్ని కాల్చడం లాంటి ద్రవిడ వ్యతిరేక దుష్ట 'ఆర్య' సంప్రదాయాలను మానుకోవాలని విశాల ప్రజలకు పిలుపునిచ్చి ఆ ప్రాంతంలోని అనేక గ్రామాలలో అమలులోకి తేవడం వారిలో పెంపొందుతున్న ఆత్మగౌరవంతో పాటు హిందుత్వ

వ్యతిరేకతను చాటుతున్నది. గత రెండేళ్లుగా దండకారణ్యంలోని గడ్చిరోలీ డివిజన్‌లో మార్చ్ 8 నాడు అంతర్జాతీయ శ్రామిక మహిళా దినంతో పాటు మార్చ్ 10 నాడు బ్రాహ్మణవాద విరోధి, దేశ శ్రామిక కులాల మహిళల తొలి ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే సంస్మరణ వేడుకలను జరుపుకున్నారు.

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ధాన్యం రేట్లు ఇవ్వ నిరాకరించడాన్ని అడ్డుపెట్టుకొని సక్రమంగా అమలు జరుపకపోవడమే కాకుండా నిర్ణీత సమయంలోనే మార్కెట్‌కు ధాన్యం తేవాలని నిబంధనాలు విధించడానికి వ్యతిరేకంగా రాజనందగాం, కాంకేర్, బీజాపూర్ జిల్లాలు సహ రాష్ట్ర వ్యాపిత ప్రజలు పెద్దెత్తున వీధులలోకి వచ్చి రోజుల తరబడి తమ నిరసన ప్రదర్శనలు జరిపారు.

ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన విధానసభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఓటర్లకు ఇచ్చిన హామీలలో నక్సలైట్ల పేరుతో పోలీసులు అక్రమంగా అరెస్టు చేసిన నిర్దోషి ఆదివాసులందరినీ తమ పార్టీ అధికారానికి వచ్చిన నెలలోపే విడుదల చేస్తామన్నది ఒకటి. కానీ ఆ హామీని అది నెరవేర్చక పోవడంతో బస్తర్ డివిజన్‌లోని ఆదివాసులు పెద్దసంఖ్యలో ఉద్యమించారు. పలు పర్యాయాలు వారు భారీ ర్యాలీలు నిర్వహించి దగాకోరు కాంగ్రెస్ ప్రభుత్వ మోసకారితనాన్ని బట్టబయలు చేశారు. ఇతర పలు తప్పుడు కేసులలో ఇరికించబడి జైలు పాలైన అనేకమంది ఆదివాసులను విడుదల చేయడానికి సిద్ధపడిన ప్రభుత్వం దాదాపు 625 కేసులను ఉపసంహరించుకోవడానికి తయారీలను పూర్తిచేసి చివరి క్షణంలో నిలుపుదల చేయడంతో సామాజిక కార్యకర్త బేలా భాటియా, సోనీ సోడీలతో పాటు యం.యల్.ఏ దేవకీ కర్మ సహ పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి కోవాసీ లక్మా నాయకత్వంలో ముఖ్యమంత్రిని కలిసి తక్షణం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామనీ, పశువుల కాపర్లకు సైతం రూ. 5,500 ఇస్తామని ఎన్నికల హామీ ఇచ్చి మొండి చెయ్యి చూపడాన్ని వ్యతిరేకిస్తూ వేలాది యువకులు భైరంగఢ్‌లో రోడ్లపైకి వచ్చారు.

ఈ రకంగా దేశంలో దూకుడుగా ముందుకు వస్తున్న ఫాసిస్టు హిందుత్వ విధానాలకు వ్యతిరేకంగా మావోయిస్టు ఉద్యమ ప్రాంతాల ప్రజలతో సహ విశాల ప్రజారాసులు ఎక్కడికక్కడే పోరాడుతున్నారు. ఆ పోరాటాలకూ ధిక్కార స్వరాలకూ దేశంలోని మావోయిస్టులు నాయకత్వం వహిస్తున్నారనీ మోదీ ప్రభుత్వం మండిపడుతుంది. దానితో దుష్ట త్రయం మోదీ, షా, భాగవత్‌లు అర్బన్ మావోయిస్టులను లక్ష్యంగా చేసుకొని దాడి చేస్తున్నారు. 2019 నవంబర్ 16న దేశీయాంగ వ్యవహారాల మంత్రి అమిత్‌షా మీడియాతో అర్బన్ నక్సలైట్ల గురించి ప్రస్తావించగా, ఝార్ఖండ్ విధానసభ ఎన్నికల సందర్భంగా డిసెంబర్ 18న మోదీ వారి పట్ల తన అక్కసునంతా వెళ్లగక్కాడు. ఆ వరుసనే ఢిల్లీ భాజపా అధ్యక్షుడు మనోజ్ తివారీ అర్బన్ నక్సల్‌కు ఉదాహరణగా అరవింద్ కేజ్రీవాల్‌ను ఉటంకించాడు. అది ఎక్కడివరకు వెళ్లిందంటే పాలక ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ నేత్రి ప్రియాంక గాంధీని కూడా కాషాయ బ్రిగెడ్ ఆ జాబితాలో చేర్చింది. దానితో ఇండియాటుడే పత్రిక ఆర్‌టీఐని 'అర్బన్ నక్సల్' మరియు 'తుక్డే తుక్డే గ్యాంగు'లపై వివరణ కోరింది. కానీ ఆర్‌టీఐ అధికారులు జవాబు చెప్పలేక ముఖం చాటేసుకున్నారు. ఈ దేశంలో పీడిత ప్రజల గొంతుగా మారేవారెవరైనా మోదీ ప్రభుత్వం దృష్టిలో అర్బన్ నక్సలే అవుతారని ప్రత్యామ్నాయ మీడియా శక్తులు నిర్వచిస్తున్నాయి.

మోదీ ప్రభుత్వం పట్టణాలలో లబ్దప్రతిష్ట ప్రజాహిత మేధావులను, పాత్రికేయులను, లౌకికవాదులను, సామ్రాజ్యవాద వ్యతిరేక దేశభక్తులను లక్ష్యంగా చేసుకొని 'సమాధాన్' దాడులను కొనసాగించడమే కాకుండా అడవులలో భద్రతా బలగాల వేటను తీవ్రతరం చేసింది. ఇప్పటికే దేశ వ్యాపిత మావోయిస్టు ప్రాంతాలలో దాదాపు ఆరు లక్షలకు పైగా ఖాకీ బలగాలను మొహరించి పెట్టారు. వారికి తోడుగా మరో ఏడు బటాలియన్‌ల అదనపు బలగాలను జమ్మూ కశ్మీర్ నుండి దింపడానికి కేంద్రం సిద్ధమైంది. అంతేకాదు, భారత సైన్యానికి చెందిన లక్షకు పైగా రాష్ట్రీయ రైఫిల్స్ బలగాలను శాశ్వతంగా జమ్మూ కశ్మీర్‌కే కేటాయించినట్టు ఇపుడు బస్తర్ డివిజన్‌లో తిష్ట వేసిన ఐటీబీపీకి చెందిన ఏడు బటాలియన్‌లను (దాదాపు లక్ష బలగాలు) ఇకపై ప్రతి మూడేళ్లకొకసారి బదిలీ చేసే పద్ధతికి స్వస్తి చెప్పి శాశ్వతంగా బస్తర్‌కే కేటాయిస్తామనే నిర్ణయాన్ని ఏప్రిల్‌లో తీసుకుంది.

ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ మహారాష్ట్రలలోని 9 జిల్లాలపై కవర్ధా, రాజనందగాం, బాలాఘాట్, మాండ్లా, డిండోరీ, నాగపుర్, గఢ్‌చిరోలీ, గోందియా, భండారా సరిహద్దులలోని నక్సలైట్లను ఆరు మాసాలలో అంతమొందిస్తామనీ, డ్రోన్, భారత సైన్యానికి చెందిన 11 హెలికాప్టర్లతో నిత్యం నిఘా పెంచుతామనీ ఛత్తీస్‌గఢ్ డీ.జీ. డీ.ఎమ్.అవస్థీ ఫిబ్రవరిలోనే ప్రకటించాడు. ఇప్పుడున్న ఏ.ఎఫ్-4 మిగ్-17, ఐ.టీ.బీ.పీ.కి చెందిన 3 హెలికాప్టర్లకు అదనంగా వాటిని చేరుస్తున్నారు. ఈ నిర్ణయాలకు ముందే జనవరి చివరివారంలో ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయపుర్‌లో జరిగిన నాలుగు రాష్ట్రాలతో-ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఉత్తర్ ప్రదేశ్, ఉత్తరాఖండ్-కూడిన 22వ 'మధ్య క్షేత్రీయ కౌన్సిల్' సమావేశంలో కేంద్ర హోం మంత్రి అనేక సమస్యలతో పాటు నక్సలైట్ల అణచివేత చర్యలను ప్రముఖంగా చర్చించారు. ఆ తరువాత ఫిబ్రవరిలో రాయపుర్‌లోనే జరిగిన 8 రాష్ట్రాల-ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్, గోవా, మణిపుర్, నాగాలాండ్-పోలీసు ఉన్నతాధికారుల 'హై పవర్ కమిటీ' సమావేశంలో పోలీసు ఆధునీకరణ గురించి విస్తృతంగా చర్చించి వారికి ఆధునిక ఆయుధాలను సమకూర్చాలని

నిర్ణయించారు. వీటన్నిటి నేపథ్యంలో సీ.ఆర్.పీ.ఎఫ్. డీఐజీ ఆలోక్ అవస్థీ ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాను అఫ్ఘనిస్తాన్, దక్షిణ కొరియాలకన్నా ప్రమాదకర విస్ఫోటనల కేంద్రం అని అభివర్ణించడాన్ని గమనించాలి. ఇవన్నీ ఇలా ఉండగా విప్లవ ప్రతీఘాతుక ఆర్ఎస్ఎస్ ఉత్తరప్రదేశ్‌లో తన తొలి సైనిక పాఠశాలను త్వరలో ప్రారంభించడానికి రంగం సిద్ధం చేసింది. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లోని పట్టణ ప్రాంతాలలో ఆర్ఎస్ఎస్ శాఖలను పెంచడానికి నిర్ణయం తీసుకుంది.

సమాధాన్ సైనిక వ్యూహం ప్రకారం సమాచార ఆధారిత దాడులను శక్తిమంతంగా, ప్రభావశీలంగా నిర్వహించడానికి కార్పెట్ సెక్యూరిటీని పటిష్టవంతం చేస్తున్నారు. ఉద్యమ ప్రాంతాల మధ్యన సజీవ సంబంధాలను లేకుండా చేయడానికి అనేక అణచివేత చర్యలు చేపడుతున్నారు. పోలీసు క్యాంపులతో ప్రాంతాలను సెక్టార్లుగా విభజించి దిగ్బంధిస్తున్నారు. బూటకపు ఎన్‌కౌంటర్లను, అరెస్టులను, లొంగుబాట్లను తీవ్రం చేస్తున్నారు. ఉదాహరణకు దర్భ డివిజన్ సెక్రటరి కామ్రేడ్ సాయినాథ్ 2019 అక్టోబర్‌లో విడుదల చేసిన ప్రతిక ప్రకటన ప్రకారం 2018 ఆగస్టులో చిక్‌పాల్ పంచాయితీ ములుంగాలో దుద్వా మడ్కంను పోలీసులు హత్య చేశారు. 2019 మే 2నాడు అరన్‌పుర్‌లో ముయ్యను, మే 8 నాడు దువ్వాల్ కార్కలో వర్గేశ్, లింగాలను హత్య చేశారు. జులై 12 నాడు పిట్టే డబ్బాలో ఊరా మడ్కంను పోలీసులు కాల్చిచంపారు. జులై 14నాడు గుమియాపాల్‌లో మంగ్లీ, దేవేలను, ఆ తర్వాత అదే గ్రామంలో సెప్టెంబర్ 13 నాడు సోడి పొదియాల్ మాడ్వి లచ్చులను హత్య చేశారు. పిదప 2019 అక్టోబర్ 15 నాడు స్కూల్‌పారలో కోసామడ్కంను హత్యచేశారు. తిరిగి నవంబర్ 5 నాడు గుమియాపాల్‌లోనే లక్మామండావి, హడ్మా మండావీలను పోలీసులు కాల్చి చంపారనీ గ్రామస్థులు ఆగ్రహించి 3 రోజులు మృత దేహాలను సైతం తీసుకువెళ్లడానికి నిరాకరించారు. సామాజిక కార్యకర్త బేలాభాటియా, సోనీ సోడీలు బస్తర్‌లో కొనసాగుతున్న పోలీసుల బూటకపు ఎన్‌కౌంటర్లను ఖండించారు. ఈ ఎన్‌కౌంటర్ల పరంపర దర్భలో ఆగడమే లేదు. 2020 జవనరి నుండి మే చివరి వరకు అక్కడ దాదాపు 6 గురు కామ్రేడ్స్‌ను పోలీసులు కాల్చి చంపారు. ఇవన్నీ దర్భ డివిజన్‌లోని కట్టేకల్యాణ్ ప్రాంతంపైనే కేంద్రీకరించి కొనసాగిస్తున్నారు. ఎందుకంటే మధ్య రీజియన్‌లోని ఉద్యమ ప్రాంతమైన ఏ.ఓ.బీ.తో దండకారణ్య సంబంధాలను తెంచడానికే సరిహద్దులలోని 'తులసి డోంగర్' కొండలను కేంద్రం చేసుకొని పోలీసులు తమ అణచివేత చర్యలను చేపడుతున్నారు.

భారత పాలకవర్గాల ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాపిత ప్రజలు వీధులలోకి వస్తున్నారు. వారికి మార్గదర్శకత్వం లేకుండా చేయడానికి ధిక్కార స్వరాల అడ్డు తొలగించుకోవడానికి మొదటి హయాం కన్నా రెండవ హయాంలో కేంద్ర ప్రభుత్వం దాడులను ముమ్మరం చేసింది. దేశ ప్రజల అన్ని పోరాటాలతో భుజం భుజం కలుపుతూ మావోయిస్టు ఉద్యమ ప్రాంతాల ప్రజలు ముందుకు రావడమే కాకుండా వారి నాయకత్వంలోని 'ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం'(పీ.ఎల్.జీ.ఏ) భారత పాలకవర్గాల భద్రతా బలగాల అణచివేత చర్యలను ద్విగుణీకృత పట్టుదలతో ఎదుర్కొంటోంది. ప్రజా పోరాటాలను సాయుధ పోరాటంతో సమన్వయ పరుస్తూ ఝార్ఖండ్, బిహార్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, పశ్చిమ కనుమలు, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ మున్నగు ఉద్యమ ప్రాంతాలలో సాయుధ చర్యలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా దండకారణ్యంలో 2020 జనవరి నుండి జూన్ వరకు వివిధ డివిజన్‌లలో 'ఎత్తుగడల ఎదురుదాడుల క్యాంపెయిన్' ను చేపట్టి పదుల సంఖ్యలో పాశవిక పోలీసు, అర్థసైనిక కమాండో బలగాలను మట్టి గరిపించారు, తీవ్రంగా గాయపరిచారు.

2020 జనవరి, ఫిబ్రవరి మాసాలలో మాడ్ డివిజన్‌లోని సోన్‌పుర్ ప్రాంతంలో, దక్షిణ బస్తర్‌లోని కిష్టారం, జేగురుగుండ ప్రాంతాలలో, మార్చ్‌లో నారాయణ్‌పుర్ జిల్లాలోని తూర్పు బస్తర్ డివిజన్‌లో, అదే సమయంలో తిరిగి దక్షిణ బస్తర్‌లోని కిష్టారం, జేగుర్‌గుండ ప్రాంతాలలో పీఎల్‌జీఏలోని మూడురకాల బలగాలు ప్రజలతో కలిసి సాయుధ చర్యలను విజయవంతంగా కొనసాగించాయి. మేలో మహారాష్ట్రలోని గడ్‌చిరోలీ జిల్లా భామ్రాగడ్ తాలూకా గుందుర్‌వాహి అడవులలో కుఖ్యాత సీ-60 కమాండోలపై గెరిల్లాలు దాడిచేశారు. ఇందులో ఎస్సై సహ ఒక కమాండో చనిపోగా, నలుగురు గాయపడ్డారు.

దండకారణ్యంలో ప్రజా గెరిల్లాలు కొనసాగిస్తున్న ఎత్తుగడల ఎదురు దాడుల కెంపెయిన్‌లో మార్చ్ 20 నాడు సుక్మా జిల్లా మినప అడవులలో డీ.ఆర్.జీ., సీ.ఏ.ఎఫ్. బలగాలతో పీ.ఎల్.జీ.ఏ. గెరిల్లా బలగాలు మెరుపుదాడి ప్రారంభించి గంటల తరబడి తలపడి విప్లవ ప్రజల, జనతన సర్కార్ల అపార మద్దతుతో 19 గంటల సమరంలో గెలుపు సాధించారు. నిజానికి ఈ చర్యలో చనిపోయినవారి అనేక వివరాలను పోలీసు ఉన్నతాధికారులు ఉద్దేశ పూర్వకంగానే వీలైనమేరకు ప్రింట్ మీడియా మరుగున పెడుతున్నారు. ***ఈ ఆపరేషన్‌లో భారత సైన్యాలకు చెందిన 30మంది జవాన్‌లతో పాటు తెలంగాణ గ్రేహౌండ్స్‌కు చెందిన 30మంది కమాండోలు సైతం పాలుపంచుకున్నారు.*** హతాహతులలో భారత సైనికులు కూడా ఉండడం విశేషం. ఈ వివరాలన్నీ అధికారికంగా అంతర్జాలంలో అందరికీ అందుబాటులోనే ఉన్నాయి. డీఆర్‌జీని అన్ని విధాలా గైడ్ చేయడానికి, వారికి శిక్షణ ఇవ్వడానికి తొలినుండి భారత సైన్యం ప్రత్యేక దృష్టి పెడుతోంది. అడవులలో గాలింపు చర్యలకు వందల సంఖ్యలో వచ్చిన బలగాలు గంటల తరబడి పీ.ఎల్.జీ.ఏ.తో సాగిన దాడితో ఖంగుతిని చనిపోయిన, గాయపడిన సోదర సైనిక జవాన్‌ల

శవాలనైనా వెను తిరిగి చూడకుండా చెల్లాచెదురై ఎవడి దారిన వాడు 'బతుకు జీవుడా' అంటూ పరుగు తీశారు. ఆ సమరంలో 17 మంది పోలీసులు మరణించినట్టు 15 మంది గాయపడినట్టు పోలీసు వర్గాలు ప్రకటించడం వాస్తవాలను కప్పిపుచ్చి ఖాకీ బలగాల మనోస్థైర్యాన్ని నిలబెట్టడానికి చేస్తున్న కసరత్తు తప్ప మరేంకాదు. గెరిల్లాల చేతులలో బహుశా తొలిసారి మృత్యువాత పడిన భారత సైనిక జవాన్‌ల ఊసే ఎత్తడం లేదు. ఈ ఘటనలో హతాహతుల సంఖ్య ఎట్టి పరిస్థితులలో కూడా 40కి తక్కువ ఉండదని ఆ దాడిలో పాల్గొన్న గెరిల్లాలు ప్రకటించారు.

నిజానికి మినప సమరంలో హతాహతుల సంఖ్య ఎంతో అధికంగా ఉంటుందని దాడిలో లభ్యమైన ఆధారాలను బట్టి నిస్సందేహంగా చెప్పవచ్చు. ఆ సమరంలో పీ.ఎల్.జీ.ఏ. పోలీసు బలగాల నుండి 11 ఏ.కే.-47 ఆయుధాలతో పాటు మొత్తంగా 14 ఆయుధాలను 1,550 తూటాలను స్వాధీనం చేసుకుంది. ఆ భీకర సమరంలో పీ.ఎల్.జీ.ఏ. తన ముగ్గురు ప్రియమైన గెరిల్లా యుద్ధ సహచరులను కోల్పోయింది. కామ్రేడ్స్ సకురు, రాజేశ్, సుక్కులు అత్యంత ధైర్యసాహసాలతో పోరాడి దండకారణ్య రణ భూమిని తమ నెత్తురుతో తడిపారు. మినప మినహాయించి జరిగిన ఇతర గెరిల్లా ప్రతిఘటన, మాటు దాడుల చర్యలలో మరో ఏడుగురు గెరిల్లాలు అమరులు కాగా మినప సహ అన్ని గెరిల్లా సైనిక చర్యలలో కలిపి దాదాపు 12 మంది గెరిల్లాలు గాయపడి చికిత్స పొందుతున్నారు. వారెవరూ ప్రాణాపాయ స్థితిలో లేరు. మిగితా చోట్లా చోటుచేసుకున్న గెరిల్లా దాడులలో దాదాపు 45 మంది పోలీసులు గాయపడగా 15మంది పోలీసులు మట్టికరిచారు. టావర్, ఏకే, ఇన్సాస్, ఎస్ఎల్ఆర్ లాంటి 5 ఆధునిక ఆయుధాలు, తూటాలు, మొత్తంగా 15 ఆధునిక డిజిటల్ కమ్యూనికేషన్ సెట్స్‌తోపాటు అనేక రకాల సామానులు పోలీసుల నుండి గెరిల్లాలు స్వాధీనం చేసుకున్నారు. దక్షిణ బస్తర్‌లోని చింతగుప్ప పోలీసు క్యాంపుకు సరఫరా చేస్తున్న దైనందిన సరుకులను స్థానిక భూంకాల్ మిలీషియాను కలుపుకొని గెరిల్లాలు దాడిచేసి స్వాధీనం చేసుకున్నారు. 2020 జనవరి నుండి జూన్ వరకు అత్యంత ధైర్య సాహసాలతో పోరాడుతూ దండకారణ్య విప్లవోద్యమంలో అసువులు బాసిన విప్లవకారులకు క్రాంతి పత్రిక వినమ్రంగా విప్లవజోహార్లు చెపుతోంది.

దండకారణ్యంలో ఒకవైపు వేలాది మంది సంఘటిత ప్రజానీకం తమ అడవుల నుండి భారత దళారీ పెట్టుబడిదారులు, బహుళ జాతి కార్పొరేషన్‌లు గనుల తవ్వకాలను నిలిపివేసి వెనక్కివెళ్లాలని నినదిస్తుంటే, మరోవైపు వారి పనిస్థలాలలో రక్షణకరువై ప్రజలపై నిత్యం దాడులు జరుపుతున్న పోలీసు, అర్ధసైనిక బలగాలపై గెరిల్లాలు ఆత్మరక్షణ దాడులు జరుపడంతో ఆముదాయి, సూర్జాగఢ్ సహా అనేక చోట్ల పనులు నిలిచిపోయాయి. ఇది ప్రజా విజయం.

ఒకవైపు ప్రజాపోరాటాలు, మరోవైపు గెరిల్లాల దాడులతో అడవులు ప్రతిధ్వనిస్తోంటే, పాలకుల ఆదేశాలపై అడవులకు చేరిన భారత భద్రతా బలగాలకు చెందిన వివిధ రాష్ట్రాల పోలీసు జవాన్‌లు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పోలీసు విభాగానికి చెందిన అనేక మంది సాధారణ పోలీసులు అధికారుల నిర్లక్ష్యంతో తమ మధ్య తలెత్తుతున్న వైషమ్యాలతో పరస్పరం కాల్పులు జరుపుకోవడం, ఆత్మహత్యలకు పాల్పడడం విషాదకరం. ఈ ధోరణి ఏనాటికానాడు పెరుగుతోంది. గత రేండేళ్ల కాలంలోనే కేవలం దండకారణ్యంలోనే దాదాపు 100 మంది రాష్ట్ర, కేంద్ర పోలీసులు ఈ రకంగా తమ ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడకూడదని, విధి నిర్వహణలో ఎదురవుతోన్న వత్తిళ్లను, ఇతర అన్ని రకాల సమస్యలను పోరాటాల ద్వారా పరిష్కరించుకోవాలని, భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) పూర్తిగా అండగా ఉంటుందని పలుమార్లు పోలీసులకు వర్గదృష్టితో చేసిన విజ్ఞప్తులు గమనార్హం. ఈ రకమైన మరణాలు ఇలా ఉండగా పలు సందర్భాలలో అన్ని రకాల బలగాలకు చెందిన పోలీసు జవాన్‌లు ఇన్ఫార్మర్లు చేరవేసే తప్పుడు సమాచారం, తీవ్రమైన మానసిక ఒత్తిళ్లకు గురై పరస్పరం కాల్పులు జరుపుకొని మరణించిన సందర్భాలు కూడా అనేకం ఉన్నాయి. అయితే, వాటిని వారు మావోయిస్టులతో జరిగిన కాల్పులుగానే తప్పుగా పేర్కొంటూ ప్రభుత్వం నుండి దొరికే అన్ని రకాల ఆర్థిక ప్రోత్సాహకాలను పొందుతున్న విషయం భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)కు తేటతెల్లమే అయినప్పటికీ అలాంటి ఘటనలను ఉద్దేశపూరితంగానే ఖండించి వాస్తవాలను వర్గదృష్టితోనే బయటికి ప్రకటించడం లేదు.

భారత పాలకవర్గాల ప్రజావ్యతిరేక దోపిడీ విధానాలతో వర్తమాన పరిస్థితులు విప్లవోద్యమానికి దినదినం అనుకూలంగా మారుతుండడంతో వారు దేశంలో ఎక్కడా మావోయిస్టుల ప్రసక్తే ఉండకూడదనీ, పరిస్థితులను వారు విప్లవోద్యమానికి సద్వినియోగం చేసుకోకూడదనీ, దోపిడీ పాలకులూ వారి పోలీసులు ఎన్ని భగీరథ ప్రయత్నాలకు పూనుకుంటున్నప్పటికీ అవన్నీ బ్యాక్‌ఫైర్ అవుతున్నాయి. ప్రజలు విప్లవించక తప్పని పరిస్థితులను కల్పిస్తున్న పాలకవర్గాలు మావోయిస్టుల ఏరివేతతో వారి నయాభారత్ పగటికలలు సాకార్యమవుతాయనుకోవడం కేవలం భ్రమగానే మిగులక తప్పదు. ప్రజలు తమ మౌలిక సమస్యలకు నిజమైన సమాధానాలు కోరుకుంటున్నారు, అందుకు ప్రభుత్వ 'సమాధాన్' వారిని ఎంతమాత్రం శాశ్వతంగా అడ్డుకోజాలదు. ప్రభుత్వాలు తీవ్రతరం చేస్తున్న నిరంకుశ ఫాసిస్టు అణచివేత చర్యల నుండి మావోయిస్టులు నిత్యం నేర్చుకుంటూ ప్రజల ప్రజాస్వామిక భారత నిర్మాణానికి పురోగమించితీరుతారు. ప్రజలు వారినే కోరుకుంటున్నారు. ★

## పథ్థల్‌గడీ ప్రజా పోరాటాన్ని లాల్‌గఢ్ ప్రజా వెల్లువ దారిలో నడుపాలి

(వర్తమాన పత్థల్‌గఢీ ఉద్యమాన్ని లాల్‌గఢ్ మార్గంలోనే నడుపాలనే ఉద్దేశంతో 2008 నాటి లాల్‌గఢ్ ఉద్యమ అనుభవాలను అందిస్తున్నాం...సం.మ)

ఇటీవలి సంవత్సరాలలో దండకారణ్యం సహ దేశంలోని వివిధ ఐదవ షెడ్యూల్డ్ ఆదివాసీ ప్రాంతాలలో జల్ జంగిల్ జమీన్ కోసం పెసా చట్టాన్ని అమలు చేయాలని ప్రజలు ఉద్యమిస్తున్నారు. 1996లో ఆ చట్టం రూపొందినప్పటికీ దేశంలో అది ఎక్కడా యధాతథంగా అమలులోకి రాలేదు. ఏ ప్రభుత్వాలు దాని అమలుకు నడుం బిగించలేదు. ఫలితంగా ఆదివాసీ ప్రజలే దాదాపు రెండు దశాబ్దాల తరువాత ఆ చట్టాన్ని ఇప్పటికైనా అమలు చేయండంటూ ఉద్యమించడం ముదావహం. తాము ఇన్నాళ్లు చేయని పనిని ఇపుడు చేయాలని ప్రజలు ఉద్యమిస్తుంటే ప్రభుత్వాలు మావోయిస్టులు ప్రజలను రెచ్చగొడుతున్నారంటూ అవాకులు, చవాకులతో ఆ ఉద్యమాలపై పోలీసు దాడులకు పాల్పడుతోన్నవి. తాము రూపొందించిన చట్టాన్ని తామే అమలు చేయాల్సింది పోయి ప్రజలను మావోయిస్టులంటూ ప్రభుత్వాలు నిందించడం మావోయిస్టు ఉద్యమ బలాన్ని చెబుతుంది. అయినప్పటికి ఆ చట్టం పై మావోయిస్టులకు ఎలాంటి భ్రమలు లేవనీ, ఆ ఉద్యమం బూర్జువా చట్టాల పట్లా ప్రజల భ్రమలు తొలిగిపోవడానికే సహకరిస్తాయనే అవగహనతో వారు లాల్‌గఢ్ తరహ ఉద్యమాలనే కోరుకుంటారనేది స్పష్టం.

పశ్చిమ బంగాల్ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య వాహనాల కాన్వాయ్‌పై 2-11-2008 నాడు మావోయిస్టులు పేల్చిన మందు పాతర ఘటన పాలక వర్గాలకు ప్రేతాత్మలను గుర్తు చేసింది. మందు పాతరా లక్ష్యాన్ని ఛేదించకపోవడంతో వారి కాన్వాయిలోని పారిశ్రామిక మిత్ర శక్తులకు అది 'పునర్జన్మ'నిచ్చినంత పనైంది. దానితో రాజకీయ నాయకులతో జతకూడిన పెట్టుబడిదారుల ఆ జంట శక్తులు తక్షణం జనంపై ఖాకీలను ఉసిగొల్పాయి. ప్రజలపై వారి భద్రతా బలగాల పాశవిక నిర్బంధం విరుచుకుపడడంతో గత పదేళ్ళుగా వివిధ రూపాలలో లాల్‌గఢ్ ప్రజలపై నిర్విచక్షణగా అమలవుతున్న రాజ్యాహింసతో పాటు సోషల్ ఫాసిస్టు రివిజినిస్టు సీ.పీ.ఎమ్. పార్టీ గూండాల అణచివేత దౌర్జన్యాలకు వ్యతిరేకంగా నివురు కప్పిన నిప్పులా వారిలో గూడు కట్టుక్ను ప్రజా ఆగ్రహం వెల్లువెత్తింది. నవంబర్ 2 నాడు మంత్రుల కాన్వాయి ఆ ప్రాంతానికి వెళ్లడానికీ మందు పాతర పేలడానికీ మధ్యగల కార్యకారణ సంబంధం తెలియకపోతే నిర్విరామంగా మావోయిస్టుల హింసాత్మక చర్యలను ఏకరువు పెట్టే 'బుద్ధిజీవులకు' ఆగ్రహం కలుగుతుంది. కాబట్టి అదేదో చెప్పుకుందాం.

మన దేశంలోని దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల అగ్రశ్రేణిలో చేరి నిలిచిన జిందాల్ స్టీల్ కంపెనీకి చెందిన నూతన ప్రత్యేక ఆర్థిక మండలి ప్రారంభోత్సవానికి ఆరోజు బుద్ధదేవ్ భట్టాచార్య, రాంవిలాస్ పాశ్వాన్‌లతో కూడిన ప్రభుత్వ వాహనాల కాన్వాయ్ శాల్‌బోని వెళ్తుందన్న విషయం ప్రజల ద్వారా తెలుసుకున్న గెరిల్లాలు మందుపాతర విస్ఫోటనకు పూనుకున్నారు. ఆ ప్రత్యేక ఆర్థిక మండలి కోసం 5,000 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎర్రజెండా భట్టాచార్యుల వారు ప్రజా వ్యతిరేకతను పెడచెవిన పెట్టి జిందాల్‌కు అప్పనంగా కేటాయించాడు. ప్రజలు నిరంతరంగా దానిని వ్యతిరేకిస్తున్నప్పటికి సీ.పీ.ఎమ్. ప్రభుత్వం మాత్రం అక్కడ ప్రత్యేక ఆర్థిక మండలి నిర్మాణానికి కంకణం కట్టుకొని పని చేస్తున్నది. జిందల్ కోసం ప్రజల భూముల కేటాయింపుకు వ్యతిరేకంగా మావోయిస్టులు కూడా పోరాడుతున్న విషయం తెలిసిందే! ఆ నేపధ్యంలోనే ప్రభుత్వ వాహనాల కాన్వాయ్‌పై మందుపాతర పేల్చక తప్పలేదన్న దోపిడీగాంధ్ర అసలు పీఠముడిని మేం విప్పదల్చుకున్నాం. ఆ దాడి తర్వాత ప్రభుత్వ యంత్రాంగం, సీ.పీ.ఎమ్. గూండాలు గ్రామీణ ప్రజలపై పడి భయంకరంగా దాడులు చేయసాగారు. పర్యవసానంగా ప్రజల క్రోధాగ్ని కట్టలు తెంచుకుంది.

**ప్రజలపై అమలైన భయభీభత్స దమనకాండ:**

ప్రభుత్వ యంత్రాంగం, సీ.పీ.ఎమ్. గూండాలు సృష్టిస్తున్న భయ భీతావాహానికి వ్యతిరేకంగా ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత నెలకొంది. గ్రామీణుల ఇళ్లలోకి చొరబడి పోలీసులు ఆడ, మగ తేడా లేకుండా బాధసాగారు. పండుగ వేడుక (జాతర) నుండి తిరిగి వస్తున్న ముగ్గురు యువ విద్యార్థులను పోలీసులు అరెస్టు చేసారు. నవంబర్ 4 నాడు కాంతాహరి సంత నుండి సరుకులు ఖరీదు చేస్తున్న దీపక్ ప్రతిహార్ అనే వ్యక్తిని పోలీసులు నిర్బంధించారు. ఆయన భార్య లక్ష్మీని తీవ్రంగా బాదుతూ రోడ్డుపైకి నెట్టేశారు. అదేరోజు రాత్రి ఛోటోపేలియా గ్రామంలో ఉన్న సివిల్ కాంట్రాక్టర్ శంశేర్ ఆలంను కూడా పోలీసులు వదిలిపెట్టలేదు. ఆయన అరెస్టును వ్యతిరేకించిన విశ్రాంత ఉపాధ్యాయుడు కాశ్మాన్‌ను సైతం పోలీసులు ఉపేక్షించ లేదు. కేవలం రెండు రోజులలోనే ఐదు గ్రామాలలో ఇలాంటి అనేక ఘటనలకు పోలీసులు పాల్పడ్డారు. లాల్‌గఢ్ పోలీస్ స్టేషన్ అధికారి మేదినీపుర్ పోలీస్ సూపరింటెండెంట్‌ల నాయకత్వంలో ఈ గ్రామాలలో విధ్వంసం సృష్టించబడింది. నవంబర్ 6 నాడు జరిగిన ఘటనతో పోలీసుల అణచివేత తాండవం పరాకాష్ఠకు చేరింది. చోటోపేలియా గ్రామంలోని మహిళలను కర్రలతో, తుపాకి బట్లతో విపరీతంగా కొట్టారు. ఆ దెబ్బలతో చింతామణి ముర్ము అనే మహిళ కనుగుడ్డు ఎగిరిపోయింది. పాణాబాణి హంస్ అనే రైతును నేలపై దొర్లిస్తూ ఆయన ఛాతీపై లాఠీల వర్షం కురిపించారు. శతాబ్దాల తరబడిగా అక్కడ తీవ్ర అణచివేతకు గురై జీవిస్తున్న పీడితులు ముఖ్యంగా సంతాల్ ఆదివాసులు తమ మహిళలపై జరిగిన అత్యాచారాల పర్యవసానంగా 'స్వాతంత్ర్యానంతరం' మరోసారి తమ తిరుగుబాటు జెండాను ఎగురవేసారు. వారి ఆగ్రహ లావాలతో అక్కడి అడవులు జ్వలించాయి.

**జన సంద్రపు ఆగ్రహజ్వాల:**

రాత్రికి రాత్రే ఉన్నఫలంగా ఆదివాసులు పోలీస్ స్టేషన్‌ను చుట్టుముట్టారు. దానికి బలగాలు చేరుకునే అన్ని దారులూ మూసివేశారు. అక్కడి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. పోలీస్‌స్టేషన్ లోనే పోలీసులను నిర్బంధించారు. ఆ మరుసటి రోజు నవంబర్ 7 నాడు వేలాది సంతాల్ ఆదివాసి ప్రజానీకం తమ సాంప్రదాయ ఆయుధాలతో రోడ్లపైకి వచ్చారు. ఆ ప్రాంతంలోకి దూసుక వచ్చే అన్ని దారులూ వాళ్ళు నందిగ్రామ్ తరహాలో మూసివేశారు. అలాగే పోలీసుల సీ.పీ.ఎమ్. గూండాల రాకపోకలను అడ్డుకున్నారు. అప్పటివరకూ ప్రభుత్వం చేపడుతూ వచ్చిన అభివృద్ధి చర్యల కొలమానంపైనే నిరసనకారుల చర్యలతో బుద్ధిజీవులలో అనేక సందేహాలు ఉత్పన్నం అయితీరుతాయి. వాళ్లు మేల్కొని తీరుతారు. ఎందుకంటే ప్రభుత్వాలు సాధారణంగా రహదారుల నిర్మాణాన్ని ప్రజా అభివృద్ధికి ఒక గీటురాయిగా ప్రచారం చేస్తుంటాయి. అప్పటివరకూ ప్రజల అభివృద్ధిని కాంక్షించిన ఆ ప్రభుత్వ పోలీసు బలగాలే తమపై ఏళ్ళతరబడిగా దౌర్జన్యానికి పాల్పడినవారంటూ ప్రజలు వారిని బహిష్కరించారు. తిరుగుబాటుకు సంకేతంగా ఆ శక్తులు సాంప్రదాయక ఆయుధాలు చేతబూని జల్,జంగల్, జమీన్ పై తమ ఆధిపత్యాన్ని కోరుకుంటూ రోడ్లను దిగ్బంధం చేసి ఎన్నడెరుగని విధంగా తమను అవమానించేసరికి సహజంగానే దోపిడీ శక్తులు ఖంగుతిన్నాయి. ప్రజల ఆగ్రహం మరియు పోరాటాల ముందు ఆ శక్తులకు మాట పెగలకుండా పోయింది. తమ పోరాటాన్ని తీవ్రం చేస్తూ ప్రజలు పదమూడు సూత్రాల ఒక డిమాండ్ పత్రాన్ని ప్రభుత్వానికి అందజేసారు. వాళ్ళు తమను పీడిస్తూ అణచివేస్తున్న రాజ్యం తమకు అక్కరలేదని అధికారం ప్రజలకే దక్కాలని ఆ డిమాండ్ల సారాంశంగా చెప్పారు. వాళ్ళ ఆగ్రహం ఏ స్థాయికి చేరిందంటే పిడిపిడీలుగా కొనసాగుతున్న దోపిడీ సంప్రదాయ సంస్థల నియంత్రణను కూడా వాళ్ళు నిర్ద్వంద్వంగా వ్యతిరేకించారు. అందుకు వాళ్ళంతా వినిపించినది ఏమంటే ఆ శక్తులే ఇంతకాలం తమ హక్కులకు వ్యతిరేకంగా పాలకులతో కలిసి ఆడుతున్న ఆటలను ఇకపై సాగనివ్వమని కుండబద్దలు కొట్టినట్టు ప్రకటించారు. సంతాలుల అత్యున్నత సంప్రదాయ సామాజిక సంస్థ 'భారత్ జకాత్ మాజి మదువా జన్‌గుంటా'కు జార్‌గ్రాం ప్రాంతంలో తిరిగి ప్రాణ ప్రతిష్ట చేశారు. వాళ్ళు ప్రజల ఆమోదం లేకుండానే ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకోవడంతో ప్రజలు తమ పోరాట కమిటీలను తాము విడిగా ఏర్పాటు చేసుకున్నారు. తక్షణమే వాళ్ళు 'పోలీసు అత్యాచార వ్యతిరేక ప్రజా కమిటీ' (సీ.ఏ.పీ.ఏ.)ని ఏర్పాటు చేసుకున్నారు. దాని నాయకత్వం నవయువకుల చేతులలోకి వచ్చింది.

ఆ కమిటీ తమ అధికారాల కోసం ధైర్యంగా పోరాట పథంలో ముందుకు పోసాగింది. దాని ప్రత్యేకతేమంటే 26 సంవత్సరాల ఒక నవయువకుడు దానికి నాయకత్వం వహిస్తున్నాడు. అభివృద్ధి పేరుతో అప్పటి వరకు తమను మోసగిస్తూ వచ్చిన దుష్ట శక్తులతో తామిక రాజీపడబోమని వాళ్ళు అర్థం చేసుకున్నారు. ప్రజా పోరాట బలంతోనే తమ ఆధిపత్యం నెలకొంటుందని వాళ్లు అర్థం చేసుకున్నారు. వాళ్ళ సంఘటిత శక్తి కూడా బలపడసాగింది. ఊరూర కమిటీలు ఏర్పడసాగాయి. ప్రజలే కేంద్రంగా అధికారం సాగడమనేది ప్రారంభమైంది. వాళ్ళు ఏర్పాటు జేసుకుంటున్న కమిటీలలో ఐదుగురు మహిళలతో పాటు ఐదుగురు పురుషులుంటున్నారు. వాళ్ళు అన్ని నిర్ణయాలు గ్రామసభలలో తీసుకునే సాంప్రదాయాన్ని పాటించసాగారు. ప్రభుత్వ నిరంకుశ కేంద్రీకృత అధికారాన్ని ప్రజలు సవాలు చేయడం నిజంగా ఎంతో అభినందనీయమైనది. దోషులైన పోలీసు అధికారులు చెవులు పట్టుకొని ప్రజల సమక్షంలో క్షమాపణలు చెప్పాలని కోరడం, దలీల్‌పూర్ చౌక్ నుండి ఛోటోపిలియా వరకు ముక్కు భూమికి రాయాలని కోరడం ప్రజల పోరాట చైతన్యానికి నిదర్శనం. ఆ శిక్ష వారి సంప్రదాయంలో వారెరిగిన జనామోదం కలిగిన అతి సామాన్యమైన శిక్ష. ప్రజలు ప్రభుత్వ న్యాయ వ్యవస్థకు కూడా తిలాంజలులు సమర్పించాలని అనుకున్నారు. ఎందుకంటే ఆ వ్యవస్థ నిజమైన దోషులను శిక్షించడంలో ఘోరంగా విఫలం అవుతుందని వారికి జీవితమే నేర్పింది.

**నిప్పు రవ్వ దావానలమైంది**

లాల్‌గఢ్ ప్రజా పోరాటాన్ని సమర్థిస్తూ, నిజమైన ప్రజల అభివృద్ధిని కోరుకుంటూ అనేక ప్రజా సంఘాలు రోడ్లపైకి వచ్చాయి. ముఖ్యంగా గత పదేళ్ళుగా ప్రభుత్వ నిర్బంధం, పీడన, అణచివేతలకు గురవుతున్న ఆ ప్రాంతాల ప్రజలు పోలీసు, అర్ధ సైనిక బలగాల క్యాంపులను తొలగించాలనే డిమాండుపై దారులన్నీ దిగ్బంధనం చేసారు. లాల్‌గఢ్‌లో రగిలిన నిప్పు రవ్వ మేదినీపూర్, బాంకురా, పురూలియాలలో కూడా మంటలను రగిలించింది. బెల్‌పహాడి, గొర్బైత పిడ్‌కార, చాంద్ర, జాంబోని, సాల్బోని సహ 70వ దశకంలో నక్సల్బరీ ఉద్యమానికి కేంద్రంగా ఉన్న గోపీవల్లభపుర్ వంటి అనేక ప్రాంతాలు పోరాటకారుల స్వాధీనం అయ్యాయి. వాళ్లు ఆ ప్రాంతాలలో పోలీసుల కదలికలను నిలిపివేశారు. అలాగే రోడ్డుపై అనేక చోట్ల చెట్లు నరికి పడేశారు. చాలా చోట్ల సీ.పీ.ఎమ్. గూండాలను తరిమికొట్టారు. బెల్‌పహాడి, సిల్దా, బన్స్‌పహాడిల స్థానిక సీ.పీ.ఎమ్. కమిటీల కార్యదర్శులు పోలీస్ స్టేషన్ల శరణు జొచ్చారు. మొత్తం ప్రాంతంలోని ప్రజానీకం వివిధ పోరాట సంఘాలలో సంఘటితమయ్యారు. సంతాల్ విద్యార్థి సంఘం, జుమిత్ జుంటా, ఈ.ఎస్.ఈ.సీ.ఏ., కుర్మీ చాత్ర సంఘం, భీర్‌భూం ఆదివాసీ కమిటీ, సిటిజన్ ఫోరంలాంటి అనేక సంఘాలు ఒక్కటై సీ.పీ.ఎమ్. గూండాల, పోలీసుల దౌర్జన్యానికి వ్యతిరేకంగా తగిన జవాబు ఇవ్వసాగారు. కొన్ని చోట్ల స్థానిక సీ.పీ.ఎమ్. కార్యకర్తలు కూడా ఉద్యమంలో పాలు పంచుకున్నారు. వర్ధమాన్ లోతట్టు ప్రాంతాల్లోని ఆదివాసీ సంఘాలు ఉద్యమానికి మద్దతుగా

సమ్మెకు దిగాయి. ప్రజలు పోలీసు, అర్ధసైనిక బలగాల క్యాంపుల ముందు ధర్నాలు చేయసాగారు. వాళ్ళు ఆయా క్యాంపుల ఇంచార్జీలను క్యాంపులు ఖాళీ చేయాలని కోరారు. ప్రజల సంరక్షణ పేరుతో ఏర్పాటు చేశామంటున్న క్యాంపులను ప్రజలే తొలగించాలనే డిమాండుతో ముందుకు వస్తుండగా ప్రభుత్వం మాత్రం వాటిని ఎత్తెయ్యడానికి ససేమిరా సుముఖంగా లేదు. ప్రభుత్వం మరియు సీ.పీ.ఎమ్. చేపట్టిన ఉద్యమ వ్యతిరేక అణచివేత చర్యల మధ్యనే రోజు రోజుకు ప్రజా పోరాటం తీవ్రంగా కొనసాగింది. తుదకు ఉద్యమకారుల ముందు ప్రభుత్వం లొంగిరాక తప్పలేదు. పోలీసు క్యాంపులను ఎత్తివేయడానికే ప్రభుత్వం ఒప్పుకోక తప్పలేదు. అలాగే 1998 తర్వాత రైతాంగంపై మోపిన కేసులన్నింటిని ప్రభుత్వం పునరాలోచించడానికి తలూపక తప్పలేదు. ముఖ్యంగా వాటిలో ఇప్పటి వరకు కనీసంగా చార్జిషీటైనా ఫైల్ చేయని కేసులన్నింటినీ తక్షణం వెనక్కి తీసుకోవడంపై ప్రభుత్వం తన ఆమోదం తెలిపింది. పోతే పోలీసుల అత్యాచారాలపై ప్రభుత్వం ఒక దర్యాప్తు కమిటీని నియమించింది. ఆ పోరాట క్రమంలో అరెస్టైన వాళ్లలో అనేక మందిని జమానత్‌పై విడుదల చేసింది.

### సల్వాజుడుం అడుగుజాడల్లో నడుస్తున్న వామపక్ష ప్రభుత్వం

ఉద్యమకారులకు ప్రభుత్వానికి మధ్య కుదిరిన ఒప్పందం ఎట్టకేలకు బూటకమైనదని రుజువైంది. పోలీసు క్యాంపులను ఎత్తివేయడానికి ప్రభుత్వం తెలిపిన ఆమోదం కేవలం ఒక కపట నాటకం మాత్రమే! సమరశీల ప్రజా ఉద్యమాన్ని నీరసపరిచి అణచివేసే దుష్ట తలంపుతోనే అది తన ఆమోదాన్ని తెలిపింది. ఉద్యమాన్ని అణచివేయడానికి ప్రభుత్వం మరియు సీ.పీ.ఎమ్.లు కలిసి కట్టుగా సల్వాజుడుం మాదిరిగా "ప్రజా ప్రతిఘటన కమిటీ' 'ఆదివాసీ, గైర్ ఆదివాసీ ఐక్య కమిటీ"ని ఏర్పర్చింది. ఆ కమిటీలో సీ.పీ.ఎమ్.తో పాటు ఝార్ఖండ్ ముక్తి మోర్చా కార్యకర్తలున్నారు. ప్రజా ప్రతిఘటన కమిటీ బ్యానర్‌పై ముందుకొచ్చిన గూండా శక్తులు ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న కార్యకర్తలను చితకబాధడం మొదలుపెట్టాయి. వాళ్లు వందల సంఖ్యలో బ్యాచులుగా ఏర్పడి గ్రామాలపై పడి దాడులు చేయసాగారు. బెల్‌పహాడి ప్రాంతంలో ఇలాంటి ఘటనలు అనేకం జరిగినవి. ఆ క్రమంలో ప్రజా ప్రతిఘటన కమిటీకి చెందిన ఝార్ఖండ్ మూక్తి మోర్చ కార్యకర్త ఆ దాడులకు నాయకత్వం వహిస్తున్న నాయకత్వ సభ్యుడూ సుధీర్ మాంజీని ప్రజలు కసితో మట్టుబెట్టక తప్పలేదు. దానిని సాకుగా తీసుకున్న ప్రభుత్వం శాంతి భద్రతల నెపంపై వెంటనే కైమా, కలాయిమురే, పీరకాట, బేరటీకాట, బిపుర్, చురీమరా, జాంప్తాలమడ్, లాల్‌గఢ్ స్కూళ్ళలో మళ్ళీ క్యాంపులు పెట్టారు.

కానీ నిజానికి తమ హక్కుల కోసం పోరాడుతున్న గ్రామాలపై పడి ప్రజలను హతమార్చడమే అసలైన శాంతి భద్రతలకు విఘ్నం కలిగజేస్తున్నదనే సమస్యపై ప్రభుత్వం వద్ద ఎలాంటి జవాబు లేదు. వారి ప్రజా అణచివేత విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించినపుడు మాత్రం తక్షణం శాంతి భద్రతలకు ముప్పు ఏర్పడుతుందనేదే వారికి తెలిసింది. ప్రజలు ప్రభుత్వ చర్యలను వ్యతిరేకించినట్టయితే నేరస్తులు, సంఘ వ్యతిరేకులు, ఉగ్రవాదులు అవుతారు. అప్పుడు ప్రభుత్వం తనకు తోచినట్టుగా వారిని అణచివేయడానికి అన్ని విధాల దానికి మార్గం సుగమం అవుతుంది. పోరాట క్రమంలో పెరిగిన ఆదివాసుల చైతన్యాన్ని నీరుగార్చడానికి ప్రభుత్వం సీ.పీ.ఎమ్. శక్తులు ప్రజా డిమాండ్లను బుట్టదాఖలా చేయడానికి, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా గొంతెత్తుతున్న వారి ధిక్కారాన్ని అణచివేయడానికి పశ్చిమ బంగాల్ వామపక్ష 'ప్రగతిశీల' ప్రభుత్వం కూడా మధ్య భారతంలోని ఛత్తీస్‌గఢ్‌లో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలనే ఆవాహనం చేసుకుంది. పోలీసులు, అర్ధసైనిక బలగాలు ప్రైవేటు గూండాలు కలిసికట్టుగా పశ్చిమ బంగాల్‌లో లాల్‌గఢ్ సంతాల్ ప్రజా ఉద్యమ అణచివేత చర్యలను నిస్సిగ్గుగా చేపట్టాయి. అందుకే అది సోషల్ ఫాసిస్టు సర్కార్!

### తలవంచని ప్రజల ధర్మాగ్రహం

ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుండా మళ్ళీ పోలీసు క్యాంపులను ఏర్పాటు చేయడమంటే వారిని మోసగించడం తప్ప మరేమి కాదంటూ 'పోలీసు అత్యాచారాల వ్యతిరేక ప్రజా కమిటీ' సమావేశమై ప్రజాసభలో చర్చించి పరిస్థితులను సమీక్షించి తిరిగి ఉద్యమించడానికి నిర్ణయాలు తీసుకున్నారు. ప్రభుత్వాన్ని సాంఘీకంగా బహిష్కరించాలని 2009 జనవరి 7 నాడు వాళ్లు పిలుపునిచ్చారు. సాంఘీక బహిష్కరణలో భాగంగా ప్రభుత్వానికి ప్రజలు ఎవరు కూడా పన్నులు చెల్లించకూడదంటూ కౌలు రేట్లు చెల్లించకూడదంటూ బ్లాక్ అధికారులతో ఎలాంటి సంప్రదింపులు జరపకూడదంటూ పోలీసులనూ ప్రభుత్వాన్నీ బహిష్కరించాలనే నిర్ణయం తీసుకున్నారు. దాంతోపాటు ప్రభుత్వం తాను ఇచ్చిన హామీలను నిలబెట్టుకోనందుకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని కూడా వారు డిమాండ్ చేశారు. కానీ అధికార మత్తులో నిండా మునిగిన 'ఎర్ర' ప్రభుత్వం సల్వాజుడుం తరహాలో ప్రజా ఉద్యమాన్ని సమూలంగా నిర్మూలించడానికి సిద్ధపడి ఉన్నందునా ప్రజా పోరాటాన్ని రాజకీయంగా శాంతి చర్చల ద్వారా పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన సీ.పీ.ఎమ్. నంగనాచి కబుర్లు ప్రజల్లో నగ్నమయ్యాయి.

జనవరి 25 తెల్లవారుజామున 50 మందికిపైగా గూండాలు ఉద్యమ నాయకుడు నిర్మల్ సర్దార్ ఇంటిపై దాడి చేసి ఆయనను, అక్కడి ఛాయ్ హోటల్ దగ్గరే నిర్దాక్షిణ్యంగా హత్యచేశారు. ఆ సందర్భంగానే మరో ఉద్యమకారున్ని వారు అపహరించుకు పోయారు. ఇప్పటికి సంవత్సరం కావస్తున్నా ఆయన జాడ తెలియరాలేదు. ప్రభుత్వం మాత్రం ఆ ఘటనకు పాల్పడిన వారెవరిపై కూడా ఏ చర్యా తీసుకోలేదు. నిజానికి ఆ ఘటనలు అక్కడ ఉద్యమిస్తున్న ప్రజలకు భయం గొలిపే గుణపాఠాలుగా

ఉండాలనీ వారిని ఉద్యమ మార్గం నుండి తప్పించాలనే చేశారన్నది తెలియందెవరికి? కాని అందుకు భిన్నంగా ఆరోజు ప్రజలు వేల సంఖ్యలో సంఘటితమై హత్యకు అపహరణకు వ్యతిరేకంగా భారీ ర్యాలీ నిర్వహించి తాము ప్రభుత్వం ముందు లొంగేది లేదని తమ తలవంచని ధిక్కార రణనినాదాలు వినిపించారు. వారు అక్కడి నుండే జనవరి 28 నాడు బాంకురా, పురూలియా, పశ్చిమ మేదినీపుర్‌లలో బంద్ పాటించాలని ప్రకటించారు. ఆ రోజు బంద్ అపూర్వస్థాయిలో జరిగింది.

ప్రజలు ఇంతగా వ్యతిరేకిస్తున్నప్పటికీ ప్రభుత్వం మాత్రం దానిని రాజకీయంగా పరిష్కరించడానికి ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వడం లేదు. అది కేవలం కుహనా శాంతి భద్రతల నీతులు వల్లిస్తోంది. ప్రజలకు ఎంతమాత్రం సంబంధం లేని ఆ నీతులు పాలకులు తమ పట్టింపులనూ ప్రయోజనాలనూ నెరవేర్చుకోవడానికే తప్ప మరెందుకూ కాదనేది బహిరంగ రహస్యం. సోషల్ ఫాసిస్టుల తరహాలో ఆ అడవులలో అదాని కోసం సల్వాజుడుం అమలవుతూనే ఉన్నది. దానికి నాయకత్వం వహిస్తున్న కరుడుగట్టిన సీ.పీ.ఎమ్. నాయకుడు నందూలాల్‌ను ప్రజలు మట్టుబెట్టాక, ఇక ఆ పార్టీ గూండాలు సహ సివిల్ దుస్తుల్లో పోలీసులు ఫిబ్రవరి 2 నాడు పెద్ద సంఖ్యలో అతడి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అతడి శవయాత్రలో పాల్గొన్నవాళ్లు అక్కడ జరుగుతున్న ఒక బహిరంగ సభపై ఇష్టానుసారంగా కాల్పులు జరిపారు. ఆ కాల్పులలో రాజారం మాంజీ, లఖీరాం, గోపీనాథ్ సోరెం అసువులు బాసారు. సీ.పీ.ఎమ్. అనుసరిస్తున్న అణచివేత విధానాలతో అది చరిత్రలో ఎన్నటికీ తాను ఆశించిన లక్ష్యాలను నేరవేర్చుకోలేదన్నది ప్రజలు తమ పోరాటాల ద్వారా నిరూపించ పూనుకున్నారు. వారు మరింత తీవ్రమైన సమరశీల పోరాటాలకు ఉపక్రమించారు. వారు జల్, జంగల్, జమీన్ పై ప్రజల అధికారం సిద్ధించే వరకు తమ పోరాటం కొనసాగి తీరుతుందని ప్రకటించారు.

బహుళజాతుల కార్పొరేషన్లకు వారి దళారీల ప్రయోజనాల కోసం తలపెట్టిన ప్రత్యేక ఆర్థిక మండలిని దోపిడి ప్రభుత్వాలు ప్రజా పోరాటాలు లేకుండా ఉపసంహరించుకుంటాయని అనుకోవడం మేకలింగాల నుండి పాలు ఆశించడం లాంటిదే అవుతుంది. అందుకు అక్కడ జరిగిన సింగూర్, నందిగ్రాం ప్రజా పోరాటాలే ప్రబల నిదర్శనంగా ఉన్నాయి. ప్రజలు పోరాడి మాత్రమే తమ హక్కుల్ని సాధించుకోగలుగుతారు. అదే అందుకు తగిన రాజకీయ పరిష్కారం కాగలదు. అది తప్ప మరే ప్రత్యామ్నాయం లేదు. ఇంకే పరిష్కారమైనా అది అత్యంత కపటపూరతమైనదే అవుతుంది.

**దోపిడీ అణచివేతలకు వ్యతిరేకంగా సాగిన ప్రతిఘటన**

చరిత్రలో శతాబ్దాలుగా దగా, మోసం, వంచన, దోపిడీ, పీడనలకు గురై విసిగి వేసారిపోతున్న లాల్‌గఢ్ ప్రజలు ఒక నూతన తరహా పోరాట వెల్లువను సృష్టించారు. దేశాభివృద్ధి పేరుతో వారిని తమ జీవిక నుండి, జీవితాల నుండి దూరం చేసిన ద్రోహపూరిత చరిత్రను వారు తిరగరాయపూనుకున్నారు. ఆ వీర ప్రజల ఉనికినే సవాల్ చేస్తూ వాళ్ల సంపదలను కొల్లగొట్టే డేగ కన్నుల నిఘా ఆ అడవులను నిత్యం నీడలా వెంటాడుతూ వచ్చింది. పశ్చిమ బంగాల్‌లోని సీ.పీ.ఎమ్. వామపక్ష ప్రభుత్వం ఏ కాంగ్రెస్, భాజపాలకు మిన్నగా ఆదివాసుల హక్కులను నిరంతరం హననం చేస్తూనే వచ్చింది. నిజానికి ఆ హక్కుల హననానికి బ్రిటిష్ వారి వలస పాలనలోనే బీజాలు పడ్డాయి. వాళ్ళు ఆదివాసుల నుండి భూమి శిస్తూ వసూలు చేయడానికి తెగ పెద్దలను జాగీరుదార్లుగా ప్రకటించడం మొదలుపెట్టారు. ఆదివాసులు లేదా మూలవాసులు తమ అడవులలోనే తాము శిస్తులు చెల్లించే రైతుల స్థాయికి దిగజారారు. అప్పటి నుండే పాలకులకు ప్రజలకు మధ్య వైషమ్యాలు పొడచూపాయి. ఆదివాసులు వ్యక్తులుగా లేదా పలు ఉద్యమ సంస్థల నాయకత్వంలో తమ హక్కుల కోసం అధికారం కోసం అనేక పర్యాయాలు పోరు జెండాలు ఎగురేశారు. భారతదేశంలో తొలి బ్రిటిష్ సామ్రాజ్య వ్యతిరేక పోరాటంలో భాగంగా సిద్ధూ కానూల నాయకత్వంలో జరిగిన సాయుధ తిరుగుబాటు బ్రిటిష్ వారికి చుక్కలు చూపింది.

ఆంగ్లేయులు ఆ పోరాటం తర్వాత తమ పాశవిక చట్టాలలో కొన్ని సడలింపులు చేయక తప్పలేదు. అయితే వారి దోపిడీ మాత్రం ఇతర రూపాలలో కొనసాగుతూనే వచ్చింది. అలాగే ఆంగ్లేయుల దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలు కూడా నిరవధికంగా పోరాటాలు చేస్తూ వచ్చారు. శిస్తు చెల్లింపు, అడవులపై నుండి ఆదివాసుల అధికారాన్ని తొలగించడానికి వ్యతిరేకంగా అలాగే బ్రిటిష్ వాళ్ళు ప్రవేశపెట్టిన నూతన మహాజన్ పద్ధతితో తీవ్రమైన దోపిడీని వ్యతిరేకిస్తూ ప్రజలు పోరాడారు. శిస్తులు చెల్లించని రైతుల భూములను మహాజనులు స్వాదీనం చేసుకోసాగారు. అడవులపై పరాయివాళ్ళ అధికారం పెంపొందడంతో ఆదివాసీ ప్రజలు అనేక మోసాలకు గురవుతూ వచ్చారు. దానితో వారి నిరసన ఒకసారి టూండి, సరయికేల, కర్సావలలో పెల్లుబికితే మరోసారి పాకుడ్‌లో మాలుగుజారీ పద్ధతికి వ్యతిరేకంగా వెల్లువెత్తేది. వారి భూపోరాటాలు బిర్సా ముండా తిరుగుబాటు నుండి ప్రత్యేక ఝార్ఖండ్ ఏర్పాటు వరకు సాగుతూ వచ్చాయి. ప్రత్యేక ఝార్ఖండ్ పోరాట సందర్భంగా కూడా వారి నినాదాలు 'మహాజనులను దరోగాలను తన్ని తరుముదాం' అనేవే ప్రధానంగా వినిపించాయి. ఎందుకంటే ఈ రెండు శక్తులే వారిని తీవ్ర దోపిడికి గురిచేస్తూ వారిపై దౌర్జన్యాలకు పాల్పడుతూ వారి భూములను అటవీ ఉత్పత్తులను కొల్లగొడుతూ వచ్చాయి. ఎట్టకేలకు 2000లలో ప్రత్యేక ఝార్ఖండ్ రాష్ట్రం ఏర్పడినప్పటికీ బహుళ సంతాల్ ఆదివాసీ తెగ ప్రాంతాలైన బాంకురా, పురూలియా, మేదినీపుర్‌లను ఝార్ఖండ్‌కు బయటే బంగాల్‌కే వదిలి నూతనంగా ఝార్ఖండ్ రాష్ట్రాన్ని ఏర్పర్చి ఆ వీర

ప్రజల సంఘటిత పోరాట శక్తిని చీల్చారు. దోపిడీ పాలకులు ఎంతో దీర్ఘ దృష్టితో ఆలోచించి చేపట్టినదే ఈ చాణక్య నీతి. ఒక భౌగోళిక ప్రాంతంగా ప్రత్యేక ఝార్ఖండ్ రాష్ట్రం ఏర్పడినప్పటికీ ఆ ప్రజల జల్, జంగల్, జమీన్‌పై అధికారం కోసం పోరాటం మాత్రం వివిధ రూపాలలో సాగుతూనే ఉంది. ప్రత్యేక ఝార్ఖండ్ రాష్ట్రంలో వారి అడవులు వారికి దక్కనేలేదు. దానితో వారు గత నాలుగు దశాబ్దాలకు పైగా వాళ్ళు విప్లవకారుల నాయకత్వంలో పోరాడుతున్నారు.

పశ్చిమ బంగాల్‌లోని లాల్‌గఢ్ ప్రజలు కూడా జల్ జంగల్ జమీన్ నినాదంపైనే పోరాటానికి దిగారు. తమ పూర్వీకుల పోరాట ప్రేరణతోనే నేటి వారసులు పోరాడుతున్నారు. 1998 నుండే ఒకవైపు పీపుల్స్‌వార్ పార్టీ మరోవైపు ఎమ్.సీ.సీ. పార్టీ ఆ ఆదివాసీ ప్రజలను పోరాటమార్గంలో సుసంఘటితం చేయసాగాయి. సంపన్న దోపిడీ కార్పోరేట్ వర్గాల అభివృద్ధి నమూనాను ప్రజలు తిరస్కరించి ప్రత్యామ్నాయ ప్రజల అభివృద్ధి నమూనాను చేపట్టారు. అది అధికారంలో ఉన్న సీ.పీ.ఎమ్. పార్టీకి మింగుడు పడకుండా తయారు అయింది. ఆ ప్రజల పోరాట డిమాండ్‌లను రాజకీయంగా పరిష్కరించే బదులు మావోయిస్టులను అణచివేయడానికి ప్రభుత్వం ఒక సర్క్యులర్ విడుదల చేసింది. సీ.పీ.ఎమ్. కార్యకర్తలు పోలీస్ ఇన్ఫార్మర్‌లుగా మారారు. 2001లో సీ.పీ.ఎమ్. గూండావాహిని ఛోటా అంగూరియాలో అప్పటి పీపుల్స్‌వార్ పార్టీకి చెందిన ఐదుగురు కార్యకర్తలను సజీవంగా దహనం చేసింది. సీ.పీ.ఎమ్. కార్యకర్తలు వందలాది మోటారు సైకిళ్లపై వచ్చి గ్రామాలపై పడి దాడులు చేస్తూ ప్రజలను హింసించసాగారు. 2002లో ప్రజా ఉద్యమాన్ని అణచి వేయడానికి ప్రభుత్వం 1970ల నాటి మాదిరిగా ఈస్టర్న్ ఫ్రాంటియర్ రైఫిల్స్, రాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో పాటు ఐదు సీ.ఆర్.పీ.ఎఫ్. కంపెనీలను, 1 బీ.ఎస్.ఎఫ్. కంపెనీని అక్కడ మోహరించింది. జెనివా ఒప్పందాలకు భిన్నంగా పాఠశాలలను, పంచాయితీ కార్యాలయాలను, ఆసుపత్రులను పోలీస్ క్యాంపులుగా మార్చివేశారు. వాళ్ళు ఊళ్ళపై పడి ప్రజలను హింసించసాగారు. వాహనాలలో వచ్చి గ్రామాలను చుట్టు ముట్టేవారు. వారి దాడి ఎలా ఉండేదంటే మిడుతల దండులా వచ్చి ఊరుమీద పడే బందిపోట్లు లేదా శత్రు రాజులు ఒక ప్రాంతాన్ని ఆక్రమించుకున్న తరహాలో ఉండేది. వాళ్ళకు ఏ చట్టాలూ సామాజిక విలువలూ అడ్డు వచ్చేవి కావు. వారి దోపిడీ కోసం ప్రజలను ఎంతగానో హింసించేవారు. గ్రామాలలో గాలింపుల పేరుతో మహిళలపై పాశవిక అత్యాచారాలకు పాల్పడేవారు. వారి ఇళ్లలోని వస్తువులను కొల్లగొట్టేవారు. భూ పోరాటంలో పాల్గొన్న ప్రజలను మావోయిస్టులంటూ నిర్బంధించేవారు. 35 సంవత్సరాలు సామ్రాజ్యవాదుల దళారీ బూర్జువా భూస్వామ్య వర్గాల సేవలో తనవితీరా మునిగిన ఆ అపర మార్క్సిస్టుల రాష్ట్రంలో ఏ రైతు ఇంట్లోనైనా తప్పిపోయి లెనిన్ రచన అగుపడిందంటే ఆ రైతు అరెస్టు కాక తప్పేది కాదు. లేదా ఏ గ్రామస్థుడినైనా అరెస్టు చేయాలనుకుంటే వారే అలాంటి పుస్తకాలు సృష్టించేవారు. అరెస్టైన ప్రజలను లాకప్పులలో చిత్రహింసల కొలిమిలో ఎంతగానే వేధించేవారు. ఒక్కొక్కరిపై అనేక కేసులు మోపేవారు. నికృష్ట జైళ్లలో వాళ్ళకు యేళ్లకు యేళ్లు గడిచినా బెయిల్ మాత్రం దొరికేది కాదు. బంగాల్‌లోని దక్షిణాది జిల్లాల ప్రజలపై ఉత్తర బంగాల్ కేసులు మోపేవారు. కేసుల చుట్టూ తిరగలేక ప్రజల ఆస్తులు హరించుకపోయాయి. మరోవైపు గ్రామాలలో సీ.పీ.ఎమ్. గూండాలు వారి కుటుంబాలపై సాంఘీక బహిష్కరణ అమలు చేసేవి. వారి చౌక ధరల దుకాణాల నుండి సరుకులు అందకుండా చేశారు. వారి కుటుంబాలలోని వ్యక్తులకు ఫింఛన్‌లు దొరుకకుండా అడ్డుకున్నారు. ఆ కుటుంబాలు తాగునీటికి కటకటలాడే దుస్థితిని కల్పించారు. ఆ కుటుంబాలు ఎలాంటి దారుణ స్థితిని ఎదుర్కొన్నాయంటే వాళ్ల ఇళ్లల్లోకి పొరపాటున బంధువులు వచ్చినా పోలీసులో, గూండాలో అర్ధరాత్రో అపరాత్రో ప్రత్యక్షమై వారిని సైతం అపహరించుకుపోయి నరకయాతనలకు గురిచేసేవారు. ఆ దాడుల తీవ్రత బాంకురా, పురూలియా, పశ్చిమ మేదినీపూర్‌లలో ఎక్కువగా ఉండేది. ఎందుకంటే లాల్‌గఢ్ పోరాట మంటలు ఈ ప్రాంతాలలో గత ఉద్యమ జ్ఞాపకాలను మళ్లీ తాజాగా ప్రజల స్మృతిపథంలోకి తెచ్చాయి. వాటిని విస్తరించనీయకూడదు అన్నదే దోపిడీ భారత పాలకవర్గాలలో భాగమైన పార్లమెంటు సోషలిస్టుల పంతం. వారు సృష్టించిన సేనను 'హర్మద్‌వాహిని'గా వ్యవహరించేవారు.

కానీ నిప్పు రవ్వ దావానలాన్ని సృష్టిస్తుందన్న చందంగా ఆ వీర లాల్‌గఢ్ ప్రజలు పోలీసులను, అర్ధసైనిక బలగాలను హర్మద్‌వాహిని గూండాలను అత్యంత ధైర్య సాహసాలతో ఎదుర్కొన్నారు. ఆ పోరాట జ్వాలలు భారత భద్రతా బలగాలను సైతం దహించాయి. ఆ అగ్నికీలలలో స్థానిక పోలీసు స్టేషన్‌లు భస్మీపటలం అయ్యాయి. భద్రతా బలగాల ఆయుధాలు ప్రజల పరమయ్యాయి. ఆ ప్రజల పోరాటాలను అధికార దాహంతో తృణమూల్ కాంగ్రెస్ సమర్థిస్తోంది కానీ అదే తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో యూపీఏతో అధికారాన్ని పాలుపంచుకుంటూ దేశవ్యాపిత ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను సమర్థించడం దాని ద్వంద్వనీతిని చాటుతుంది. ఆ ప్రజా పోరాటాలు ప్రపంచానికి మరో విడుత నక్సల్బరీని గుర్తుచేస్తూ పీడిత ప్రజల నోళ్లలో అరుణారుణ లాల్‌గఢ్ ఒక ప్రాణప్రదమైన నామంగా నిలిచింది.

2011 ఏప్రిల్‌లో పశ్చిమ బంగాల్‌లో విధానసభ ఎన్నికలు జరుగనున్నాయి. తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్‌ల మధ్య పొత్తు కుదురుతుంది. ఆ ఎన్నికలకు ముందు తృణమూల్ కాంగ్రెస్ ప్రజలకు నాలుగు హామీలను విన్పిస్తోంది. అవి పాతవే. గతంలో ప్రజలు పోరాడి సాధించుకున్నవే! అర్ధ సైనిక బలగాల ఉపసంహరణ, పోలీసు క్యాంపుల ఎత్తివేత, కేసుల ఉపసంహరణ, ప్రజా సమస్యల

# "మీతో మాట్లాడే అవకాశం మళ్ళీ వస్తుందో, రాదో తెలీదు"

**(ఆనంద్ తేలుతుంబ్డే తన ప్రపంచానికి అందజేసిన బహిరంగ లేఖ)**

*14-4-2020*

భారత సుప్రీం కోర్టు ఆదేశాలపై హక్కుల కార్యకర్తలూ ప్రజాహిత మేధావులూ మిత్రులు, కామ్రేడ్స్ గౌతమ్ నవల్ఖా, ఆనంద్ తేలుతుంబ్డేలు మంగళవారం మధ్యాహ్నం (14-4-2020) ఎన్.ఐ.ఏ. ముందు హాజరయ్యారు. వీరిద్దరి అరెస్టులపై 'అమ్నెస్టి ఇండియా' కోవిడ్-19 మహమ్మారి సమయంలో కూడా భారతదేశంలో అసమ్మతి స్వరాలను అణచివేస్తున్నారు. మహమ్మారి సమయంలో భారత ప్రభుత్వం తనను విమర్శించే వారిని లక్ష్యాలుగా చేసుకుంటుంది అంటూ ఖండించింది.

"ఆనంద్ తేలుతుంబ్డే ఆంగ్లంలో రాసిన లేఖకు తెలుగు అనువాదం, గౌతమ్ నవ్లాఖా రాసిన 'స్వేచ్ఛా గీతం' క్రాంతి పాఠకుల కోసం అందిస్తున్నాం."- సం.మ.

"బీ.జే.పీ.-ఆర్.ఎస్.ఎస్.లు పథకం ప్రకారం సృష్టిస్తున్న అలజడితో పాటు వారి సేవలో నిమగ్నమైన మీడియా మధ్య నా ఈ లేఖ ఎక్కడో తప్పి మాయమవుతుందని నాకు తెలుసు, కాని నాకు మీతో మాట్లాడాలని ఉంది, ఎందుకంటే మీతో మాట్లాడే మరో అవకాశం ఇక నాకు చిక్కుతుందో లేదో తెలియదు.

2018 ఆగస్టులో పోలీసులు గోవా మేనేజ్‌మెంట్ ఇన్స్టిట్యూట్‌లో విద్యా బోధన కేంద్ర పరిసరాలలో నా ఇంటిపై దాడి జరిపారు. ఆ తరువాత నుండి నా ప్రపంచం మొత్తంగా చెదిరిపోయింది. నేను పీడకలలలో కూడా ఊహించని విధంగా నాతో వ్యవహారాలు సాగుతున్నాయి.

నన్ను ప్రసంగించడానికి వివిధ వేదికలపైకి ఆహ్వానిస్తున్న వారిని పోలీసులు అనేక రకాలుగా ప్రశ్నిస్తూ బెదిరిస్తున్న విషయం నాకు తెలుసు. వాళ్ళు నా గురించి, నా సోదరుడి గురించి చాలా పొరపాటు అవగాహనతో ఉన్నట్టుంది. నా సోదరుడు అనేక సంవత్సరాల క్రితం మా కుటుంబం నుండి దూరమయ్యాడు. ఆ రోజుల్లో నేను ఖరఘ్‌పుర్‌లో ఐ.ఐ.టి. అభ్యసిస్తున్నాను. బీ.ఎస్.ఎన్.ఎల్.కు చెందిన ఒక అధికారి నాకు ఫోన్ చేసి నా ఫోన్ కాల్స్ ట్యాప్ అవుతున్నాయనే విషయాన్ని తెలియజేశాడు. నేను ఆయనకు కృతజ్ఞతలు తెలిపాను. కాని ఆ తరువాత ఫోన్ విషయంలో మరేమి చేయలేదు. నా సిమ్ కార్డ్ కూడా మార్చలేదు.

నా ఫోన్‌లోకి పోలీసుల చొరబాటుతో నేను కొంత ఆందోళన చెందినప్పటికి నాకు నేను సముదాయించుకోని నేను ఒక సాధారణమైన వ్యక్తిననే విషయం ఈ రకంగానైన వారికి తెలుస్తుంది అనుకున్నాను. నా ఆచరణలో ఎలాంటి చట్ట వ్యతిరేకత లేదు. సాధారణంగా ప్రజల హక్కుల కోసం గొంతెత్తే వారిని పోలీసులు ఇష్టపడరు. ఎందుకంటే వాళ్ళు పోలీసుల వైఖరులను ప్రశ్నిస్తుంటారు. నేను ఆ కోవకు చెందినవాడవనే కాబట్టి నాతో వాళ్ళ వ్యవహారాన్ని నేను ఊహించుకోగలిగాను. నాకు నేను మరోసారి సముదాయించుకొని ఈ రంగంలో నేనింతకన్నా ఎక్కువగా మరేమి చేయలేనని వాళ్ళు కూడా అర్థం చేసుకుంటారని భావించాను. ఎందుకంటే నేను నా పూర్తి కాలం ఉద్యోగంలో ఎంత మాత్రం తీరిక లేకుండా ఉంటాను.

మా ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ పొద్దు పొద్దున్నే ఫోన్ చేసి పోలీసులు కాలనీ పరిసరాలలో దాడులు చేస్తూ నాకోసం వెతుకుతున్నారనే విషయాన్ని తెలిపాడు. దాంతో కొద్ది క్షణాలు నేను అవాక్కాయి పోయాను. కొద్ది గంటల ముందే గోవా నుండి ఆఫీసు పనిపై నేను ముంబాయి చేరుకున్నాను. అప్పటికే నా భార్య అక్కడికి చేరుకుంది. అదే రోజు మరెంతో మంది ఇళ్ళపై దాడులు చేసి వారిని అరెస్టు చేసిన సమాచారం తెలవడంతో నేను ఆందోళన చెందాను. నేను అదృష్టం కొద్ది తప్పుకోగలిగాననుకున్నాను.

నేనెక్కడున్నానో పోలీసులకు స్పష్టంగా తెలుసు. వాళ్ళు నన్ను అరెస్టు చేయగలుగుతారు. కాని అలా ఎందుకు చేయలేదో వాళ్ళే చెప్పాలి. వాళ్ళు నా సెక్యూరిటి గార్డు నుండి బలవంతంగా డూప్లికేట్ తాళం చెవి తీసుకొని మా ఇంట్లోకి వెళ్ళి వీడియో చిత్రీకరణ చేసి ఇంటికి మళ్ళీ తాళం వేసారు. ఇక అప్పటి నుండి మాకు కష్టాలు మొదలయ్యాయి.

మరో విమానంలో నా సహచరి గోవా చేరుకొని న్యాయవాదుల సలహాతో అక్కడి బిబోలిం పోలీస్ స్టేషన్లో మా ఇంట్లో మేమిద్దరము లేని సమయంలో పోలీసులు చొరబడ్డారు. అక్కడ వాళ్ళు ఏదైన పెట్టి ఉంటే దానికి మేమెంత మాత్రం బాధ్యులం కామని ఫిర్యాదు

---

పరిష్కారం. ఆ హామీలతో ఓట్లు దండుకొని అధికారాన్ని హస్తగతం చేసుకున్న తృణమూల్ కాంగ్రెస్ ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేదు సరికదా అన్ని బూర్జువా పార్టీల లాగానే అది తన పాలనను కొనసాగిస్తోంది. మార్క్సిస్టుల హర్మద్ వాహిని స్థానంలో తృణమూల్ భైరవ వాహినిని ముందుకుతెచ్చింది. ప్రజలపై పోలీసుదాడులు కొనసాగుతునే ఉన్నాయి. వారి ప్రజా ఉద్యమాల సమర్థన ఓట్లు దండుకునే వరకేనని రుజువైంది. కాబట్టి ప్రజలు తమ మార్గాన తాము విప్లవించడం మినహా ఏ బూర్జువా పార్టీలు, బూర్జువా చట్టాలు వారిని ఉద్ధరించవనే లాల్‌గఢ్ ప్రజావెల్లువ మనకు నేర్పుతుంది.

(ఈ రిపోర్టు లాల్‌గఢ్ ఉద్యమ నిర్మాత, భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్రకమిటీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అమరుడు కామ్రేడ్ కిషన్‌జీ దండకారణ్య కేడర్లకు 2011 జనవరిలో వివరించాడు. కామ్రేడ్ కిషన్‌జీ 2011 నవంబర్ 24 నాడు పశ్చిమబంగాల్ శాల్బోనీ అడవులలో బూటకపు ఎన్‌కౌంటర్‌లో అసువులు బాసాడు) ★

చేసింది. వాళ్లు అవసరమైతే మరిన్ని వివరాలు తెలుసుకోవడానికి తన ఫోన్ నంబరు కూడా వారికి ఇచ్చింది.

పోలీసులు చాలా ముందు నుండే ఎంతో విచిత్రంగా మావోయిస్టుల కథలను ప్రెస్ కాన్ఫరెన్సులలో వినిపించడం మొదలుబెట్టారు. నా గురించి అలాగే అరెస్టైన ఇతరుల గురించి ప్రజలలో వ్యతిరేక అభిప్రాయాలను సృష్టించడమే వారి లక్ష్యమన్నది సుస్పష్టం. అందుకు మీడియా వారికెంతగానో సహకరిస్తూ వచ్చింది. 2018 ఆగస్టు 31నాడు పోలీసులు నిర్వహించిన ఒక ప్రెస్ కాన్ఫరెన్సులో వాళ్లొక పత్రాన్ని చదివారు. అది వాళ్ళకు వారు అరెస్టు చేసిన ఒక వ్యక్తి కంప్యూటర్‌లో నుండి దొరికిందని చెప్పారు. ఆ పత్రాన్ని నాకు వ్యతిరేక సాక్ష్యంగా వాళ్లు చూపుతున్నారు. ఆ పత్రంలో వాళ్ళు ఒక అకడమిక్ కాన్ఫరెన్స్ జరిగిందనీ అందులో నేను పాల్గొన్నాననే విషయం ఉందని అంత అస్తవ్యస్తంగా తెలిపారు. ఈ విషయం అమెరికన్ యూనివర్సిటీ ఆఫ్ ప్యారిస్ వెబ్‌సైట్ పై సులువుగానే లభిస్తుంది.

ఈ విషయంపై మొదట్లో నేను చాలా నవ్వుకున్నాను. తర్వాత సదరు పోలీసు అధికారిపై పరువు నష్టం దావా వేయాలని నిర్ణయించుకున్నాను. 2018 సెప్టెంబర్ 5నాడు నేను ఒక లేఖ ద్వారా మహారాష్ట్ర ప్రభుత్వానికి తెలిపాను. కాని ఇప్పటి వరకు ఆ ప్రభుత్వం నుండి నాకు ఎలాంటి జవాబు లేదు. తర్వాత హైకోర్టు జోక్యం చేసుకోవడంతో పోలీసుల ప్రెస్ కాన్ఫరెన్సుల నిర్వహణ నిలిచిపోయింది.

పుణే పోలీసులు చట్ట రహితంగా నన్ను నిర్బంధించినపుడు నేను సుప్రీం కోర్టు బేయిల్‌పై ఉన్నాను. హిందుత్వ శక్తుల సైబర్ ముఠా నా వికీ మీడియా పేజ్‌తో పరిహాసాలు ఆడారు. వాస్తవంగా ఇదొక బహిరంగ పేజే కాని చాలా కాలం వరకు నాకు దాని గురించి తెలీదు. అందులో నా గురించి రాసిన సమాచారాన్నంతా ముందుగా వాళ్ళు చెరిపేసారు. ఆ తరువాత "ఇతనికి ఒక మావోయిస్టు సోదరుడు ఉన్నాడు. ఇతని ఇంటిపై దాడి చేసారు. ఈయనకు మావోయిస్టులతో సంబంధాలు ఉండడంతో అరెస్టు చేసారు" మున్నగు విషయాలు ఆ పేజీలో చేర్చారు. నా విద్యార్థులు ఎన్ని సార్లో ఆ పేజీని సరిదిద్దడానికి ప్రయత్నించిన్పటికీ లేదా ఎడిట్ చేయడానికి పూనుకున్నప్పటికీ ఆ ముఠా మళ్ళీ ప్రత్యక్షమై వాటిని డిలిట్ చేసి ఆ పేజీపై అవమానకర విషయాల్ని ఎక్కించేవారు అని ఆ విద్యార్థుల ద్వారానే నాకు తెలిసింది. చివరికి వికీ మీడియా జోక్యం చేసుకొని కొన్ని తన నకారాత్మక వ్యాఖ్యానాలతో ఎదో ఓరకంగా దానిని నిలిపివేసింది.

ఆ తరువాత మీడియా వారి దాడులు మొదలయ్యాయి. నక్సల్ వ్యవహారాలలో ప్రబుద్ధులం అనుకునే ఆర్.ఎస్.ఎస్.కు చెందిన వారు తమ అనర్గలత్వాన్ని చాటుకోసాగారు. నేను ఈ విషయాన్ని ఇండియా బ్రాడ్‌కాస్టింగ్ ఫౌండేషన్ ముందు మొరబెట్టుకున్నాను. కాని నాకు లేశ మాత్రమైన జవాబు దాని నుండి రాలేదు.

2019 అక్టోబరులో పెగాసస్‌తొ ముడిబడిన సమాచారం నా ఫోన్‌లో ఏదో ప్రమాదకరమైన ఇజ్రాయిలీ స్పైవేర్‌ను వేశారన్న విషయం బయటపడింది. దీనిపై కాసేపు మీడియాలో ఎంతో హంగామా చోటు చేసుకుంది. కాని ఇంతటి సీరియస్ విషయం కూడా తన దారిన అది చచ్చిపోయింది. ఎందుకంటే నేను నిజాయితీగా జీవికను కొనసాగిస్తున్న ఒక సాధారణ వ్యక్తిని. నాకు తెలిసిన దానిని నా రచనల ద్వారా ప్రజలకు తెలుపడానికి ప్రయత్నిస్తున్నాను.

నా ఐదు దశాబ్దాల జీవితం మచ్చ లేనిది. కార్పొరేట్ ప్రపంచంలో నేనొక ఉపాధ్యాయుడిగా, పౌరహక్కుల కార్యకర్తగా, బుద్ధిజీవిగా వేరు వేరు పాత్రలలో ఈ దేశానికి సేవ చేశాను. నా రచనల సూచి చాలా పెద్దది. నేను ముప్పైకి పైగా పుస్తకాలు రాశాను. అనేక పరిశోధక పత్రాలు, వ్యాసాలు, కాలమ్స్, ఇంటర్వ్యూలు అంతర్జాతీయంగా ముద్రించబడ్డాయి. వాటిలో ఎక్కడా నేను హింస, విధ్వంసాన్ని సమర్థించిన దాఖలాలు ఉండవు.

నా జీవిత చరమాంకంలో అత్యంత పాశవికమైన ఊపా చట్టం కింద నాపై తీవ్రమైన నేరారోపణలను చేస్తున్నారు. నాలాంటి వాళ్ళెవరైనా ప్రభుత్వ ప్రచారాన్ని, దానికి సేవ చేసే మీడియాను ఎదిరించలేరు. ఈ విషయంపై అంతర్జాలంలో కావల్సినంత సమాచారం దొరుకుతుంది. దాంతో ఎవరైనా ఈ ఆరోపణలు బూటకమైనవనీ, చిత్తానుసారం మోపబడినాయనీ సూనాయాసంగానే తెలుసుకుంటారు. ఏ.ఐ.ఎఫ్.ఆర్.టీ.ఈ. వెబ్‌సైట్ పై ఈ కేసుకు సంబంధించిన సమాచారాన్ని చదువుకోవచ్చు.

మీ కోసం నేను దాన్ని దిగువ రాస్తున్నాను. పోలీసులు ఐదు లేఖలను ఆధారం చేసుకొని ఈ కేసును సృష్టించారు. ఈ లేఖలు వాళ్ళకు అరెస్టైన ఇద్దరి కంప్యూటర్ల నుండి దొరికాయన్నారు. ఇలాంటివి పదమూడు ఉత్తరాలు దొరికినట్టు చెబుతున్నారు. కాని నా దగ్గర మాత్రం వాళ్ళకు ఏమీ దొరకలేదు. ఆ ఉత్తరాలలో 'ఆనంద్' అనే పేరు ఉంటుంది. ఆ పేరు భారతదేశంలో అత్యంత సామాన్యమైనది, కానీ పోలీసులు ఎలాంటి సందేహాలకు ప్రశ్నకు తావివ్వకుండా ఆ ఆనంద్‌తో పేరుతో నన్ను గుర్తిస్తున్నారు.

ఆ పత్రాలు ఎలా ఉన్నప్పటికి వాటిలో ఏమి రాసినప్పటికి విజ్ఞులు వాటిని ఖండించారు. వారిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి సైతం ఉన్నారు. మొత్తంగా న్యాయ వ్యవస్థలోనే సాక్ష్యాధారాలపై దృష్టి నిలిపింది ఆయన ఒక్కడే! ఆ ఉత్తరాలలో సాధారణ నేరంతోనైన ముడిపెట్టే అంశం అందులో ఏ ఒక్కటీ లేదు కాని పాశవిక యూ.ఏ.పీ.ఏ. చట్టం ముసుగులో తమను తాము కాపాడుకోవడానికి ఏ అవకాశం లేనివన్నీ చేస్తున్నారు. నన్ను జైలుకు పంపిస్తున్నారు.

మీరు నా కేసును ఈ రకంగా అర్థం చేసుకోవచ్చు. హఠాత్తుగా మీ ఇంటికొక పోలీస్ బ్యాచ్ వస్తుంది. ఎలాంటి వారెంట్ లేకుండానే మీ ఇంటిని చిందరవందర చేసేస్తుంది. తుదకు మిమ్మల్ని అరెస్టు చేసి పోలీస్ లాకప్‌లో నిర్బంధిస్తుంది. ఏదో దొంగతనం కేసు

*(మిగతాది **32**వ పేజీలో...)*

# గౌతమ్ నవ్లాఖా రాసిన 'స్వేచ్ఛా గీతం'

ఢిల్లీలోని ఎన్‌ఐఎ ప్రధాన కార్యాలయంలో సరెండర్ అవడానికి వెళ్లబోతూ, ఈ వారం బైట గడపడానికి, నాకొక వారం స్వేచ్ఛ ఇవ్వడానికి ఏప్రిల్ 8న జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ ఇందిరా బెనర్జీ ఇచ్చిన తీర్పుకు సంతోషపడుతున్నాను. ఇప్పుడు నేనున్న పరిస్థితుల్లో, ఈ లాక్‌డౌన్ సమయంలో కూడ, ఒక వారం రోజుల స్వేచ్ఛ అంటే చాల విలువైనది. ముంబాయిలోని ఎన్‌ఐఎ కార్యాలయంలో ఏప్రిల్ 6న నేను సరెండర్ కావాలని, దేశంలోని అత్యున్నత న్యాయస్థానం మార్చ్ 16న ఇచ్చిన ఉత్తర్వులను పాటించే దుస్థితిని ఎలా ఎదుర్కోవాలా అని నేను మథన పడుతున్నప్పుడు ఈ వారం రోజుల పొడిగింపు ఉత్తర్వు వచ్చింది. పాత సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం నేను ముంబాయి వెళదామనుకున్నా లాక్‌డౌన్ వల్ల ప్రయాణ సౌకర్యాలు లేవు. అటువంటి పరిస్థితుల్లో నేను ఏం చేయవలసి ఉంటుందో ఎన్‌ఐఎ ముంబాయి నుంచి ఎటువంటి ఉత్తర్వులూ రాలేదు. ఇప్పుడు నేను ఢిల్లీలోని ఎన్‌ఐఎ ప్రధాన కార్యాలయంలో సరెండర్ కావచ్చునని స్పష్టత వచ్చింది.

కొవిడ్ 19 మహమ్మారి మనకు విసిరిన సవాలును భారత ప్రధాన మంత్రి "జాతీయ అత్యవసర పరిస్థితి"గా అభివర్ణించారు. ఈలోగా, సర్వోన్నత న్యాయస్థానం కూడ ఇటీవలనే జైలు పరిస్థితుల విషయంలో జోక్యం చేసుకుని కిక్కిరిసిన జైళ్లలో ఖైదీలకూ, నిర్బంధితులకూ, జైలు సిబ్బందికీ, జైలు బాధ్యతల్లో ఉన్న ఇతరులకూ రానున్న ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకుని, అనుసరించవలసిన మార్గదర్శక సూత్రాలను ఇచ్చింది.

ఆ ప్రమాదం అలాగే ఉన్నప్పటికీ, జైళ్లలో కొవిడ్ 19 అంటువ్యాధి సోకిన సమాచారమేదీ ఇప్పటికి రాలేదు గనుక నాకు కాస్త ఊరట ఉంది. కాని కొవిడ్ 19 మధ్యలో నేను బందీగా ఉంటే ఏమవుతుందో అని నా ఆత్మీయులూ సన్నిహితులూ అనుభవిస్తున్న భయం నన్ను కూడ ప్రభావితం చేస్తున్నది.

కాని నిరాశ పడడం తప్ప నేను చేయగలిగిందేమీ లేదు. ఎందుకంటే, భారతదేశంలో మనందరినీ, ప్రపంచాన్నంతా ఆ మహమ్మారి చుట్టుముట్టినప్పటికీ, ఏప్రిల్ 8న సుప్రీంకోర్టు ఇచ్చిన క్లుప్తమైన ఆదేశంలో కొవిడ్ 19 మహమ్మారి గురించి మాట కూడ మాట్లాడలేదు.

ఏది ఏమైనా, నేనిప్పుడు వాస్తవ చట్ట ప్రక్రియను ఎదుర్కోవడం మొదలు పెట్టవలసి ఉంది. అంటే చట్టవ్యతిరేక కార్యకలాపాల (నిరోధ) చట్టం–యుఎపిఎ–నిబంధనలను ఎదుర్కోవలసి ఉంది. అటువంటి చట్టాలు సాధారణ చట్ట ప్రక్రియనూ, న్యాయ శాస్త్రాన్నీ తలకిందులు చేస్తాయి. 'నేరస్తుడిగా రుజువయ్యేవరకూ ఒక వ్యక్తిని నిర్దోషిగానే భావించాలి' అనే సాధారణ న్యాయ సూత్రం ఇంకెంత మాత్రమూ వర్తించదు. ఇటువంటి చట్టాల ప్రకారం, "నిర్దోషిగా తేలేంతవరకూ ప్రతి నిందితుడూ నేరస్తుడే."

యుఎపిఎలో అత్యంత కఠినమైన శిక్షలు విధించే దుర్మార్గమైన నిబంధనలున్నాయి గాని, సాక్ష్యాధారాల విషయంలో, ప్రత్యేకించి ఎలక్ట్రానిక్ సాక్ష్యాధారాల విషయంలో అనుసరించే పద్ధతులు మాత్రం అంతే కఠినంగా, కచ్చితంగా లేవు. మామూలుగా ఏ న్యాయ విచారణలోనైనా సాక్ష్యాధారాల విషయంలో కఠినంగా, కచ్చితంగా ఉండే పద్ధతులను, ఈ చట్టాల కింద మాత్రం ఎటుపడితే అటు సాగదీయగలిగేలా మార్చారు. ఇటువంటి రెండంచెల దాడి వల్ల, జైలే సాధారణమూ, బెయిల్ మినహాయింపూ అవుతుంది. ఈ అధివాస్తవిక ప్రపంచంలో విచారణా ప్రక్రియే శిక్ష అవుతుంది.

ఇప్పుడిక నాకూ నా సహనిందితులకూ వేగవంతమైన, న్యాయమైన విచారణ అందుతుందనే ఆశ మాత్రమే మిగిలింది. అటువంటి వేగవంతమైన, న్యాయమైన విచారణ జరిగినప్పుడు మాత్రమే ఇందులో నుంచి నా పేరు తొలగించుకోవడానికీ, మళ్లీ స్వేచ్ఛగా బైట తిరగడానికీ వీలవుతుంది. ఈలోగా నేనింతకాలం చేసుకున్న అలవాట్లను తొలగించుకోవడానికి జైలు జీవితం వీలు కల్పిస్తుంది.

అలా బైటికి వచ్చినప్పుడు మళ్లీ కలుద్దాం.
అప్పటివరకూ బాబ్ మోర్లే పాడినట్టుగా,
"మీరు నాకొక సాయం చేయరూ...
నేనీ స్వేచ్ఛాగీతాలు పాడడానికి
సాయం చేయరూ...
ఎందుకంటే
నేనింతదాకా చేసినది
విముక్తి గీతాలు పాడడమే
విముక్తి గీతాలు...
స్వేచ్ఛా గీతాలు...

మీ
గౌతమ్ నవ్లాఖా
ఏప్రిల్ 14, 2020
న్యూ ఢిల్లీ

★

# గెరిల్లా ప్రాంతాలలో పోరాటం మరియు ఆర్గనైజేషన్ పద్ధతులు

చెన్-యున్

14 సెప్టెంబర్, 1934

శత్రువు దురాక్రమించిన అనేక ప్రాంతాలలో ఇప్పటికీ పెద్ద ఎత్తున వాస్తవమైన గెరిల్లా యుద్ధమేదీ జరగలేదు. ఈ ప్రాంతాలలోకి గెరిల్లా యూనిట్లు ప్రవేశించినా, వాటి శ్రేణులు తిరిగిపోతూ, అవి తరచుగా సోవియట్ ప్రాంతాలకు వెనుకంజ వేస్తున్నాయి. అక్కడే వుండిపోయిన యూనిట్లు పెద్ద ఎత్తున గెరిల్లా యుద్ధంలో ప్రాంతీయ ప్రజలను కదిలించడంలో విఫలమయ్యాయి. ఆక్రమిత ప్రాంతాల్లో కొంతమంది పార్టీ సభ్యులున్నప్పటికీ, వారిలో కొందరు వంటరిగానైనా శత్రువుతో పట్టుదలగా పోరాడుతున్నారు; అయితే, వారిని ఆర్గనైజ్ చేయడానికి, లేదా మార్గదర్శకత్వం అందించడానికి ఏ పార్టీ ఆర్గనైజేషన్ కూడా లేదు. సాధారణంగా చెప్పాలంటే, ఆక్రమిత ప్రాంతాల్లోని గెరిల్లాలు, పార్టీ ఆర్గనైజేషన్ల చర్యలు పురోగమిస్తున్న శత్రువుకు అధిగమించరాని ఇబ్బందులనేమీ కలిగించడం లేదు; శత్రువును తమ మార్గంలోకి ఆకర్షించడంగానీ, లేదా, తప్పనిసరిగా చేయాల్సినట్టుగా శత్రువు పురోగమనాన్ని అడ్డుకోవడంగానీ చేయడం లేదు.

ఈ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున గెరిల్లా యుద్ధాన్ని అభివృద్ధి చేయడంలో గల వైఫల్యాలకు కారణాలేమిటి?

మొదటిది. గెరిల్లా యుద్ధతంత్రానికి గల ప్రాముఖ్యతను తగినంతగా పార్టీలోనే అవగాహన చేసుకోలేదు. ఆ యుద్ధాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేయడం పార్టీకి అత్యున్నత కర్తవ్యమనేది సాధారణంగా గ్రహించబడలేదు. శత్రువు ఆక్రమించిన ప్రాంతాల్లో పనులను వదిలించుకొనే ధోరణి ఇంకా వుంది. డైయింగ్ కౌంటీలో నాలుగు టౌన్‌షిప్‌లను తప్ప మిగతా ప్రాంతాన్నంతా శత్రువు ఆక్రమించుకున్నాడు. కానీ, కౌంటీ మరియు జిల్లా పార్టీ కమిటీలు ఆక్రమిత ప్రాంతాల్లో గెరిల్లా యుద్ధాన్ని చేయడానికి బదులుగా, కార్మికులు-పార్టీ సభ్యులు-కాందిశీకులు-జిల్లా కేంద్రం స్టాఫ్-సాయుధ యూనిట్లను ఆ నాలుగు టౌన్‌షిప్‌లకు తరలించారు. అనేక యుద్ధ క్షేత్రాలలో పార్టీ సంస్థలు నిష్క్రియాపరంగా మిగిలి, గెరిల్లా యుద్ధానికి ప్రజలను చురుకుగా సాయుధం చేయడానికి బదులు, రక్షణ సాధనాలకు బలం చేకూర్చుకుని శత్రువు నుండి వస్తు సామాగ్రిని దాచివేయడానికి మాత్రమే పరిమితమయ్యాయి. ఆక్రమిత ప్రాంతాల్లో అవి పోరాటంలో గెరిల్లాలకు చురుకుగా నాయకత్వం వహించడం లేదు. వాటిలో కొన్ని 'ఇంటెలిజన్స్ టీమ్'గా తమను తాము దిగజార్చుకున్నాయి. మిగతావి, రోడ్లనూ, రక్షణ దుర్గాల (ఫోర్టిఫికేషన్సు)ను నిర్మించడానికి, కొమింగ్‌టాంగ్ చేసే ప్రయత్నాలను ప్రతిఘటించే ప్రాంతీయ ప్రజలకు నాయకత్వం వహించాయి గాని, అవి గూడా 'మాకు తిండి-జీతాలు ఇవ్వండి' అనే నినాదానికి మాత్రమే పరిమితమైనాయి. శత్రువుకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం జరపడమటుంచి, శత్రువు తాత్కాలిక రక్షణ కట్టడాలను (బ్లాక్ హౌసెస్) నిర్మించకుండా నిరోధించడానికి విధ్వంసాలు, కూల్చివేతలు వంటి చర్యలకు ప్రజలు పూనుకొనేలా వారిని పురికొల్పలేదు.

అన్ని పార్టీ సంస్థలు గెరిల్లా యుద్ధతంత్రాన్ని అభివృద్ధి చేయడానికి గల ప్రాముఖ్యతను తప్పనిసరిగా అర్థం చేసుకోవాలి. ఇది ప్రస్తుతం పార్టీకి అత్యున్నత కర్తవ్యంగా వున్నదనీ, ఎర్రసైన్యం ప్రధాన బలగాల విజయానికి అనివార్యమైన నియమమనీ భావించాలి. విస్తృత గెరిల్లా యుద్ధాన్ని నడపడం ద్వారా శత్రువు పురోగమనాన్ని నిలువరించి, సోవియట్ ప్రాంతాలను రక్షించుకోగలం. శత్రువు వెనుకతట్టు ప్రాంతంలో సాయుధ పోరాటం కొనసాగించటం ద్వారా మనం నూతన సోవియట్ ప్రాంతాలనూ, నూతన ఎర్రసైన్యం యూనిట్లను సృష్టించుకోగలం. ఈ విషయంలో పార్టీకి గల సరియైన విధానాన్ని అన్ని పార్టీ సంస్థలు మరియు సభ్యులు సంపూర్ణంగా అవగాహన చేసుకున్నప్పుడే, గెరిల్లా యుద్ధాన్ని చిన్నచూపు చూడడం, గెరిల్లా ప్రాంతాల్లో పని వదులుకోవడం వంటి తప్పులను చేయకుండా వుండడం సాధ్యమౌతుంది.

పెద్ద ఎత్తున గెరిల్లా యుద్ధాన్ని చేయాలంచే మనం చేయాల్సినవి ఇవి: 1. ఇప్పుడున్న గెరిల్లా యూనిట్లలో రాజకీయ విద్యను, మిలటరీ శిక్షణను మరింత పెంచి, రాజకీయంగా అత్యంత ఆధారపడదగిన కేడర్లను పార్టీ శాఖలను అభివృద్ధి చేయడానికి పంపించి, ఆ యూనిట్లలో పార్టీ నాయకత్వానికి బలం చేకూర్చాలి. తద్వారా అవి పార్టీ పంథాను దృఢంగా అనుసరించి, ప్రజల పాత్రతో గెరిల్లా యుద్ధాన్ని అభివృద్ధి చేసేలా చూడాలి. 2. రెడ్‌గార్డ్స్, యంగ్‌పయోనీర్ బృందాలపై పార్టీ నాయకత్వానికి బలం చేకూర్చాలి, ఇందుకుగాను, వీటిలో ఆదర్శంగా వున్న వాటితో మొదలుపెట్టి, నూతన పార్టీ శాఖలను నెలకొల్పి ఇప్పటికే వున్న సంస్థలను అభివృద్ధి చేయడానికిగాను కేడర్లను పంపాలి; తద్వారా ఈ బృందాలను, వీటిలో కూడా ఆదర్శంగా వున్న బృందాలను, శత్రు ఆక్రమిత ప్రాంతాల్లోకి చొచ్చుకుపోయి అక్కడే పనిచేస్తూ, రంగంలోకి దూకడానికి సర్వదా సిద్ధంగా వున్న ప్రాంతీయ గెరిల్లా యూనిట్లుగా తీర్చిదిద్దాలి. 3. రెడ్‌గార్డ్-యంగ్-పయోనీర్ బృందాలు ఇంకా పూర్తిగా ఆర్గనైజ్ కాకున్నా గెరిల్లా టీములు ఇప్పటికే వునికిలోకి వచ్చినచోట, ఆ బృందాలలోనే ప్లాటూను స్క్వాడ్లను నిర్మించి, అవి గెరిల్లా యుద్ధంలో ఆ బృందాలకు నాయకత్వం వహించేలా చేయడానికి ఆ టీములను ప్రోత్సహించాలి.

ప్రజలను కదిలించి, సాయుధ పోరులోనూ ఇతర అన్ని పోరాట రూపాలలోనూ వారికి నాయకత్వం వహించడంలో గెరిల్లాలు చేసే ప్రయత్నాల పైనే గెరిల్లా యుద్ధం జయప్రదంగా అభివృద్ధి చెందడం ఆధారపడి వుంటుంది. ఆక్రమిత ప్రాంతాల్లోని కొన్ని గెరిల్లా యూనిట్లు ప్రజా స్వభావం కలిగిన గెరిల్లా యుద్ధాన్ని అభివృద్ధి చేయడంలోనూ, బలమైన పట్టు సంపాదించడంలోనూ, కనీసం తిండి సంపాదించడంలోనూ విఫలమై, ఆ విధంగా ఓడిపోయారు. దీనికి కారణమేమిటంటే, వారు ప్రజలను కదిలించి వారి మద్దతును పొందలేక పోయారు.

ఆక్రమిత ప్రాంతాలలో పార్టీ సంస్థలు-గెరిల్లా యూనిట్లు ప్రజల నుండి దూరం కావడాన్ని అధిగమించాలంటే, ప్రజల బలాన్ని అనుమానించే ఎలాంటి ధోరణితోనైనా మనం పోరాడాలి; కొమింగ్‌టాంగ్- భూస్వామ్య వర్గాలకు వ్యతిరేకంగా నిర్ణయాత్మక పోరాటం చేయడంలో, ప్రజలకు నాయకత్వం వహించగలిగే మన సామర్థ్యాన్ని అనుమానించే ఎలాంటి ధోరణితోనైనా మనం పోరాడాలి. ప్రజలను చర్యలకు పురికొల్పడంలో, కేంద్ర సోవియట్ ప్రాంతాల్లో వినియోగించే పద్ధతులనే ఆక్రమిత ప్రాంతాల్లో కూడా యాంత్రికంగా మరియు వివిధ కాలాల్లో వుండే వేరు వేరు పరిస్థితులను మనం గుర్తించి, ఆయా పరిస్థితులకు తగిన విధంగా పని పద్ధతులను మలచుకోవాలి. ప్రాంతీయ ప్రజల తక్షణ డిమాండ్లను మనం వాస్తవంగా అర్థం చేసుకొని, వారు ఆమోదించి వాటి కొరకు చిత్రీకరించడానికి ఉపయోగపడేలా వున్న ఒక నిర్దిష్టమైన ఉదాహరణ చూడండి. శత్రు దాడులు జరుగుతూ వుండగానే కేంద్ర సోవియట్ ప్రాంతాలలో జీవిస్తున్న ప్రజలు ఆ ప్రాంతాన్ని రక్షించాలని అర్జెంటుగా కోరారు. అందుకోసం మనం, ప్రజలు ఆయుధాలను పట్టాలనీ, ధాన్యాన్ని పొదుపు చేయాలనీ, దాన్ని ఎర్రసైన్యానికి అప్పుగా ఇవ్వాలనీ, ఆయుధాలను, సప్లైలను కొనడానికి డబ్బు డొనేట్ చేయాలని 'సమస్తమూ యుద్ధరంగంలో విజయానికే' అని పిలుపునిచ్చాం. పార్టీ ఇచ్చిన ఈ నినాదాలు ప్రజలందరి హృదయాలను సరిగ్గా అతుక్కున్నాయి కాబట్టి, ఒక్క మే,జూన్ నెలల్లోనే 63,000 మంది నూతనంగా సాయుధ రిక్రూట్‌లు సరిహద్దుకు బయలుదేరారు; సోవియట్ ప్రాంతం మొత్తంపైన ధాన్యాన్ని పొదుపుచేసి ఎర్రసైన్యానికి అప్పుగా మరియు విరాళంగా ఇచ్చే ఉద్యమం బ్రహ్మాండమైన విజయం సాధించింది. కానీ, ఆక్రమిత ప్రాంతంలో పరిస్థితి పూర్తి భిన్నంగా వుంది. అక్కడ ప్రజల అత్యవసర డిమాండ్ కొమింగ్‌టాంగ్ తెల్ల సైన్యం అమలు చేస్తున్న హత్యలు-మానభంగాలు-లూటీలనూ, భూస్వాములు అమలు చేస్తున్న భరించరాని అణచివేత-దోపిడీలనూ వ్యతిరేకించడం, ఉదాహరణకు, ఈ భూస్వాములు కౌళ్ళు-అప్పులను చెల్లించాలని ప్రజలపై ఒత్తిడి తెచ్చి, చెల్లించలేని వారి పశువులను, పందులను జప్తు చేసుకుంటున్నారు.

ఇలాంటి పరిస్థితులున్న చోట కూడా ఎర్రసైన్యం మరియు గెరిల్లా యూనిట్లతో చేరడానికీ, అలాగే కొమింగ్‌టాంగ్ పాలనను కూల్చి సోవియట్ పాలనను పునఃస్థాపించడం అనే అంతిమ లక్ష్యం కోసం ధాన్యాన్ని డొనేట్ చేయానికీ మనం ప్రజలను కదిలించాల్సిన అవసరం వుంది. అయితే, మనం ప్రజల అత్యవసర డిమాండ్లకు ప్రాతినిధ్యం వహించే నినాదాలను ఇవ్వకుండా కేంద్ర సోవియట్ ప్రాంతంలో చేసినట్టుగా కేవలం 'ఎర్ర సైన్యాన్ని విస్తరించే ఉద్యమం లేదా 'ధాన్యాన్ని అప్పుగా ఇచ్చే ఉద్యమం వంటివి యాంత్రికంగా మొదలుపెడితే, మనం మన లక్ష్యాన్ని నెరవేర్చలేం, ప్రజలను మేల్కొలపలేం; రాజకీయంగా ఇంకా చైతన్యవంతులుగా లేని వారిని అసలే మేల్కొలపలేం. యాంగ్‌డింగ్ గెరిల్లా ప్రాంతంలో ఇదే జరిగింది. అక్కడి కౌంటీ పార్టీ కమిటీ మరియు గెరిల్లాలు చాలా కాలం వరకు పోరాటాన్ని కొనసాగించి, కేంద్ర సోవియట్ ప్రాంతంలో చేసినట్టుగానే 'ఎర్ర సైన్యాన్ని విస్తరించే ఉద్యమాన్ని' శక్తివంతంగా ప్రారంభించినప్పటికీ, మూడు నెలల్లో వారు రిక్రూట్ చేసుకోగలిగింది కేవలం ఎనిమిదిమందినే. ప్రాంతీయ పరిస్థితులకు అనుగుణంగా ప్రజలను కదిలించే తమ పద్ధతులను మలచుకోవడంలో వారు వైఫల్యం చెందడమే వారి ప్రయత్నాలన్నీ నిష్ఫలం కావడానికి గల కారణం.

ఆక్రమిత ప్రాంతాల్లో పెద్ద ఎత్తున గెరిల్లా యుద్ధం అభివృద్ధి చెందక పోవడానికి గల రెండవ కారణం, ఆర్గనైజేషనల్ పనిలోనూ నాయకత్వంలోనూ తీవ్రమైన పొరపాట్లు జరుగుతూ వుండడం. మొదటి విషయమేమిటంటే, వివిధ వాడల్లో గల పార్టీ సంస్థలు ఆక్రమిత ప్రాంతాల్లో నాయకత్వ స్థానాలకు అత్యంత సామర్థ్యం కలిగి అన్ని విధాలా తగిన వారిని కేటాయించలేదు. రెండవది, యుద్ధక్షేత్రాలలో పార్టీ సంస్థలు నెలకొల్పిన అజ్ఞాత పార్టీ శాఖలు ప్రజలతో కలిసిపోకుండా వుండడమేగాక, వారినుండి వేరుబడిపోయాయి కూడా. చివరగా, ప్రతి ఆక్రమిత ప్రాంతంలోనూ కేంద్రీకృత హెడ్‌క్వార్టర్‌లను స్థాపించలేదు. ఈ పొరపాట్లన్నీ ఆక్రమిత ప్రాంతాల్లో ప్రజలను మేల్కొల్పడంలో పార్టీ ప్రయత్నాలకు ప్రతిబంధకాలయ్యాయి; తత్కారణంగా గెరిల్లా బలగాలు వేరుబడిపోయి, ప్రజల మద్దతులేనందున కొన్నిసార్లు ఓడిపోయాయి.

పార్టీ సంస్థలూ, గెరిల్లా యూనిట్లూ ఆక్రమిత ప్రాంతాల్లో పార్టీ పంథాకు తప్పనిసరిగా కట్టుబడి వుండేలా చూడడానికి, అవి అత్యంత సమర్థతగల కేడర్లచే నడపబడేలా మనం చూడాలి. అలాంటి చోటికి కేటాయించబడిన కేడర్లు, లేదా నాయకత్వం నెరపుతున్న కేడర్లు వున్నత పార్టీ సంస్థలతో తాత్కాలికంగా సంబంధాలు తెగిపోయినా తామే సమస్యలను పరిష్కరించగలిగి, మొక్కవోని విధంగా పార్టీ పంథాను అనుసరిస్తూ వుండాలి. అంతేగాక, ప్రాంతీయ పరిస్థితులతో బాగా పరిచయముండి, చిరకాలంగా ప్రాంతీయ పార్టీ సభ్యుల నమ్మకాన్ని చూరగొన్న ప్రాంతీయ కేడర్లనే నాయకత్వ స్థానాలకు ఎన్నుకోవాలి. ఈ కేడర్లందరూ గెరిల్లా యుద్ధ ఎత్తుగడలతో బాగా పరిచయమున్న వారై వుండాలి. ఈ అర్హతలకు అనుగుణంగా మనం కేడర్లను జాగ్రత్తగా ఎంచుకోకపోతే, శత్రువు మన వెంటబడుతున్న గ్యాంగ్‌డాండ్-జియాంగ్సి ప్రాంతం, తదితర ఆక్రమిత ప్రాంతాల్లో మనమెదుర్కొన్నటువంటి వూగిసలాట, సోవియట్ ప్రాంతాలకు పురోగమనం సమస్యలేగాక పార్టీని వదిలిపెట్టడం, శత్రు పక్షం చేరడం వంటి సమస్యలు తిరిగి తలెత్తుతాయి. యుద్ధ క్షేత్రాలలో ఇప్పుడు పార్టీ సంస్థలు ఎదుర్కొంటున్న తక్షణ కర్తవ్యాలలో ఒకటి ఆర్గనైజేషనల్ సన్నాహాలు చేయడం; అనగా ప్రాథమికంగా కేడర్లను ఎంపికచేసి, కేటాయించడమే. ఉన్నత ప్రమాణాలు గల కేడర్లను గెరిల్లా ప్రాంతాలకు కేటాయించి, వారి శక్తి సామర్థ్యాలకు తగిన పదవులను ఇవ్వాలని పార్టీ ప్రత్యేకంగా గుర్తుపెట్టుకోవాలి. రాజకీయంగా బలంగా వున్న ప్రాంతీయ కేడర్లు గెరిల్లా పోరాటంలో అనుభవం సంపాదించేలా తగిన మిలటరీ శిక్షణనివ్వాలి. లేదా రెడ్‌గార్డులు-యంగ్ పయోనీర్ల బృందాలలో చేర్చుకోవాలి.

ప్రజల పోరాటాలకు ముఖ్య నాయకత్వాన్ని (కోర్ లీడర్‌షిప్) పార్టీ పొందుపరచాలి. రహస్య పార్టీ శాఖలను ఆర్గనైజ్ చేయడంలో పొరపాట్లను మనం సరిచెయ్యాలి. రహస్య శాఖల కమిటీలను మెరుగైన సభ్యులతోగాక సాధారణంగా ముగ్గురు లేదా నలుగురు వయసుమళ్ళీన, లేదా శక్తి వుడిగిన వారితో ఏర్పరుస్తున్నారు. ఇలాంటి శాఖలు ప్రజల నుండి అనివార్యంగా దూరమై, గెరిల్లా యుద్ధాన్ని నడపడంలో పూర్తిగా అశక్తులుగా వున్నాయి. గెరిల్లా ప్రాంతాలలో పార్టీ సభ్యులు ప్రజల మధ్య కష్టపడి పట్టుదలగా పనిచేయాలని, వారి పోరాటాలకు కోర్ నాయకత్వంగా ఎదగాలనీ ప్రోత్సహించాలి. మనం ప్రజలతో కలసిపోయి, వారి మద్దతును పొందగలిగితే, మనం వారి నుండి రక్షణను పొందగలగడమేగాక, విప్లవ పోరాటానికి వారిని కదిలించడం కూడా చేయగలుగుతాం.

ప్రతి ఆక్రమిత ప్రాంతంలో పార్టీ సంస్థ ఉన్నత స్థాయి వర్క్‌టీముకూ, కౌంటీ పార్టీ కమిటీకీ, గెరిల్లా యూనిట్లకూ మధ్య లోపించిన సమన్వయాన్ని అధిగమించడానికి కేంద్రీకృత నాయకత్వాన్ని తప్పనిసరిగా నెలకొల్పాలి. ఇలాంటి కేంద్రీకృత నాయకత్వం లేనపుడు గెరిల్లాలకు ప్రాంతీయ పార్టీ సంస్థల నుండి సహకారం, ప్రజల నుండి మద్దతూ లోపించి, ఫలితంగా ఒంటరిగా పోరాడవలసి వచ్చి, ఓటమి ప్రమాదానికి గురౌతాయి. అంతేగాక సబార్డినేట్ జిల్లాలకు మరియు గెరిల్లా గ్రూపులకు లీడింగ్ కేడర్ల కొరత వున్నప్పుడు, అతిగా వున్న లీడింగ్ శాఖల సిబ్బంది గెరిల్లా యూనిట్లతో కలసి వారు ఎక్కడికి వెళితే అక్కడికి వెళ్ళడం మానేయాలి. ఇలాంటి ఆచరణ, గెరిల్లా యూనిట్ల వునికిని కనుగొనడాన్ని శతృవుకు సులువు చేస్తుంది. అది వారికి కదలికలను, విన్యాసాలను (ఫెక్సిబిలిటి) మృగ్యం చేస్తుంది. కేంద్రీకృత నాయకత్వాన్ని నెరపడానికి ప్రతి గెరిల్లా ప్రాంతంలోనూ అక్కడే పనిచేస్తున్న స్వతంత్ర రెజిమెంట్, వర్క్ టీము, గెరిల్లా బలగాల నుండి అత్యంత సమర్థులైన కేడర్లను ఎంపికచేసి, సైనిక-రాజకీయ కమిటీలను నిర్మించాలి. కౌంటీ పార్టీ కమిటీ ఇప్పటికే వున్నా గెరిల్లాలతో సంబంధం లేని చోట, పాత కమిటీ నుండి మరియు కౌంటీలోని అతి పెద్ద గెరిల్లా యూనిట్ నుండి అత్యంత సమర్థులైన కేడర్లను తీసుకొని, పాత కమిటీని నూతన కమిటీగా పునర్నిర్మాణం చేయాలి. ఈ కమిటీ నూతన కార్యదర్శి, ఆ గెరిల్లా యూనిట్‌కు పొలిటికల్ కమిస్సార్‌గా కూడా సేవలందించాలి. అన్ని జిల్లా సైనిక-రాజకీయ కమిటీలూ, కౌంటీ పార్టీ కమిటీలూ గెరిల్లా యూనిట్లకూ మరింత మెరుగైన, మరింత ప్రత్యక్ష మార్గదర్శకత్వాన్ని అందించడానికి ఆ గెరిల్లా యూనిట్లతో కలసి పనిచేస్తూనే, అదే సమయంలో ప్రాంతీయ పార్టీ సంస్థలపై నాయకత్వాన్ని నెరపాలి.

ఆక్రమిత ప్రాంతాలలో కౌంటీ, లేదా జిల్లా లీడింగ్ శాఖల్లో చేరిన పెద్ద సంఖ్యలోగల సిబ్బందిని, ఇతర ప్రాంతాలకు పంపించివేయాలి. వీరిలో ఎక్కువమందిని క్రిందిస్థాయి పార్టీ సంస్థలకూ లేదా చిన్న గెరిల్లా గ్రూపులకూ కేటాయించి, అక్కడి నాయకత్వం బలపడేలా చూడాలి. మిగతా వారిని సాయుధం చేసి పోరాటకారులుగా గెరిల్లా యూనిట్లలో చేరడానికైనా పంపించాలి. లేదా వివిధ జిల్లాలలో, టౌన్‌షిప్‌లలో ప్రజలమధ్య పనిచేయడానికైనా పంపించాలి.

వివరణలు:

1. కామ్రేడ్ యున్‌డైయింగ్ జ్ఞాపకార్థం డైయింగ్ కౌంటీ పేరు వచ్చింది. ప్రజలతో సన్నిహిత సంబంధాలను కొనసాగించి, మరింత సమర్థవంతమైన నాయకత్వాన్ని అందించడం కోసం ఫ్యూజియన్ ప్రావిన్స్ కార్మిక-రైతాంగ ప్రజాస్వామిక ప్రభుత్వం ఈ నూతన కౌంటీని 3 సెప్టెంబర్ 1933లో షాన్‌హంగ్ కౌంటీ నుండి లైబా, తైయాంగ్, లూఫెంగ్, బాంజియడు, చడిలను కలపడం ద్వారా ఏర్పరచడం జరిగింది. ఎర్రసైన్యంలోని ప్రధాన బలగం లాంగ్ మార్చ్‌లో వెళ్ళిపోయిన తరువాత కొంత కాలానికి ఈ కౌంటీని హంగ్ డై కౌంటీ అని పేరు మార్చారు; ఇది తరువాత రద్దయింది.

2. ఈ రెడ్‌గార్డ్-యంగ్ పయోనీర్‌లను రెండవ విప్లవ సివిల్‌వార్ కాలంలో విప్లవ విముక్తి ప్రాంతాల్లో నిర్మించారు. ప్రాంతీయ సాయుధ సంఘమే రెడ్‌గార్డ్. కొన్ని ప్రాంతాల్లో వీటి సభ్యుల వయస్సు 23 నుండి 50 వరకు వుండేది. యంగ్ పయోనీర్ సెమీ-మిలటరీ యువకుల సంఘం. దీని సభ్యులు సాధారణంగా 16 నుండి 23 సంవత్సరాల వారు. వీరు ఉత్పత్తిలో కూడా భాగం వహించేవారు. వీరిలో ఆదర్శ రెడ్‌గార్డ్, ఆదర్శ యంగ్ పయోనీర్లు 18 సంవత్సరాలు, అంతకు మించిన వాలంటీర్లతో కూడుకొనేవి. ఎర్ర సైన్యం ఖాళీలను భర్తీచేస్తూ, ఎర్రసైన్యం-గెరిల్లా యూనిట్లతో సమన్వయం చేసుకొని పోరాడేవారు. జపాన్ వ్యతిరేక యుద్ధ కాలంలో రెడ్‌గార్డ్స్ పేరును సెల్ఫ్ డిఫెన్స్ కోర్స్ అన్నారు.

3. డిసెంబర్ 1937లో కేంద్ర విప్లవ విముక్తి ప్రాంతాలలో ఎర్రసైన్యాన్ని విస్తరింప జేయడానికి ఒక నెల మొత్తం జరిగిన ఉద్యమమిది. ఆ కాలంలో విప్లవ విముక్తి ప్రాంతంలో రిక్రూట్ చేసుకున్న యువకులతోనే ఎర్రసైన్యం ఏర్పడి వుండేది పట్టుబడిన కొమింగ్‌టాంగ్ సైనికులు కూడా వుండేవారు; వీరు పునర్విద్య పొందిన తరువాత స్వచ్ఛందంగా చేరేవారు.

4. 1 మార్చి 1933 నాడు మొదలుపెట్టి కేంద్ర విప్లవ విముక్తి ప్రాంతాల్లో ఎర్రసైన్నానికి జొన్నలు సప్లై చేసే క్యాంపెయిన్ ప్రారంభమైంది. చైనా సోవియట్ రిపబ్లిక్ యొక్క సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎర్రసైన్యానికి విప్లవ ప్రజలు జొన్నలను స్వచ్ఛందంగానే అప్పులిచ్చే పద్ధతులను నిర్దేశిస్తూ సూచనలిచ్చింది. అవసరాలు అత్యవసరంగా వుంది కాబట్టి, నెలాఖరులోగా కర్తవ్యాన్ని కౌంటీలు పూర్తి చేయాల్సి వచ్చింది.

5. యుద్ధ క్షేత్రాలలో పార్టీ సంస్థలంటే ఎక్కడైతే కొమింగ్‌టాంగ్‌తో ఎర్రసైన్యం పోరాడుతూ వుందో ఆ ప్రాంతంలోని పార్టీ సంస్థలు.

★

(లెనిన్ 150వ జయంతి సందర్భంగా)

# "ఆర్థిక వాదుల" అవకాశవాద తత్వం పై లెనిన్ పోరాటమే "ఏం చేయాలి?" అనే మహోన్నత గ్రంథం చారిత్రక ప్రాముఖ్యత

1898లో రష్యన్ సోషల్-డెమోక్రటిక్ పార్టీ మొదటి కాంగ్రెస్ సమావేశం జరిగినప్పటికీ, ఆ కాంగ్రెస్‌లో పార్టీని నిర్మించినట్లు ప్రకటించినప్పటికీ, నిజమైన పార్టీ ఇంకా ఏర్పడనేలేదు. అప్పటికి పార్టీ కార్యక్రమంగాని, నిబంధనలు గాని లేనేలేవు. మొదటి కాంగ్రెస్‌లో ఎన్నుకోబడిన కేంద్ర కమిటీ సభ్యులను ప్రభుత్వం అరెస్టు చేసింది. కాని వారిస్థానే మరొక కేంద్రకమిటీ ఏర్పడలేదు. వారిస్థానాన్ని నింపడానికి మరెవరూ లేకపోవడమే అందుకు కారణం. ఇంతకంటె అధ్వాన్నమయిన విషయం ఏమంటే, మొదటి కాంగ్రెస్ తర్వాత సిద్ధాంత గందరగోళమూ, పార్టీలో వ్యవస్థాగత సన్నిహితత్వం, లోపించడం మరింత ప్రస్ఫుటంగా కన్పించసాగాయి.

ఐక్య శ్రామికవర్గ రాజకీయ పార్టీని నిర్మించేముందు, ''ఆర్థికవాదులను'' ఓడించాల్సి ఉంది. ఈ కర్తవ్యాన్ని పూర్తిచేసేందుకూ, కార్మికవర్గ పార్టీని నిర్మించేందుకూ లెనిన్ స్వయంగా పూనుకొన్నాడు.

కార్మికవర్గ ఐక్యపార్టీ నిర్మాణం ఎలా ప్రారంభించాలి అన్న విషయంపైన అభిప్రాయభేదాలేర్పడ్డాయి. పార్టీ రెండవ కాంగ్రెస్‌ను సమావేశపరచితే, అది స్థానిక సంస్థలను ఐక్యపరచి పార్టీని నిర్మిస్తుందని కొందరు భావించారు. కాని లెనిన్ దీనికి ప్రతికూలం. కాంగ్రెస్‌ను సమావేశపరచేముందు పార్టీ ఆశయాలను, ఉద్దేశ్యాలను స్పష్టపరచడం అవసరం. ఎలాంటి పార్టీ కావాలో తేల్చుకోవడం అవసరం. "ఆర్థికవాదుల"తో సిద్ధాంతరీత్యా విడివడటం అవసరం. పార్టీ ఆశయాలు ఉద్దేశాల గురించి- "ఆర్థికవాదుల"ది ఒకటి, విప్లవకర సోషల్-డెమోక్రట్లది ఒకటీ- రెండు వ్యతిరేక అభిప్రాయాలున్నా పార్టీ నిష్కపటంగా చిత్తశుద్ధితో చెప్పాలి. "ఆర్థికవాదులు'' తమ అభిప్రాయాలకు అనుకూలంగా తమ పత్రికల్లో ప్రచారం చేసుకొంటున్నట్లే. విప్లవ సోషల్-డెమోక్రటిక్ సిద్ధాంతాల కనుకూలంగా పత్రికలలో విరివిగా ప్రచారం సాగించాలి. ఈ రెండు ధోరణులతో తమకేది కావాలో ఆలోచించి నిర్ణయించుకోవలసిందని స్థానిక సంస్థలకు అవకాశం ఇవ్వాలి. తప్పనిసరియైన ఈ ప్రాథమిక కార్యక్రమం పూర్తియైన పిమ్మటనే కాంగ్రెస్‌ను సమావేశపరచాలి- అని లెనిన్ అభిప్రాయపడ్డాడు.

నిర్మింపబడుతూన్న పార్టీ స్వభావం ఏమిటి? కార్మికవర్గంతో దాని సంబంధం ఏమిటి? పార్టీ ఆశయాలు ఉద్దేశాలు ఏమిటి?- ఈ విషయాలపై లెనిన్ అభిప్రాయం ఇది: పార్టీ, కార్మికవర్గానికి పురోగామిగా ఉండాలి. శ్రామిక జనవర్గ పోరాటాన్ని నడిపిస్తూ, సమన్వయిస్తూ, అది కార్మికవర్గ ఉద్యమానికి మార్గదర్శక శక్తిగా ఉండాలి. పార్టీ అంతిమ ఆశయం పెట్టుబడిదారీ విధానాన్ని కూలదోసి సోషలిజాన్ని స్థాపించడం. తక్షణ ఆశయం జార్ ప్రభుత్వాన్ని కూలద్రోసి ప్రజాతంత్ర విధానాన్ని నెలకొల్పడం. జార్ ప్రభుత్వాన్ని మొదట కూలదోయనిదే పెట్టుబడిదారీ విధానాన్ని కూలద్రోయడం అసాధ్యం. కాబట్టి, ఈ సమయంలో పార్టీ ప్రధాన కర్తవ్యం కార్మికవర్గాన్నీ, ప్రజలందరినీ జార్ ప్రభుత్వ వ్యతిరేక పోరాటానికి ఉత్తేజపరచడం, ప్రజా విప్లవోద్యమాన్ని వృద్ధి చేయడం, సోషలిస్టు మార్గానికి మొదటి తీవ్ర ప్రతిబంధకమైన జార్ ప్రభుత్వాన్ని కూలదోయడం-అని లెనిన్ అభిప్రాయం.

లెనిన్ పథకంపై దాడి సల్పడానికి "ఆర్థికవాదులు" ఏ మాత్రం ఆలస్యం చేయలేదు. వారీ విధంగా వాదించారు.

జార్ ప్రభుత్వ వ్యతిరేక రాజకీయ పోరాటం అన్ని వర్గాలకు చెందినది. ముఖ్యంగా బూర్జువాలకు చెందినది. అందుచేత అది కార్మికవర్గానికి అంత ముఖ్యమైనది కాదు. ఎక్కువ జీతాల కోసం, పనిచేసే పరిస్థితులు బాగుపడడం కోసం, యజమానులపై ఆర్థిక పోరాటం సాగించుటలోనే కార్మికుల ముఖ్య ప్రయోజనం ఉంది. అందుచేత, సోషల్-డెమోక్రాట్ల ప్రధాన తక్షణ కర్తవ్యం "యజమానులపైన, ప్రభుత్వంపై కార్మికుల ఆర్థిక పోరాటాన్ని" సంఘటిత పరచుటేగాని, జార్ ప్రభుత్వంపై పోరాడటంగాని, దాన్ని కూలదోయటం గాని కాదు. ప్రభుత్వంపై ఆర్థికపోరాటం అంటే, ఎక్కువ సౌకర్యాలు కల్గించే ఫ్యాక్టరీ చట్టం కోసం పోరాటమన్నమాట. ఈ విధంగా "ఆర్థిక పోరాటానికి దానంతకదే రాజకీయ స్వభావం కల్గించటం" సాధ్యమని ''ఆర్థికవాదులు'' వాదించారు.

కార్మిక వర్గానికి ఒక రాజకీయ పార్టీ కావలసిన ఆవశ్యకతను "ఆర్థిక వాదులు" బహిరంగంగా ఎదిరించ సాహసించలేకపోయారు. కార్మికవర్గ ఉద్యమానికి మార్గదర్శక శక్తిగా పార్టీ ముందుండ రాదట. అప్రయత్నంగా వచ్చే కార్మికవర్గ ఉద్యమాన్ని నడపడంమాట అలా ఉంచి పార్టీ అసలు దానిలో జోక్యం కల్గించుకోరాదట. కాని ఆ ఉద్యమం తోక వెనుక పార్టీ నడిచి దానిని పరిశీలించి దాని నుండి గుణపాఠాలు నేర్చుకోవాలట.

కార్మికవర్గ ఉద్యమంలో చైతన్య శక్తుల పాత్ర: సోషలిస్టు చైతన్యానికి సోషలిస్టు సిద్ధాంతానికి గల నిర్మాణాత్మక మార్గదర్శక పాత్ర పూర్తిగా లేనేలేదని లేక దాదాపు లేనే లేదని ఆర్థిక వాదులు వాదించారు. సోషలిస్టు చైతన్య స్థాయికి కార్మికుల ఆలోచనలను సోషల్-డెమోక్రాట్లు తీసుకుపోరాదనీ, పై పైచ్చు సోషల్-డెమోక్రాట్లే సాధారణ కార్మికుల స్థాయికి-ఇంకా మాట్లాడితే - చాలా వెనకబడ్డ కార్మికవర్గ ప్రజల స్థాయికి దిగిపోవాలనీ, సరిపుచ్చుకోవాలనీ ఆర్థికవాదులు వాదించారు. కార్మికవర్గానికి సోషలిస్టు చైతన్యాన్ని సోషల్-డెమోక్రాట్లు అందించరాదనీ, అప్రయత్నంగా వచ్చిన

కార్మికవర్గ ఉద్యమం దానంతట అది సోషలిస్టు చైతన్యాన్ని పొందేవరకు వారు వేచి ఉండాలనీ "ఆర్థికవాదులు" వాదించారు.

లెనిన్ సూచించిన పార్టీ నిర్మాణ పథకం, యాదృచ్ఛిక ఉద్యమంపైన దాదాపోక హింసాచర్య అని "ఆర్థిక వాదులు" భావించారు.

"ఇస్క్రా" పత్రికలోనూ, "ఏంచేయాలి?" అనే అతని మహోన్నత గ్రంథంలోనూ, లెనిన్ "ఆర్థిక వాదుల" ఈ అవకాశవాద తత్వంపై తీవ్రంగా దాడిచేసి, సమూలంగా నాశనం గావించాడు.

1. జార్ ప్రభుత్వ ప్రతికూలమైన రాజకీయ పోరాటం నుండి కార్మికవర్గాన్ని పెడమార్గం పట్టించి, ప్రభుత్వాన్నీ యజమానులనూ ముట్టకుండా అలాగే ఉంచి, వారితో ఆర్థిక పోరాటం మాత్రమే సాగించటం కార్మికుల కర్తవ్యమని నిర్ధారణ చేయటం అంటే–కార్మికులను శాశ్వత దాస్యానికి లోను చేయడమే. ప్రభుత్వంతోను, యజమానులతోను కార్మికుల ఆర్థిక పోరాటం అంటే ఏమిటి? తమ శ్రమశక్తిని పెట్టుబడిదారులకు అమ్ముకోవడంలో మంచి షరతుల కోసం పోరాడే ట్రేడ్ యూనియన్ పోరాటం. పెట్టుబడిదారులకు తమ శ్రమ శక్తిని అమ్ముకోవడంలో మంచి షరతుల కోసమేగాక పెట్టుబడిదారీ విధానం రద్దు చేయడానికి కూడా కార్మికులు పోరాడదలచారు. ఎందుచేతనంటే, తమ శ్రమశక్తిని పెట్టుబడిదారులకు అమ్ముకొనే దుర్గతికి తెచ్చినదీ, దోపిడికి గురియై బాధపడేటట్లు చేసిందీ ఈ పెట్టుబడిదారీ విధానమే. అందుచేత ఈ పెట్టుబడిదారీ విధానాన్నే రద్దుచేయడానికి పోరాటం సాగించాలని కార్మికులు తలచారు. కాని పెట్టుబడిదారీ విధానం కావలికుక్క అయిన జార్ ప్రభుత్వం, వారి ఉద్యమ పంథాలో ప్రతిబంధకంగా ఉన్నన్నాళ్లు కార్మికులు పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగాను సోషలిజం కోసమూ తాము జరిపే పోరాటాన్ని పూర్తిగా వృద్ధిచేయలేరు. అందుచేత మార్గమధ్యం నుండి జార్ ప్రభుత్వాన్ని తొలగించి సోషలిజానికి మార్గం సుగమం చేయడం పార్టీకి, కార్మికవర్గానికి తక్షణ కర్తవ్యం.

2. కార్మికోద్యమంలో యాదృచ్ఛికత క్రమాన్ని ఎత్తిపట్టడం అంటే, పార్టీ నిర్వహించాల్సిన నాయకత్వ పాత్రను నిరాకరించటం, దాన్ని సంఘటనలను రికార్డు చేసే స్థాయికి కుదించటం, తోకపట్టుకుపోయే తత్వాన్ని బోధించటం. యాదృచ్ఛిక క్రమాన్ని (Khvostism.) వెంబడించేదిగా పార్టీని మార్చటం, దాన్ని ఉద్యమంలో నిష్క్రియాశక్తిగా చేయటం. యాదృచ్ఛికతా క్రమం కోసం ఎదురుచూసే శక్తిగా మాత్రమే దాన్ని తయారు చేసి, సంఘటనలు వాటి మార్గంలో అవి ప్రయాణించటాన్ని అనుమతించేటట్లు చేయటం అని అర్థం. దీన్ని ప్రచారం చేయటం అంటే పార్టీని నాశనం చేయటం. అంటే కార్మికవర్గానికి పార్టీలేకుండా చేసి దాన్ని నిరాయుధం చేయటం. ఒక వైపు పూర్తిగా సాయుధమైన జార్ ప్రభుత్వం, మరోవైపు ఆధునిక పద్ధతులలో నిర్మాణమైన కార్మికవర్గానికి వ్యతిరేకంగా తాను చేస్తున్న పోరాటాన్ని నిర్దేశిస్తున్న పార్టీని కలిగియున్న బూర్జువా వర్గం వంటి శత్రువులను ఎదుర్కొంటున్న కార్మికవర్గాన్ని నిరాయుధం చేయటం అంటే దాన్ని మోసం చేయటమే.

3. లెనిన్ ఈ కింది విధంగా వాదించాడు: యాదృచ్ఛిక కార్మికవర్గ ఉద్యమాన్ని పూజిస్తూ తలలొగ్గడం. చైతన్యం యొక్క పాత్రను అంటే సోషలిస్టు చైతన్యం, సోషలిస్టు సిద్ధాంతాల ప్రాముఖ్యతను తక్కువ చేయుటమే. అంధకారంలో నుండి వెలుగులోకి ప్రవేశిస్తున్నట్లుగా చైతన్యం పొందుతున్న కార్మికులను అవమానపరచడం మొదటి తప్పు. పార్టీ దృష్టిలో సిద్ధాంత విలువను తగ్గించడం అనగా వర్తమానాన్ని అర్థంచేసుకొని భవిష్యత్తును స్పష్టంగా ఊహించగలిగేందుకు పార్టీకి అవసరమయిన సాధనాన్ని తక్కువ అంచనా వేయడం రెండవతప్పు. అవకాశవాదం అనే ఊబిలో మళ్లా తలయెత్తకుండా దిగజారడం మూడవతప్పు.

లెనిన్ ఇలా అన్నాడు: "విప్లవ సిద్ధాంతం లేనిదే విప్లవోద్యమమనేదే లేదు. బాగా అభివృద్ధి చెందిన సిద్ధాంతంచే నడుపబడే పార్టీయే, ముందుండి పోరాడే పాత్రను నిర్వహించగలదు." (లెనిన్, సెలెక్టెడ్ వర్క్స్. ఇంగ్లీష్ ఎడిషన్, మాస్కో 1947, వాల్యూం ఒకటి. 163, 164 పేజీలు)

4. యాదృచ్ఛిక కార్మిక ఉద్యమం నుండి సోషలిస్టు సిద్ధాంత తత్వం తలయెత్తవచ్చునని "ఆర్థికవాదులు" వాదించారంటే, వారు కార్మికవర్గాన్ని మోసగిస్తున్నారు. వాస్తవానికి సోషలిస్టు సిద్ధాంతం యాదృచ్ఛిక ఉద్యమం నుండిగాక విజ్ఞానశాస్త్రం (సైన్సు) నుండి తలయెత్తుతుంది. కార్మికవర్గానికి సోషలిస్టు చైతన్యాన్ని అందజేయవలసిన ఆవశ్యకతను నిరాకరించుట ద్వారా, "ఆర్థికవాదులు", బూర్జువా సిద్ధాంతానికి దారి సుగమం చేస్తున్నారు. కార్మికవర్గంలో బూర్జువా సిద్ధాంతాన్ని చొప్పించి ప్రచారం చేయడానికి సహాయపడుతున్నారు. తత్ఫలితంగా, కార్మికవర్గ ఉద్యమాన్నీ, సోషలిజాన్నీ ఐక్యం చేయాలనే భావాన్ని పాతిపెడుతున్నారు. ఆ విధంగా బూర్జువాజీకి సహాయపడుతున్నారు – అని లెనిన్ నిరూపించాడు.

లెనిన్ ఇంకా ఇలా అన్నాడు: "యాదృచ్ఛిక కార్మికోద్యమాన్ని పూజించడం, 'చైతన్యాంశం' పాత్రను, సోషల్ డెమోక్రాటిక్ పార్టీ పాత్రను చిన్నచూపు చూడటం, కార్మికులలో బూర్జువా సిద్ధాంత పలుకుబడిని బలపరచడమే. "ఇలా చేసేవారు తమ కిష్టమై చేసినా, లేక ఇష్టంగాక చేసినా, ఫలితం మాత్రం ఒకటే." (పై గ్రంథమే 173 పేజీ)

ఇంకా:

"బూర్జువా సిద్ధాంతాన్నో, సోషలిస్టు సిద్ధాంతాన్నో ఈ రెంటిలో – ఏదో ఒక దానిని ఎన్నుకోవాలి. మరో మధ్యే మార్గంలేదు. ఏ విధంగానైనా సరే సోషలిస్టు సిద్ధాంతాన్ని చిన్నచూపు చూడటం అంటే, సోషలిస్టు సిద్ధాంతం నుండి స్వల్ప మాత్రంగానైనా తిరిగి పోవటం అంటే బూర్జువా సిద్ధాంతాన్ని బలపరచడం అన్నమాట." (పై గ్రంథమే. 174-175 పేజీలు)

5. "ఆర్థికవాదుల" ఈ తప్పులన్నిటినీ క్రోడీకరిస్తూ లెనిన్ ఈ కింది నిర్ణయాలకి వచ్చాడు: పెట్టుబడిదారీ విధానం నుండి కార్మికవర్గాన్ని స్వతంత్రులను చేయడానికి కావలసిన సామాజిక విప్లవ పార్టీని వారు కోరరు. అందుకే "ఆర్థికవాదులు' శ్రామికవర్గ ప్రధాన ప్రయోజనాలకు ద్రోహం చేస్తున్న సంస్కరణ వాదులు.

6. ఆఖరు విషయం "ఆర్థికవాదం" రష్యాలో అకస్మాత్తుగా సంభవించినది కాదు. కార్మికవర్గంపైన పెట్టుబడిదారుల పలుకుబడికి ఆర్థికవాదులు ఒక సాధనం. పశ్చిమ యూరోపియన్ సోషల్-డెమోక్రటిక్ పార్టీలలో ఆర్థిక వాదులకు స్నేహితులున్నారు. వారు అవకాశవాది బెర్నస్టీన్ అనుచరులైన రివిజనిస్టులు. పశ్చిమ యూరప్‌లో సోషల్ డెమోక్రాటిక్ పార్టీలలో అవకాశవాద ధోరణి బలపడుతూంది. మార్క్సును "విమర్శించే స్వాతంత్ర్యం" కావాలనే వంకతో వారు మార్క్సిస్టు సిద్ధాంతాలను తిరగదోడాలని అన్నారు. అందుచేతనే వీరికి రివిజనిస్టులని పేరు వచ్చింది. విప్లవాన్ని, సోషలిజాన్ని, శ్రామిక నియంతృత్వాన్ని వీరు సవాల్ చేసారు. విప్లవ పోరాటాన్ని, సోషలిజాన్ని, శ్రామిక నియంతృత్వాన్ని, వదులు కోవడమే రష్యన్ ఆర్థికవాదుల పాలసీ కూడా అని లెనిన్ నిరూపించాడు.

ఆర్థికవాదం సిద్ధాంతరీత్యా పూర్తి అపజయం పొందడంవల్ల అవకాశవాదం, ఖ్వోస్టిజం (Khvostism) ,యాదృచ్ఛికత (Spontaneity) మొదలగు వాటి సిద్ధాంతాలు కూడా పూర్తిగా అపజయం పొందాయి.

"ఏం చేయాలి?" అనే గ్రంథం ప్రాముఖ్యత ఇంతటితోనే తీరిపోలేదు. ఈ మహోన్నత గ్రంథం చారిత్రక ప్రాముఖ్యత ఈ క్రింది విషయాలవల్ల తెలుస్తుంది. దీనిలో లెనిన్,

1. మార్క్సిస్టు ఆలోచనా క్రమ చరిత్రలో మొట్టమొదటిసారిగా, అవకాశవాదం సిద్ధాంత బీజాలేమిటో బట్టబయలు చేశాడు. యాదృచ్ఛిక కార్మికోద్యమాన్ని పూజించుటలోను, కార్మికవర్గ ఉద్యమంలో సోషలిస్టు చైతన్యం పాత్రను చిన్నచూపు చూడటంలోనూ ముఖ్యంగా ఆ సిద్ధాంత బీజాలున్నాయని తెలియజేశాడు.

2. సిద్ధాంతం, చైతన్యాల పాత్రను, యాదృచ్ఛిక కార్మికవర్గ ఉద్యమానికి దిక్సూచిగా ఉంటూ దాన్ని విప్లవీకరించడంతో పార్టీకున్న గొప్ప ప్రాధాన్యతలను ఆయన వెలికి తెచ్చారు.

3. మార్క్సిస్టు పార్టీ అంటే కార్మికవర్గ ఉద్యమంతో సోషలిజాన్ని మేళవించుటయే అన్న ప్రధాన మార్క్సిస్టు సిద్ధాంత ప్రతిపాదనను అత్యంత చాకచక్యంతో లెనిన్ నిరూపించాడు.

4. మార్క్సిస్టు పార్టీ సిద్ధాంత పునాదులను అత్యద్భుతంగా విశదపరచాడు.

"ఏం చేయాలి?" (What is to be Done?) అనే గ్రంథంలో లెనిన్ విశదీకరించిన సిద్ధాంత ప్రతిపాదనలే ఆ తర్వాత బోల్షివిక్ పార్టీకి సిద్ధాంత పునాది అయ్యాయి. ★

---

*(....25వ పేజీ తరువాయి)*

దర్యాప్తు సందర్భంగా (మరే కేసైనా కావచ్చు) ఫలాన పట్టణంలో (భారత దేశంలో ఏ పట్టణమైనా కావచ్చు) ఒక కంప్యూటర్ లేదా పెన్‌డ్రైవ్ ఫలాన వ్యక్తి నుండి (ఏదైన పేరు కావచ్చు) దొరికిందని వాళ్ళు కోర్టులో చెబుతారు. వాటిలో నిషేధిత సంస్థకు చెందిన ఎవరో ఒకరు సభ్యులు రాసిన ఉత్తరాలు కోడ్ పేరుతో దొరికాయంటారు. పోలీసుల తర్కం ప్రకారం ఆ కోడ్ పేరు గల వ్యక్తి మీరే అవుతారు, మరెవరో కారు. వాళ్ళు మిమ్మల్ని ఒక పెద్ద కుట్రలో భాగస్తుడిగా చూయిస్తారు. దాంతో మీ మొత్తం ప్రపంచం తల కిందులైనట్లుగా మీరు గ్రహిస్తారు. మీ ఉద్యోగం ఊడిపోతుంది. మీ కుటుంబాన్ని మీ నుండి దూరం చేస్తారు. మీడియా మిమ్మల్ని నిందిస్తుంది. కాని మీరు వీటిని ఆపలేరు. పోలీసులు కోర్టును సమ్మితింపజేయడానికి ఏదో సీల్డ్ కవర్ ఇస్తారు. దాంతో ప్రాథమిక దృష్ట్యా మీపై కేసు నమోదు అవుతుంది. మీరు అరెస్టై పోలీసుల విచారణకు అనుమతింపబడతారు. మీరు అందుకు ఎలాంటి సాక్ష్యాలు లేవని ఎంత తర్కించినప్పటికీ న్యాయమూర్తుల వారు వినరు. అన్నీ విచారణలో తేలుతాయంటారు. పోలీస్ కస్టడీలో విచారణ ముగిసాక మిమ్మల్ని జైలుకు పంపిస్తారు.

మీరు జమానత్ కోసం దరఖాస్తు చేసుకుంటారు. కాని కోర్టులు దానిని తిరస్కరిస్తాయి. ఇలాంటి కేసులలో ఒక వ్యక్తికి బెయిల్ దొరకడం గాని లేదా నేర విముక్తం జరగడానికి కాని నాలుగు నుండి పది సంవత్సరాలు పడుతుందని చారిత్రకంగా మనకు దొరుకుతున్న గణాంకాల ద్వారా తెలుస్తుంది. ఇలా ఎవరితోనైనా జరగవచ్చు! అమాయకులైన ప్రజలపై వారి పౌర స్వతంత్రాన్ని అలాగే అన్ని రకాల రాజ్యాంగ హక్కులను వారి నుండి తీసేసుకోవడానికి జాతీయ భద్రత పేరుతో ఇలాంటి నిరంకుశ చట్టాలను ప్రయోగిస్తే చట్టపరంగ సాధికారత లభిస్తుంది.

రాజకీయ వర్గాలు జాతీయోన్మాదాన్ని ఒక ఆయుధంగా వినియోగిస్తున్నాయి. దాని ఆధారంగా ప్రజలను విభజించి ధిక్కారాన్ని తుదముట్టిస్తున్నారు. ఈ ఉన్మాదం అన్ని రకాల తర్కానికి తిలాంజలులు ఇస్తుంది. పదాలకు అర్థాలు మారిపోతున్నాయి. దేశాన్ని వినాశనం చేసేవారు దేశ భక్తులు మరియు నిస్వార్థంగా సేవ చేసే వాళ్ళు దేశ ద్రోహులవుతున్నారు. నేను మన భారత దేశం వినాశనం కావడాన్ని కళ్ళార చూస్తున్నాను. నేను రవ్వంత ఆశతో ఈ సంక్షోభ సమయంలో మీ అందరి కోసం ఉత్తరాన్ని రాస్తున్నాను. నేను ఎన్.ఐ.ఏ. వారి కస్టడీకి వెళ్తున్నాను. నేను మీతో మళ్ళీ మాట్లాడగలుగుతాననేది తెలీదు. నాలాగా మీవంతు రాకముందే మీరు మాట్లాడతారని విశ్వశిస్తున్నాను'.

ఆనంద్ తేలుతుంబ్డే

★

# అమరులకు అరుణాంజలి

## కామ్రేడ్ సుదీప్ ఉరఫ్ కంచన్ పశ్చిమ బంగ్ రాష్ట్రకమిటీ కార్యదర్శి

ఆయన పశ్చిమ బెంగాల్‌లో దీర్ఘకాల ప్రజాయుద్ధ సేనానులలో ఒకరు. ఆయనది దిగజారిపోతుండిన ఎగువ మధ్యతరగతి కుటుంబం. ఆయన పశ్చిమ బంగ్‌లో ఆనాటి సీపీఎం ప్రభుత్వ నిరంకుశ విధానాలకు, అణచివేతకు వ్యతిరేకంగా యువజనులను కూడగట్టి పోరాడారు. 1980ల ఆరంభంలో నక్సల్బరీ రాజకీయాలతో ప్రభావితుడయ్యారు. విద్యార్థి రంగం నుంచి విప్లవ రాజకీయాల్లోకి వచ్చారు. ఆయనతో పాటు మరికొందరు కామ్రేడ్స్ కేవెన్ రాంచంద్రన్ నాయకత్వాన గల సీపీఐ (ఎంఎల్) రెడ్‌ఫ్లాగ్ గ్రూపు మితవాద అవకాశవాద రాజకీయాలను వదలి 1990 దశకం ఆరంభంలో సీపీఐ (ఎం-ఎల్) (పీపుల్స్‌వార్)లో చేరారు. జంగల్‌మహల్ ప్రాంతంలో వ్యవసాయ విప్లవానికి పునాదులు వేసే ప్రక్రియను ఆరంభించడంలో నాయకత్వం వహించారు. 1995-98 మధ్య కూలిరేట్ల పెంపు, అడవిపై అధికారం, సాల్ ఆకుల, తునికాకుల రేటు పెంపుతో పాటు పలు వ్యవసాయ సమస్యలపై ప్రజలను సంఘటితం చేసారు. ఈ ప్రజా పోరాటాల లక్ష్యం రివిజనిస్టు సీపీఎం పాలనలో బలంగా వున్న భూస్వామ్య వ్యవస్థకు, అది పెంచి పోషించిన నూతన తరహా భూస్వామ్య వర్గానికి వ్యతిరేకంగా వర్గ పోరాటాన్ని తీవ్రతరం చేయడం. 1998లో మమతా బెనర్జీ నాయకత్వాన గల తృణమూల్ కాంగ్రెస్ బీజేపీతో చేతులు కలిపి కేస్‌పుర్, గొర్బెతా ప్రాంతాలపై ఆధిపత్యం కోసం సీపీఎం నాయకుడు సుశాంత్ ఘోష్ వాహినికి వ్యతిరేకంగా తీవ్రమైన ఘర్షణలకు దిగడంతో ఆ ప్రాంతం నుంచి సీపీఎం వెనక్కు తగ్గింది. దీంతో ఆ ప్రాంతంలో సీపీఎం పక్షాన ఉండిన కార్మికులపై, రైతులపై తృణమూల్, బీజేపీల అత్యాచారాలు తీవ్రతరమయ్యాయి. ఈ అత్యాచారాలకు వ్యతిరేకంగా పీపుల్స్‌వార్ పార్టీ ప్రజలను సంఘటితం చేసి కొనసాగించిన సమరశీల ప్రతిఘటనా పోరాటంతో తృణమూల్-భైరవ వాహిని (తృణమూల్ నాయకత్వాన పనిచేసే అమానుష సాయుధ మిలీషియా), బీజేపీ వెనక్కు తగ్గకతప్పలేదు. గొర్బెతా భూమిపుత్రుడు కామ్రేడ్ సుదీప్, కామ్రేడ్ అసిత్ సర్కార్‌లు దీనికి నాయకత్వం వహించారు. భూమిలేని పేదరైతులలో అధికంగా ఉన్న సీపీఎం కార్యకర్తలు, సభ్యులు పీపుల్స్‌వార్ పార్టీ నాయకత్వంలో సంఘటితం కావడంతో సింఘ్‌భూమ్, బేల్‌పహాడీ, గొర్బెతా, పింగ్లాలతో కూడిన విశాల ప్రాంతంలో సాయుధ ప్రజా ఉద్యమం విస్తరించింది. తృణమూల్-బీజేపీలు వెనక్కి తగ్గిన తర్వాత సోషల్ ఫాసిస్టు సీపీఎం తిరిగి సుశాంత్-దీపక్‌ల నాయకత్వంలో ఆ ప్రాంతంలో ప్రవేశించింది. ఆ ప్రాంత ప్రజలకు శత్రువుగా మారింది. చోటో అంగరియా వంటి హత్యాకాండల ద్వారా సుశాంత్-దీపక్ బాహిని భయోత్పాతం సృష్టించింది. సీపీఎం ప్రభుత్వం పీపుల్స్‌వార్ పార్టీ ప్రజాసంఘం కిసాన్-మజ్దూర్ సంగ్రాం సమితిని నిషేధించింది. దీంతో పెద్దెత్తున అరెస్టులు సాగాయి. 2002లో సుదీప్‌ను అరెస్టు చేసారు. 2004లో తిరిగి విడుదలయ్యారు. 2008లో కామ్రేడ్ సుదీప్ ఉరఫ్ కంచన్ ఐక్య పార్టీ సీపీఐ (మావోయిస్టు) పశ్చిమ బంగ్ రాష్ట్రకమిటీ కార్యదర్శిగా ఎంపికయ్యారు.



కామ్రేడ్ సుదీప్ చోంగ్‌దార్

పశ్చిమ బంగ్‌లో పాలకవర్గాల తొత్తు సీపీఎం బుద్ధదేవ్ భట్టాచార్య ప్రభుత్వం రైతుల భూములను బలవంతంగా సేకరించి కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడానికి వ్యతిరేకంగా రైతులు నందిగ్రామ్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) నాయకత్వంలో మిలిటెంట్‌గా పోరాడారు. ఇది దేశవ్యాప్తంగా సెజ్‌ల వ్యతిరేక పోరాటంగా ప్రసిద్ధి చెందింది. ఈ పోరాటం ఆ రాష్ట్రంలో కొరకరాని కొయ్యగా మారిన రివిజనిస్టు సీపీఎం ప్రభుత్వ పునాదులను కుదిపివేయడంలో ప్రత్యేక పాత్రను పోషించింది. ఈ పోరాటానికి నాయకుడిగా 'సుకుమార్' పేరుతో కామ్రేడ్ సుదీప్ అందరి అభిమానాన్ని చూరగొన్నారు. నందిగ్రామ్ తర్వాత లాల్‌గఢ్ ప్రజా విజృంభణ ప్రారంభమైంది. లాల్‌గఢ్ ఉద్యమ ప్రముఖ నాయకులలో కామ్రేడ్ సుదీప్ కూడా ఒకరు. 2010 డిసెంబర్ 2న మరో ముగ్గురు రాష్ట్రకమిటీ సభ్యులతో పాటు కోల్‌కతా నగరంలో తిరిగి ఆయన అరెస్టు అయ్యారు. పోలీసు నిర్బంధంలో చెప్పనలవికాని చిత్రహింసలకు గురయ్యారు. ఆయనను అనేక తప్పుడు కేసులలో ఇరికించారు. అనేక జైళ్లు తిప్పారు. ఆయనకు సుదీర్ఘకాలం పాటు బెయిల్ ఇవ్వకుండా అడ్డుకున్నారు. తీవ్ర అనారోగ్యంతో వున్నప్పటికీ కనీస వైద్య సదుపాయాలు కల్పించలేదు. ఈ విధంగా ముందు సీపీఎం ప్రభుత్వం, తర్వాత తృణమూల్ ప్రభుత్వం ఆయనను ఉద్దేశ్యపూర్వకంగా మృత్యుముఖానికి నెట్టాయి. చివరికి, కామ్రేడ్ సుదీప్ చోంగ్‌దార్ ఫిబ్రవరి 8, 2019న కోల్‌కతా ప్రెసిడెన్సీ జైలులో సెరిబ్రల్ మలేరియాతో, ఫాసిస్టు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అకాల మృత్యువు పాలయ్యారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకొని, వారిని ప్రాణంగా భావించి, వాస్తవిక స్థితిని వాస్తవికంగా విశ్లేషించడంలో దక్షత కలిగిన ఒక సాహసిక విప్లవ కమ్యూనిస్టు ఆర్గనైజర్, భారత కార్మికవర్గ ఉత్తమ పుత్రుడి అమరత్వానికి అశృ నయనాలతో వినమ్రంగా విప్లవ జోహార్లు అర్పిద్దాం!

## ట్రైజంక్షన్ ఎస్‌జడ్‌సీ సభ్యుడు కామ్రేడ్ మణివాసగం



కామ్రేడ్ మణివాసగం

పశ్చిమ కనుమల ఎస్‌జడ్‌సీ సభ్యులు కామ్రేడ్ మణివాసగం తమిళనాడుకు చెందినవారు. ఆయన వయసు 57 సంవత్సరాలు. విద్యార్థి దశలోనే విప్లవ రాజకీయాలతో ప్రభావితులై అప్పటి సీపీఐ (ఎంఎల్) (పీపుల్స్‌వార్)లో చేరారు. ఉపాధ్యాయ ఉద్యమంలో కొంతకాలం పనిచేసి 1980ల చివరిలో స్కూల్ టీచర్ ఉద్యోగం వదిలి పార్టీలో వృత్తి విప్లవకారుడిగా విప్లవోద్యమంలోకి వచ్చారు. 2000 సంవత్సరంలో తమిళనాడు రాష్ట్రకమిటీ సభ్యుడయ్యారు. తమిళనాడు రాష్ట్రకమిటీ నాయకత్వాన అర్బన్ కమిటీ ఏర్పడినప్పటి నుంచి అందులో భాగమై పట్టణోద్యమానికి నాయకత్వం వహించారు. రెండుసార్లు అరెస్టయినప్పటికీ శత్రువు నుంచి పార్టీ రహస్యాలను కాపాడారు. 2 సంవత్సరాల తర్వాత 2012లో జైలు నుండి విడుదలైన వెంటనే అజ్ఞాతవాసంలోకి వచ్చి అటవీ ప్రాంతంలో విప్లవోద్యమ నిర్మాణంలో పార్టీకి నాయకత్వం వహించారు. పశ్చిమ కనుమల (కర్నాటక-కేరళ-తమిళనాడు ట్రైజంక్షన్) ప్రాంత ఉద్యమ నిర్మాణంలో తొలి నుండి నాయకత్వ స్థాయిలో పనిచేస్తూ ఎస్‌జడ్‌సీ సభ్యుడిగా నడగని, అట్టపాడి దళాలకు నాయకత్వం వహించారు. ట్రైజంక్షన్ గ్రామీణ ప్రాంతంలోని పట్టణ ఉద్యమ నిర్మాణ కృషిలో భాగమయ్యారు. మధుమేహం వంటి వ్యాధులకు గురైనప్పటికీ ఎల్లప్పుడూ ఆయన చురుకుగానే ఉండేవారు. పార్టీ ఎడ్యుకేషన్ కోసం విప్లవ సాహిత్యాన్ని ఇంగ్లీషులోకి, ఇంగ్లీషు నుండి తమిళంలోకి అనువాదాలు చేయాల్సిన అవసరాన్ని ఒక విప్లవ బాధ్యతగా గుర్తించి మావో రచనలు మొదటి సంపుటితో పాటు అనేక పుస్తకాలను తమిళంలోకి అనువాదం చేసారు. పార్టీ కేడర్లకు అనే విషయాలపై రాజకీయ తరగతులు నిర్వహించారు. సామ్రాజ్యవాదుల బడితొత్తులయిన ప్రతీఘాతుక బ్రాహ్మణవాద హిందుత్వ ఫాసిస్టు బీజేపీ కేంద్ర ప్రభుత్వం తమిళనాడు ఏఐడీఎంకే ప్రభుత్వ ఎస్‌టీఎఫ్ బలగాలు, కేరళ సీపీఎం ప్రభుత్వ థండర్‌బోల్ట్ బలగాలు కలిసి ట్రైజంక్షన్ ప్రాంతంలో కామ్రేడ్స్ మణివాసగంతో పాటు నలుగురు కామ్రేడ్స్‌ను క్రూరంగా హత్య చేసారు. ఆ ప్రాంతంలో ప్రజాయుద్ధానికి పునాదులు వేసి అత్యంత విలువైన అనుభవాలను అందించిన కామ్రేడ్ మణివాసగంకు తలవంచి నివాళి అర్పిద్దాం.

## దండకారణ్య విప్లవోద్యమంలో నూతన దారులు పరిచిన ధృవతార కామ్రేడ్ సృజన



కామ్రేడ్ సృజన

కామ్రేడ్ సృజన మే 2 నాడు గఢ్‌చిరోలీ జిల్లా ఏటపల్లి తాలూకా సీన్‌భట్టీ అడవిలో చుట్టుముట్టిన సీ-60 కమాండోలతో సాహసంగా పోరాడుతూ అసువులు బాసింది. కామ్రేడ్ సృజన 1988 వేసవిలో గఢ్‌చిరోలీ జిల్లా భామ్రాగఢ్ ప్రాంత విప్లవోద్యమంలో భాగమై గత 33 ఏండ్లుగా భారత నూతన ప్రజాతంత్ర విప్లవ విజయానికై వివిధ స్థాయిలలో బాధ్యతలు నిర్వహిస్తూ 2020 మే 2 నాడు అసువులు బాసింది.

కామ్రేడ్ సృజన చిన్న తనం నుంచి కుటుంబ సభ్యులతో కలసి వ్యవసాయ, కూలీ పనులలో పాల్గొని ఎంతో కష్టపడి చిన్న వయసులోనే శ్రమజీవిగా జీవితానుభావాన్ని గడించింది. గడ్‌చిరోలీ జిల్లా భామ్రాగడ్ తాలూకా గోపనార్ గ్రామంలో ఆర్కీ గోత్రంవారి ఇంట్లో దాదాపు 50 సంవత్సరాల క్రితం జన్మించిన ఆమెకు తల్లి తండ్రులు జైనీగా పేరు పెట్టుకున్నారు. ఆమెకు ఒక చెల్లెలు ఒక అన్న ఉన్నారు. ఆమెకు యుక్తవయసు రాగానే తల్లి తండ్రులు మేనరికానికి ఇచ్చి వివాహం చేశారు. కానీ, ఆ వివాహం ఆమెకు ఎంతమాత్రం ఇష్టం లేకపోవడంతో ఆ బంధాన్ని తెంచుకొంది. ఆ సమయానికే ఆ ప్రాంతానికి నూతనంగా విప్లవోద్యమం విస్తరించింది. 1980 జూన్-జులై మాసాలలో గోదావరి నది దాటి సిరొంచ అడవులలోకి, ఆదివాసులలోకి ప్రవేశించిన విప్లవోద్యమం 1984నాటికి భామ్రాగడ్ చేరుకుంది. తొలినాళ్లలో విప్లవోద్యమం అనేక సమస్యలను ఎదుర్కొన్నప్పటికి అది ప్రజా సమస్యలను చేపట్టి ఉద్యమాలలోకి ప్రజలను సమీకరించడంతో విశాల అడవులలోని ఆదివాసులకు ఉద్యమ వార్తలు దావానలంలా చేరుకున్నాయి. పీడిత ప్రజలకు విప్లవోద్యమం అండగా నిలుస్తుందనే విశ్వాసం జిల్లా ప్రజలలో బలంగా నెలకొంది. ఆదివాసీ ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు తోడు మహిళలు అదనంగా పితృస్వామ్య ఆధిపత్యాన్ని భరిస్తున్నారు. ఆ ప్రజల వెనుకబాటుకు ప్రతిబింబంగా కాలంచెల్లిన సంప్రదాయాల సంకెళ్లలో మహిళ దిక్కు తోచని దుస్థితిలో నలిగిపోతున్న రోజులలో విప్లవోద్యమం వారికి పరిచయం కావడంతో వారిలో జీవితం పట్ల కొత్త ఆశలు చిగురించాయి. వారి జీవన సమరానికి నూతన దారులు తెరుచుకున్నాయి.

1988లో విప్లవోద్యమంలో చేరిన జైని మొదట చిన్నక్కగా పెరిమిళి ప్రాంతంలో మూడేళ్లు పని చేసి 1991లో ఉద్యమ అవసరాల రీత్యా ప్రస్తుత ఉత్తర గఢ్‌చిరోలీలోని టిప్రాగఢ్ ప్రాంతానికి బదిలీ అయింది. దానికి కొద్ది ముందే ఆమె ఉద్యమ సహచరున్ని వివాహమాడింది.

1991-94 మధ్య జిల్లా ఉద్యమం తీవ్రమైన నిర్బంధ పరిస్థితులను ఎదుర్కొన్న కాలం. మహారాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు ఉద్యమ అణచివేత కోసం 'ప్రత్యేక ప్లాను'ను రూపొందించి, ముమ్మర సంస్కరణలను చేపట్టి మరోవైపు జిల్లాలో సీ-60 పేరుతో నూతన కమాండో బలగాలను ఏర్పర్చింది. ప్రత్యేకించి టిప్రాగఢ్ ప్రాంతంలో పోలీసు దాడులతో పాటు ప్రజా వ్యతిరేక శక్తులు, ఇన్ఫార్మర్లు దళాన్ని మట్టుబెట్టడానికి, అడవిలో నిక్షిప్తం చేసుకున్న పార్టీ నిధుల ఆరా తీయడానికి పెద్దెతున గాలింపులు జరుపుతున్న సమయంలో కామ్రేడ్ సృజన దృఢంగా నిలబడి ప్రజలతో కలసిపోయి అహర్నిశలు ఉద్యమాన్ని కాపాడు కోవడానికి కృషి చేసింది. తన దళం బాధ్యులు మడిమతిప్పి శత్రు పక్షం వహించి విప్లవకారులను బలహీనపరచడానికి పూనుకున్నపుడు వారి ప్రతీఘాతుక చర్యలను ప్రజలలో బట్టబయలు చేయడంలో చురుగ్గా పాల్గొంది.

ఉద్యమాన్ని ఉన్నత స్థాయికి పురోగమింపచేయడానికి పార్టీ 1995లో నిర్మించిన తొలి ప్లాటూన్‌లో కామ్రేడ్ సృజన సభ్యురాలుగా చేరింది. అందులో మూడేళ్లు పని చేసి సైనిక రంగంలో మంచి అనుభవాన్ని సంపాదించింది. 1998లో ఉద్యమ అవసరాల రీత్యా మాస్‌వర్క్‌కు బదిలీ అయి కసన్‌సూర్‌లో ఏ.సీ. బాధ్యతలు చేపట్టింది. అప్పటినుండి దాదాపు 22 సంవత్సరాలు ఆ ప్రాంతంలోనే ప్రజల మధ్య పని చేసి ఆర్.సీ. స్థాయికి ఎదిగింది. కామ్రేడ్ సృజన 2004లో డివిజనల్ కమిటీలోకి ఎన్నికైంది. ఆ తరువాత 2006లో గఢ్‌చిరోలీ ఉద్యమం రెండు డివిజన్‌లుగా అభివృద్ధి కావడంతో కామ్రేడ్ సృజన ఉత్తర గఢ్‌చిరోలీ డివిజన్‌లో భాగమైంది.

కామ్రేడ్ సృజన 2009లో ఆర్.సీ.ఎమ్.గా ఎన్నికైంది. విప్లవోద్యమాన్ని నిర్మూలించడానికి శత్రువు చేపట్టిన ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ఎదుర్కోవడానికి 2013లో ఏర్పడిన ఏకీకృత కమాండ్‌లో కామ్రేడ్ సృజన భాగమై మాస్‌వర్క్, మిలటరీవర్క్‌లో మంచి అనుభవాన్ని సంపాదించింది. కామ్రేడ్ సృజన పార్టీలోనే చదువు నేర్చుకొని ఆర్.సీ. స్థాయిలో ఉద్యమానికి నాయకత్వాన్ని అందించింది. ఉద్యమం ఎదుర్కొంటున్న అనేక జటిల సమస్యలను పరిష్కరించడంలో తన కమిటీలో చర్చించడమే కాకుండా వివిధ పార్టీ వేదికలపై వాటిని ప్రవేశపెట్టి సమష్టి పరిష్కారాలలో పాలు పంచుకునేది. సమాజంలో పితృస్వామ్యాన్ని నిర్ద్వంద్వంగా వ్యతిరేకించి ఉద్యమ బాటపట్టిన కామ్రేడ్ జైనీ పార్టీలో మహిళా సబ్ కమిటీలో కొంత కాలం పని చేసి పార్టీలోని, ఉద్యమంలోని, సమాజంలోని మహిళల సమస్యలను మావోయిస్టు సిద్ధాంత కోణంలో అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ భూస్వామ్య పితృస్వామ్యంపై గట్టిపోరాటం చేసింది.

ఆమె భర్తీ అయిననాటి నుండి మొదలుపెట్టి తొలి ప్లాటూన్‌లో సభ్యురాలు కావడం నుండి చివరివరకు కొనసాగిన తన సుదీర్ఘ విప్లవానుభవంలో దాదాపు 30 ఘటనలలో శత్రువును ఎదుర్కొంది. శత్రువును దెబ్బతీయడానికి రూపొందించుకున్న అనేక మాటుదాడులలో ఆమె చురుగ్గా పాల్గొంది. ఆమె సుదీర్ఘ విప్లవజీవితంలో శత్రు దాడుల నుండి ప్రజల అండతో తృటిలో తప్పుకున్న ఘటనలు అనేకం ఉంటాయి. వివిధ ఘటనలలో శత్రు కాల్పులకు సహచరులు అసువులు బాసినపుడు ఒక చేత్తో కన్నీరు తుడుచుకుంటూ మరోచేత్తో వారి అంత్యక్రియలు జరిపి వారి ఆశయాల సాధనకై తుదివరకూ పోరాడుతామని శపథం చేసి నెరవేర్చిన ధీశాలి ఆమె. కామ్రేడ్ సృజన అంతిమంగా మే 2నాడు జరిగిన ఘటనలో కూడా శత్రువుతో ముఖాముఖి తలపడుతూ తన ప్రాణప్రదమైన కేడర్లను కాపాడుతూ తాను ఆత్మత్యాగం చేసింది. ఆమె పోరాటం, సాహసం, చాకచక్యత ప్రతి గెరిల్లాకు ఆదర్శం.

కామ్రేడ్ సృజన సుదీర్ఘకాలం ఒకే ఏరియాలో బాధ్యతాయుతంగా పని చేయడంతో పాటు స్థానిక ప్రజలతో మమేకమైన తీరు, ఆమె సున్నితమనస్తత్వం, వినయం, ఆదర్శవంతమైన సహచర జీవితం, వీరయోధగా పోరాడుతూ శత్రుదాడిలో కేడర్‌ను కాపాడి ప్రాణత్యాగం చేయడం లాంటి విప్లవ లక్షణాలు గల సృజన అమరత్వం ప్రజలను, కేడర్‌ను దుఖ సాగరంలో ముంచింది.

కామ్రేడ్ సృజన ఉద్యమంలోని అన్ని రంగాలలో మంచి అనుభవాన్ని గడించింది. పార్టీ కేడర్ల, పీ.ఎల్.జీ.ఏ, గెరిల్లాల ప్రజల అపార విశ్వాసాన్ని చూరగొన్న తొలితరం విప్లవకారిణి కామ్రేడ్ సృజనకు తలవంచి విప్లవ జోహార్లర్పిస్తూ ఆమె ఆశయాల పరిపూర్తికై తుదివరకూ పోరాడుదామని శపథం చేద్దాం.

## పిలుపు రంగనాథంకి జోహార్లు

తూర్పు గోదావరి జిల్లా పుట్టుకొండ గ్రామానికి చెందిన రంగనాథం విద్యార్థి దశలోనే విప్లవ రాజకీయాలతో ప్రభావితం అయ్యాడు. విప్లవ రచయితల సంఘం, ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యవర్గాల్లో చాలాకాలం పని చేశారు. 'పిలుపు' విప్లవ రాజకీయ పత్రికా నిర్వహణలో భాగమయ్యాడు. అందుకే ఇప్పటికీ ఆయన్ని పరిచయస్తులు 'పిలుపు' రంగనాథంగనే పిలుచుకుంటారు.

శ్రీకాకుళ పోరాట కాలంలోనే విప్లవ రాజకీయ ప్రచారానికి పత్రికా ఆరంభమైంది. పిలుపు పక్ష పత్రిక ఆ తర్వాత విప్లవ రాజకీయ పత్రికలకు ఒరవడిని అందించింది. కా.ఎం.టీ.ఖాన్ పబ్లిషర్‌గా, రంగనాథం సంపాదకుడిగా పిలుపు 1972 ఆగస్టు 1 సంచికతో ప్రారంభమైంది. చారుమజుందార్ మార్గంలో, శ్రీకాకుళ పోరాట స్ఫూర్తితో అప్పటి విప్లవోద్యమ నాయకుడు కా. కొండపల్లి సీతారామయ్య ఆధ్వర్యంలో పిలుపు వెలువడి చారిత్రక పాత్ర పోషించింది. విప్లవోద్యమ శిబిరంలో అతి మితవాదాల మధ్య చర్చలు తీవ్రంగా కొనసాగుతున్న సమయంలో నక్సల్బరీ శ్రీకాకుళ

సాయుధ పోరాటంలో జరిగిన లోపాలను గుర్తిస్తూ ప్రజాయుద్ధ పంథాలో వాటిని ముందుకు తీసుకపోవడంలో పిలుపు కీలకంగా పనిచేసింది. గతాన్ని సమీక్షించుకొని పునర్నిర్మాణమవుతున్న విప్లవోద్యమ ప్రచార వేదికగా పని చేసింది.

కామ్రేడ్ రంగనాథం విప్లవోద్యమ వక్తగా, రచయితగా, పత్రికా సంపాదకుడిగా విరసం, పౌరహక్కుల సంఘం నాయకుడిగా తెలుగు ప్రాంతాలన్నీ తిరిగారు. ఎమర్జెన్సీ వరకూ (1975 జూన్ 16 సంచిక) ఈ పత్రిక నడిచింది. సికిందరాబాద్ కుట్రకేసులో పిలుపు పత్రిక బాధ్యులుగా ఎంటి ఖాన్‌ను, రంగనాథంను నిందితులుగా చూపి 1974మే 18న ప్రభుత్వం అరెస్టు చేసింది. 'ప్రభుత్వాన్ని హింసాత్మక పద్ధతుల ద్వారా పడగొట్టాలనే కుట్ర లక్ష్యాలను ప్రచారం చేయడానికి ఈ నిందితుడు సభల్లో మాట్లాడి విద్యార్థులను, నిరుద్యోగ యువకులను, మిలిటెంట్ క్యాడర్‌ను, ప్రజలను ఆయుధాలు తీసుకుని సాయుధ పోరాట కార్యక్రమంలో చేరమని రెచ్చగొట్టాడు" అని సికిందరాబాద్ కుట్రకేసు చార్జిషీట్‌లో ఆరోపించారు. ఈ కేసులో రంగనాథం బెయిల్ మీద విడుదలయ్యారు. ఆ తర్వాత 1975 ఏప్రిల్‌లో ప్రపంచ తెలుగు మహాసభలను బహిష్కరిస్తూ ఎల్ బి స్టేడియం గేటు దగ్గర శ్రీశ్రీతో పాటు ప్రదర్శన జరిపి అరెస్టయ్యారు. జూన్ 25న ఎమర్జెన్సీ విధించగానే మళ్లీ అరెస్టయి ఎమర్జెన్సీ అంతా జైల్లోనే ఉన్నారు. ఆ ఎమర్జెన్సీ ఎత్తేశాక కొద్ది కాలం ప్రజా ఉద్యమాల్లో క్రియాశీలంగా ఉన్నారు. ఆ తర్వాత నేరుగా ప్రజాసంఘాల్లో లేకపోయినా విప్లవాభిమానంగా జీవించారు. కడ దాకా విప్లవోద్యమ విలువలకు కట్టుబడి ఉన్నారు. రంగనాథం ఫిబ్రవరి 18న సికింద్రాబాదులో స్వగృహంలో వృద్ధాప్యంతో కన్నుమూశాడు. ఆయనకు విప్లవ జోహార్లు.

మన అమరులు తమ తుదిశ్వాస వరకు ఎత్తిపట్టిన సమున్నత ఆశయం, నెలకొల్పిన గొప్ప ఆదర్శాలు, ఉన్నత కమ్యూనిస్టు విలువలు, త్యాగ సాంప్రదాయాలు, సాహసం, దృఢసంకల్పం, శత్రువు పట్ల కసి, ప్రజల పట్ల, కేడర్ల పట్ల ప్రదర్శించిన ప్రేమాభిమానాలు, వారి సాదాసీదా జీవనశైలి, కష్టాలకు వెనుదీయని ధీరోదాత్తత నుంచి మనమంతా నేర్చుకుందాం. వారు కలలు గన్న దోపిడీ, పీడనలు లేని నూతన సమాజం కోసం చివరి ఊపిరి వరకు పోరాడుతామని శపథం చేద్దాం.

## మార్పు సీతారామయ్యకు శ్రద్ధాంజలి

రైతు ఉద్యమ నేత మార్పు సీతారామయ్య (82) అనారోగ్యంతో ఏప్రిల్ 19న శ్రీకాకుళం జిల్లాలోని మదనాపురంలో మృతిచెందారు. ఆ జిల్లాలో తొలితరం కమ్యూనిస్టు, స్వాతంత్ర సమర యోధుడు, రైతు ఉద్యమ నేత, పౌర హక్కుల నాయకులుగా ఈయన ప్రసిద్ధి చెందిన వారు. తన పద్నాలుగో యేటనే తండ్రితోపాటు జైలు జీవితాన్ని గడిపారు. 1984లో సోంపేట-మందస రైతాంగం ఐక్య కార్యాచరణగా సాగించిన పోరాటానికి సీతారామయ్య మందస మండలం బాలిగాం-హరిపురం కూడలిలో నిరాహార దీక్షలో రెండు వారాలపాటు కూర్చొని అప్పటి ప్రభుత్వం కళ్లు తెరిపించారు. తాగునీటి కోసం కళింగదళ్, డబార్సింగి నీటి పారుదల ప్రాజెక్టుల సాధనకు సీతారామయ్య ఉద్యమించి ప్రాజెక్టుల జలాలను పొలాలకు మళ్లించే పోరాటంలో కీలక పాత్రను నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘానికి శ్రీకాకుళం జిల్లా శాఖ అధ్యక్షునిగా బాధ్యత వహించారు. 1996 మార్పు పద్మనాభం స్మారకంగా నెలకొల్పిన 'మార్పు గ్రంథాలయం' నిర్వహణలో ప్రధాన పాత్రను నిర్వహించారు. వీరికి క్రాంతి సంపాదక మండలి శ్రద్ధాంజలి ఘటిస్తుంది.

## పొత్తూరి వెంకటేశ్వరరావుకు శ్రద్ధాంజలి

ప్రముఖ పాత్రికేయులు పొత్తూరి వెంకటేశ్వరరావు (86) కన్నుమూశారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మార్చ్ 5న హైదరాబాద్‌లోని విజయనగర్‌కాలనీలో మరణించారు. పొత్తూరి వెంకటేశ్వరరావు 1934 ఫిబ్రవరి 8న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా పొత్తూరులో జన్మించారు. ప్రభుత్వాన్ని, నక్సలైట్లను శాంతి చర్చలకు ఒప్పించడంలో పౌరస్పందన వేదికసభ్యుడిగా కీలకపాత్ర పోషించారు.

ప్రజా జీవితంలో క్రియాశీలంగా ఉన్న పొత్తూరి జీవితం వైవిధ్యంతో కూడుకున్నది. ఆయన ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమర్థకుడు. ప్రజాస్వామికవాది. ఎన్‌కౌంటర్లు లేని సమాజాన్ని ఆకాంక్షించాడు. ప్రభుత్వం నక్సలైట్ల మధ్య చర్చలు జరగాలని, శాంతినెలకొనాలని పౌరస్పందన వేదిక ద్వారా క్రియాశీలంగా కృషి చేసారు. నల్లమలకు వెళ్లి నక్సల్స్ ప్రతినిధులతో కలిసి మాట్లాడిన బృందంలో ఉన్నారు. విప్లవకారుల ఆశయాలపట్ల, వ్యక్తిత్వాల పట్ల గౌరవం, నమ్మక ఉన్న వ్యక్తి. ఇటీవల అర్బన్‌నక్సల్స్ పేరిట జరుగుతున్న అరెస్టులను, ఫాసిస్టు నిర్బంధాన్ని ఖండించారు. శాంతి చర్చల విఫలం కావడానికి ప్రభుత్వమే కారణమని నిజాయితీగా మాట్లాడేవారు.

2013 నుండి మల్టిపుల్ మైలోమా అనే బ్లడ్‌క్యాన్సర్ కారణంగా దీర్ఘకాలం తీవ్రమైన అనారోగ్యంతో ఉండి 2020 మార్చ్ 5న తుదిశ్వాస విడిచారు. విప్లవ మిత్రులు పొత్తూరి వెంకటేశ్వరావు గారికి క్రాంతి సంపాదక మండలి వినమ్రంగా శ్రద్ధాంజలి ఘటిస్తుంది.

ఈ మధ్య కాలంలో కొత్త ఢిల్లీలో సీఆర్‌పీపీ అధ్యక్షుడు సయ్యద్ అబ్దుల్ రహమాన్ గిలాని, చెన్నైలో సీపీడీఆర్ కార్యకర్త సుకుమార్, తెలంగాణలో రైతు ఉద్యమ నాయకుడు కాశపోగుల ప్రభాకర్ అనారోగ్యంతో మృతి చెందారు. వీరికి క్రాంతి సంపాదక మండలి శ్రద్ధాంజలి ఘటిస్తుంది. ★

## 4 దశాబ్దాల తూర్పుకనుమల విప్లవోద్యమంలో భాగంగా జరిగిన

# కాఫీ ప్లాంటేషన్స్ స్వాధీనం కోసం ప్రజా పోరాటాలు

విశాఖజిల్లాలో అత్యధిక శాతం ఆదివాసీ జనాభా గల 11 మండలాలు (గూడెం క్రొత్తవీధి, కొయ్యూరు, చింతపల్లి, జీ.మాడుగుల, పెదబయలు, ముంచింగిపుట్, పాడేరు, హుకుంపేట, డుంబ్రి గూడా, అరకు, అనంతగిరి) ఎతైన కొండలు, గుట్టలతో, కొన్నిచోట్ల దట్టమైన అడవులతో అతిశీతల (చల్లటి) వాతావరణాన్ని కలిగి ఉంటాయి. ఇక్కడ వర్షపాతం కూడా అధికంగానే ఉండి సంవత్సరం పొడవునా జలజల పారే జీవగడ్డలు, నదులతో, పచ్చటి ప్రకృతితో అలరారుతుంటుంది. అరుకు, అనంతగిరి, చింతపల్లి, లంబసింగి ప్రాంతాలు శీతాకాలంలోని ఉష్ణోగ్రతలు 5 డిగ్రీ సీ కన్నా తక్కువగా ఉంటూ కశ్మీర్, ఊటీలను తలపిస్తాయి. అరకును ఆంధ్రా కశ్మీర్‌గా పిలవడం కద్దు-ఒక్క మాటలో ఇక్కడి వాతావరణ పరిస్థితులు కాఫీ తోటల పెంపకానికి అత్యంత అనుకూలంగా ఉంటాయి.

ఇది గమనించిన భారత దోపిడీ పాలకవర్గాలు ఫారెస్టు డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో అప్పటివరకూ అక్కడి ఆదివాసీ ప్రజల స్వేచ్ఛా వినియోగంలో ఉన్న కొన్ని వేల ఎకరాల అడవి భూముల్ని బలవంతంగా దురాక్రమించి కాఫీ ప్లాంటేషన్స్‌ను చేపట్టాయి. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ (ఏపీఎఫ్‌డీసీ) ఏర్పడి పనిచేస్తున్నది. ఇది 1970ల తదుపరి ప్రారంభమై కొనసాగుతున్నది. అలాగే కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కాఫీతోటలపై ప్రత్యేక పరిశోధన మరియూ అభివృద్ధి లక్ష్యంతో ఒక బోర్డ్ ఏర్పడి పనిచేస్తున్నది. (సెంట్రల్ గర్నమెంట్ కాఫీ రీసెర్చ్ అండ్ డవలప్‌మెంట్ బోర్డ్) ఇది తన పరిశోధనల ద్వారా కాఫీలో నూతన వంగడాలను ఉత్పత్తి చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఏపీఎఫ్‌డీసీ కాఫీతోటల్ని పెంచుతుంది.

### ఏపీఎఫ్‌డీసీ కాఫీతోటలు - వాటి నిర్వాహణ

ఏపీఎఫ్‌డీసీ నిర్వాహణలో 4 వేల హెక్టార్లలో (10 వేల ఎకరాలు) కాఫీ ప్లాంటేషన్స్ విస్తరించి ఉన్నాయి. వీటిని 6 డివిజన్స్‌గా విడగొట్టారు. గూడెం క్రొత్తవీధి మండల పరిధిలో ఆర్.వీ. నగర్ ఈస్ట్, వెస్ట్ డివిజన్స్, చింతపల్లి మండల పరిధిలో చింతపల్లి నార్త్, సౌత్ డివిజన్స్, పాడేరు, పెదబయలు మండలాల పరిధిని పాడేరు డివిజన్‌గా, అరకు, అనంతగిరి మండలాల పరిధిని అనంతగిరి డివిజన్‌గా వ్యవహరిస్తున్నారు.

ఒక్కొక్క డివిజన్ పరిధిలో వేరు వేరు చోట్ల అనేక కాఫీ ఎస్టేట్స్ ఉంటాయి. ఒక్కొక్క ఎస్టేట్ పరిధిలో అనేక కాఫీ బ్లాక్స్ ఉంటాయి. ఒక్కోక్క బ్లాక్ పరిధిలో అనేక బిట్స్ రూపంలో కాఫీ తోటల్ని పెంచారు.

సంవత్సరం పొడవునా ఇందులో పనులు ఉంటాయి. కాఫీ ప్లాంటేషన్‌కు కొండ ఏటవాలుగా ఉండాలి. నీరు నిలువ ఉండకూడదు. కాఫీ విత్తులతో ముందుగా నారుమొక్కలు (నర్సరీ) పెంచుతారు. ఇవి సుమారు 20 సెం. మీ ఎదిగాక వాటిని నిర్ణయించిన ప్రాంతంలో అప్పటికే ఏర్పరచిన గోతుల్లో నాటుతారు. ముందు పెద్ద పెద్ద చెట్లకింద ఉన్న తుప్పల్ని నరికిస్తారు. తర్వాత గోతులు తీసి 2-3 రోజుల తర్వాత మొక్కల్ని నాటుతారు. నర్సరీ కాలంలో మొక్కలు తయారయ్యే వరకూ వాటికి పందిరి వేసి పెద్ద పెద్ద కొమ్మలతో నీడను ఏర్పాటు చేస్తారు. రోజూ నీళ్ళు పోస్తారు.

ప్రతి సంవత్సరము ఈ కాఫీ పంట ద్వారా ఏపీఎఫ్‌డీసీ కోట్లాది రూ॥లను ఆర్జిస్తున్నది. విశాఖ కాఫీకి అత్యంత నాణ్యమైనదిగా గుర్తింపు ఉంది. ఇప్పటికి అనేక మార్లు నాణ్యమైన కాఫీగా ఇది అంతర్జాతీయ గుర్తింపును, అవార్డును అందుకుంది. ప్రత్యేకించి ప్రభుత్వ గిరిజన సహకార సంస్థ (జీసీసీ) 'అరకు కాఫీ' పేరుతో కాఫీపొడి విక్రయాల్ని చేస్తున్నది.

### స్థానిక ఆదివాసీ ప్రజలపై వీటి ప్రభావం

దీని ద్వారా ప్రభుత్వ కాఫీ తోటలు విస్తరించిన వివిధ మండలాల్లోని వందలాది గ్రామాల ప్రజలంతా తాము తర తరాలుగా స్వేచ్ఛగా అనుభవిస్తూ వచ్చిన అడవిపై అధికారాన్ని, జీవనాధారాన్ని కోల్పోయి నిరాశ్రయులై ఈ తోటల్లో శ్రమను అమ్ముకునే దినసరి కూలీలుగా మారిపోయారు. ప్రభుత్వ అధికారుల దీపిడీ దౌర్జన్యాలకు, పీడనలకు ప్రజలు గురయ్యే పరిస్థితి దాపురించింది. ఇక మహిళల పరిస్థితి చెప్పనలవి కాదు. లింగ వివక్ష, లైంగిక పీడన, అత్యాచారాలు లాంటివి వీరిపై సాధారణ వయ్యాయి. పనికి కాస్త ఆలస్యమైనా, వేగంగా పనిచేయకున్నా పూర్తి మస్టర్ కాకుండా 1/2 మస్టర్ వేస్తామంటూ అధికారులు చేసే అదిరింపులు, బెదిరింపులు నిత్యం పడాల్సి వచ్చేది. పనిలో ప్రమాద వశాత్తు గాయపడినా, మరణించినా, జబ్బుపడినా నష్టపరిహారం కాదు సరికదా వైద్య చికిత్స కూడా అందేది కాదు. వారాని కొకసారి అందించే కూలి డబ్బులు కూడా సక్రమంగా ఇచ్చేవారు కాదు. అదేమని అడిగితే ఇక నుంచి నువ్వు పనిలోకి రావాల్సిన అవసరం లేదు పొమ్మనేవారు. ప్రభుత్వం నిర్ణయించిన దినసరి కూలీ, కాఫీ పండ్ల సేకరణ రేటు అతి తక్కువగా ఉండేది. 1 హెక్టారు కాఫీ తోటలో చేయాల్సిన పనికి ప్రభుత్వం నిర్ణయించిన దానికన్నా తక్కువ మస్టర్లకే పనిచేయిస్తూ కూలీలచే బానిసల్లాగా గొడ్డు చాకిరీ చేయించడం జరిగేది. ఊర్ల చుట్టూ భూమినంతా ఫారెస్టు ఆక్రమించటంతో ప్రజలకు గొడ్డు గోదా, గొర్రె, మేక తోలుకోడానికి కూడా జాగా కరువయ్యింది. పిల్లలకు తినడానికి 4 జొన్న మొక్కలు నాటుదామనుకున్నా చిన్న దొడ్డి ముక్క కూడా లేకుండయ్యింది.

కొన్ని దశాబ్దాల క్రితం శ్రీలంక నుంచి కొన్ని వందల తమిళ కుటుంబాలు కట్టుబట్టలతో వచ్చి ఈ కాఫీతోటల ప్రాంతంలో కాందిశీకులుగా స్థిరపడ్డారు. ఈ తోటల్లో కూలీలుగా శ్రమను అమ్ముకోవడమే వీళ్ల జీవనాధారం తప్ప ఇతర వ్యాపకాలు ఏమీలేక ఫారెస్టు యాజమాన్య దయా, దాక్షిణ్యాలపై ఆధారపడి జీవించాల్సి వచ్చేది. వీళ్లు జీవించడానికి పేరుకు కాలనీలే తప్ప అది నివాస యోగ్యంగా ఉండేవికావు. వర్షాలకు ఇండ్లంతా కారుతూ ఉండేవి. త్రాగునీటి సౌకర్యం, విద్య, వైద్య సౌకర్యం ఉండేది కాదు. కరెంటు కూడా అంతంత మాత్రమే. ఒకరోజు ఉంటే వారం రోజుల ఉండదు. చుక్కల వెలుతురులో కాలం వెల్లబుచ్చాల్సిందే. కాఫీతోటల్లో కూలీ పని తప్ప వేరే గత్యంతరం లేని రీత్యా కూలీకి వెళ్లి వచ్చిన డబ్బులతోనే కడుపు నింపుకోవాలి. కూలి దొరక్కపోతే పస్తులుండాల్సిందే. పనికి గ్యారంటీ ఉండేది కాదు. ఫారెస్టు ఉద్యోగుల అడుగులకు మడుగులొత్తుతూ కుక్కిన పేనుల్లా కిమ్మనకుండా బానిసల్లాగా గొడ్డుచాకిరీతో బ్రతుకులు వెళ్లదీసే వాళ్లు. కాఫీతోటల పరిసర గ్రామాలలోని రైతులు కూడా తమకున్న అరా, కొరా భూముల్లో వ్యవసాయ పనులు ముగిసాక కాఫీతోటల్లోని కూలి పనులకు వెళ్తుండేవారు. వీళ్లు కూడా పైన చెప్పినలాగే ఫారెస్టు ఉద్యోగుల దోపిడీ పీడనలననుభవించాల్సిందే. లేకుంటే పని దొరక్క ఉన్న చాలిచాలని భూముల్లోని ఎటూచాలని ఫలసాయంతో అర్ధాకలితో కాలం గడపాల్సి వచ్చేది. ఈ స్థానిక కూలీలకు తోడు కాఫీపండ్ల సేకరణ సమయంలో అవసరమయ్యే అదనపు లేబర్‌గా వేలసంఖ్యలో గిరిజనులు ఇతర దూరపు ప్రాంతాలనుంచి వచ్చి ఎస్టేట్స్‌లోనే నెలల తరబడి ఉండి (తాత్కాలికంగా వేసుకున్న గుడిసెలలో వండుకొని తింటూ) శ్రమను అమ్ముకునే వాళ్లు. వీళ్లు స్థానికేతరులు కావడంతో మరింత అభద్రతా భావంతో స్థానిక లేబర్ కన్నా ఎక్కువగా ఉద్యోగులకు అణిగి మణిగి ఉండేవాళ్ళు. దీన్ని ఆసరాగా చేసుకొని స్థానిక-స్థానికేతర కూలీల మధ్య వైరుధ్యాలను సృష్టించి యాజమాన్యం తన పబ్బం గడుపుకోజూసేది.

కొన్ని సార్లు చాటుమాటుగా కూలీలు ఏరిన కాఫీ పండ్లను దాచుకొని విడిగా అమ్ముకోజూస్తే ఇండ్లపై దాడులు చేసి దొంగతనం అంటగట్టి ఉన్నదంతా డిపార్టుమెంట్ దోచుకునిపోయేది. ఫారెస్టు డిపార్టుమెంట్ కూడా పోలీసుల వలే ఖాకీ యూనిఫాంలు ధరించి మందలు మందలుగా ఊర్లపై బడి లాఠీలతో ప్రజల్ని కుళ్లబొడిచి భయభ్రాంతులకు గురిచేసే వాళ్లు. అదీ చాలదనుకుంటే అక్రమ కేసులు పెట్టి పోలీసులచే అరెస్టులు చేపించడం స్టేషన్‌లో లాఠీలు విరిగేలా కొట్టించడం, తప్పుడు కేసులతో జైళ్లకు పంపడం లాంటివి కూడా చేసేవాళ్లు ఒక్కమాటలో వాళ్ళదే రాజ్యం అయింది.

ఇలా సిలోన్ లేబర్, స్థానిక లేబర్, క్యాంపు లేబర్ అనే 3 రకాలుగా కూలీలు తమ రక్తాన్ని స్వేదంగా మార్చి ప్రభుత్వం ప్రతి సంవత్సరము తమ లక్ష్యంగా నిర్ణయించే కాఫీ పండ్ల ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించేలా సంవత్సరము పొడవునా చాకిరీ చేస్తే ప్రతిఫలంగా వీరికి మిగిలేది చాలిచాలని ఎంగిలి మెతుకుల్లాంటి కూలి డబ్బులే. మరోపక్క వీళ్ల రక్తాన్ని జలగల్లాగా జుర్రుకునేలా దీనిపై ఆధారపడుతున్న ప్రభుత్వ యంత్రాంగంలోని ఉన్నత ఉద్యోగులు నెలసరిగా వేలాది లక్షలాది రూపాయల్ని జీతాలుగా పొందుతూ విలాస జీవితాన్ని గడుపుతారు. ఏపీఎఫ్‌డీసీకి వచ్చే సూపర్ లాభాలంతా శ్రమజీవులను నిలువునా కొల్లగొట్టినదేననడంలో అతిశయోక్తి లేదు.

## రివిజనిస్టు పార్టీల కార్యాచరణ

మొదటగా కాఫీ కూలీలలో సీపీఐకి చెందిన యూనియన్ ఉండేది. తదుపరి క్రమంగా సీపీఐ (ఎం) కూడా ఇందులో ప్రవేశించింది. ఓట్ల రాజకీయాలతో కాలం వెల్లబుచ్చడం తప్ప ప్రజల్ని సంఘటితపర్చి ఉద్యమాల వైపుగా వీరెప్పుడూ నడుపలేదు. కాఫీ కార్మికుల యూనియన్ కూడా దీనికి నకలుగానే ఉండేది. సభ్యత్వాలు చేర్పించడం, చందాలు దండుకోవటం, మొక్కుబడిగా మేడే సభలు జరపటం చేసే వాళ్ళు. కూలీల వత్తిడితో కొన్నిసార్లు సమ్మెలు ప్రారంభించినా అవి తీవ్రతరం కాకుండా జాగ్రత్తపడుతూ యాజమాన్యంతో రాజీపడి ఉద్యమాలను నీరుగార్చడంగా వీరి ఆచరణ సాగింది.

## విప్లవ పార్టీ ప్రవేశంతో పుంజుకున్న ప్రజా ఉద్యమం

భారత నూతన ప్రజాస్వామిక విప్లవోద్యమ లక్ష్యంతో తూర్పు కనుమల విశాఖ జిల్లాలోని మణ్యంలోకి 'రైతాంగ గెరిల్లా దళాల' రూపంలో విప్లవ పార్టీ 1980 సంవత్సరం ప్రవేశించి పీడిత ప్రజల్ని తమ మౌలిక సమస్యలపై సమీకరిస్తూ ఉద్యమంపజేసింది. ఈ క్రమంలో కాఫీతోటల్లో పనిచేస్తున్న వివిధ రకాల అసంఘటిత కార్మికుల్ని విప్లవసంఘాల్లో సంఘటితపర్చి తమ సమస్యలపై పోరాడేలా నేతృత్వాన్ని అందించింది. సిలోన్ లేబర్, క్యాంపు లేబర్ కాఫీ కార్మిక సంఘాలుగా ఏర్పడి తమకు నాయకత్వ నిర్మాణాలుగా పోరాట కమిటీలను ఎన్నుకున్నాయి. స్థానికంగా ఉన్న గ్రామాల ప్రజలు ఆదివాసీ రైతుకూలీ సంఘాలను ఏర్పర్చుకొని వాటి నాయకత్వంలో ఏపీఎఫ్‌డీసీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా **దశాబ్దాలుగా అంచెలంచెలుగా వివిధ సందర్భాలలో** పోరాడారు.

## ప్రజలు తమ పోరాటాలలో ముందుకు తెచ్చిన డిమాండ్లను క్రోడీకరిస్తే...అవి

1. దినసరి కూలీని పెంచాలని, 2. కాఫీ పండ్ల సేకరణ రేటును పెంచాలని,3. ఇతర ఆధారాల్లేకుండా కాఫీతోటలపైనే ఆధారపడి జీవిస్తున్న వారిని పర్మినెంటు కార్మికులుగా గుర్తించాలని, 4. నెలలో శెలవులను మినహాయించి మిగిలిన దినాల్లో పనిని తప్పనిసరి కల్పించాలనీ, 5. 8 గం॥ల నియమిత పని దినాన్ని అమలు జరపాలని, 6. కుంటి సాకులతో మస్టర్ల కోతను వ్యతిరేకిస్తూ, 7. యాజమాన్య నియంతృత్వ పద్ధతులను వ్యతిరేకిస్తూ, 8. పని

క్రమంలో ప్రమాదవశాత్తు గాయపడిన వారికి, మరణించిన వారికి వైద్యం అందించాలని, నష్టపరిహారం ఇవ్వాలనీ, 9. శ్రీలంక కాందిశీకులు నివసించే కాలనీలలో విద్య, వైద్యం, కరెంటు, త్రాగునీరు, సరైన గృహవసతి ఇత్యాది సంక్షేమ చర్యలకోసం,10. ప్లాంటేషన్ కండక్టర్లను పర్మినెంటు ఉద్యోగులుగా గుర్తించాలనీ, 11. కాఫీ పండ్ల దొంగతనం పేరుతో గ్రామాలపై ఫారెస్టు డిపార్టుమెంట్ చేస్తున్న దాడులను బంద్ పెట్టాలని,12. అక్రమ అరెస్టులు, కేసులు ఉండకూడదనీ, 13. మహిళా కూలీలపై జరుగుతున్న వివక్షలు, లైంగిక పీడనలకు వ్యతిరేకంగా, 14. కాఫీ పండ్ల తప్పుడు తూకాలను వ్యతిరేకిస్తూ,15. పేమెంట్ సక్రమంగా వారానికొకసారి ఇవ్వాలనీ ఇత్యాదిగా ఉన్నాయి.

1982-83 సంIIలో రోజువారీ కూలీ - 6 రూIIలు, 1 కేజీ కాఫీ పండ్ల సేకరణకు - 30 పైసలు. కాంట్రాక్టు పద్ధతిలో మూర వెడల్పు, మూర లోతు లెక్కన 100 గోతులను త్రవ్వితే - 15 రూIIలు ఇచ్చేవాళ్లు. సాధారణంగా ఒక కూలీ రోజుకు 30-35 కన్నా ఎక్కువ గోతులు త్రవ్వలేదు. దీన్ని బట్టి ఎంత తక్కువ కూలీ ఇచ్చి గిరిజన కూలీలను దోపిడీ చేశారో అర్థంచేసుకోవచ్చు.

1984-85 సంIIలో జరిగిన సమ్మెల ఫలితంగా... రోజు కూలీ 12 రూIIలకు, పీసీలకు రోజుకు 15 రూIIలు ఇవ్వడానికి, కిలో కాఫీ పండ్లు ఏరడానికి 60 పైసలు ఇవ్వడానికి యాజమాన్యం అంగీకరించింది. ఇతర సౌకర్యాల విషయంలో హామీ ఇచ్చి కూడా అమలుజరుపలేదు. సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి పోలీసులను దింపి, అరెస్టులు సాగించి, దౌర్జన్యకాండకు పాల్పడింది మేనేజమెంటు. కానీ ఈ నిర్బంధాన్ని అధిగమిస్తూ సమ్మె విజయవంతం అయింది. ఇలా ఫారెస్టు డిపార్టుమెంట్ సాగించే దోపిడీ విధానాలను ఎదుర్కొంటూ ఆదివాసీ ప్రజలు విప్లవసంఘాల ద్వారా చైతన్యవంతులౌతూ అంచెలంచెలుగా పోరాడుతూ తమ డిమాండ్లను సాధించుకొనే క్రమం కొనసాగింది.

రెండు దశాబ్దాల క్రమంలో సాగిన ఈ పోరాటాల ద్వారా 2005 సంII నాటికి రోజు కూలీ రూII 72.25 పై గానూ 1 కేజీ కాఫీ పండ్లు ఏరినందుకు రూII 1.80 పైసలు గాను రేట్లు పెరిగాయి. దీంతో పాటు మేట్స్ జీతాలు పెరిగాయి. ప్లాంటేషన్ కండక్టర్లు సుదీర్ఘకాలంగా డిమాండ్ చేస్తూ వచ్చిన పర్మినెంట్ ఉద్యోగులుగా వారికి గుర్తింపు లభించింది. ఇందులో విద్యార్హతలున్న వారికి ఫీల్డుమేన్ గ్రేడ్‌వన్, గ్రేడ్ 2 ఉద్యోగులుగా ప్రమోషన్స్ లభించాయి.

ఈ పోరాట విజయాలు ఏపీఎఫ్‌డీసీ కార్మికులు, ఉద్యోగులపై మంచి ప్రభావాన్ని వేశాయి. ఫలితంగా మొత్తం అన్ని డివిజన్స్‌లోని కార్మికులు, క్రింది స్థాయి ఉద్యోగులు వివిధ యూనియన్స్‌లో సంఘటితులై ఉన్నత స్థాయిలో సమన్వయంకోసం నాయకత్వ బాడీలను ఏర్పరచుకున్నారు.

దీంతో ఒక్కొక్క యూనియన్‌లోని వాళ్ల సమస్యలకు మద్దతుగా మిగిలిన యూనియన్స్ కూడా సంఘీభావాన్ని తెల్పడం, యాజమాన్యానికి వ్యతిరేకంగా ఆందోళనలు, నిరసనలు చేపట్టడం జరిగి యాజమాన్యం మెడలు వంచడానికి ఎంతగానో ఉపయోగపడింది. మెజారిటీ డిమాండ్స్ సాధించబడ్డాయి. అయితే ఇదంతా నల్లేరు మీద బండినడకలా సాఫీగా సాగలేదు.

## విరుచుకుపడిన నిర్బంధం-పెరిగిన ప్రజా ప్రతిఘటన

సంఘటిత ఉద్యమాన్ని దెబ్బతీయడానికి యాజమాన్యం మరియూ దోపిడీ ప్రభుత్వాలు పోలీసు బలగాలను ఉసిగొల్పాయి. పర్యవసానంగా అక్రమ అరెస్టులు, దాడులు, జైళ్లు, చిత్రహింసలు పెరిగాయి. ప్రజల్ని భీతావహుల్ని చేయడానికి సంఘ నాయకులైన వనగల ఎర్రబ్బాయి (ఎర్రవరం), కొర్రా లక్ష్మణరావులను పోలీసులు కాల్చిచంపి ఎన్‌కౌంటర్ కట్టుకథలు సృష్టించారు.

నిర్బంధాన్ని తిప్పికొడుతూ ప్రజలు పోరాటాన్ని కొనసాగించారు. యాజమాన్యం మొండి వైఖరిని ప్రదర్శించిన సందర్భాల్లో సమ్మెలు వారాలు, నెలలు పాటు సాగాయి. పోలీసుల అక్రమ అరెస్టులు, దాడులకు నిరసనగా బంద్ పిలుపులు, కాఫీ డిపార్ట్‌మెంట్ ఆస్తుల ధ్వంసాలు సాగాయి. ప్రజలు సామూహికంగా తరలివెళ్లి పాంటేషన్స్‌లోని కాఫీ పండ్లను స్వాధీనం చేసుకొని ప్రైవేటుగా అమ్ముకునేవారు. కూలీలు, ప్రజల మధ్య చీలికలు సృష్టించి విభజించి పాలించే యాజమాన్య విధానాల్ని సమైక్యంగా త్రిప్పికొట్టారు. మొండి ఘటాలుగా ఉంటూ ప్రజాపీడకులుగా యాజమాన్యానికి కొమ్ముకాస్తున్న కొందరికి దేహశుద్ధులు జరిగాయి. ఇలా అనేక రూపాల్లో ప్రజా ప్రతిఘటణ తీవ్రమై పెద్దఎత్తున ఫారెస్టు డిపార్ట్‌మెంట్‌కు ఆర్థిక నష్టం వాటిల్లటంతో చివరికి యాజమాన్యం కాళ్లబేరానికి వచ్చేది. ఒక దశలో యాజమాన్యం అసలే దిగిరాని పరిస్థితుల్లో ప్రజలు రాత్రికి రాత్రి కొన్ని ఎకరాల కాఫీతోటల్ని అడ్డంగా నరికి తమ ఆగ్రహాన్ని వ్యక్తపరిచారు.

విప్లవోద్యమాలపై ప్రభుత్వం తలపెట్టిన పాశవిక నిర్బంధం కొన్నిసార్లు తీవ్రంగా కొనసాగి (1985-87, 2002-04 లలో) దాని ప్రభావంతో తాత్కాలికంగా ప్రజా పునాది, నిర్మాణబలం దెబ్బతినడం లాంటివి సంభవించాయి. ఇలాంటి ఒడిదుడుకులు కాఫీ నిర్మాణాలు, పోరాటాలపై కూడా ప్రభావాన్ని సహజంగానే చూపాయి. ప్రజల నిర్మాణబలం మరియూ చైతన్యం ఉన్నతస్థాయిలో ఉన్నపుడు పోరాటాలు కూడా ఊపుగానూ, మిలిటెంట్‌గానూ సాగి విజయాలను సాధించాయి. దీనికి భిన్నమైన పరిస్థితుల్లో విఫలతలు కూడా ఉన్నాయి. కొన్నిసార్లు కొన్ని సంవత్సరాలు పాటు విప్లవపార్టీతో సత్సంబంధాలు కొనసాగని స్థితిలో కాఫీ పోరాటంలో, ఉద్యమంలో స్తబ్దత నెలకొన్న సందర్భాలు కూడా ఉన్నాయి.

## కూలి రేట్ల పోరాటం, కాఫీ తోటల స్వాధీన పోరాటంగా ఉన్నత స్థాయికి ఎదగటం

ప్రారంభంలో కొంతకాలం ప్రజల చైతన్య స్థాయిని నిర్మాణ బలాన్ని దృష్టిలో ఉంచుకుని విప్లవ పార్టీ పాక్షిక డిమాండ్లపై కాఫీ కార్మికులను కూలి రేట్లు తదితర డిమాండ్లపై ఉద్యమింపజేసింది. అయితే నిరంతరం ప్రజల్ని 'అడవి మీద హక్కు ఆదివాసులదే, పీడిత ప్రజలదే' అనే నినాదం చుట్టూతా చైతన్యవంతుల్ని చేస్తూ కాఫీ కూలీలు ఎపిఎఫ్‌డిసి తోటల్ని తిరిగి తమ స్వాధీనంలోకి తెచ్చుకునేలా దీర్ఘకాల దృష్టితో విద్య గరుపుతూ వచ్చింది. 2005 సంవత్సరం నాటికి ప్రజలు దశాబ్దాలుగా సాగిన పోరాటాల్లో రాటు తేలారు. ఎవిఆర్‌సిఎస్ (ఆదివాసీ విప్లవ రైతుకూలీ సంఘం), ఎవిఎంఎస్ (ఆదివాసీ విప్లవ మహిళా సంఘం) లతో పాటు మిలీషియా యూనిట్స్‌లో కూడా సంఘటితులై సాంప్రదాయక ఆయుధాలతో సాయుధులయ్యారు. సాంప్రదాయక తెగపెద్దల ఆధిపత్యాన్ని కూలదోసి పీడిత ప్రజల రాజ్యాధికార అంగాలైన ఆర్‌పిసి (విప్లవ ప్రజా కమిటీలు)లను ఏర్పరచుకుని స్వయం సంపూర్ణ ప్రజాభివృద్ధి నమూనాలో తమదైన పరిపాలనను సాగించే స్థితి నెలకొన్నది.

ఈ స్థితిలో విప్లవోద్యమ పిలుపుతో విశాఖ జిల్లా, ఈస్ట్ డివిజన్ పరిధిలోని గాలికొండ ఏరియాలో (అప్పటికది ఏఓబీ ప్రాంతంలోని కేంద్ర జిబిగా ఉన్నది) పెదపాడు ఆర్‌పిసి పరిధిలోని 10 గ్రామాల ప్రజలు ఐక్యంగా 'మర్రిపాకల ఎస్టేట్'ను (ఆర్‌వి నగర్ పరిధి) స్వాధీనపరచుకోవడం చేశారు. అయితే తోటల స్వాధీన పోరాటం పరిమితమైన ప్రాంతంలో ప్రారంభం కావడం దాన్ని విశాల ప్రాంతాలకి విస్తృతపరచలేకపోవడం మూలంగా శతృవు కేంద్రీకరణ, నిర్బంధం పెరిగి తాత్కాలికంగా ప్రజలు వెనక్కి తగ్గారు. తిరిగి 2008లో పిఎల్‌జిఎ నిర్వహించిన గునికిరాళ్ల ఆంబుష్‌లో గ్రేహౌండ్స్ బలగాల్ని పరుగులు పెట్టించటం తదుపరి ఒక నెల తిరక్కుండానే 'బలిమెల రిజర్వాయర్‌లో' లాంచ్‌లో ప్రయాణిస్తున్న 38 మంది గ్రేహౌండ్స్ బలగాల్ని ముంచి చంపిన రాజకీయ వాతావరణంలో తిరిగి మరొకమారు తోటల స్వాధీనం ముందుకు వచ్చింది.

'మర్రిపాకల కాఫీ ఎస్టేట్'ను ప్రజలు స్వాధీనపరచుకున్న దాని ప్రభావం ఆర్.వి నగర్ ఈస్ట్, వెస్ట్ డివిజన్‌ల పరిధిలో గల ఇతర ఎస్టేట్స్‌లో కూడా చూపింది. అక్కడ కూడా కాఫీ తోటల్ని స్వాధీనపరచుకుకోవాలనే ఆకాంక్ష పెరుగుతూ ప్రజల్లో కదలిక మొదలయ్యింది.

అయితే ఇందులో వర్గ ప్రాతిపదికన కాకుండా అడవి ఆదివాసీ ప్రజలందరి సామూహిక ఆస్తి కావటాన ఒక్కొక్క ఎస్టేట్‌కు అందుబాటులో గల గ్రామాలలోని అన్ని వర్గాల ప్రజలూ (వ్యవసాయ కులీలు, పేద రైతాంగం, మధ్య తరగతి, ధనిక) సమీకృతులై 'అడవిపై హక్కు ఆదివాసులదే' అన్న నినాదంతో 'ఎస్టేట్ స్వాధీన పోరాట కమిటీ'ని అన్ని గ్రామాల ప్రాతినిధ్యంతో ఏర్పరుచుకోవడం ప్రారంభమైంది. ఎక్కడికక్కడ విడివిడిగా గ్రామాల స్థాయిలో కూడా ఇవి ఏర్పడతాయి. ఎపిఎఫ్‌డిసి యాజమాన్యాన్ని తోటలకు అడుగు పెట్టకుండా బహిష్కరిస్తూ గ్రామాల్లోని కుటుంబాల సంఖ్యను బట్టి (చిన్న గ్రామాలా? పెద్ద గ్రామాలా?) తేడాలను చూసన్తూ బ్లాక్స్‌వారీగా, బిట్స్‌వారీగా కాఫీ తోటల్ని ఏ గ్రామానికాగ్రామానికి విడివిడిగా సరిహద్దులు నిర్ణయించుకుని పంపిణీ చేసుకున్నారు. తోట సాగు ప్రజలందరి సమిష్టి నిర్వహణలో జరుగుతుంది. తోటలు ప్రజల స్వాధీనంలోకి వచ్చేక ఆ నాయకత్వ కమిటీలే నిర్వహణ కమిటీలుగా మార్పు చెంది పనుల్ని సమన్వయిస్తాయి. వీటి నిర్ణయం ప్రకారమే ఇంటికి ఒక్కరు లేదా ఇద్దరు చొప్పున నిర్ణయించుకున్న రోజుల్లో పనుల్ని చేస్తారు. కాఫీ పండ్ల సేకరణను కూడా ఏ గ్రామానికా గ్రామం సమిష్టిగా లేదా కుటుంబాల వారీగా పంపకాలు చేసుకుని అమ్ముకుని వచ్చిన రాబడిలో నగం వాటా నిర్వహణ ఖర్చులకు (రాబోయే సంవత్సరానికి) తీసి మిగిలిన భాగాన్ని సమంగా పంచుకోవడం కొనసాగుతున్నది.

2010వ సంవత్సరంలో చింతపల్లి నార్త్ డివిజన్ పరిధిలోని 'బలపం ఎస్టేట్'ను (110 హెక్టార్లు) బలపం పంచాయితీలోని 33 గ్రామాల ప్రజలు 8 గ్రూపులుగా, వాటి ప్రాతినిధ్యంతో పై స్థాయిలో ఒక ఎస్టేట్ కమిటీగా సంఘటితులై పంపిణీ చేసుకున్నారు. ఈ ప్రక్రియ రాజకీయ ప్రచారంతో మొదలుకుని నిర్మాణాలను ఏర్పర్చుకోవడం, ఎక్కడికక్కడ సభలు జరుపుకోవడం, ప్రజా కోర్టు నిర్వహించి ఎపిఎఫ్‌డిసి ఉద్యోగులను పిలిచి ఇక మీదట తోటలలో అడుగు పెట్టకుండా బహిష్కరణ చేయటం, వాళ్ల భవనాలను కూల్చివేయటం, కాఫీ పండ్ల సేకరణ సమయం కావటాన 33 గ్రామాల ప్రజంతా వేలాది మంది ఒక జాతరలా తోటలకు వెళ్లి కాఫీ పండ్లను ఏరటం వగైరాలతో ఒక నెల రోజుల పాటు ఒక వెల్లువలా సాగాయి. ఈ క్రమంలోనే కామన్ మిలీషియా నిర్మాణంగా గ్రామ గ్రామానా 'మన్యం పితూరి సేన' ఆవిష్కరణ జరిగింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరము అల్లూరి వర్ధంతి దినం మే 7 తేదీన మన్యం పితూరీ సేన ఆవిర్భావ దినాన్ని జరపడం ఈస్ట్ డివిజన్‌లో ఒక ఆనవాయితీగా మారింది.

పై ప్రక్రియ మొత్తం నెల రోజుల కాలంలో సీఆర్‌సీ 1వ కంపెనీకి చెందిన ప్రధాన బలగాలు, స్థానిక బలగాలు ప్రజలతోనే ఉంటూ, ప్రజలతోనే తింటూ, కాఫీ పండ్లను సేకరించటంలో పాలు పంచుకోవడం ప్రజలకు గొప్ప ప్రేరణనిచ్చింది. 'ప్రజాసైన్యం లేకుండా ప్రజలకేమీ ఉండదు' 'సైన్యం ద్వారానే' 'బలప్రయోగం ద్వారానే' ప్రజలకు రాజ్యాధికారం సిద్ధిస్తుంది అన్న ప్రవచనాల్లోని రాజకీయ సందేశం ప్రజలకు మరింతగా విశదమయింది. దాని రాజకీయ ప్రభావం కాఫీ తోటల స్వాధీన పోరాటాన్ని మరిన్ని ఎస్టేట్‌లకు వ్యాప్తి చేయగా ఎపిఎఫ్‌డిసి యాజమాన్యానికి 42గంగెర్రులెత్తించింది.

## 2017 నాటికి 500 హెక్టార్ల కాఫీ తోటలు ప్రజల స్వాధీనమయ్యాయి

1. మర్రిపాకల ఎస్టేట్ 2. ఈతరుబ్బల ఎస్టేట్ 3. కుంకుంపూడి ఎస్టేట్ 4. తీములబంద ఎస్టేట్ 5. లంకపాకల ఎస్టేట్ 6. పెదవలస ఎస్టేట్ 7. బలపం ఎస్టేట్ 8. సప్పర్ల ఎస్టేట్

అయితే తోటల నిర్వహణకు సంబంధించిన 'ప్రజల సమిష్టి యాజమాన్య పద్ధతి'లో కొన్ని సమస్యలు ముందుకొస్తున్నాయి. తోటల నిర్వహణ పనుల్లో అందరూ ఒకేలా (వివిధ వర్గాలు) శ్రద్ధగా పాలు పంచుకోవటం లేదు. ఫలసాయాన్ని పంచుకోవడంలో ఆర్థిక అవినీతి సమస్యలు ముందుకొస్తున్నాయి. ప్రజలకు, కమిటీలకు మధ్య వైరుధ్యాలుగా ఇవి మారుతున్నాయి. తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొనే విషయంలో (దృఢంగా ఉంటూ పోరాట ఫలితాల్ని కాపాడుకోవటంలో) వర్గ స్థితులు ప్రభావాన్ని చూపుతున్నాయి. మొత్తంలో వెరసి క్రమంగా తోటల నాణ్యత దెబ్బతినడం, ఉత్పత్తి తగ్గడం వగైరా దుష్ఫలితాలు చోటు చేసుకుని చెడు ప్రభావాన్ని వేస్తున్నాయి. వీటిని శత్రువు దుష్ప్రచారానికి వాడుకుంటున్నాడు.

పై సమస్యలకు పరిష్కారంగా నిర్వహణ బాధ్యతలు చూస్తున్న ఐక్య వేదికల్లో ఉన్న మధ్య తరగతి వారిని మార్చి పునాది వర్గాల వారిని తెచ్చేందుకు కృషి చేయాలనీ, వారు వర్గ సంఘాలలోనూ, పార్టీ నిర్మాణాలలోనూ క్రియాశాలక సభ్యులై ఉండాలని, తోటల పంపిణీలో కూడా ఈ వర్గాల వారికే ప్రాధాన్యతనివ్వాలనీ, సాయుధ మిలీషియా ఏర్పడి నిర్బంధాన్ని ఎదుర్కోవడంలో ప్రజలకు మద్దతునిస్తూ రాజ్యాధికార నిర్మాణాన్ని స్థాపించుకోవాలని, సరైన ప్రతి ఎత్తుగడలతో దీటుగా శత్రు ఎత్తుగడల్ని తిప్పికొడుతూ పోరాట ఫలితాల్ని నిలబెట్టుకుని అభివృద్ధి కావాలనే దిశా నిర్దేశంతో పని జరగాలని తీర్మానించుకున్నాం. కానీ ఈ దిశా నిర్దేశానికి అనుగుణంగా పని తగినంతగా ముందుకు సాగలేదు. ఈ మొత్తం కాలంలో తీవ్ర శత్రు బహుముఖ దాడి కొనసాగుతూ అనేక ఆటుపోట్లను ఉద్యమం ఎదుర్కొంది.

## మరో మారు తీవ్రతరమైన శత్రు బహుముఖ దాడి

ఎపిఎఫ్‌డిసి ఉనికికి, మనుగడకు, అస్థిత్వానికీ ప్రమాదకరంగా మారిన కాఫీ తోటల ఆక్రమణ పోరాటాన్ని బలహీనపరచడానికి శత్రువు సామదానభేద దండోపాయాలన్నింటిని ఎల్ఐసి బహుముఖ దాడి రూపంలో ప్రయోగించాడు. పారా మిలిటరీ బలగాలతో నూతనంగా క్యాంపులు వేసి కార్పెట్ సెక్యూరిటీ మరింతగా బలోపేతం చేశారు. ఏరియాలపైన, క్రియాశీలంగా పని చేస్తున్న కార్యకర్తల గ్రామాలపైన పోలీసు దాడులు, కూంబింగులు పెరిగాయి. సమాచార ఆధారిత దాడులతో విప్లవోద్యమానికి నాయకత్వం అందించే పార్టీ, పీఎల్‌జీఏ యూనిట్స్‌ను నిర్మూలించే ప్రయత్నాలు తీవ్రతరం అయ్యాయి. ఇంటెలిజెన్స్ యంత్రాంగాన్ని బలోపేతం చేశారు. మన్యాన్నంతా సెల్ టవర్‌లతో నింపి వేసి కమ్యూనికేషన్, రోడ్లను అత్యంత మారుమూల ప్రాంతాలకు కూడా విస్తరింపజేశారు. లంపెన్ శక్తుల్ని విప్లవ ప్రతీఘాతుక హంతక దళాలుగా పెంపొందించి కుట్రపూరిత హత్యలకు పాల్పడ్డారు.

ప్రజలు తమ అమ్మకాలు, కొనుగోళ్ల కోసం ఆధారపడే సంతలను జరగకుండా ఆపడం, ప్రజలెవ్వరూ కాఫీ పండ్లను అమ్మకుండాను, షావుకార్లు కొనకుండానూ నిషేధం విధించడం, లోతట్టు ప్రాంతాలకు రవాణా సౌకర్యంగా ఉన్న బస్‌లను బంద్ పెట్టించి ప్రజల్ని ఇబ్బందుల పాలు చేశారు. మిలీషియాలో చురుగ్గా పని చేస్తున్న వారి పేర్లను బహిరంగ ప్రకటనల రూపంలో (పోస్టర్స్, పేపర్స్‌లో) ప్రచారం చేస్తూ లొంగిపొమ్మని కోరటం, ఇండ్లకు నోటీస్‌లు పంపటం, తలలకు వెలలు ప్రకటిస్తూ పదే పదే వివిధ రకాలుగా చెడు ప్రచారానికి పూనుకున్నారు. అక్రమ కేసులు మోపి సంవత్సరాల తరబడి జైళ్లలో నిర్బంధించారు.

మావోయిస్టులు ఎపిఎఫ్‌డిసి ఉద్యోగులను బెదిరించి బలవంతంగా కాఫీ తోటల్ని ప్రజలకు పంపిణీ చేశారని, ప్రభుత్వం చేతుల్లో ఉంటేనే ప్రజలకు సంవత్సరం పొడవునా పని ఉండి ఆదాయం దొరుకుతుందనీ నేడు ప్రజల చేతుల్లో అవి నాశనం కాబడుతున్నాయనీ తప్పుడు ప్రచారం లంకించుకున్నారు. దీన్ని మరింతగా ఆచరణలో రుజువు చేయడానికి అడవులకు గాలింపుకు వచ్చిన పోలీసు బలగాలు కావాలనే కాఫీ తోటలకు అగ్గిపెట్టి మరీ కుట్రపూరిత పద్ధతుల్లో నష్టపరచడం చేశారు. కొంతమంది ఎపిఎఫ్‌డిసి ఉద్యోగులు, అధికారులు పోలీసులతో చేతులు కలిపి ప్రభుత్వ ఏజెంట్‌లుగా, ప్రజలకు పీడకులుగా మారారు. కానీ ఇవేవీ మెజారిటీ ప్రజల పోరాట దీక్షను సడలింపచేయలేకపోయాయి.

## మాకింక కూలి బతుకు వద్దు. కాఫీ తోటల్ని వదిలిపెట్టం అడవిపై సర్వ హక్కులూ, అధికారాలూ ఆదివాసులవే

ఒకటి రెండు ఎస్టేట్లలో మినహాయిస్తే మెజారిటీగా ప్రజల ఆధీనంలోకి వచ్చిన ఎస్టేట్‌లన్నింటిలో ప్రజలు నేటికీ వెనుకంజ వేయకుండా పట్టుదలగా కాఫీ తోటల్ని వదిలేది లేదంటూ సాగు చేసుకుంటున్నారు.

2013 తర్వాత కూడా కాఫీ ఎస్టేట్‌ల స్వాధీన పోరాటం నూతనంగా 1. గొందిపల్లి 2. ఆర్‌వి నగర్ 3. సిరిబాల 4. చాపగడ్డ 5. ఏబులం ఎస్టేట్‌లకు విస్తరించింది. అయితే గొందిపల్లి ఎస్టేట్ మాత్రమే ప్రజల పూర్తి అదుపులోకి వచ్చింది. మిగిలిన ఎస్టేట్‌ల తోటలు ఇప్పటికీ ప్రజలకూ ఎపిఎఫ్‌డిసికి మధ్య ఘర్షణ కొనసాగుతూ ఉన్నాయి.

దోపిడీవర్గాల పాలన ఉన్నంతవరకు ఈ ఘర్షణ ఉంటూనే ఉంటుంది. ప్రజల రాజ్యాధికారంతో ముడిపడిన సమస్య ఇది. దీర్ఘకాల ప్రజాయుద్ధమే మార్గం. నూతన ప్రజాస్వామిక విప్లవమే పరిష్కారం. ★

ఎఓబి రిపోర్ట్...

# జులై 28 అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను గ్రామగ్రామాన జరుపుకున్న విప్లవ ప్రజానీకం

2018 జులై నుండి 2019 జులై వరకు ఆంధ్ర-ఒడిశా సరిహద్దులో శతృవు అమలు జరిపిన క్రూరమైన హంతకదాడిలో సుమారు 9 మంది వృత్తివిప్లవకారులు అమరులు కాగా, నలుగురు సాధారణ ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. అందులో సీనియర్ మహిళా నాయకురాళ్ళు మల్కనగిరి-కొరాపూట్-విశాఖ సరిహద్దు డివిజన్ కమిటీ సెక్రటేరియట్ సభ్యురాలు కామ్రేడ్ మీనా, జిల్లా కమిటీ సభ్యురాలు కామ్రేడ్ రింకీ, ఏరియా కమిటీ సభ్యులు కామ్రేడ్స్ కీర్తి, దాస్, క్రాంతి, క్రిష్ణ, సుశీల, అద్మాల్ (ప్రమాదంలో), పార్టీ సభ్యులు కామ్రేడ్స్ సున్ని, గీతలు అమరులయ్యారు. వీరంతా ఎ.ఒ.బి ఉద్యమంలో వివిధ స్థాయిలో కీలకమైన పాత్ర పోషించి, ఏటికి ఎదురీదిన, ఉక్కు సంకల్పం కలిగిన దృఢమైన కమ్యూనిస్టు యోధులు, యోధురాళ్ళు.

వీరి అమరత్వం ఉద్యమానికి తీరని నష్టం. వీరు నడిచిన దారి, అందించిన నాయకత్వం, నిర్మించిన ఉద్యమం ఈ ప్రాంతంపై, ప్రజల హృదయాలపై చెరగని ముద్ర వేశాయి. ఈ అమరులతో పాటు, భారత విప్లవోద్యమంలో అసువులు బాసిన అమరులందరిని స్మరించుకుంటూ, జులై 28 నుండి ఆగస్టు 5 వరకు అమరుల వారోత్సవాలను జరపాలని డివిజన్ కమిటీ కార్యక్రమం రూపొందించుకుంది. పోస్టర్స్, బ్యానర్స్, క్యాంపెయిన్ టీంల ద్వారా డివిజన్‌లోని అన్ని గ్రామాలలో ప్రచారం నిర్వహించింది. ప్రజలు పోలీసు కూంబింగ్‌లనూ, భారీ వర్షాలను లెక్క చేయకుండా ఎక్కడికక్కడ గ్రామాలలో అమరుల సంస్మరణ సభలు జరిపారు. మల్కనగిరి జిల్లా, కటాఫ్ ఏరియాలో ఒంద్రపల్లి సమీపంలో కామ్రేడ్ మీనా స్మారక స్థూపాన్ని, నిర్మించి 300 మంది ప్రజలు స్థూపాన్ని ఆవిష్కరించి, సభ జరిపి శ్రద్ధాంజలి ఘటించారు.

పనసపుట్ పంచాయితీలో సుమారు 10 గ్రామాల ప్రజలు బోరున కురుస్తున్న వర్షం మధ్యనే సుమారు 400 మంది ప్రజలు ఊరేగింపుగా వెళ్ళి, అమరుల స్థూపం వద్ద సంస్మరణ సభను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు 14వేల రూ॥లు విరాళంగా యివ్వగా వాటిని స్థూపానికి రక్షణగా కంచె వేయాలని నిర్ణయించి అమలు చేశారు.

జొడాంబ పంచాయితీలోని దార్లబెడ వద్ద నిర్మించిన రాంగూడ అమరుల హాలు వద్ద సభను అడ్డుకోవడానికి పోలీసులు కుంతిలిపొద్దార్‌లో చాలా ముందస్తుగానే బలగాలను మోహరించారు. ఈ విషయం గమనించిన ప్రజలు శతృవు కళ్ళుగప్పి 30 సెంట్రీ పోస్టులు, అనేక పెట్రోలింగ్ బ్యాచీలు ఎంగేజ్ చేసి, సమారు 10 గ్రామాలకు చెందిన 480 మంది ప్రజలు ఎడతెరిపి లేకుండా పడుతున్న వర్షం మధ్యనే అమరుల హాలు వద్ద ఎర్రజెండా ఎగురవేసి, విప్లవ గీతాలు ఆలపించి, అమరులను స్మరించుకుంటూ శ్రద్ధాంజలి ఘటించారు.

రంగబయలు పంచాయితీ, కొనంపూట్ ప్యాకెట్‌లోని 8 గ్రామాలలో 300 మంది ప్రజలతో, నక్కమామిడి పంచాయితిలోని అమ్లిబెడలో సుమారు 500 మంది ప్రజలతో, బూసిపుట్ పంచాయితీలో 200 మంది ప్రజలతో అమరుల సంస్మరణ సభలు పోలీసుల కూంబింగ్‌లను దిక్కరించి, భారీ వర్షాలను లెక్క చేయకుండా విజయవంతం చేశారు.



మావోయిస్టుల సమావేశం, (ఇన్‌సెట్లో) మావోయిస్టుల స్థూపాలు

విశాఖపట్నం జిల్లా, పెదబయలు ఏరియాలో గిన్నెలకోట గ్రామం వద్ద 250 మంది ప్రజలు విప్లవ రైతు కూలి సంఘం నాయకత్వంలో ఊరేగింపు జరిపి, అమరుల సంస్మరణ సభను జరుపుకున్నారు.

జాముగూడ పంచాయితీ, చింతలవీధి గ్రామంలో సుమారు 6 గ్రామాలకు చెందిన 400 మంది ప్రజలు, గిన్నెలకోట పంచాయితీ అంట్రిపడలో 10 గ్రామాలకు చెందిన 500 మంది ప్రజలు కలిసి అమరుల సంస్మరణ సభలను జరుపుకోగా, ఎక్కడికక్కడ అనేక గ్రామాలలో ప్రజలు శపథం చేశారు.

అక్టోబర్ 24 రాంగూడ అమరుల సంస్మరణ దినాన్ని స్థానిక ప్రజలు విడిగా కూడా సంస్మరణ సభలు జరుపుకున్నారు. అందులో భాగంగా జొంత్రి పంచాయితీలోని తోటగూడ గ్రామంలో రాంగూడ అమరుల పేరులోల నిర్మించిన స్మారక భవనం వద్ద సుమారు 6 గ్రామలకు చెందిన 300 మంది ప్రజలు, తాబేరు గ్రామ పాకెట్ పరిధిలో 250 మంది ప్రజలతో రాంగూడ అమరులనూ, వారి త్యాగాలనూ, పోరాట స్ఫూర్తిని ఎత్తిపడుతూ, ఊరేగింపులు చేసి, సంస్మరణ సభ జరిపి అమరులైన కుటుంబాలను ఆదుకుంటామని నిర్ణయించుకున్నారు.

## సెప్టెంబర్ 14న జితేన్‌దాస్ వర్ధంతిని రాజకీయ ఖైదీల హక్కుల దినంగా పాటించాలనీ ప్రజలు జరిపిన బహిరంగ రాజకీయ సభ

విశాఖపట్నం జిల్లా, పెదబయలు ఏరియాలో సెప్టెంబర్ 16న వింజరి పంచాయితీలోని 15 గ్రామాలకు చెందిన సుమారు 1500 మంది ప్రజలు "గ్రామాలపై పోలీసుల దాడులు, అక్రమ అరెస్టులు నిలిపివేయాలనీ, తప్పుడు కేసులు బనాయించి జైళ్ళలో నిర్బంధించిన రాజకీయ ఖైదీలను విడుదల చేయాలనీ, బాక్సైట్ వ్యతిరేక ఆందోళనలో ప్రజలపై మోపిన కేసులను బేషరతుగా ఎత్తివేయాలనీ, అర్బన్ నక్సలైట్ పేరుతో విప్లవ సానుభూతిపరులనూ, ప్రజాస్వామిక, అభ్యుదయ మేధావుల అరెస్టులను నిలిపి వేయాలనీ, వారిపై మోపిన తప్పుడు కేసులను ఎత్తివేసి విడుదల చేయాలి" అనే డిమాండ్‌లతో నినాదాలిస్తూ, ప్లాకార్డులతో ఊరేగింపు నిర్వహించారు. ఆ తర్వాత కోంద్రు, జుమ్డ గ్రామాల మధ్య సభ జరిపి, అరెస్టయిన వారి కుటుంబాలను హార్దికంగా, ఆర్థికంగా ఆదుకోవాలనీ, గ్రామాలపై దాడులకు వచ్చే పోలీసులను ప్రతిఘటించి ఎదుర్కోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అన్ని గ్రామాల నుండి తరలివచ్చిన ప్రజలు 35వేల రూపాయలు, 10 క్వింటాళ్ళ బియ్యం, కొన్ని బట్టలు, నిర్బంధ బాధిత కుటుంబాలకు అక్కడికక్కడే సహాయం అందించారు. వాటిని జైళ్ళలో ఉన్న నిరుపేద 12 కుటుంబాలకు పంపిణీ చేశారు. నిర్బంధ బాధిత కుటుంబాలకు అండగా నిలబడుతామనీ, వారి విడుదలకు ఉద్యమిస్తామని అన్ని కుటుంబాలకు హార్దిక మద్దతును తెలియజేశారు. బాధిత కుటుంబాలు పత్రిక విలేఖరుల సమావేశంలో 'తమ కుటుంబాలు ఒంటరిగా లేవని ప్రభుత్వం పోరాడే వారిపై తప్పుడు కేసులు పెట్టి, జైళ్ళలో నిర్బంధించినంత మాత్రాన విప్లవోద్యమాన్ని అడ్డుకోరని ప్రజల మద్దతుతో మా కష్టాలను అధిగమిస్తామ'ని ప్రకటించారు.

## కటాఫ్ ఏరియాలో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలంటూ ఆందోళన బాట పట్టిన విద్యార్థులు, ప్రజలు

ఈ ప్రాంతంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజలంతా సమావేశమై చర్చించారు. వాటి పరిష్కారంగా 1. ప్రతి పంచాయితీకి ఒక హైస్కూల్‌తోపాటు, హాస్టల్ సౌకర్యం కల్పించాలి. 2. ప్రస్తుత హాస్టల్స్‌లో సౌకర్యాలను మెరుగుపర్చాలి. 3. నూతన పాఠశాల భవనాలను నిర్మించాలి. 4. ప్రస్తుత పాఠశాలలో టీచర్స్ కొరతను వెంటనే భర్తీ చేయాలి. 5. ఉపాధ్యాయులు స్థానికంగానే వుంటూ, రెగ్యులర్‌గా స్కూల్స్‌కు హాజరు కావాలనే ప్రధాన డిమాండ్‌లతోపాటు, ఇతర సమస్యలను కూడా జోడించి, సెప్టెంబర్ 22న (2019) జొడాంబ, పనసపూట్, జొంత్రి, ఒంద్రపల్లి, నక్కమామిడి పంచాయితీలకు చెందిన విద్యార్థులు, ప్రజలు కలిసి సుమారు 3వేల మంది మల్కనగిరిలోని కలెక్టర్ కార్యాలయం ముందు ర్యాలీ నిర్వహించడానికి బయలుదేరారు. ఈ సమాచారం అందుకున్న జిల్లా ఎస్.పి తమ అంగ, ఆయుధ బలంతో చిత్రకొండ సమీపంలోని సి...వే వద్ద అందరిని అడ్డుకున్నాడు. ప్రజలు అక్కడే ఆందోళనకు దిగడంతో సబ్‌కలెక్టర్ చర్చలకు దిగివచ్చాడు. కలెక్టర్ జిల్లాలో అందుబాటులో లేరనీ, మీ సమస్యలను ప్రభుత్వం చర్చించి పరిష్కరించడానికి సిద్ధంగా వుందనీ, 10 రోజుల తర్వాత ఒక ప్రతినిధి బృందం కలెక్టర్‌ను కలువమని విజ్ఞప్తి చేశాడు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ, శాంతియుతంగా ఆందోళన చేస్తున్న మాపై ప్రభుత్వం పోలీసులను దింపి అడ్డుకోవడాన్ని నిరసిస్తూ కలెక్టర్‌ను కలువాలని పిలుపును ప్రజలు బహిష్కరించారు. 15 రోజుల తర్వాత విద్యార్థులు ప్రధాన డిమాండ్‌లను ఆమోదిస్తూ, ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయక తప్పలేదు. అందులో పంచాయితీకి ఒక హైస్కూల్, హాస్టల్స్‌ను మంజూరు చేయడంతోపాటు, భవన నిర్మాణం చేయడం, తీక్షణంగా ప్రస్తుతం నడుస్తున్న పాఠశాలలకు ఉపాధ్యాయులను కేటాయించడం, హాస్టల్ వసతులలో స్వల్ప మెరుగుదలను చేపట్టారు. ఈ విజయం విద్యార్థులు, ప్రజలు సాధించిన పోరాట ఫలితమేనని అభినందనలు తెలియజేసుకున్నారు.

## బలిమెల డ్యాం ముంపు బాధిత గ్రామాల ప్రజలకు అండగా నిలబడి సహాయాన్ని అందించి ఆదుకున్న ఆంధ్ర-ఒడిశా సరిహద్దు గ్రామాల ప్రజలు

మల్కనగిరి జిల్లాలోని బలిమెల జలవిద్యుత్తు ప్రాజెక్టుకోసం నిర్మించిన భారీ నిర్మాణం మూలంగా పంట ముంపుకు గురయిన పేద ఆదివాసీ ప్రజలను ఆదుకోవాలని ప్రజలందరు ఒక సహాయక కమిటీని ఏర్పాటు చేశారు. వారంరోజుల పాటు ప్రభుత్వ నిర్లక్ష్య, ప్రజా వ్యతిరేక వైఖరిని నిరసిస్తూ, బాధిత ప్రజలను ఆదుకోవాలని ఆంధ్ర-ఒడిశాలోని సరిహద్దు గ్రామాలలో తిరిగి ప్రచారం చేశారు. ఈ పిలుపుకు ప్రజల నుండి గొప్ప స్పందన వచ్చింది. వారిని ఆదుకోవడానికి ఆంధ్రప్రదేశ్‌లోని సరిహద్దు బూసిపుట్, జామ్‌గూడ, వింజరి, కమ్డ, బొంగపుట్, బరడా, లక్ష్మీపూర్ పంచాయితీలతో పాటు, కటాఫ్ ఏరియాలోని అనేక గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా ధాన్యం, రాగులు, బట్టలు, డబ్బులు తీసుకొని స్వయంగా తరలివచ్చి, ఒరపాదూర్ గ్రామంలో 7వేల మంది ప్రజలతో ప్రభుత్వ ప్రజావ్యతిరేక వైఖరిని నిరసిస్తూ, ఊరేగింపు నిర్వహించి, భారీ బహిరంగ సభ జరిపారు. బాధిత గ్రామాల ప్రజలను పిలిచి అక్కడ జమచేసిన క్వింటాళ్ళకుపైగా, ధాన్యం, రాగులను ప్రతి కుటుంబానికి 25 కిలోల చొప్పున పంపిణీ చేశారు. ఆ తర్వాత కూడా ప్రజలు ఇంకా వసూలు కొనసాగిస్తూ బాధితులను ఆదుకునే కార్యక్రమం కొనసాగింది. ప్రజలు చేసుకుంటున్న ఈ సహకారాన్ని అడ్డుకోవడానికి ప్రభుత్వం సాయుధ బలగాలను మోహరించింది. కూంబింగ్‌లకు వచ్చిన బలగాలను నిలదీయడానికి ప్రజలు వెంబడించడంతో తోకముడిచి అందుబాటులో ఉన్న కుంతిరిపాదూర్ క్యాంపులో తలదాచుకున్నారు. అయినా ప్రజలు

వదిలిపెట్టకుండా వేలాది మంది క్యాంపును ఘెరావ్ చేసి, నిలదీయడంతో పోలీసులు క్షమాపన చెప్పడంతోపాటు, మరోసారి కూంబింగ్‌కు రామని ప్రజలకు హామి యివ్వడంతో వెనుతిరిగారు. దీనితో ప్రభుత్వ ప్రజా వ్యతిరేక వైఖరి బహిర్గతం కావడంతోపాటు, ప్రజలలో ఒక సమిష్టి, సహకార చైతన్యాన్ని పెంచింది.

## ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోని ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ, విప్లవ చైతన్యంతో సమిష్టి శ్రమ ద్వారా చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు

విశాఖపట్నం జిల్లాలోని మన్యం ప్రాంతంలో సహజసిద్ధంగానే పుష్కలమైన నీటి వనరులు ఉండి అనేక జలపాతాలు, నదులు సంవత్సరం పొడవునా ప్రవహిస్తున్నాయి. ప్రభుత్వానికి ప్రజాసంక్షేమం, అభివృద్ధి చేపట్టాలనే చిత్తశుద్ధి ఉంటే చిన్న చిన్న డ్యాంలు, చెక్ డ్యాంలు, కుంటలు నిర్మించడం ద్వారా లక్షలాది ఎకరాల భూములను వ్యవసాయ సాగుయోగ్యంగా మార్చవచ్చు. ప్రజలకు సురక్షితమైన త్రాగునీటిని అందిచవచ్చు. ఆదివాసీలు, పీడిత ప్రజలు, పార్టీ, విప్లవ రైతుకూలి సంఘాలు, విప్లవ ప్రజా రాజ్యధికార కమిటీల నాయకత్వంలో స్వావలంబనతో కూడిన ప్రజాభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. అందులో భాగంగానే పెదబయలు ఏరియాలోని, నానబరి గ్రామంలో చెరువు నిర్మించాలనే నిర్ణయం తీసుకుని 6 గ్రామాలకు చెందిన ప్రజలు నెలరోజులపాటు శ్రమించి (సుమారు 3600 మంది) చెరువు నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఈ నీటిని పంటల సాగుకు వినియోగించడంతోపాటు, ప్రజల ఆహార అవసరాలకోసం చేపల పెంపకం కూడా చేపట్టారు. అలాగే దాని పక్కనే ఉన్న ఇంజరి గ్రామంలో కూడా 3 రోజులు పని చేసి, మరో చెక్‌డ్యాంను నిర్మించడం పూర్తి చేశారు. ఆ నీటిని పంట పొలాలకు ఉపయోగిస్తూనే చేపలను పెంచుకుంటున్నారు.

ఆంధ్ర సరిహద్దు ఒడిశా రాష్ట్రంలోని ఈతలపాడు, చీకటిపల్లి గ్రామలలో ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం పార్టీ కేటాయించిన నిధులను పైపులు కొనితెచ్చి కొండ నుండి గ్రామానికి పైపులైన్ వేసి, గ్రామాలలో నల్లాలు ఏర్పాటు చేసి, ప్రజలందరికి సురక్షితమైన త్రాగునీటిని అందించారు. మహిళలు దూరం నుండి నీటిని మోసుకువచ్చే శ్రమను తగ్గించారు.

ఇంజరి పంచాయితీలో బంగారుకొండ గ్రామంలో పైపులైన్‌ల ద్వారా వస్తున్న నీటిని నిల్వచేసి నల్లాల (ట్యాప్‌ల) ద్వారా అదించటానికి నీళ్ళట్యాంక్‌ను నిర్మించారు. అలాగే దొడ్డంపాడు,నానబరి, దొసులబంద, ఊర్లపాలెం, చెరువుగొయ్యి గ్రామాలలో నీటికుండీలను ప్రజల సమిష్టి శ్రమ ద్వారా నిర్మాణం చేసి, మంచినీటిని అందిస్తున్నారు. ప్రభుత్వ వైఖరిని బహిర్గతపరిచి, ప్రజలలో చైతన్యం పెంచుతూ చేపడుతున్న ఈ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రత్యామ్నాయ అభివృద్ధిపై, ప్రజల సమిష్టి శక్తి సామర్థ్యాలపైన గొప్ప విశ్వాసాన్ని పెంచుతున్నాయి.

## విప్లవోద్యమంపై శత్రువు బహుముఖ దాడిలో భాగంగా కొనసాగుతున్న ఆపరేషన్ 'సమాధాన్' వ్యూహాత్మకదాడి

ఎ.ఒ.బిని మావోయిస్టు రహిత ప్రాంతంగా మార్చుతామని ప్రకటించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ శక్తినంత కేంద్రీకరించి సంపూర్ణ నిర్మూలన లక్ష్యంగా దాడి తీవ్రతను అనేకరెట్లు పెంచారు. అందులో భాగంగా వ్యూహాత్మక ప్రాంతాలలోకి చొరబడటానికి కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేసి, రోడ్లు, కీలకమైన బ్రిడ్జీలు, సెల్‌టవర్లు నిర్మిస్తూ, ఇందతా వెనకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయడంలో భాగంగా చేస్తున్నామని అసత్య ప్రచారం చేస్తున్నారు. నిరుద్యోగ, లంపెన్ యువతకు డబ్బులు వెదజల్లి, మోటర్‌సైకిల్, సెల్‌ఫోన్స్ యిచ్చి పూర్తికాలం ఇన్‌ఫార్మర్లుగా తయారు చేసుకుంటూ, రెగ్యులర్‌గా దళాలు, సంఘ నాయకత్వం కదలికల సమాచారం సేకరించుకుంటున్నారు. లొంగిపోయిన కొందరు మాజీలను విప్లవ ద్రోహులుగా తయారు చేసుకుని, దాడులలో వినియోగించుకుంటున్నారు. ప్రజా నిర్మాణాలలో బలహీనమైన శక్తులను రహస్యంగా అరెస్టు చేసి, లొంగదీసుకుని, బ్లాక్ మెయిల్‌చేస్తూ, కోవర్టులుగా మార్చుకుని, దళాలపై దాడులకు పథకాలు వేస్తున్నారు. మనం ఎప్పుడు వెళ్ళని కొత్త ప్రాంతాలలో కూడా కొందరిని రహస్యంగా హోంగార్డులుగా నియమించి వారి సమాచారం మీద ఆధారపడి మన దళాలు ఆ ప్రాంతాలకు వెళ్ళగానే దాడులు చేస్తున్నారు. ఒడిశాలో కూడా ఎ.పి ఎస్.ఐ.బి అధికారులు మకాం వేసి, నెట్‌వర్క్‌ను తయారు చేయడంపై ప్రత్యేక కేంద్రీకరణతో పని చేస్తున్నారు. రెండు రాష్ట్రాల పోలీసు అధికారులు సమాచారం యిచ్చిపుచ్చుకోవడం, జాయింట్ ఆపరేషన్స్ చేపట్టడం చేస్తూనే, రెగ్యులర్‌గా సమావేశాలు జరుపుకుంటూ సమన్వయాన్ని సాధిస్తున్నారు.

పై అంశాలలో గతం కన్న అనేకరెట్లు అనుకూలతలను సాధించి, ప్రధానంగా సమాచార ఆధారిత దాడులకు పూనుకుంటున్నారు. పార్టీకీ, ప్రజాపునాదిని దెబ్బతీయడంలో భాగంగా, ఎడతెరిపి లేకుండా వారాలు, నెలల తరబడి కూడా వెసులుబాటు యివ్వకుండా కూంబింగ్‌లను కొనసాగిస్తూ, దళాలపై ఒత్తిడి పెంచి ప్రజాపునాదికి అడ్డంకులు కల్పిస్తున్నారు. గ్రామాలలో స్థానిక సంఘ నాయకత్వాన్ని దెబ్బతీయడం ద్వారా ప్రజలకు నాయకత్వం లేకుండా చేయాలని దాడులు, అక్రమ అరెస్టులను ఒక క్యాంపెయిన్‌గా కొనసాగిస్తున్నారు.

2019 జులై నుండి డిసెంబర్ మధ్య శత్రువు దళాలపై 4 చోట్ల దాడులు చేశాడు. అందులో జులై 27న ఒడిశా–చత్తీస్‌గఢ్ సరిహద్దులోని తిరియా గ్రామ అడవి ప్రాంతంలో ఫారెస్టు డిపార్ట్‌మెంట్ నియమించిన ఏజెంట్ ఇచ్చిన పక్క సమాచారంతో ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి చేసిన దాడిలో ఒక సాధారణ స్కూల్ విద్యార్థితోపాటు, ఆరుగురు కామ్రేడ్స్ అమరులయ్యారు. మల్కనగిరి జిల్లా, గుమ్మ ఏరియాలోని డాబగూడ గ్రామంలో రహస్యంగా పని

చేస్తున్న హొంగార్డు యిచ్చిన ఖచ్చితమైన సమాచారంతో ఏర్పాటు చేసిన ఆంబూష్‌లో చిక్కుకున్న దళం ఒక బి.ఎస్.ఎస్ జవాన్‌ను ఖతం చేసి, మరొకరిని తీవ్రంగా గాయపరిచి, సి.ఆర్.సి పి.ఎల్ కమాండర్, డి.వి.సి.ఎమ్ కామ్రేడ్ రాకేష్ అమరుడయ్యాడు. ఈస్ట్ డివిజన్‌లోని మండపల్లి అటవీ ప్రాంతంలో కూంబింగ్‌లో ఉన్న గ్రేహౌండ్స్ బలగాలపై దళం ఫైరింగ్ చేసింది. సెప్టెంబర్ 22న కొండజర్త అటవీ ప్రాంతంలో దళమకాంపై జరిగిన దాడిలో ముగ్గురు కామ్రేడ్స్ అమరులు కాగా, అక్కడ నుండి రిట్రీట్ అయి, గ్రామానికి వెళ్ళిన మరో ఇద్దరు కామ్రేడ్స్‌ను 24వ తేదీన పట్టుకొని కాల్చిచంపారు.

పోలీసులు గ్రామాలపై దాడులు చేసి, సంఘ నాయకులను అరెస్టు చేయడానికి ప్రయత్నిస్తే, ప్రజలు సాయుధంగా ప్రతిఘటించి విడిపించుకోవడం, అడ్డుకోవడం వంటివి చేయడంలో గ్రామాలపై దాడులు నిలిపివేసి, సంతలకు, బంధువుల ఇళ్ళకు, హాస్పిటల్స్‌కు, మండల కేంద్రాలకు వెళ్ళినవాళ్ళను ఇన్‌ఫార్మర్ సహాయంతో అరెస్టులు చేస్తున్నారు. అందులో భాగంగానే మల్కనగిరి జిల్లా, చిత్రకొండ బ్లాక్, రంగినిగూడ సంఘ నాయకుడు కామ్రేడ్ చిన్నారావును జంతబాయి సంతలో అరెస్టు చేసి, చిత్రహింసలు పెట్టగా లాకప్‌లో చనిపోయాడు. అనేక మందిపై కేసులు మోపి, జైళ్ళకు పంపుతున్నారు.

## 'సమాధాన్' దాడిని ప్రతిఘటిస్తూ, విప్లవోద్యమాన్ని పురోగమింప జేస్తున్న ప్రజలు

2019 సెప్టెంబర్....న మల్కనగిరి జిల్లా, చిత్రకొండ బ్లాక్‌లోని రంగినిగూడ గ్రామ సంఘ నాయకుడు పార్టీ సభ్యుడైన కామ్రేడ్ చిన్నారావు అనారోగ్యంతో వైద్యం చేయించుకోవడానికి కూతురు తోడురాగ జంతబాయి సంతకు వెళ్ళాడు. పోలీసు ఏజెంటు అందించిన సమాచారంతో మఫ్టీలో వున్న ముగ్గురు పోలీసులు వచ్చి సంతలోనే పట్టుకున్నారు. ఆ సమయంలో తనతోపాటు ఉన్న కూతురు పోలీసులను అడ్డుకుంటూ వారితోపాటు, జంతబాయిలో ఉన్న బి.ఎస్.ఎఫ్ క్యాంపు వరకు వెళ్ళింది. చిన్నారావుతో మాట్లాడి సాయంత్రం ఇంటికి పంపిస్తామని చెప్పడంతో కూతురు ఒక్కతే తిరిగి గ్రామానికి వెళ్ళి జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు, గ్రామస్తులకు చెప్పింది. తెల్లవారి ఉదయమే వందలాది మంది ప్రజలు, బంధువులు, కలిసి జంతబాయి క్యాంపుకు వెళ్ళి చిన్నారావు గురించి ప్రశ్నించారు. అప్పటికే చిన్నారావును లాకప్‌లో తీవ్ర చిత్రహింసలకు గురి చేసి, హత్య చేసి శవాన్ని గ్రామంలోని అంగన్‌వాడీ భవనంలో దాచిపెట్టారు. కానీ ఈ విషయాలేవి చెప్పకుండా చిన్నారావు మా వద్ద లేడని బుకాయించారు. వెంటనే స్థానిక బొడిపద పోలీస్టేషన్‌లో చిన్నారావు కోసం ఎంక్వయిరీ చేయగా, మాకు సంబంధంలేదనీ, ఎక్కడ ఉన్నాడో కనుక్కొని తెలియజేస్తామని తిప్పి పంపించారు. ఈ పరిణామాలన్ని చూస్తుంటే ప్రజలకు సందేహాలు పెరిగాయి. అదేరోజు సాయంత్రానికి సమారు 1500 మంది ప్రజలు కర్రలు, విల్లుకాడులతో, బొడపడ బి.ఎస్.ఎఫ్ క్యాంపు, పోలీస్టేషన్‌పై దాడి చేయగా, పోలీసులు పరుగులు తీసారు. బంకర్‌పైన ఉన్న సెంట్రీని పట్టుకుని మహిళలు చెప్పులతో కొట్టారు. స్టేషన్‌లోని సామాగ్రిని ధ్వంసం చేసి, కాల్చివేశారు. మరుసటి రోజు హడావిడిగా జంతబాయి అంగన్‌వాడి భవనం వద్ద గుర్తు తెలియని శవం లభ్యమైనట్లుగా పోలీసులు ప్రకటించారు. ప్రజలు ఊహించినట్లుగానే పోలీసులు చిన్నారావును హత్యచేశారని సుమారు 3వేల మంది ప్రజలు జంతబాయికి వెళ్ళగా, అప్పటికే శవాన్ని బి.ఎస్.ఎఫ్ క్యాంపుకు తరలించి దాచి పెట్టారు. ప్రజలు శవాన్ని చూపించాలని డిమాండ్ చేయగా, తెలియదని బుకాయించారు. ప్రజలు క్యాంపులోకి చొరబడి పోలీసులపై దాడి చేస్తూనే, క్యాంపులో వెతకగా మూటగట్టిన శవం కనబడింది. కుటుంబ సభ్యులు సంతకం చేస్తే శవాన్ని పోస్ట్‌మార్టం అనంతరం అప్పగిస్తామని రాజీబేరాలకు దిగారు. కుటుంబ సభ్యులు అందుకు నిరాకరించడంతో రాత్రికి రాత్రే శవాన్ని రహస్యంగా పోస్ట్‌మార్టానికి తరలించారు. తెల్లవారి ఉదయం ఆంధ్రప్రదేశ్ సరిహద్దు, ఒడిశా గ్రామాలకు చెందిన వేలాదిమంది ప్రజలు సాంప్రదాయక ఆయుధాలతో ఆ గ్రామానికి చేరుకున్నారు. పోలీసులు రాజకీయ నాయకులను పంపి ప్రజలతో రాజీ చేయాలని చూసారు. అప్పటికే అదనపు బలగాలను మోహరించారు. శవాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించడానికి తిరిగి జంతబాయికి తరలించారు. చిన్నారావును అరెస్టు చేసిన పోలీసులను అప్పగించాలనీ, తక్షణమే పోలీసు క్యాంపు ఖాళీ చేయాలని డిమాండ్‌లతో క్యాంపును చుట్టుముట్టారు. కత్తులు, గొడ్డళ్ళతో దాడికి దిగడంతో పోలీసులు వాహనాలతో కొందరు, పంటపొల్లాలో కొందరు పరుగులు లంఖించుకున్నారు. రాళ్ళతో దాడి చేస్తూ, చేతికి దొరికిన వారిని గొడ్డళ్ళతో గాయపర్చుతూ, వాహనాలను తగలబెట్టారు. ఈ దాడిలో ఏడుగురు పోలీసులు తీవ్రంగా గాయపడగా, అనేక మంది పోలీసులకు స్వల్ప గాయాలయ్యాయి.

చిన్నారావు శవాన్ని తీసుకొని, భారీ ఊరేగింపుగా గ్రామానికి తీసుకువెళ్ళి, విప్లవ సాంప్రదాయాలతో అంతిమ సంస్కారాలు పూర్తి చేశారు. మరుసటి రోజు ఆంధ్ర-ఒడిశా సరిహద్దులోని అనేక గ్రామాలకు చెందిన సుమారు 7వేల మంది ప్రజలు సమావేశమై 1. చిన్నారావుతో పాటు గతంలో పోలీసులు ఎన్‌కౌంటర్‌ల పేరిట చేసిన హత్యలన్నింటిపై న్యాయ విచారణ జరిపి దోషులను శిక్షించాలనీ, 2. వాకపల్లి, బల్లుగూడ మహిళపై హత్యచారానికి పాల్పడిన గ్రేహౌండ్స్ పోలీసులకు శిక్షలు విధించాలనీ, 3. జంతబాయిలోని తక్షణమే పోలీసు క్యాంపును ఎత్తివేయాలనీ, 4. గ్రామలపై దాడలు, అక్రమ అరెస్టులు నిలిపివేయాలనే ప్రధాన డిమాండ్‌లతో జంతబాయి క్యాంపును ఘేరావ్ చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న ప్రభుత్వం వందలాది మంది అదనపు బలగాలను మోహరించి బారికేట్లు

నిర్మించి క్యాంపుకు చేరుకునే దారులన్నింటిని మూసివేశారు. అయినా ప్రజలు వాటిని దిక్కరించి ముందుకెళ్ళారు. జిల్లా ఎస్.పి, బి.ఎస్.ఎఫ్ ఐ.జి, జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్.ఎల్.ఎతో కలిసి ప్రజల డిమాండ్లపై చర్చించడానికి ముందుకు వచ్చారు. ప్రజలు తమ డిమాండ్లను ఆమోదించే వరకు చర్చలకు రామని తెగేసి చెప్పారు. ప్రజలతోపాటు, బూర్జువా పార్టీల స్థానిక నాయకులను పిలిచి ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామనీ, చిన్నారావు కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామనీ, మిగిలిన డిమాండ్లను కూడా అమలు చేస్తామని పోలీసు క్యాంపు ఎత్తివేతపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నిర్ణయించాల్సి ఉంటుందనీ, అందుకు నెల రోజుల సమయం కావాలని అప్పటి వరకు ఈ ప్రాంతంలో కూంబింగ్‌లు, అరెస్టులు నిలిపివేస్తామని ప్రకటించారు. ఒకరోజు వ్యవదితో కటాఫ్ ఏరియా ప్రజలు కూడా ఈ ఆందోళనలో భాగం అవుతూ నిర్దిష్టమైన డిమాండ్‌లను రూపొందించారు. 1. ఏజెన్సీలో మోహరించిన పోలీసు క్యాంపులన్నింటిని వెంటనే ఎత్తివేయాలి. 2. కూంబింగ్‌లు, గ్రామాలపై దాడులు నిలిపివేయాలి. 3. ఇప్పటివరకు జరిగిన లాకప్ హత్యలు, అత్యాచారాలు, బూటకపు ఎన్‌కౌంటర్‌లపై న్యాయ విచారణ జరిపి తక్షణమే అందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి అనే డిమాండ్లతో 3వ రోజు ఆంధ్ర-ఒడిశా ప్రజలతో సమావేశమై ఆందోళనకు దిగారు. పోలీసులు క్యాంపు గేట్లకు తాళాలు వేసి, విలేఖరుల బృందాన్ని మధ్యవర్తులుగా పంపి, ప్రజా డిమాండ్‌లను ఆమోదిస్తూ ప్రభుత్వం ప్రకటన చేసింది కనుక నెలరోజుల సమయం ఇవ్వాలని సమాచారం పంపారు. ప్రజలు నెల రోజుల గడువు విధించి తదుపరి తమ కార్యాచరణను రూపొందించుకొని తాత్కాలికంగా ఆందోళనను విరమించారు. ఈ ఆందోళన సరిగ్గా 8 రోజులు కొనసాగింది. సాధారణ ప్రజలలో కూడా పోలీసులపై గూడు కట్టుకొని ఉన్న కసి ఈ ఉద్యమంలో వివిధ రూపాలలో వ్యక్తమయ్యింది. వేలాది మంది ప్రజలకు స్థానిక గ్రామాల ప్రజలు ఆహారం, మంచినీరు, జావ అందించి వారి ఇళ్ళలో ఆశ్రయం కల్పించారు.

ఈ ఆందోలనలో ప్రజలు అత్యంత మిలిటెన్సీని, పోలీసులు, ప్రభుత్వం పట్ల కసిని ప్రదర్శించారు. 'ఒక చిన్న నిప్పురవ్వ గొప్ప దావనలాన్ని సృష్టిస్తుంది' అనడానికి ఈ ఆందోళన ఒక నిరద్శనం. ఈ ప్రతిఘటన ఉద్యమంలో ప్రజల మధ్య ఉన్న ఐక్యత, సంఘీభావం, మిలిటెన్సీ చాలా స్పష్టంగా వ్యక్తమయ్యింది. ఈ ప్రతిఘటనలో మహిళలు ముందు భాగాన ఉండి క్రియాశీలక పాత్రను పోషించారు. వ్యూహాత్మక శతృవు కాగితపు పులే అని ప్రజలే నిర్ణయాత్మక శక్తులని మరోమారు ఋరువయ్యింది. చిన్నారావు కుటుంబం ప్రభుత్వం కల్పించే ఆశలకు, భ్రమలకు లొంగకుండా వీటిని ధిక్కరిస్తూ ఆయన ఆశయ సాధనకు అంకితమై చైతన్యయుతంగా ఉద్యమించారు.

## పెదబయలు ఏరియాలో పోలీసు దాడులు, అక్రమ అరెస్టులకు నిరసనగా ప్రజా ర్యాలీ

విశాఖపట్నం జిల్లా, పెదబయలు ఏరియాలోని ముంచింగిపుట్, జి.మాడుగుల, చింతపల్లి, పెదబయలు మండలాలో గ్రేహౌండ్స్, సి.ఆర్.పి.ఎఫ్, స్థానిక పోలీసులు అడవులలో కూంబింగ్‌ల పేరుతో వ్యవసాయ పనులు చేసుకుంటున్న వారిని, వేటకు వెళ్ళిన ప్రజలను, బంధువుల ఇళ్ళకు ప్రయాణించే వారిని పట్టుకోవడం, వేధించడం, అక్రమంగా నిర్బంధించడం, గ్రామాలపై రాత్రిళ్ళు దాడులు చేయడం, సంతలకు, వైద్యానికి వెళ్ళినవారిని అక్రమంగా అరెస్టు చేసి, వారాల తరబడి పోలీసుస్టేషన్‌లో చిత్రహింసలకు గురి చేయడం, తప్పుడు కేసులు బనాయించి, జైళ్ళకు పంపడంతో ప్రజలు, వారి కుటుంబాలు తీవ్రమైన అబధ్రతతో జీవనం కొనసాగించవలసి వస్తున్నది.

ప్రభుత్వం అమలు జరుపుతున్న ఈ నిర్బంధాన్ని ప్రజలు సామూహికంగా ఎదుర్కొవాలనీ, అందుకు కలిసివచ్చే పార్టీలు, సంస్థలు, వ్యక్తులు ముందుకు రావాలని పార్టీ పిలుపునిచ్చింది. ప్రజలకు దూరం అవుతామనే భావంతో అన్ని పార్టీలు స్థానిక రాజకీయ నాయకులు కూడా ఈ సమస్యలపై ఏర్పాటు చేసిన ఐక్య సంఘటనలో కలిసి వచ్చారు.

1. గ్రామలపై దాడులు, సంతలలో అక్రమ అరెస్టులు నిలిపివేయాలి. 2. అడవులలో ప్రత్యేక బలగాల కూంబింగ్ నిలిపివేయాలి.

3. పోలీసుల అదుపులో ఉన్న ప్రజలను, సంఘనాయకులను బేషరతుగా విడుదల చేయాలి. 4. మన్యంలో ఏర్పాటు చేసిన పోలీసు క్యాంపులను వెంటనే ఖాళీ చేయాలనే డిమాండ్స్‌తో ఐక్యకార్యాచరణ కమిటీ ఏర్పడింది. ఈ డిమాండ్‌లతో నవంబర్‌లో వేలాది మంది ప్రజలు స్థానిక పోలీసు క్యాంపులు, పెదబయలు మండల కేంద్రానికి ర్యాలీగా వెళ్ళి, రాస్తారోకో నిర్వహించి, సాంప్రదాయక ఆయుధాలు చేబూని, పై డిమాండ్‌లతో కూడిన బ్యానర్స్ పట్టుకొని ఊరేగింపుగా బయలుదేరారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు ఒ.ఎస్.డి, చింతపల్లి ఎ.ఎస్.పి సతీష్‌కుమార్, పాడేరు డి.ఎస్.పి, సి.ఐ, ఎస్.ఐల నాయకత్వంలో వందలాది మంది సాయుధ బలగాలతో, రోడ్లపై ఉదయం నుండే ప్రజలు వచ్చే దారులన్నింటిని మోహరించారు. మా మీద విశ్వాసం ఉంచండి. మాకు సహకరించండి" అంటూ మేకవన్నే పులులైన పోలీసు అధికారులు వరుసపెట్టి ఉపన్యాసాలు ఇచ్చారు. కాని ప్రజలు వారి మోసపూరిత వాగ్ధానాలను పట్టించుకోలేదు. చివరకు పోలీసులు అరెస్టు చేసిన వారిని ప్రజల సమక్షంలోనే విడుదల చేయక తప్పలేదు. పోలీసులు గ్రామాలపై దాడులు చేస్తే, అక్రమ అరెస్టులకు పాల్పడితే ప్రతిఘటిస్తామని ప్రజలు బహిరంగంగా ప్రకటించారు. వందలాది గ్రామాలు, వేలాది మంది ప్రజలు కదిలి పోలీసుల ధౌర్జన్యాలను ప్రశ్నించడాన్ని ప్రభుత్వానికీ, పోలీసు

యంత్రాంగానికి ఎంతో ఆందోళనకు గురి చేసింది. తమ చిత్తానుసారంగా ప్రజలతో వ్యవహరిస్తే ప్రతిఘటనను ఎదుర్కోవలసి వస్తుందని అవగతమైంది. ఈ ఆందోళన తర్వాత పోలీసులు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. తాత్కాలికంగానైనా గ్రామాలపై దాడులు, అక్రమ అరెస్టులు నిలిచివేశారు.

## వ్యూహాత్మక ప్రాంతాలలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న నూతన పోలీసు క్యాంపుల నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ప్రజాందోళన

మల్కనగిరి జిల్లాలోని చిత్రకొండ బ్లాక్, కటాఫ్ ఏరియాలోకి చొరబడే లక్ష్యంతో రోడ్లను నిర్మిస్తూ, లేదా నిర్మించే లక్ష్యంతో నూతనంగా అనేక పోలీసు క్యాంపుల ఏర్పాటు చేసే పథకం వేసి దాని ద్వారా ఆ ప్రాంత విప్లవ ప్రజాఉద్యమాలను అణచివేసే లక్ష్యంతో ఒంతలగూడ గ్రామంలో క్యాంపు నిర్మాణానికి సన్నాహాలు ప్రారంభించాడు. అందులో భాగంగా బోరింగ్‌లు వేయడం, రోడ్డును నిర్మించడం, క్యాంపు నిర్మాణ స్థలాన్ని చదును చేసే పనులు మొదలైన వాటిని భారీ యంత్రాలను ఉపయోగిస్తూ మొదలుపెట్టారు. అందుకుగాను తెగపెద్ద, మరికొందరు ప్రజా వ్యతిరేకుల సహకారాన్ని తీసుకుంటూ, వారి పనులను కొనసాగిస్తున్నారు. దీనికి కొన్ని రోజుల ముందే చిన్నారావు లాకప్ హత్య జరగడం, పక్కనే ఉన్న జంతబాయి క్యాంపును ఎత్తి వేయాలని ప్రజల ప్రతిఘటన ఉద్యమం జరుగుతూనే ఉంది. అయినప్పటికీ దానిని లెక్కచేయకుండా ప్రజలను అణచివేసి లేదా లొంగదీసుకొని ప్రజల పోరాట విజయాలను వమ్ము చేసే దుష్ట తలంపుతో మరొక క్యాంపు ఏర్పాటు చేయడానికి పూనుకోవడం ప్రజలలో తీవ్ర ఆగ్రహం పెల్లుబికింది. సుమారు 4వేల మంది ప్రజలు ఒంతలగూడలో పోలీసు రక్షణలో జరుగుతున్న క్యాంపు నిర్మాణాన్ని అడ్డుకోవడానికి సాంప్రదాయక ఆయుధాలతో తరలివెళ్ళారు. ప్రజలు కదిలిరావడాన్ని గమనించిన పోలీసులు వాహనాలను తరలించుకొని కొండదిగి సమీప క్యాంపుకు వెళ్ళిపోయారు. గ్రామ తెగపెద్ద కూడా గ్రామాన్ని వదిలి పారిపోయాడు. ప్రజలు ఒంతలగూడ గ్రామానికి చేరుకొని, పోలీసులు వేసిన బోరింగులను ధ్వంసం చేసి, పోలీసు క్యాంపు నిర్మాణానికి గ్రామస్తులు సహకరించవద్దనీ, భయపడవద్దనీ, అందుకు ఈ ప్రాంత ప్రజల మద్దతు వుంటుదని అర్థం చేయించారు. రోడ్ల నిర్మాణం ప్రజల అభివృద్ధిలో భాగం కాదనీ, ప్రజలను అణచివేసేందుకేననీ, ఆచరణ పూర్వకంగా మనకు ఋజువు అవుతున్నందున రోడ్లనూ, పోలీసు క్యాంపులను ప్రజలందరూ కలిసి అడ్డుకుందామని సమిష్టిగా నిర్ణయం తీసుకున్నారు. ★

---

*(....5వ పేజీ తరువాయి)*

సురక్షితమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందిస్తూ వైరస్ వ్యాప్తిని అరికడుతూనే ఆకలి చావులతో పాటు ఆర్థిక ఒత్తిడితో కూడిన ఆత్మహత్యలు జరగకుండా ప్రజలందరిని తగు విధంగా పోషిస్తూ, ఆర్థిక వ్యవస్థలో జరిగే ఉత్పత్తి కార్యకలాపాలను తగు జాగ్రత్తలతో ముందుకు తీసుకుపోవడంలో ప్రభుత్వం విఫలమయ్యింది.

ప్రభుత్వ గోడౌన్లలో నేడు నిల్వ ఉన్న 7.7 టన్నుల బియ్యం, గోధుమలను ప్రజా పంపిణీ ద్వారా పంపిణి చేసి మొదటగా ఈ దేశ ప్రజల ఆకలి సమస్యను పరిష్కరించవచ్చు. కుటుంబంలో ప్రతి ఒక్కరికి అడిగినన్ని రోజులు పని కల్పించ వచ్చు. రైతులకు రుణమాఫీ చేసి కొత్త రుణాలివ్వ వచ్చు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు షరతులు లేకుండా రుణాలందించి గతంలోని రుణాలపై వడ్డీ రాయితిచ్చి 50 శాతం జిఎస్‌టిని రద్దు చేయాల్సి ఉంటుంది. స్వల్పకాలిక ఆర్థిక ప్రణాళికలను రూపొందించుకోవాలి. కార్పొరేట్లకిచ్చే భారీ సబ్సిడీలు, రాయితీలు, పన్ను మినహాయింపులను రద్దు చేయాలి. ఈ విపత్కర పరిస్థితుల్లో సంపద పన్నును పునరుద్ధరించాలి. కానీ, ప్రభుత్వం ఈ పనులు చేయడం లేదు. బ్యాంకులను మోసం చేసి విదేశాలకు పరారైన వారి కోసం 63 వేల కోట్ల రూపాయలను రద్దు చేసింది. ఇది దాని దోపిడీవర్గ స్వభావాన్నే చూపుతుంది.

మన దేశంలో సామ్రాజ్యవాద నూతన సరళీకృత ఆర్థిక విధానాలు అమలుచేయడంతో కలిగిన దుష్ప్రభావాల తీవ్రత నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి జాతీయోన్మాదాన్ని మత్తు మందులాంటి విద్వేషపూరిత మతవైషమ్యాలను రెచ్చగొట్టడానికి ఫాసిస్టు హిందుత్వ శక్తులు చేస్తున్న అన్ని రకాల కుట్రలను బహిర్గత పరుస్తూ ప్రజా ఉద్యమాల ద్వారా ఓడించాలి.

ఈ సంక్షోభ నివారణ చర్యలు ఇకపై ఏ విధంగా ఉండాలో అన్ని సామాజిక సెక్షన్‌లను భాగం చేస్తూ పథకాలను రూపొందించుకోవాలి. అయితే, మన ఆర్థిక ప్రణాళికల్లో ప్రకృతిని భాగస్వామ్యం చేసే దిశగా ప్రజల హెల్త్‌కేర్ వ్యవస్థని రూపొందించుకునే దిశగా ఆ పథకాలు ఉండనిపక్షంలో కొరోనా లాంటి మహమ్మారులు తెచ్చే సంక్షోభాల్ని ఎదుర్కోలేం.

ప్రజలందరికీ, స్థాయీ బేధం లేకుండా, తరగతుల్లేని ఒకే తరహా ప్రజా వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావడం. డబ్బుతో వైద్యం కొనుక్కోవడాన్ని రద్దుచేయడం. డబ్బుతో పనిలేని వైద్యాన్ని ప్రజలకు అందించడం. పనిచేసే చోటే, నివసించే చోటే అందుబాటులోకి వైద్యం లాంటివి ఆచరణ సాధ్యం కావాలంటే పీడిత వర్గాలన్నీ ఐక్యమై దోపిడీ వర్గ సమాజాన్ని కూల్చాలి. నూతన ప్రజాస్వామిక సమాజాన్ని నిర్మించాలి. ★

*(....54వ పేజీ తరువాయి)*

ప్రధానంగా మహర్ (నేతకాని)లు కాపులు (జాడి కాపులంటారు) దాదాపు అంతటా ఉన్నారు. గైరాదివాసీ వ్యాపారులూ ఉన్నారు. వీరికితోడుగా 1970లలో లక్షల సంఖ్యలో శరణార్థులుగా చేరిన బంగ్లాదేశ్‌కు చెందిన 'హిందూ' (అధికశాతం దళితులు) ప్రజలున్నారు.

మన్యం సహా దండకారణ్యమంతా అనాదిగా ప్రజా తిరుగుబాట్లకు పుట్టినిల్లు. బ్రిటిష్‌వారి దోపిడీ దౌర్జన్యాలను, వలసాధిపత్యాన్ని ఎదిరించిన తొలి ప్రజా తిరుగుబాట్లలో బస్తర్ పరాల్‌కోట గేండ్‌సింగ్ కొనసాగించిన గెరిల్లా యుద్ధం చరిత్రకు ఎక్కింది. ఆ తరువాతి ఉద్యమాలలో గడ్‌చిరోలీ సడ్మెక్ బాబూరావు, బస్తర్ గుండాదూర్, మన్యం అల్లూరి సీతారామరాజు, ఆదిలాబాదు కొంరం భీంల నాయకత్వంలో నడిచినవి నేటికి ఆ వీర ప్రజలకు ప్రేరణాదాయకమే! చరిత్రలో దోపిడీ పాలకవర్గాలు మరుగునపడేసిన వీరయోధుల వారసులుగా మనం పోరాడితీరాలనీ తొలినుండి విప్లవకారులు ఆ ప్రజాయోధుల త్యాగాలను ఎత్తిపడుతున్నారు. దానితో ఇపుడు అనివార్యంగా పాలకవర్గాలు సైతం వారిని ఓవైపు స్తుతిస్తూ మరోవైపు అహింస పాటపాడుతూ వారి వారసులైన ప్రజలను అణచివేస్తున్నారు. నలుబై ఏళ్ల దండకారణ్య విప్లవోద్యమం మట్టి పొరలలో దాగిన చారిత్రికవీరుల త్యాగాలను వెలుగుమయం చేయడంలో కృతకృత్యమైంది.

విప్లవోద్యమ ప్రారంభానికి ముందే పాత బస్తర్ జిల్లాలో ఆగ్నేయంగా ఉన్న బైలాడిల్లా కొండలలో ఇనుప గనుల తవ్వకాలను ఎన్.ఎం.డీ.సీ. జపాన్ వారి కోసం ప్రజలను ఊచకోత కోసి ప్రారంభించింది. గత నలుబై ఏళ్లుగా ఆ తవ్వకాలు కొనసాగుతూ కొండలను నేలమట్టం చేశాయి. ఆ చేదు అనుభవంతో విప్లవపార్టీ నాయకత్వంలో గత నాలుగు దశాబ్దాలుగా విప్లవ ప్రజానీకం తమ జీవితాలను అస్థిత్వాన్ని సవాలు చేసే తవ్వకాలకు వ్యతిరేకంగా జీవన్మరణ పోరాటాలు కొనసాగిస్తున్నారు.

దండకారణ్యం వ్యాపితంగా అన్ని రకాల తెగల ఆదివాసీ పీడిత ప్రజలు విప్లవకారులను ప్రాణంలా చూసుకుంటూ వారి నాయకత్వంలో సంఘటితపడి సమరశీల పోరాటాలలోకి దిగడం దోపిడీ పాలకవర్గాలకు కునుకు పట్టనివ్వలేదు. దానితో మూడు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర ప్రభుత్వాలు పాశవికమైన అణచివేత చర్యలకు దిగాయి. మన్యంలో పదుల సంఖ్యలో ఆదివాసీ ప్రజల పూరిళ్లను మంటలకు ఆహుతి చేశారు. మిగితా రెండు రాష్ట్రాలలో పెద్దెత్తున అరెస్టులు, తప్పుడు కేసులలో ప్రజలను జైలుకు పంపడంతో పాటు విప్లవకారులను బూటకపు ఎదురు కాల్పులలో హత్య చేయడం మొదలైంది. ప్రభుత్వ అటవీశాఖ వారు అత్యంత దౌర్జన్యంగా ప్రజల సాగు భూములను పట్టాలు లేవనే పేరుతో తిరిగి స్వాధీనం చేసుకోసాగారు. స్త్రీ-పురుషులకు సమాన పనిలో అసమాన కూలీ, స్త్రీలపై ఉద్యోగుల లైంగిక దోపిడీ, ప్రభుత్వ ప్రైవేట్ వెట్టి చాకిరీని ఎదిరించిన ప్రజలను లక్ష్యంగా చేసుకొని పోలీసులు దాడులు ముమ్మరం చేశారు. తొలినాళ్లలో ప్రజలు పోరాడి సాధించుకున్న విజయాలను అన్ని ప్రాంతాలలోని పేపర్ మిల్లుల యాజమాన్యాలు-దళారీ నిరంకుశ పెట్టుబడిదారులు-భారత రాజ్యంతో కుమ్మక్కై వమ్ము చేయడానికి సిద్ధమయ్యారు. తునికాకు కాంట్రాక్టర్ల నుండి నక్సలైట్లు నిధులు దండుకుంటున్నారనీ మహారాష్ట్రలో ప్రభుత్వం వారిని అడవులలోకి అనుమతించడాన్ని నిలిపివేసింది. ప్రభుత్వ పోలీసు దాడులు ఉన్నత స్థాయిలో సాగుతుండగా ప్రజలు ప్రతిఘటించక తప్పని అనివార్య స్థితి ఆంధ్ర అడవులలో ముందుకు వచ్చింది. విప్లవ గెరిల్లాలు రాజ్య శక్తులను ఎదుర్కోవడమే ప్రధాన కర్తవ్యంగా మారింది. పర్యవసానంగా, 1987 వరకు విశాల దండకారణ్యం ఒక గెరిల్లా జోన్‌గా ఉనికిలోకి వచ్చింది.

విప్లవోద్యమంలో ప్రజలు ఉన్నత స్థాయిలో సంఘటిత పడసాగారు. దండకారణ్య వ్యాపితంగా ప్రజా సంఘాలు ముఖ్యంగా రైతు కూలీలు, మహిళలు రాష్ట్ర స్థాయి నాయకత్వాలను ఎన్నుకొని వాటి మార్గదర్శకత్వంలో పని చేయసాగారు. కరువు వ్యతిరేక పోరాటాలలో కదిలిన ప్రజానీకం నూతన రూపాలలో కరువు దాడులు నిర్వహించారు. ఉద్యమంలో పెరుగుతున్న ప్రజల భాగస్వామ్యం, వారిని అణచడానికి నిరంకుశ ప్రభుత్వాలు చేపడుతున్న హింసాత్మక చర్యలను వెల్లడిస్తూ విశాల పీడిత ప్రజల సంఘీభావాన్ని కూడగట్టుకోవడానికి హిందీలో 'ప్రభాత్' పత్రిక ప్రారంభమైంది.

1983లో ప్రాథమిక సైనిక శిక్షణ పొందిన గెరిల్లాలకు 1987లో ఉన్నత స్థాయిలో సైనిక శిక్షణను ఇవ్వడం మొదలైంది. దండకారణ్య ఉద్యమంపై ఆధారపడి నూతన ప్రాంతాల విస్తరణకు ఉత్తరానికి భండారా, బాలాఘాట్ జిల్లాలకు మార్గాలు తెరచుకున్నాయి. అప్పటివరకు ఉద్యమానికి నాయకత్వం వహిస్తూ వచ్చిన 'ఫారెస్టు లైజాన్ కమిటీ' స్థానంలో దండకారణ్య పార్టీ మహాసభ జరిగి 'ఫారెస్టు కమిటీ' ఏర్పడింది. దాని నాయకత్వంలో 1987లోనే ఆదిలాబాదు జిల్లాలోని అల్లంపల్లిలో, తూర్పు గోదావరి జిల్లా దారగడ్డలో గెరిల్లాలు తొలి మాటుదాడులకు దిగి పోలీసు బలగాలను మట్టి కరిపించి శత్రు వర్గాలకు ప్రజాయుద్ధాన్ని పరిచయం చేశారు.

దండకారణ్య విప్లవోద్యమం ఉన్నత స్థాయికి ఎదగడంతో ప్రభుత్వ పోలీసు వర్గాలు ద్విముఖ వ్యూహంతో పని చేయ ప్రారంభించాయి. కేంద్రం ఉద్యమ రాష్ట్రాలలోని ఖాకీబలగాలను సైనికంగా సమన్వయించడానికి పూనుకుంది. మహారాష్ట్ర ప్రభుత్వం 1991లో 'స్పెషల్ ఆక్షన్ ప్లాన్'ను చేపట్టి 1992లో స్థానిక యువకులతో 'క్రాక్ కమాండోస్' (సీ)-60 బలగాలను రూపొందించింది. వాళ్లు 1991-94 మధ్య గఢ్‌చిరోలీలో ఎన్నడెరుగని స్థాయిలో ఉద్యమంపై విరుచుకపడ్డారు. యేడాది కాలంలోనే 60మంది విప్లవకారులను ప్రధానంగా విప్లవ ప్రజాసంఘాలలో సంఘటితపడిన ఆదివాసీ యువతను బూటకపు ఎన్‌కౌంటర్లలో కాల్చిచంపారు. మధ్యప్రదేశ్‌లోని బస్తర్‌లో

'రాత్‌వాలా' పేరుతో నూతన బలగాలు ఉనికిలోకి వచ్చాయి. అక్కడ ప్రజా ఉద్యమ నాయకుడు చాప లచ్చుమన్నను మాయం చేశారు. అడవుల గాలింపు చర్యల కోసం 'అపరేషన్ మంథన్', 'ఆపరేషన్ దంతేశ్వరీ' తదితర పేర్లతో సైనిక కెంపెయిన్‌లు కొనసాగించడం మొదలైంది. ఆంధ్రప్రదేశ్‌లో అర్ధసైనిక బలగాలు అప్పటికే దిగి అక్కడ స్వైరవిహారం చేయసాగాయి. 1987 వరకు ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతూ వచ్చిన శతృ అణచివేతచర్యలలో 1991నాటికి మొత్తం దండకారణ్య వ్యాపితంగా సారూపత్య సంతరించుకున్నదని కేంద్రకమిటీ అంచనా వేసింది.

ఉద్యమంలో విడిగా సైనిక నిర్మాణాలు ఏర్పర్చుకోవలసిన సమయం ఆసన్నమై 1993లో ప్రత్యేక మిలటరీ దళాలు ఏర్పడగా 1995 నాటికి అవి ప్లాటూన్‌ల స్థాయికి ఎదిగాయి. గ్రామాలలో యువత ప్రజా మిలీషియాగా సంఘటితమవడమే కాకుండా సాయుధం కాసాగారు. గ్రామాలలో విప్లవ ప్రజా సంఘాలు సంఘటితం కావడంతో పాటు వాటిలో నుండి చురుకైన, అంకితభావం గలిగిన రాజకీయంగా సచేతనులవుతున్న కార్యకర్తలు ఉన్నత స్థాయిలో ఎక్కడికక్కడే పునాదిస్థాయిలో కార్మికవర్గ అగ్రగామి దళ ప్రాతినిధ్య యునిట్లు (సెల్) సంఘటితం అవుతున్నారు. పటిష్టమవుతూ పెంపొందుతున్న ఉద్యమంలో ఆదివాసీ, గైరాదివాసీ రైతాంగం తిరిగి అటవీ భూముల స్వాధీనానికై తెగించి ముందుకు వచ్చి పంటలు పండించసాగారు. గ్రామాలలో 'సంఘాలదే అధికారం' లేదా 'దున్నే వారికే భూమి, రైతాంగ కమిటీలకే అధికారం' నడుస్తోంది. దుష్ట తెగ పెత్తందార్లలో, భూస్వాములలో ఒక సెక్షన్ (బురద వడ్డె, గోవిందరావులాంటి వాళ్లు) ప్రజల చేతులలో మట్టి గరువగా, మరో సెక్షన్ ఉద్యమం ముందు లొంగిపోయింది. జనజాగరన్ అభియాన్ పేరుతో 1991లో చేపట్టిన విప్లవ ప్రతీఘాతుక తొలి కెంపెయిన్ బస్తర్‌లో దాదాపు మూడు మాసాలలో ఓటమిపాలైంది. గ్రామాలలో ఉన్నతస్థాయిలో ప్రత్యామ్నాయ ప్రజారాజ్యాధికార సంస్థ (నాలుగు వర్గాల రాజ్యాధికార అంగాలు) ఆవశ్యకత ముందుకు వచ్చింది.

దేశవ్యాప్త ఉద్యమ పరిస్థితులను అంచనా వేసిన కేంద్రకమిటీ దండకారణ్య ఉద్యమం ముందు ఉన్నత స్థాయి గెరిల్లా జోన్ నిర్మాణ కర్తవ్యాన్ని ఉంచింది. దండకారణ్య ఉద్యమ భూభాగాన్ని మూడుగా విభజించి ఆదిలాబాద్ జిల్లాను ఉత్తర తెలంగాణలో, మన్యం ప్రాంతాన్ని ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేసి బస్తర్, గఢ్‌చిరోలీలతో కూడిన విశాల అటవీ ప్రాంతాలకు తోడు నూతన విస్తరణ ప్రాంతం బాలాఘాట్‌ను జతచేసి దండకారణ్యంగా 1995లో స్థిరీకరించింది. అప్పటికే దేశంలో నాలుగేళ్లగా 'సరళీకృత ఆర్థిక విధానాలు' (నియో లిబరల్) పేరుతో ప్రారంభమైన సామ్రాజ్యవాద ఆర్థిక విధానాలతో వ్యవస్థగత మార్పులు చోటు చేసుకుంటున్నాయి.

విప్లవ ప్రజల ప్రత్యామ్నాయ రాజ్యాధికార సంస్థలు 'గ్రామరాజ్య కమిటీ' పేరుతో ప్రారంభమయ్యాయి. ఉద్యమ ప్రారంభంలో దోపిడీ ప్రభుత్వ పట్టాల కోసం రైతాంగాన్ని సమీకరించి పోరాటాలకు కదలించిన చోట అటవీ భూములు స్వాధీనం చేసుకొని సాగు చేసుకుంటున్న రైతులకు గ్రామరాజ్య కమిటీల ద్వారా భూముల కొలతలు చేపట్టి స్త్రీ-పురుషుల ఉమ్మడి పేర్లతో భూమి పట్టాల పంపిణీ ప్రారంభమైంది. భూముల పట్టాలు మహిళల పేర్లతోనూ ఇనస్తాండడంతో మధ్యప్రదేశ్ ప్రభుత్వం కూడా దానినే అనుకరించసాగింది. వ్యవసాయ విప్లవ సంస్కరణలలో భాగంగా అనేక గ్రామాలలో సాగు భూములకు నీటిపారుదల, పశువులకు తాగునీటి వ్యవస్థతోపాటు ప్రజల జీవన ప్రమాణాలు పెంచడంలో భాగంగా చేపల పెంపకం, తోటల పెంపకం కూడా మొదలైంది. నిన్నటివరకు 'దున్నేవారికే భూమి, రైతాంగ కమిటీలకే అధికారం' నినాదంతో సాగిన ఉద్యమం ఇప్పుడు ఆ భూములను రక్షించుకోవడానికి 'దున్నేవారికే భూమి, గ్రామ రాజ్య కమిటీలకే సర్వాధికారాలు' నినాదాన్ని చేపట్టింది. ఉద్యమంలో పెంపొందుతున్న మహిళల పాత్రను విశాల ప్రజల ముందుకు తీసుకెళ్లడానికి 'పోరుమహిళ' (సంఘర్షరత్ మహిళ) 1996 నాటికి వెలుగు చూసింది.

దేశంలోని పలు ఆదివాసీ ప్రాంతాలలో పటిష్టమవుతూ పెంపొందుతొన్న ప్రజాఉద్యమాన్ని లబ్ధిప్రతిష్ట బుద్ధిజీవులు సహ అనేక మంది అధ్యయనం చేసి కేంద్ర ప్రభుత్వం ముందు ఆదివాసీ ప్రాంతాలలో పంచాయితీ వ్యవస్థ విస్తరణపై అనేక మార్పులను సిఫారసు చేసిన నేపథ్యంలో భారత రాజ్యాంగానికి చేసిన 73వ సవరణతో 'పెసా'చట్టం 1996 డిశంబర్ 24న రూపొందింది. విప్లవోద్యమం కాకుండా భారత రాజ్యాంగం ద్వారానే ప్రజల సమస్యలకు పరిష్కారం అనే భ్రమలతో వారు ఈ కసరత్తుకు దిగారు. ప్రభుత్వ చిరు సంస్కరణలకు భిన్నంగా ఉద్యమ అణచివేతలో భాగంగా బస్తర్‌లో రెండవ విడుత జనజాగరన్ అభియాన్‌ను ప్రారంభించినప్పటికీ విప్లవోద్యమం వర్గ ప్రాతిపదికపై నిర్ధాక్షిణ్యంగా కొద్ది మాసాలలోనే దానిని అణచివేసింది.

ప్రారంభంలో అటవీ ఉద్యమానికి దన్నుగా పరిసర శ్రామిక పట్టణ కేంద్రాలలో ఆర్గనైజేషన్ ప్రారంభించినప్పటికీ వివిధ కారణాలతో అది బలపడలేదు. దేశంలో వివిధ శక్తులను ఆకర్షిస్తున్న శంకర్ గుహ నియోగి నాయకత్వంలో 1997-98 నాటికి బలపడిన 'ఛత్తీస్‌గఢ్ ముక్తి మోర్చా' లాంటి సంస్కరణవాద కార్మిక సంఘాల నైజాన్ని వెల్లడిచేస్తూ రాజ్యాధికార లక్ష్యంతో శ్రామికులను విప్లవోద్యమంలో సంఘటితం చేయడానికి పార్టీ నడుం బిగించింది. విశాల శ్రామిక కేంద్రంగా ముందుకు వచ్చిన రాయపుర్, దుర్గ్, రాజనంద్‌గాం జిల్లాల కార్మిక ప్రాంతాలలో ఆర్గనైజేషన్‌ను పటిష్టం చేసే చర్యలు చోటు చేసుకున్నాయి. మరోవైపు దండకారణ్యంలో దేశంలోని నిజమైన విప్లవకారుల ఐక్యతలో భాగంగా 1997లో సీ.పీ.ఐ. (ఎమ్.ఎల్.) (పీ.డబ్ల్యు.) సీ.పీ.ఐ. (ఎమ్.ఎల్.) (పీ.యూ.)ల విలీనం జరిగింది.

1950లో భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన సమయంలో మధ్య ప్రావిన్స్, బేరర్‌లతో కూడిన మధ్యప్రదేశ్

నాగపూర్ రాజధానిగా ఉనికిలోకి వచ్చింది. అప్పటి విధానసభ సభ్యుడైన లాల్‌శ్యాం షాహ్ 1955లో ప్రతిపాదించిన 'గోండ్వానా' బదులు నాలుగునర దశాబ్దాల తరువాత 2000 నవంబర్ 1నాడు 'ప్రత్యేక ఛత్తీస్‌గఢ్' రాష్ట్రం ఏర్పడింది. నూతన రాష్ట్ర నిర్మాణాన్ని ఆహ్వానిస్తూనే బస్తర్ ప్రజలు వేల సంఖ్యలో రోడ్లపైకి వచ్చి ఈ దేశంలో 6లక్షల జనాభా కలిగిన సిక్కిం ఒక రాష్ట్రం అయినపుడు, 30 లక్షలు పైబడిన జనాభాతోనున్న తమ ఆదివాసీ బహుళ బస్తర్‌ను కూడా ఒక ప్రత్యేక రాష్ట్రంగా గుర్తించాలని నినదించారు. కానీ అపార ప్రాకృతిక వనరులున్న బస్తర్‌ను మినహాయించి ప్రత్యేక ఛత్తీస్‌గఢ్ నిర్మాణానికి పాలక వర్గాలు ససేమిరా అన్నాయి. ఆదివాసులకు కనీసం స్వయం పాలిత ప్రాంతాలనైనా అవి ఏర్పర్చలేదు. దేశంలోని ఐదవ షెడ్యూల్డ్ ప్రాంతాలలో అమలు చేస్తామని మురిపించిన పెసా అమలు అటకెక్కింది. కానీ మరోవైపు విప్లవోద్యమంలో నిజమైన ప్రజా పాలనా కేంద్రాలుగా గెరిల్లా జోన్‌లలో గెరిల్లా బేసుల నిర్మాణానికి పార్టీ పిలుపునిచ్చింది. వాటి రక్షణ కోసం దేశ విప్లవోద్యమంలో తొలిసారి 2000 డిసెంబర్ 2న పీ.జీ.ఏ.(పీపుల్స్ గెరిల్లా ఆర్మీ) ఏర్పడింది. ఆనాటికి దేశంలోని రాజకీయ పార్టీల పరిస్థితి ఎంత అస్థిరంగా మారిందంటే వాటిలో ఏ ఒక్కటి కూడా గతంలో లాగా కేంద్రంలో ఏకపార్టీ ప్రభుత్వాన్ని ఏర్పర్చలేక పోతున్నాయి. కేంద్రంలో కూటములతో కూడిన అస్థిర ప్రభుత్వాలు ఏర్పడక తప్పని అనిశ్చిత స్థితులు తలెత్తాయి.

విప్లవ కార్యాచరణలో ప్రతిఘటన సహా కార్యక్రమాలన్నీ కేంపెయిన్‌ల రూపంలోనే చేపట్టాలనే నూతన అవగాహన పెంపొందింది. పీజీఏలోకి పెద్దెతున కేడర్లను భర్తీ కెంపెయిన్‌ల ద్వారా తీసుకోవడం మంచి ఫలితాలను ఇచ్చింది. వందలాది ఆదివాసీ యువత సాయుధమయ్యారు. మన దేశంలో విప్లవం దళితులతో పాటు తక్షణం ఆ వర్గాలకే కావాలి. వారు విప్లవోద్యమంలో పాల్గొని, దోపిడీ వర్గాల ప్రజా వ్యతిరేక విధానాలతో పోరాడాలంటే వారు సుశిక్షితులు కాకుండా సాధ్యం కాదు. సమాజంలో అప్పటి వరకు వారు కనీస విద్యకు నోచుకోనివారే! భారత రాజ్యాంగంలో పేర్కొన్న నిర్బంధ విద్య, మాతృభాషలో విద్యా బోధన ఆదివాసుల విషయంలో హుళక్కే అయింది. కాబట్టి వారికి వారి మాతృభాషలో రాజకీయ, పాఠశాల విద్యా బోధన అత్యవసర సమస్యగా ముందుకు వచ్చి పార్టీ 1997లో ఒక ప్రత్యేక కర్రికులం రూపొందించి గోండీలో ప్రారంభించిన విద్యా బోధనకు తోడుగా జనతన సర్కార్ల నిర్మాణం, అభివృద్ధితో పాఠశాల విద్యా విభాగం వికాసం చెందింది. నూతన భర్తీలలో నుండి ఎంపిక చేసిన శక్తుల కోసం మొదట ఆరు మాసాలతో కూడిన 'ప్రాథమిక కమ్యూనిస్టు శిక్షణా పాఠశాల' (బీసీటీఎస్), 2009 వరకు ఉన్నత స్థాయి కేడర్ల రాజకీయ విద్యా బోధనకై కేంద్రకమిటీ నిర్మించిన 'రీపోస్' (రీజియన్ పొలిటికల్ స్కూల్) దండకారణ్య కేడర్లకు చాలా ఉపయోగపడింది.

2000ల తదుపరి గ్రామరాజ్య కమిటీలు మరింత ఉన్నతమైన, విస్పష్టమైన అవగాహనతో విప్లవ ప్రజా కమిటీల రూపంలో ముందుకు వచ్చాయి. వాటిని స్థానిక ప్రజలు 'జనతన సర్కార్లు'గా పిలుచుకోసాగారు. వాటి రక్షణకు ఉన్నత స్థాయిలో ప్రజా మిలీషియా నిర్మాణం పెంపొందింది. గెరిల్లా బేసుల రక్షణకు పీ.ఎల్.జీ.ఏ.లో ప్లటూన్‌ల విస్తరణతో పాటు 2004 జులై నాటికి ఉన్నత స్థాయి నిర్మాణం కంపెనీ ముందుకొచ్చింది. జనతన సర్కార్ నాయకత్వంలో ప్రజలు వివిధ వ్యవసాయ మరియు దాని అనుబంధ పనులలో నాగళ్ల ప్రాతిపదికన సహకారోద్యమానికి పెద్దెత్తున సంఘటితమయ్యారు.

ప్రపంచ ఆర్థిక సంక్షోభం తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో టాటా, జిందల్, ఎస్సార్ లాంటి అనేక దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ శక్తులు ఎమ్.ఎన్.సీ.లతో కలసి ప్రాకృతిక వనరులను కొల్లగొట్టుక పోవడానికి నూతన రాష్ట్ర ప్రభుత్వంతో అనేక ఎమ్.ఓ.యూ.లు కుదుర్చుకున్నాయి. గతంలో రెండు విడుతల జనజాగరన్ అభియాన్‌లను ముందుండి నడిపిన కర్మోటకపు ఆదివాసీ భూస్వామి మహేంద్రకర్మ రాష్ట్రంలో పరిశ్రమల శాఖామాత్యుడు అయ్యాడు. ఐదవ షెడ్యూల్డ్ ప్రాంతంలో అమలు పరచాల్సిన ఆదివాసీ గ్రామసభలను పోలీసుల తుపాకుల నీడలో నిరంకుశ అధికారులు దౌర్జన్యంతో దోపిడీ శక్తుల కోసం కాగితాలపై సృష్టించారు. అయినప్పటికీ వనరుల తరలింపుకు విప్లవోద్యమం వారికి పెను ఆటంకంగా నిల్చి ప్రజల విస్థాపనను అడ్డుకుంది.

2003 నవంబర్‌లో ప్రత్యేక ఛత్తీస్‌గఢ్ తొలి విధానసభ ఎన్నికలు జరిగి కాషాయ శక్తుల భాజపా గద్దెనెక్కింది. దానికి కొద్ది ముందు కాంగ్రెస్ జోగి సర్కార్ 2003 మార్చ్‌లో దండకారణ్యంలోని బస్తర్‌లో తొలిసారి అర్ధసైనిక బలగాలను దింపింది. మరోవైపు దేశంలోని రెండు విప్లవ స్రవంతులు సమైక్యమై సరండా అడవులలో 'భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)' ఏర్పడింది. రెండు పార్టీల నాయకత్వంలోని ప్రజా సైన్యాలు సమైక్యమై పీ.ఎల్.జీ.ఏ. ఆవిర్భవించింది. ఈ గొప్ప విప్లవకర పరిణామాలతో భారత పాలకవర్గాలు బెంబేలు పడిపోయాయి. నూతనంగా ఆవిర్భవించిన సీ.పీ.ఐ. (మావోయిస్టు) పార్టీని 2005లో దేశ అంతరంగిక భద్రతకు ఏకైక అతి పెద్ద ప్రమాదకర శక్తిగా కేంద్రం ప్రకటించడం, ప్రధాన ఉద్యమ ప్రాంతాలలో ముఖ్యంగా దండకారణ్యంలో 'సల్వాజుడుం' (సామూహిక వేట), ఝార్కండ్‌లో 'సేంద్ర' పేర్లతో 'శ్వేత ఉగ్రవాద దాడి' కెంపెయిన్ దీర్ఘకాల వ్యూహంతో ప్రారంభం కావడం యాదృచ్ఛికం ఏమీ కాదు. భారత దోపిడీ పాలకవర్గాల నమ్మకబంటు మహేంద్రకర్మ నాయకత్వంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు; పోలీసు, అర్ధ సైనిక, సైనిక అధికారుల కనుసన్నలలో సల్వాజుడుం పాశవిక దాడులకు పాల్పడుతూ ప్రజలలో భయ భీభత్స వాతావరణాన్ని సృష్టించి ఆదివాసీ సమాజాన్ని నిలువునా చీల్చారు. మూడు ముక్కలైన ఆదివాసీ సమాజంలో మెజార్టీ ప్రజలు విప్లవోద్యమంతో దృఢంగా నిలబడి ఫాసిస్టు సల్వాజుడుం దాడులను

అసమాన త్యాగాలతో ఎదుర్కొని 2009నాటికి దానిని ఓడించారు. ఒక సెక్షన్ ప్రజలు తెలంగాణకు తరలివెళ్లగా, మరో సెక్షన్ సల్వాజుడుం నెలకొల్పిన నిర్బంధ శిబిరాలలోకి బలవంతంగా తరలించబడ్డారు. అయితే సల్వాజుడుం ఓటమితో శిబిరాలలోని మెజార్టీ ప్రజలు సంతోషించి విప్లవపార్టీ పిలుపుతో మళ్లీ తమ స్వస్థలాలకు చేరుకున్నారు.

పాలకులూ పోలీసులూ ఆశించిన ఫలితాలు ఇవ్వకుండా సల్వాజుడుం బ్యాక్‌ఫైర్ కావడంతో భారత పాలకవర్గాలు మరింత ఉన్నత స్థాయిలో, విస్తృత పరిధిలో యావత్ దేశవ్యాపిత మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని అప్రకటిత 'ఆపరేషన్ గ్రీన్‌హంట్'ను మరింత దీర్ఘకాల పథకంతో రూపొందించి 2009 మధ్య నుండి అమలులోకి తెచ్చారు. కానీ శత్రు దాడులను ధీటుగా ఎదుర్కోవడానికి ఇంచుమించు అదే సమయంలో ముందుచూపుతో పీ.ఎల్.జీ.ఏ. సంఘటితీకరణలో భాగంగా కంపెనీలపై ఆధారపడిన గెరిల్లా బటాలియన్ నిర్మాణం జరిగింది. అలాగే అప్పటికే అపూర్వ స్థాయిలో సాగిన సల్వాజుడుం దాడులను ప్రజలు దాదాపు నాలుగేళ్లు యుద్ధం మధ్య యుద్ధాన్ని అభ్యసించిన తీరులో ఎదుర్కొని ఓడించి ఉన్నత స్థాయిలో ఎదురయ్యే దాడులను ఎదుర్కోవడానికి మానసికంగా సంసిద్ధమై ఉన్నారు.

దండకారణ్యంలోని అన్ని డివిజన్‌లలో ఏరియా స్థాయిలో జనతన సర్కార్లు ఏర్పడి మెరుగ్గా పని చేస్తున్న చోట, ప్రజాపునాదిపై ఆధారపడి డివిజన్ స్థాయిలో కూడా అవి ఏర్పడడం ప్రారంభమైంది. 2004లో ఉత్తరాన ఆర్.కే.బీ., (రాజనంద్‌గాంవ్, కాంకేర్, దుర్గ్) దక్షిణాన దర్భా ప్రాంతాలకు విస్తరించిన విప్లవోద్యమం రాష్ట్రంలోని పలు ముఖ్య పట్టణాలకు, శ్రామిక జనాభా కలగిన కేంద్రాలకు చేరువయ్యింది. దండకారణ్యంలో పశ్చిమాన గల గఢ్‌చిరోలీ డివిజన్ ఉద్యమం 2006లో రెండు డివిజన్‌లుగా అభివృద్ధి చెందింది. అయితే, పొరుగున ఉన్న మహారాష్ట్ర విప్లవోద్యమ అవసరాల రీత్యా కేంద్రకమిటీ 2001లో దండకారణ్యంలోని గఢ్‌చిరోలీకి చెందిన కొంత ప్రాంతంతో పాటు బాలాఘాట్ డివిజన్‌ను అందులో భాగం చేసింది. ఆ వరుసనే తూర్పు, మధ్య రీజియన్‌లలోని విశాల గెరిల్లా జోన్‌ల మధ్య అనుసంధానానికి సరండా, దండకారణ్య గెరిల్లాజోన్‌లపై ఆధారపడి 2007 మార్చ్‌లో వ్యూహాత్మక పథకంలో భాగంగా ఒడిశాను కేంద్రం చేసుకొని నూతన విస్తరణకు పునాదులు పడ్డాయి. ఇవన్నీ శత్రువు రూపొందించిన ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను శక్తిమంతంగా ఎదుర్కోవడానికి ఎంతగానో దోహదపడినాయి.

తొలినాళ్ల బస్తర్ ఉద్యమం దక్షిణ, పశ్చిమ, ఉత్తర, తూర్పు బస్తర్ డివిజన్‌లతో పాటుగా మాడ్ ప్రాంతం దానికి ఉన్న ప్రత్యేకతల రీత్యా 2000నాటికే ఒక ప్రత్యేక డివిజన్‌గా ఉనికిలోకి వచ్చింది. ఆపరేషన్ గ్రీన్‌హంట్ ప్రారంభించిన కొద్ది మాసాలలోనే 2010 ఏప్రిల్‌లో భారత విప్లవోద్యమ చరిత్రలోనే కాకుండా సీ.పీ.ఎమ్.ఎఫ్. చరిత్రలో సైతం తొలిసారిగా సుక్మాజిల్లా తాడిమెట్ల/ముకురం ఘటనలో 76మంది సీ.ఆర్.పీ. బలగాలు ఒకే సమరంలో మట్టిగరవడం శరాఘతంలా పని చేసింది. ఆ వెంటనే జూన్‌లో కొండగాంవ్ జిల్లా కొంగెరలో దాదాపు 27 మందికిపైగా సీ.ఆర్.పీ. బలగాలను గెరిల్లాలు తుదముట్టించడం దండకారణ్యంలో పెంపొందుతున్న ప్రజా సైనిక గెరిల్లా శక్తుల సామర్థ్యాన్ని తెలియజేసింది.

పై చారిత్రక పరిణామాల నేపథ్యంలో 2011లో జరిగిన దండకారణ్య పార్టీ ప్లీనం 'సైనిక రంగంలో లభిస్తున్న భారీ విజయాలపై ఆధారపడి మిగితా నిర్మాణ కర్తవ్యాలను పరిపూర్తి చేయడంలో పార్టీ వైఫల్యం చెందిందనీ, పర్యవసానంగా ఉద్యమం గడ్డు స్థితికి చేరిందని సమీక్షించింది. శత్రువు తన ఓటముల నుండి అనేక గుణపాఠాలను తీసుకొని ఆధునిక సన్నాహాలతో మరిన్ని అదనపు భద్రతా బలగాలను సమకూర్చుకోవడమే కాకుండా ఉద్యమ ప్రాంతాలలో కార్పెట్ సెక్యూరిటీ అమలుకు వేగంగా పూనుకున్నాడు. ఉద్యమ ప్రాంతాన్ని సెక్టార్‌లుగా విభజించి విప్లవ శక్తులను సమూలంగా నిర్మూలించే రోడ్ మ్యాప్ తయారు చేసుకున్నాడు. 2005 నుండి ప్రజలపై కొనసాగుతూన్న ఎడతెరిపి లేని దాడులు మరింత తీవ్రమయ్యాయి. పోలీసులు తమ నిరంకుశ అణచివేత చర్యలకు సాధికారత పొందడానికి 'సివిక్ ఆక్షన్ ప్రోగ్రాం' పేరుతో సంస్కరణలను పెద్దెత్తున ప్రోత్సహించారు. వాటితో గ్రామాలలో ఇన్ఫార్మర్స్ నెట్‌వర్క్‌ను విస్తృతం, పటిష్టం చేసుకుంటూ మొబైల్ నెట్‌వర్క్‌ను లోతట్టు అడవి ప్రాంతాలలో సైతం అందుబాటులోకి తెచ్చారు.

ఉద్యమం 2011 చివరినాటికి గడ్డుపరిస్థితికి చేరడంతో, రాజకీయంగా బలహీనమైన, పార్టీ క్రమశిక్షణను పాటించడంలో ఘోరంగా విఫలమైన స్వార్థపర నాయకత్వ శక్తులు ఉద్యమంలో మరిన్ని తప్పులకు ఒడిగట్టి పారిపోయి అంతిమంగా శత్రువు ముందు మోకరిల్లి దండకారణ్య విప్లవోద్యమంపై విషం కక్కసాగారు. మరోవైపు కొన్ని డివిజన్‌లలో ఉద్యమంలోకి నూతన శక్తులు భర్తీ కావడం తాత్కాలికంగా నిలిచిపోయింది, లేదా మందగించింది.

వ్యూహాత్మక ఆత్మ రక్షణ స్థితిలోని విప్లవోద్యమంలో గడ్డు పరిస్థితులు, మందగమనాలు తలెత్తడం అతి సహజం. దీనినే మహోపాధ్యాయులు ఆటు పరిస్థితులుగా నిర్వచించారు. 2011లో దండకారణ్యం గడ్డు పరిస్థితికి చేరగా 2013 నాటికి యావత్ భారతదేశ మావోయిస్టు విప్లవోద్యమం వివిధ రాష్ట్రాలలో వివిధ తేడాలున్నప్పటికీ గడ్డు పరిస్థితులకు చేరింది. విప్లవోద్యమం గడ్డు పరిస్థితులకు చేరడాన్ని పార్టీ గుర్తించడంతో కేడర్లను తీర్చిదిద్దుకోవడానికి బోల్షెవీకరణ కేంపెయిన్‌ను రెండేళ్ల వ్యవధితో చేపట్టి మూడవవంతు శక్తులను ఆ దిశలో సరిదిద్దుకోగలిగింది.

దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాలో 'విజయం, ఓటమి, అంతిమంగా విజయం' అనే అవగాహనలోని సారాన్ని గ్రహించిన కేడర్లు గెరిల్లా ఎత్తుగడల నియమాలను పాటిస్తూ (రహస్యం, వేగవంతమైన కదలికలు) యుద్ధ చర్యలతో పాటు నిర్మాణ రంగంలో పలు మార్పులను చేపట్టారు. నష్టాలను, పారు బోతుతనాన్ని అరికడుతూ పార్టీ నిర్మాణాలను పటిష్ట పరచుకుంటూ విశాల ప్రజా రాశులలోకి మరింత లోతుగా వెళ్లడానికి 'ఫీల్డ్ స్టడీ' పేరుతో నాయకత్వ కమిటీలకు శిక్షణా కార్యక్రమం మొదలైంది. వీటన్నింటికి తోడుగా పార్టీ నూతన పోరాట రంగాలనూ ఎన్నుకున్నది. చట్టబద్ధ పోరాటాలను చేపట్టింది. విప్లవ పోరాటాల ఫలితంగా దోపిడీ పాలక వర్గాలు ప్రవేశపెట్టిన చట్టాలలోని 'మానవముఖాన్ని' ఎంచుకొని ఆచరణలో ప్రజలను సమీకరించి దాని వికృతత్వాన్ని పార్టీ ఎండగట్టింది. ఉదారవాద మేధావులు ముందుకు తెచ్చిన పెసా గ్రామసభలు 'జల్-జంగల్-జమీన్' నినాదాన్ని ప్రభుత్వాలు ఎలా బుట్టదాఖలా చేస్తున్నాయో చట్టాల బూటకత్వాన్ని ప్రజలకు తేటతెల్లం చేయడానికి పార్టీ జరిపిన కృషిలో నూతన సామాజిక శక్తులు కదిలివచ్చాయి. ఇలాంటి అనేక చర్యలతో ప్రతికూల పరిస్థితులలోని అనుకూలతలను సద్వినియోగం చేసుకుంటూ ఉద్యమాన్ని నిలబెట్టుకోవడం ఆనాటికి ఒక విజయంగానే భావించాలి.

1992 లోనే మహారాష్ట్రలోని గడ్‌చిరోలీలో రూపొందించిన సీ-60లాగా 2013లో ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో డీ.ఆర్.జీ.పేరుతో, రాజనంద్‌గాంవ్‌లో ఈ-30 పేరుతో నూతన ఫోర్సులను దోపిడీ పాలకులు, పోలీసు ఉన్నతాధికారులు ఏర్పర్చారు. ఉద్యమ ప్రాంతాలలో కేంద్ర-రాష్ట్ర బలగాల మధ్య తలెత్తుతున్న తీవ్ర వైరుధ్యాలు, నిరాశా నిస్పృహలు, పై అధికారుల వేధింపులు, పనిభారం లాంటి అనేక సమస్యల మూలంగా భద్రతా సిబ్బందిలో తలెత్తుతున్న హత్యలూ, ఆత్మహత్యలూ ఏనాటికానాడు పెరిగిపోతూండడంతో కలవరం చెంది స్థానిక శక్తులతోనే విప్లవోద్యమాన్ని ఎదుర్కొవాలనే దిశలో 'కన్ను నీదే వేలు నీదే'నన్న కుటిల నీతిలో భాగంగా దీర్ఘదృష్టితో వాటిని రంగంలోకి దింపారు.

శత్రువు దీర్ఘకాల పథకంతో చేపట్టిన ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు గడువు దగ్గర పడుతున్నా కొద్దీ దండకారణ్య విప్లవోద్యమాన్ని అది సమూలంగా నిర్మూలించలేకపోవడంతో, అందులో భాగంగానే నూనత పేర్లతో నిర్దిష్ట లక్ష్యాలతో దూకుడును, తీవ్రతను పోలీసు వర్గాలు పెంచాయి. మిషన్-2016 పేరుతో మొదలైన పోలీసుల దాడులు ప్రధానంగా ప్రగతిశీల, ప్రజాస్వామ్య, ఉదారవాద మేధావులను లక్ష్యంగా చేసుకున్నాయి. సామాజిక కార్యకర్త బేలా భాటియా, స్క్రోల్ పాత్రికేయురాలు మాలినీ సుబ్రహ్మణ్యం, సోనీసోడి, ప్రముఖ గాంధేయవాది హిమాంశుకుమార్ మున్నగువారిని అనేక మందిని లక్ష్యంగా చేసుకొని పోలీసు డీ.ఐ.జీ., ఎస్.ఆర్.పీ. కల్లూరి 'అగ్ని' పేరుతో కొనసాగించిన దాడులు ఖాకీల పైశాచికత్వానికి నిలువుటద్దంలా నిలిచాయి. తక్షణం వాటికి జవాబుగా ప్రజాహిత శక్తులు 'పానీ'ని ముందుకు తెచ్చాయి. కామ్రేడ్ లెనిన్ వందేళ్ల క్రితమే చెప్పినట్టు శతృవర్గాలే విప్లవం వైపు నూతన మిత్రశక్తులను కూడగడుతాయన్నది ఆచరణలో సల్వాజుడుం వ్యతిరేక కెంపెయిన్ నాటి నుండి అనుభవంలోకి వస్తోంది.

ఆదివాసీ ప్రజలపై సాగుతున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాడులను ప్రపంచ ప్రఖ్యాత రచయిత జాన్ మిర్డాల్, బుక్కర్‌ప్రైజ్ విజేత అరుంధతీరాయ్, రాంచందర్ గుహ, నందినీ సుందర్, బీడీశర్మ, బాలగోపాల్ సహ హక్కుల సంఘాల కార్యకర్తలు, దేశ, విదేశీ స్వచ్ఛంద సంస్థలు వివిధ రూపాలలో ఖండించాయి. ఫిలిప్పైన్స్ కమ్యూనిస్టు పార్టీ ఆ దేశంలో నెల రోజుల కెంపెయిన్ చేపట్టి ఓ.జీ.హెచ్.ను ఎండగట్టి భారత ప్రజాయుద్ధానికి తన సంఘీభావాన్ని తెలిపింది. 2011లోనే అంతర్జాతీయంగా వివిధ దేశాల విప్లవ కమ్యూనిస్టు పార్టీలు, శక్తులతో కలసి భారత ప్రజాయుద్ధ సంఘీభావ కమిటీ ఏర్పడింది. 'నూతన విప్లవోద్యమాలకు ఆ పోరాటం విప్లవ వెలుగులను ప్రసరిస్తుంది, వారి పోరాటం మనది, ఎందుకంటే మనమంతా ఒకే సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో భాగం'అనే అవగాహణతో వారు సంఘీభావోద్యమానికి నడుం బిగించారు.

మరోవైపు దండకారణ్య అడవులలో ప్రజా గెరిల్లాలు శతృ బలహీనతలను పసిగట్టి సద్వినియోగం చేసుకుంటూ 2014లో కస్నాల్‌పాడ్, 2017లో బుర్కపాల్, కారంపెల్లి లాంటి భారీ మాటుదాడులలో పెద్దెతున పోలీసుకమాండో బలగాలను మట్టికరిపించాయి. యావత్ భారత విప్లవోద్యమంలో భాగంగా దండకారణ్య ఉద్యమాన్ని కాపాడుకోవడానికి దేశంలోని వ్యూహాత్మక ప్రాంతాలలో నూతనంగా యుద్ధక్షేత్రాలను ప్రారంభించడానికి ఎమ్.ఎమ్.సీ. (మధ్యప్రదేశ్ మహారాష్ట్ర ఛత్తీస్‌గఢ్)ల సరిహద్దు ప్రాంతానికి దండకారణ్య బలగాలతో విప్లవోద్యమం విస్తరించింది.

2014లో కేంద్రంలో గద్దెనెక్కిన హిందుత్వ శక్తులు దేశ పాలక, పోలీసు వర్గాలు యేళ్ల తరబడిగా ఎన్ని రకాల వ్యూహాలు, ఎత్తుగడలు చేపడుతున్నప్పటికీ అవి ఏదో ఒక స్థాయిలో వ్యతిరేక ఫలితాలే ఇస్తుండడంతో 2017 మేలో పాత వ్యూహాలను సమీక్షించి నూతన వ్యూహం 'సమాధాన్'ను ఐదేళ్ల కాలవ్యవధితో రూపొందించారు. ఈ వ్యూహం ద్వారా మావోయిస్టు రహిత నవ భారతాన్ని నిర్మించే తమ లక్ష్యాన్ని 2019లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించాడు. అలాగే పట్టణాలలో వివిధ వృత్తులలో, ప్రజల మధ్య ఉంటూ అనేక సామాజిక, రాజకీయ కార్యక్రమాలలో పాలుపంచుకునే లబ్ధప్రతిష్ట ఆలోచనాపరులు, కళాకారులు, హక్కుల కార్యకర్తలు, రచయితలు, పాత్రికేయులు, న్యాయవాదులు, మేధావులు తమ ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజా వ్యతిరేక విధానాలను విమర్శించడాన్ని జీర్ణం చేసుకోలేకపోతూ వారందరినీ 'అర్బన్ నక్సల్స్' లేదా 'హాఫ్ నక్సల్స్' అనే నూతన పదప్రయోగంతో అరెస్టు చేసి వారిపై అనేక తీవ్రమైన ఆరోపణలు చేస్తూ జైలుపాలు చేయడం పెరిగింది.

ఆపరేషన్ సమాధాన్ ప్రకటించాక గెరిల్లాలవైపు నుంచి జరిగిన స్వయంకృత అపరాధాలతో కొన్ని చోట్ల అసాధారణ భారీ నష్టాలను ఉద్యమం ఎదుర్కొన్నప్పటికీ 'సమాధాన్' దాడులను తిప్పికొట్టడంలో ఇర్పనార్, మాహాల, జాంబుర్ ఖేడా, మినుపలు నూతన అనుభవాలను ఇచ్చాయి. మరోవైపు నందిగ్రాం మార్గంలో లోహండి గూడా నుండి టాటా ప్లాంట్‌ను ఎత్తివేయించడంలో సఫలీకృతమైన ప్రజలు నూతన రూపాలలో వేల సంఖ్యలో ఏకమై 'పోలీసు క్యాంపులను ఎత్తివేయాలనీ, జల్-జంగల్-జమీన్‌పై తమదే అధికారం' అంటూ వాటి రక్షణకోసం, అమూల్య వనరులను కాపాడుకోవడానికి, విస్తాపనకు వ్యతిరేకంగా చేపడుతున్న ***పత్థల్‌గడీ*** (పెసా) ప్రజాపోరాటాలు పెల్లుబుకుతున్నాయి. అయితే, 1917 మెక్సికో విప్లవం కల్పించిన ***ఎజిడో*** (అడవిపై ఆదివాసీ సమూహాలకు కల్పించిన సామూహిక హక్కు) హక్కులను అక్కడి అధ్యక్షుడు సామ్రాజ్యవాద నియో లిబరల్ విధానాల వకాల్తాదారు సలీనా1991లో ఓ నూతన చట్టం చేసి కబలించిన విషయాన్ని పత్థల్‌గడీ ఆందోళనకారులు గుర్తుంచుకోవాలి. మన దేశంలో కూడా మోదీ ఆ బాటే నడుస్తున్నాడు.

కేంద్రంలో బ్రాహ్మణీయ శక్తులు గద్దెనెక్కిననాటినుండి దేశాన్ని హిందూ రాష్ట్రంగా మార్చడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. 2008లో రూపొందిన నూతన అటవీ చట్టాన్ని అమలు చేయడంలో ఘోరంగా విఫలమైన పాలకులు 2019 ఫిబ్రవరిలో భూములకు పట్టాలు లేవనే పేరుతో అడవులనుండి లక్షలాది ఆదివాసులను బేదఖల్ చేయించడానికి సుప్రీంకోర్టుచే ఉత్తర్వులు వెలువరింపచేశారు. దానికి ముందు 2018 మార్చ్‌లో సుప్రీంకోర్టు 'దళిత ఆదివాసీ అత్యాచార నిరోధక చట్టాన్ని' సవరింప చేశారు. కానీ దండకారణ్య ప్రజలు ఈ రెండు సందర్భాలలో తమ వ్యతిరేకతను ప్రకటించారు. 2019 చివర్లో మత ప్రాతిపదికపై రూపొందించిన పౌరసత్వ సవరణ చట్టాన్ని, దాని వెన్నంటి ముందుకు వచ్చిన జాతీయ పౌరసత్వ సూచీ, జాతీయ జనాభా సూచీని దండకారణ్య ఆదివాసులు 'తాము హైందవులం కామంటూ' వ్యతిరేకించారు.

2020 మార్చ్ నుండి నోవెల్ కొరోనా వైరస్ 'కోవిడ్-19' విజృంభణతో దేశాన్ని పాలకవర్గాలు తీపి కబుర్లతో ప్రజలను గాలికి వదిలి లాక్‌డౌన్‌లతో అతలాకుతలం చేస్తున్నారు. గతంలో అధికోత్పత్తి సంక్షోభాలలో సరుకులను కళ్లముందే నాశనం చేసి కృత్రిమమైన కరువును సృష్టించి ఆర్థిక మాంద్య పరిస్థితుల నుండి తాత్కాలికంగా గట్టెక్కె విధానాలను అలవర్చుకున్న దోపిడీ పాలకవర్గాలు నేటి 21వ శతాబ్దంలో అలాంటి ప్రత్యక్ష విధ్వంసకర పద్ధతులు చెల్లవని అతి తెలివితో నెలల తరబడి లాక్‌డౌన్‌లను ప్రకటించి పేద ప్రజల జీవితాలతో చెలగాట మాడుతున్నారు. వైరస్ ప్రాణాంతకమని తీవ్ర భయ వాతావరణాన్ని సృష్టించి భౌతిక దూరం కాకుండా సామాజిక దూరం పేరుతో ప్రజలను వెలివేస్తూ ఎవరి ఇళ్లకు వారిని బందీలు చేస్తూ తమ ఫాసిస్టు చర్యలకు ఎదురు లేకుండా చేసుకుంటున్నారు. ఆర్థిక వ్యవస్థను తిరిగి పట్టాలు ఎక్కించడానికి పీపీపీ పేరుతో లక్షల కోట్ల ప్రజానిధులు ఘరానా కార్పోరేటు వర్గాల కోసం విడుదల చేస్తున్నారు. మరోవైపు పోలీసులు పాలకుల సామాజిక దూరాన్ని అపహాస్యం చేస్తూ ప్రజలను కొరోనా గురించి జాగరూకులను చేస్తున్న విప్లవకారుల ఏరివేతకు అడవులలో గాలింపు తాండవం కొనసాగిస్తున్నారు. దండకారణ్య ఉద్యమం పోలీసుల ధోరణిని నిర్ద్వంద్వంగా ఖండించింది. వారి గాలింపు చర్యలకు అడ్డుకట్ట వేయడానికి ప్రతిఘటన చర్యలకు పూనుకొని ప్రజలను విప్లవోన్ముఖులను చేస్తోంది.

దండకారణ్య విప్లవోద్యమంలో కాలిడిన తొలితరం కార్యకర్తలలో తన నవయవ్వన ప్రాయంలోనే భాగమైన రావుల శ్రీనివాస్ (రామన్న) దాదాపు 36 సంవత్సరాల తన విప్లవ పయనంలో సాధారణ గెరిల్లా నుండి దండకారణ్య పార్టీ కార్యదర్శిగా, కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎదిగి 2019 డిసెంబర్ 7వ అనారోగ్యంతో అసువులు బాసాడు. గఢ్‌చిరోలీ ఉద్యమంలో తొలితరం భర్తీలో భాగమై మూడు దశాబ్దాలకు పైగా ఆ ఉద్యమానికి తన సర్వశక్తులను ధారపోసిన అతి సాధారణ ఆదివాసీ మహిళా కామ్రేడ్ సృజన (జైనీ ఆర్కి) ఒక గెరిల్లాగా జీవితాన్ని ప్రారంభించి రీజియన్ స్థాయికి ఎదిగి 2020 మే 2నాడు అదే జిల్లా సీన్‌భట్టీలో శత్రువుతో పోరాడుతూ రణరంగంలో వీరమరణం పొందింది. ఆర్‌కేబీ డివిజన్‌లో కామ్రేడ్ రైనుతో సహ నలుగురు కామ్రేడ్స్ పోలీసులతో వీరోచితంగా తలపడుతూ ఒక అధికారిని మట్టుబెట్టి అసువులు బాసారు.

నాలుగు దశాబ్దాల దండకారణ్య విప్లవోద్యమ నేలలో చల్లిన పోరు విత్తనాలు అనేకం మొలకెత్తి, ఏపుగా ఎదిగి, పోరాట ఫలాలను అధికాధికంగా అందిస్తూ యావద్దేశానికి విస్తరింప చేసినవాళ్లలో కొందరు ఈ సందర్భంగా భౌతికంగా మన మధ్య లేరు. ఉద్యమం పట్ల విశ్వాసం సడిలి మడిమ తిప్పిన కొందరు శత్రువుముందు లొంగిపోయారు. నిన్నటి వరకు మనతో కలిసి 'సమాధాన్'ను ఎదిరించిన మన ఉద్యమ సహచరులు (కామ్రేడ్స్ ఇన్ ఆర్మ్స్) కొందరు సమరంలో వీరమరణం పొంది ఇకపై దానిని ఓడించే కర్తవ్యాన్నే కాదు, అలాంటి 'సమాధాన్'లు మరెన్ని ముందుకు వచ్చినా ఈ దేశ విముక్తి మార్గంలో దృఢంగా వాటిని ఎదుర్కొంటూ దుష్ట హిందుత్వశక్తుల 'శ్రేష్ట భారత' స్వప్నాలను చిత్తు చేస్తూ భారత నూతన ప్రజాతంత్ర విప్లవాన్ని జయప్రదం చేసి ప్రపంచ సోషలిస్టు విప్లవానికి బాటలు వేయాలనే సందేశాన్ని తమ రక్త తర్పనం ద్వారా మనకందిస్తున్నారు. ఆ దారిలో నిజాయితీగా, నిర్భయంగా, నిబ్బరంగా, నిర్దిష్ట పరిస్థితుల అధ్యయనంతో తగిన ఎత్తుగడలు చేపడుతూ ముమ్ముందుకు పోవడానికి నాలుగు దశాబ్దాల వేడుకల సందర్భంగా మరోసారి ప్రతిన బూనుదాం. ★

# నాలుగు దశాబ్దాల దండకారణ్య విప్లవోద్యమానికి విప్లవ జేజేలు

మన దేశంలో 1975-77 మధ్య అత్యవసర పరిస్థితిని విధించి ఇందిరా ఫాసిజం పడగవిప్పి రాజ్య మేలుతున్న సమయంలో భారత విప్లవకారులు 1972 తరువాత ఎక్కడికక్కడే దెబ్బతిన్న ఉద్యమ ప్రాంతాలు నహా దేశ వ్యాప్తంగా విప్లవోద్యమాన్ని తిరిగి బలోపేతం చేసి పురోగమింప చేయడానికి నడుం బిగించారు. వారు ముందుగా నక్సల్బరీ విప్లవోద్యమ వెనుకంజకు గల కారణాలను సమీక్షించారు. ఆ గుణపాఠాలపై ఆధారపడి చేసిన బృహత్ కృషిలో భాగంగా భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) ఆంధ్రప్రదేశ్ 'విప్లవానికి బాట' పేరుతో నూతన వ్యూహం-ఎత్తుగడలను రూపొందింకుంది. అప్పటికే నక్సల్బరీ, శ్రీకాకుళ ఉద్యమాల ప్రభావంతో విప్లవోద్యమం వైపు ఆకర్షితులైన యువతపై ఆధారపడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా అప్పటి ఉత్తర తెలంగాణ జిల్లాలలో వ్యవసాయ విప్లవోద్యమ నిర్మాణకి పునాదులు వేసింది. దేశంలో నానాటికి పెరుగుతున్న ఫాసిస్టు ఇందిరా ఎమర్జెన్సీ వ్యతిరేక పవనాలతో సరిగ్గా అదే సమయానికి కేంద్రం అత్యవసర పరిస్థితిని ఎత్తేయక తప్పలేదు. ఆ అనుకూల పరిస్థితులలో 'విప్లవానికి బాట' అమలుకు దృఢ సంకల్పంతో పార్టీ నాయకత్వం కృషి చేసింది. ఫలితంగా, అనతి కాలంలోనే కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలలో కరుడు కట్టిన భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా రైతాంగ పోరాటాలు వెల్లువెత్తాయి. ఆ పోరాటాలను నూతన ఎత్తులకు పురోగమింపచేసే కృషిలో భాగంగా 1980లో 'గెరిల్లాజోన్' డాకుమెంటు వెలుగు చూసింది. సీ.పీ.ఐ. (ఎమ్.ఎల్.)లోని కెవస్ గ్రూపు 'పీపుల్స్‌వార్'గా అవతరించింది.

గెరిల్లాజోన్ డాకుమెంటు అందించిన గైడెన్స్‌లో పార్టీ, తనకు అప్పటికే ఎంతో కొంత పరిచయం ఉన్న సరిహద్దులలోని మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌ల విశాల అటవీ ప్రాంతానికి-దండకారణ్యం-దారులు పరిచి విప్లవోద్యమ విస్తరణకు పూనుకుంది. అవి 1980 జూన్-జూలై మాసాలు! అప్పటి నుండి ప్రస్తుత 2020 జూన్ వరకు గడచిన నాలుగు దశాబ్దాల దండకారణ్య విప్లవోద్యమ కృషిలో అసువులు బాసిన దాదాపు మూడున్నర వేలకు పైగా కామ్రేడ్స్‌కు ముందుగా వినమ్రంగా విప్లవ జోహార్లర్పిదాం. 1980 నవంబర్ 2న మహారాష్ట్ర సరిహద్దు గ్రామం 'ముయ్యబోయినపేట'లో అసువులు బాసిన సింగరేణి కార్మికవర్గ పుత్రుడు కామ్రేడ్ పెద్ద శంకర్ మొదలు 2019 డిసెంబర్ 7న అనారోగ్యంతో అసువులు బాసిన తొలితరం గెరిల్లా, వర్తమాన కేంద్రకమిటీ సభ్యుడు కామ్రేడ్ రావుల శ్రీనివాస్ (రామన్న), 2020 మే మొదటి వారంలో శతృవుతో సాహసంగా తలపడుతూ తమ ప్రాణాలర్పించిన దండకారణ్య తొలితరం ఉద్యమ ముద్దు బిడ్డ కామ్రేడ్స్ సృజన (జైనీ ఆర్కి) తోపాటు అశోక్, కృష్ణ, సబిత, ప్రమీలాల వరకు ఆ మట్టి తొలుచుకు పుట్టిన ప్రజావీరులందరినీ పేరు పేరున స్మరించుకొని వారి ఆశయాల సాధనకై తుదివరకూ పోరాడుతామని ఈ వేడుకల సందర్భంగా శపథం చేద్దాం. దండకారణ్య ఉద్యమాన్ని ప్రారంభ కష్టాలలో, బాలారిష్టాలలో కాపాడి గట్టిపరిచి ప్రజాపునాది నిర్మాణంలో విప్లవాదర్శాలతో ఎంతో గొప్ప పాత్రను పోషించిన కామ్రేడ్ సత్యంరెడ్డి నుండి మొదలై ఆ ఉద్యమానికి నిన్నటివరకు నాయకత్వం వహించి తీవ్ర అనారోగ్య పరిస్థితులలో శతృచేత చిక్కిన కామ్రేడ్స్ నర్మదా (నిర్మలా), కిరన్ (సత్యనారాయణ)ల వరకూ అనేక మంది దండకారణ్యం కోసం అహర్నిశలు కృషి చేసి ప్రమాదకర పరిస్థితులలో జైలు పాలైన వారందరినీ 40 వసంతాల ఉద్యమ వేడుకల సందర్భంగా గుర్తుచేసుకుంటూ వారి విడుదలకై శక్తివంచన లేకుండా కృషి చేద్దాం.

దేశంలోని నేటి ఐదు రాష్ట్రాల కూడలిలోని అడవులలోకి-దండకారణ్యం- దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాలో నలుబై వసంతాల క్రితం 35 మందితో ఏడు గెరిల్లా దళాలు చేరుకున్నాయి. విప్లవోద్యమ ప్రచారం, ప్రజల సంఘటితీకరణ ప్రధాన కర్తవ్యాలుగా చేరిన సాయుధ విప్లవకారులు (గెరిల్లాలు) దోపిడీ పాలకవర్గాల పోలీసుల నుండి ఆత్మరక్షణ చేసుకుంటూనే తొలుత అడవుల సర్వే జరిపారు. ప్రారంభంలో అనేక సమస్యలను-తిండి, భాష, నడక, శతృవర్గాల దాడులు-అధిగమించి పేద, భూమిలేని ఆదివాసుల అభిమానాన్ని చూరగొన్నారు. సాగు భూముల కోసం అటవీ భూముల స్వాధీనంతో పాటు వెదురు, తునికి ఆకు కొత కూలీ రేట్ల పెంపుదల పోరాటం; ఫారెస్టు, రెవెన్యూ అధికారుల వెట్టి, దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సంఘటితమై ప్రజా పోరాటాలు చేపట్టారు. దుష్ట ఆదివాసీ తెగ పెద్దల అక్రమాలకు, ఆధిపత్యానికి వ్యతిరేకంగా నిలిచారు. తొలినాళ్లలో పోలీసులతో చేరిన శతృవర్గాలు ప్రజలలో సృష్టించిన భయాందోళనల వాతావరణాన్ని తొలగిస్తూనే గెరిల్లాలు అంకితభావంతో అలుపెరుగని కృషి చేశారు. వారి కృషికి విప్లవాభివందనాలు.

దండకారణ్యం దట్టమైన, విశాల అడవులు, కొండలతో కూడుకొని ఉండడమే కాకుండా అమూల్యమైన అనేక రకాల ప్రకృతి వనరులున్నాయి. దండకారణ్యంలో కోయలు (గోండులు) ప్రధానమైన తెగగా లేదా రూపొందుతున్న జాతిగా ఉన్నారు. కాగా కోందులు, కొండరెడ్లు, మన్నె కోయ, హల్బా, ప్రధాన్, బతరా, గోవారీ మున్నగు పలు ఇతర తెగలూ ఉన్నాయి. దండకారణ్యంలో ఆదివాసీలతో పాటు వివిధ పేర్లతో దళితులు

*(మిగతాది 48వ పేజీలో....)*